
పురాణములు

# లక్ష్మీ నరసింహ పురాణం




సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

## http://ebooks.tirumala.org



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

T.T.D. Religious Publications Series No. - 994
Price : Rs.

## మా ఇతర ప్రచురణలు

1. తాళ్ళపాక విరచిత
   అన్నమాచార్య చరిత్ర వ్యాఖ్యానం : ఆచార్య గల్లా చలపతి
2. శఠకోపవాక్సుధ -I (వ్యాఖ్యాత) : కె.టి.యల్.నరసింహాచార్యులు
3. శఠకోపవాక్సుధ -II (వ్యాఖ్యాత) : కె.టి.యల్.నరసింహాచార్యులు
4. తిరుపతి యాత్ర : డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ
5. ఆర్షవిజ్ఞాన సర్వస్వం-II(సంపాదకులు) : డా॥ యస్.బి.రఘునాథచార్య
6. నిత్యకళ్యాణపురం శ్రీనివాసమంగాపురం : శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
7. శ్రీ కోదండ రామస్వామి ఆలయం : శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
8. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం:
   అప్పలాయగుంట : శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
9. శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం : డా॥ కె.వి.రాఘవాచార్య
10. తిరుపతి పరిసరక్షేత్రాలు : శ్రీ గోపీకృష్ణ

Published by L.V.Subrahmanyam, I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati

# శ్రీ లక్ష్మీనరసింహపురాణం

- యామిజాల పద్మనాభస్వామి



ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

SRI LAKSHMI NARASIMHAPURANAM

*By*

**Kavirathna Yamijala Padmanabhaswamy**

*Edited by*

**Mudivarthi Kondamacharyulu**

T.T.D. Religious Publications Series No.994

© All Rights Reserved

First Edition : 1990
Revised Edition : 2013

Copies: 2,000

*Published by*

**L.V.Subrahmanyam, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P. Type Setting*
office of the Editor-in-chief, TTD,Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.

# శ్రీ లక్ష్మీనరసింహపురాణం

రచయిత :

కవిరత్న

**యామిజాల పద్మనాభస్వామి**

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2013**

# ముందుమాట

మాఘ స్నానానికని మౌనులంతా ప్రయాగక్షేత్రానికి వచ్చారు. భరద్వాజ మహర్షిని కలిశారు. స్నానాదు లయాక అందరూ సుఖోపవిష్టులై వుండగా అక్కడికి పౌరాణికాగ్రేసరుడు సూతుడు విచ్చేశాడు. సాభిప్రాయంగా మునులంతా భరద్వాజుణ్ణి చూశారు. వారి తలంపు గ్రహించి భరద్వాజుడు సూతమునీ! నరసింహపురాణం వినదలచి ముని లిక్కడున్నారు అన్నాడు. ఏ పద్ధతిలో నృసింహపురాణం చెప్పాలో సూచించమని సూతు డడిగితే భరద్వాజుడు కొన్ని ప్రశ్నలు వేశాడు. ఆయన ప్రశ్నలకు సూతు డిచ్చిన సమాధానమే నృసింహ పురాణ మయింది. ఇదీ లక్ష్మీనృసింహపురాణానికి ఉపక్రమణిక.

దురవగాహములైన వేదార్థాలను ఇతిహాసపురాణాలు మిత్రసమ్మితంగా వివరిస్తాయి. పురాణాలు పద్దెనిమిది. ఉపపురాణాల సంఖ్య అంతే. నరసింహపురాణం ఉపపురాణంగా పరిగణించ బడింది. బ్రహ్మాండ పురాణంలో నృసింహావతార కథ కలదు. సంస్కృత భాగవతంలో ప్రహ్లాదకథ సుప్రసిద్ధం. పరమ భాగవత శ్రేణిలో ప్రథమస్థానం అలంకరించిన ప్రహ్లాద చరిత్రను బమ్మెర పోతనామాత్యుడు మందార మకరంద మధురశైలిలో రచించి తెలుగువారి తలపులను పులకింపజేశాడు. ఆ మహనీయుని నృసింహావతార ఘట్టం చదవితీరవలసిన మనోజ్ఞరచన.

కవిరత్న యామిజాల పద్మనాభస్వామివారి ఈ లక్ష్మీనరసింహ పురాణరచనలో సృష్టిక్రమం, కాలమానం, మనువు, కశ్యప సంతతి, మైత్రావరుణి, మార్కండేయుడు తుంగభద్రాతటంలో నృసింహదేవుని కొల్చి మృత్యుంజయుడై చిరంజీవియైన వృత్తాంతం, యముని ధర్మపరాయణత్వం, సావిత్రి అనే సాధ్వి దేవశర్మకు తెల్పిన స్వధర్మానుష్ఠాన ప్రభావం, అష్టాక్షర మంత్రమహిమ, అశ్వినీ దేవతల జన్మప్రకారం చోటుచేసుకున్నాయి; అంతేకాదు, మరుద్గణ వృత్తాంతం, నిర్మాల్య మహిమ, దేవాలయ సమ్మార్జన

ప్రభావం, దశావతార కథలు అనుక్రమంగా ప్రశంసించబడ్డాయి. ప్రతికథా విష్ణు తేజోవిలసితం.

పద్యగద్యాలలో ఆరితేరిన రచయితగా, పుస్తకసమీక్షకులుగా ప్రసిద్ధులైన యామిజాల పద్మనాభస్వామిగారి **“శ్రీ లక్ష్మీనరసింహపురాణం”** గ్రంథాన్ని పునర్ముద్రించి అందిస్తున్నాం. పాఠకులు ఈ పురాణ గ్రంథాన్ని పఠించి తరించగలరని ఆకాంక్షిస్తూ....

సదా శ్రీవారిసేవలో

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

# మున్నుడి

పారమార్థిక విషయ ప్రచారానికి కంకణం కట్టుకుని ఐహికాముష్మిక ఫలప్రదములైన గ్రంథాలను వ్రాయించి ప్రచురించాలని ఒక ప్రణాళిక ఏర్పరచుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తృత్వ సంస్థ యాజమాన్యం అభిప్రాయాను సారంగా అప్పటి తత్కార్యనిర్వహణాధికారి శ్రీయుత పి.వి.ఆర్.కె.ప్రసాద్‌గారు కోరగా ఈ నరసింహపురాణం ముఖ్య విషయం ప్రధానంగా ప్రాచీనాంధ్ర కవుల ఆంధ్రీకరణ పద్ధతి ననుసరించి తెలుగు చేశాను.

నా చే యీ ఉత్కృష్టమూ విశిష్టమూ, అయిన సంస్కృతి చేయించిన ధర్మకర్తృత్వ మండలికి, యిలాటి రచనలు చేయిస్తూ రచయితలను ఉదారదృష్టితో ప్రోత్సహిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానంవారికి నమస్సుమనోంజలి.

నా యీ కృతిలో ఎగుడు దిగుడులను లెక్కింపక విషయ గ్రహణముతో ఆనందించి యింకా యిలాటి గ్రంథాలను వ్రాయడానికి తగిన ఆదరాభిమానాలను చూపవలసిందిగా నా తెలుగు సోదరీ సోదరులకు మనవి.

మద్రాసు – 17. **యామిజాల పద్మనాభస్వామి.**

# అంకితము

ప్రసన్న పారిజాతం,

శ్రీ పద్మావతీసమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి

భక్తితో సమర్పించిన

ప్రభాత పూజాపుష్పం.

# శ్రీ లక్ష్మీ నరసింహ పురాణం

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం చైవ తతో జయ ముదీరయేత్.

"తప్తహాటక కేశాంత ర్జ్వలత్పావక లోచనః
వజ్రాధిక నఖస్పర్శ ! దివ్యసింహ ! నమోఽస్తుతే !

పాంతు వో నరసింహస్య నఖలాంగల కోటయః,
హిరణ్యకశిపోర్వక్షః క్షేత్రాసృ క్కర్దమారుణాః.

హిరణ్యకశిపుని వక్షం అనే పొలంలోని నెత్తురు బురదతో ఎరుపెక్కిన నాగళ్లవంటి నరసింహుని గోళ్లు మిమ్ము కాపాడు గాక!

*    *    *

అది మాఘమాసం. ప్రయాగక్షేత్రానికి అటు హిమగిరితో ఆరంభించి ఇటు వింధ్యకు దక్షిణాన సహ్యాద్రివరకూ ఉన్న భూభాగంలో ఎక్కడెక్కడ ఉన్న మునులూ, మాఘస్నానానికని వచ్చారు. పద్ధతిప్రకారం స్నానం, ధ్యానం, జపం అయాక మాధవదర్శనం, తరువాత పితృతర్పణం నిర్వర్తించారు. అనుకోకుండా అక్కడ ఒకచోట భరద్వాజమహామునిని చూచారు. పరమా నందంగా పలకరింపులూ, యోగక్షేమ ప్రసంగం అయాయి. భరద్వాజుడు అందరికీ సముచితంగా చిత్రాసనం వగైరా ఆసనాలు వేశాడు. అంతా కూర్చున్నారు. కులాసా కబుర్లూ మాధవ కథా ప్రసంగాలూ అయాయి. అంతలో అక్కడికి పౌరాణిక దివ్యకేతుడు సూతుడు వచ్చాడు. అతని పేరు రోమహర్షణుడు. వ్యాసుని శిష్యుడు. శ్రుతిస్మృతి పురాణ ఇతిహాసాల విషయం అంతా ఆ గురువు దయవల్ల సొంతం చేసుకున్న బుద్ధిమంతుడు సూతుడు.

భరద్వాజుడు సూతునకు వందనపూర్వకంగా ఆతిథ్యం నెరపి ఆసనంపై కూర్చున్నాక తానూ కాస్త కుడివైపు ప్రక్కగా కూర్చున్నాడు. మునులంతా సూతుణ్ణి వందనాభినందనాలతో ఆనందపరచి తమతమ ఆసనాలపై కూర్చున్నారు.

భరద్వాజుణ్ణి సాభిప్రాయంగా చూచారు. బుద్ధి మదగ్రేసరుడు, భానుతేజుడు, భరద్వాజుడు వారిచూపు గ్రహించి సూతుణ్ణి చూచి చిరునవ్వుతో అన్నాడు.

సూతా ! మునుపు శౌనకుడు యజ్ఞంచేసిన సమయంలో వరాహ పురాణంకథ చెప్పావు జ్ఞాపకం ఉందా!

'చెప్పి ఉంటాను...' అని చిరునవ్వుతోనే అన్నాడు సూతుడు.

'మరి, ఇప్పుడు ఒక పురాణం... అప్పుడే అడిగాను కూడా.

'నరసింహపురాణం...' చెప్పాలి. వినవలసే మునులంతా ఇక్కడ ఉన్నారు. ఏమంటావు?

'పెద్దలమాటకి ఏమంటాను? అందునా ప్రతిభాశాలురకు శిరోమణివి. నీ మాట కాదంటానా? ఏ పద్ధతిలో నరసింహపురాణం చెప్పాలో? సూచన ఇస్తే ఆ మార్గాన వినిపిస్తాను, అని సవినయంగా అన్నాడు సూతుడు.

మంచిది. నా ప్రశ్నలు విను.

చరాచరాత్మకమైన ఈ జగత్తు ఎవరివల్ల రూపొందింది? దీని పాలకు డెవడు? లయకరు డెవడు? భూ ప్రమాణమెంత? ఎలాటి ఆరాధనవల్ల నరసింహస్వామి సంతోషిస్తాడు?

నాలుగుయుగాల లక్షణాలేమిటి? వాటిలో కలియుగం అవస్థ ఏలాటిది? పుణ్యక్షేత్రాలు, పుణ్యగిరులు, పుణ్యనదులూ ఏవి? దేవాదుల సృష్టికథ ఏమిటి? మను – మన్వంతరాల సృష్టి ఎలాటిది?

నరసింహస్వామిని ఆరాధించిన మానవేతరు లెవ్వరు? యజ్ఞాలు చేసి ఆ పుణ్యఫలం పొందిన రాజు లెవరు?

ఇదంతా మాకు వివరించి చెప్పవే మహాత్మా! అని భరద్వాజుడు అనగా విని సూతుడు మంచి ప్రశ్నలువేశావు. మా గురువులు వ్యాసులవారి అనుగ్రహం వల్ల నేను తెలుసుకున్న పురాణవిషయం శ్రీనరసింహదేవుని దయ ఆధారంగా చెప్తున్నాను విను భరద్వాజమునీంద్రా! తపోధనులారా! వినండి అని ఒకసారి గురువును స్మరించాడు చేతులు జోడించి.



**"నమో భగవతే తస్మై వ్యాసాయామితతేజసే,**
**యస్య ప్రసాదాద్వక్ష్యామి వాసుదేవకథా మిమామ్",**

ఈ విష్ణుకథను చెప్పడానికి తగిన జ్ఞానమును నాకు ప్రసాదించిన వ్యాసభగవానునకు, నా గురువునకు నమస్కారం.

భరద్వాజమహర్షీ! మునీశ్వరులారా! నరసింహపురాణంచెప్పే మహాభాగ్యం నాకు కలిగించిన మీ కందరికీ ధన్యవాదాలు. ఋషిచంద్రుడు భరద్వాజుడు అడిగిన ప్రశ్నలకు నేను చెప్పే సమాధాన విషయమే నరసింహపురాణం అని ప్రసిద్ధమౌతుంది. ఔగాక !...నేనిప్పుడు చెప్పబోయేది నా నోటిమాటతో మా గురుదేవుడు చెప్పేదే అని భావించగోరుతున్నాను.

## సృష్టిక్రమం

నారాయణుడే చరాచరాత్మకమైన ఈ జగత్తుకి కర్త. నరసింహాది రూపాలు ధరించి పాలకుడై ఉంటాడు. చివర జ్యోతిస్స్వరూపుడైన తనయందే లీనం చేసుకుంటాడు. సారం చెప్పాను. ఇక క్రమం చెప్తాను. విను భరద్వాజా! సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరితం అని పురాణలక్షణాలు అయిదు.

ఆదిసర్గం, అనుసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరితం అని వాటిని సమీకరించి క్రమంగా చెప్తాను.

ఆదిసర్గం చాలా గొప్పది. అదే మహత్తు. ఈశ్వరస్థితి. పైన దేవతల యొక్క క్రింద రాజులయొక్క చరిత్ర దానివల్లనే తెలుస్తుంది. సృష్టికి ముందు, ప్రళయానికి పైనా కించిత్తైనా లేదు. అలాటిదశలో నిరంజనమూ, నిర్వికారమూ, శుద్ధమూ, శాంతమూ, సర్వమునకు మూలమూ 'బ్రహ్మ' అనే సంజ్ఞకల జ్యోతిర్మూర్తి తనంతతాను అవతరించింది. తానే జ్ఞానం. జ్ఞాననాయకుడు అయింది ఆ బ్రహ్మస్వరూపం.

సృష్టి చెయ్యవలసే కాలం వచ్చిందని ఆ జ్యోతిర్మూర్తి అనుకున్నది. వెంటనే రూపొందింది 'మహత్తు'.

సాత్త్వికం, రాజసం, తామసం అని 'మహత్తు' మూడు విధాలు. వైకారికం, తైజసం, భూతాది–ఇది తామసం–మూడువిధాలు. ఈ వికారమే ముప్విధమైన 'అహంకారం', ఆ మహత్తునుంచే వచ్చింది.

ఇక రూపొందిన ప్రాణులలో ధ్వని ఆవశ్యకం. మహన్మూర్తి అయిన ప్రధానపురుషుడు ఈ మహత్తత్వంలోంచి ఒక మాత్రామూర్తిగా 'శబ్దం' పుట్టించాడు. అదే ఆకాశం; శబ్దానికి మూలం.

తరువాతిది వాయువు. అది స్పర్శగుణం. తాకితే తెలుస్తుంది. ఇది చాలా బలిష్ఠమైన తత్త్వం.

తరువాత కనిపించే తత్త్వం ఏర్పడింది ఆ స్పర్శ లక్షణమైన వాయువు నుంచి. అదే రసప్రధానమైన జలం. దానినుంచి వచ్చింది గంధ లక్షణమైన పృథివి. ఈ విధంగా ఆ యా మాత్రల రూపాలుగా భూతసృష్టి జరిగింది. ఈ సృష్టి తామసమైన అహంకారం నుంచి ఏర్పడిందిగా తెలుసుకోవాలి.

అలాగే ఇంద్రియాలు అయిదున్నూ తేజస్సంబంధములనీ మొత్తం పది అయి, పదనొకండవది మనస్సు అనేది.

చెవులు, కన్నులు, నాలుక, ముక్కు, చర్మం, ఈ అయిదున్నూ జ్ఞానేంద్రియాలు.

వాక్కు, పాణి, పాదం, వాయువు, ఉపస్థం అనే అయిదున్నూ కర్మేంద్రియాలు. ఈ విధంగా ఈ ఇంద్రియసమ్మేళనతో ఒకరూపం ఏర్పడిందన్న మాట. అది ఒక అండం. గ్రుడ్డురూపంతో సృష్టి జరిగింది. అదే దేవతలూ, దానవులూ పుట్టడానికి మూలభూతమైన పదార్థం. అదే మానవులకు, కొండలకు సముద్రాలకు, ద్వీపాలకు, అడవులకు, క్రిమికీటకాదులకు మూలపదార్థం.

హరి రజోగుణమూర్తియై బ్రహ్మరూపంతో సృష్టికర్త అవుతున్నాడు.

కల్పాంతం వచ్చేవరకు నరసింహాదిరూపాలతో ఆ సృష్టిని పాలిస్తున్నాడు. లయ సమయం రాగానే రుద్రరూపంతో అంతమొందిస్తున్నాడు. ఇదీ సృష్టికథ.



## 2. కాలమానం

ఇలా జరిగిన సృష్టిలో ఆయుః పరిమాణం నూరేళ్లు. ఆ లెక్క చెప్తాను విను భరద్వాజా!

పద్దెనిమిది నిమిషాలు ఒక కాష్ఠ. ముప్ఫైకాష్ఠలు ఒక కళ. ముప్ఫైకళలు ఒక ముహూర్తం. ముప్ఫైముహూర్తాలు ఒక అహోరాత్రం (ఒక పగలు ఒకరాత్రి ఇది మనుష్యమానం. అలాటి పదునైదుదినాలు ఒకపక్షం. రెండు పక్షాలు ఒక నెల. ఆరునెలలు ఒకఅయనం. వాటికి ఉత్తరాయణం, దక్షిణాయనం అని పేర్లు. ఆ రెండు అయనాలూ కలిసి ఒక సంవత్సరం.

దేవతలకు దక్షిణాయనం ఒకరాత్రి. ఉత్తరాయణం ఒకపగలు. మానవుల గణనలో ఒకమాసం పితృదేవతలకు ఒకదినం. వసువులకు ఒక దినం – మానవులకు ఒకసంవత్సరం. దేవమానంలో వెయ్యి సంవత్సరాలు ఒక యుగం. అవే త్రేతాదులు, అలాటి యుగాలు వెయ్యి బ్రహ్మకు ఒకదినం. బ్రహ్మకు ఒక దినమైన కాలంలో పద్నాలుగురు మనువులు ప్రవర్తిస్తారు. ఒక మన్వంతరం ఇంద్రాదులకు దేవమానంప్రకారం కొన్ని వేలసంవత్సరాల కాలం అవుతుంది.

విశ్వసృష్టికిముందు దేవతలను, పితృదేవతలను ఈ వరుసలో గంధర్వులను, రాక్షసులను, యక్షులను, పిశాచాలను, గుహ్యకులను, ఋషులను, విద్యాధరులను, మనుష్యులను, పశువులను, పక్షులను, స్థావరములను, పిపీలికలను, పాములను సృష్టిస్తాడు.

ఆ తర్వాత గుణకర్మ విభాగాలతో నాలుగువర్ణాలను ఏర్పరుస్తాడు. సృష్టిని ఇలా పగలు నడిపి రాత్రికాగానే ముల్లోకాలను ఉపసంహరించి ఆ ప్రభువు ఆ రాత్రి శేషశాయియై యోగనిద్రలో ఉంటాడు. ఆ రాత్రినే కల్పాంత మంటారు. దానికే బ్రహ్మకల్పమని పేరు. ఆ సమయాంతమందే మత్స్యావతారం, సముద్రమథనం, అలాగే వరాహకల్పం; ఇదంతా సర్వేశ్వరుని సంకల్పరూప సంపద.

సముద్రజలాలలో మునిగిఉన్న భూమిని ఉద్ధరించదానికి స్వయం బుద్ధితో శ్రీహరి వరాహమూర్తి అవుతాడు. ఇలా సృష్టించి నైమిత్తికమనే ప్రళయంలో ఆ సృష్టిని సంహరించి ఆదిదేవుడైన శ్రీహరి యోగనిద్రా ముద్రితు డౌతాడు.

## 3. మనువు

ఆలాగు నిద్రలో ఉన్న దేవుని నాభియందు పద్మం ఒకటి పుడుతుంది. దానినుంచి వేదవేదాంగాలు క్షుణ్ణంగా తెలిసినవ్యక్తి ఉదయిస్తాడు. అతడే బ్రహ్మ. ఆ బ్రహ్మకు "ప్రజను సృష్టించు" అనే మాట వినవస్తుంది. నిద్రలో ఉన్న దేవుడు అదృశ్యుడౌతాడు. సృష్టి ఎలా చెయ్యాలి? బ్రహ్మకేమీ పాలుపోలేదు. రోషం వచ్చింది. ఆ రోషం మూలంగా ఒక శిశువు పుట్టి బ్రహ్మ తొడపై కూర్చొని ఏడవనారంభించాడు. బ్రహ్మ వానిని ఓదార్చాడు. 'నా పేరేమిటన్నా డా శిశువు?' నీ పేరా 'రుద్రుడు' అన్నాడు బ్రహ్మ. ఆ శిశువు అలా మెల్లగా లేచి నీళ్ళలో మునిగిపోయాడు. తరువాత బ్రహ్మ ఆలోచించి కుడిచేతి బొటనవ్రేలి నుంచి ఒక మగశిశువును, ఎడమ బొటనవ్రేలినుంచి ఒక ఆడుబిడ్డను సృష్టించాడు. ఆ బిడ్డపేరు దక్షుడు. ఆ ఇద్దరినీ దంపతులను చేసి సృష్టి చేయవలసిందని బ్రహ్మ ఆజ్ఞాపించాడు. ఆ దంపతులకు మొదట కలిగినవాడే 'మనువు'. స్వాయంభువమనువు అన్నా అతడే. ఈ విధంగా సృష్టి జరిగింది.

## 4. కశ్యప సంతతి

ఇక నవబ్రహ్మలకథ వినండి. మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, ప్రచేతసుడు, వసిష్ఠుడు, భృగువు అని నవబ్రహ్మలు. వీరు బ్రహ్మ సంకల్పంవల్ల మానసపుత్రులుగా ప్రసిద్ధులైనవారు.

మరీచిభార్య సంభూతి. వీరికొడుకు కశ్యపుడు. ఇతనిభార్యలు పదిముప్పరు. వీరు దక్షునికూతుళ్లు. పెద్దామె అదితి. ఆ తపస్వినికి పన్నెండుగురు కొడుకులు శోభనమూర్తులు కలిగారు.

రెండవభార్య దితి. ఈమెకు మొదటపుట్టిన కొడుకులు ఇద్దరు. ఒకడు హిరణ్యాక్షుడు. శ్రీహరి వరాహావతారుడై ఆ దుష్టుణ్ణి హతమార్చాడు.



ఇంకొకడు హిరణ్యకశిపుడు. వాడు నరసింహమూర్తికి బలి అయినవాడు. ఇతని చరిత్రమే ఇప్పుడు మనకి ప్రధానవిషయం. ఇది ఇలా ఉండనీ. ఒకప్పుడు అడిగావు భరద్వాజా? జ్ఞాపకం ఉందా? వసిష్ఠుడు మిత్రావరుణుల పుత్రు డవడం. ఏమిటాకథ? అని.. అది చెప్తా విను.

### మైత్రావరుణి

కశ్యపుని భార్యలు పదముగ్గురనీ వారిలో మొదటిది అదితి అనీ ఆమెకు పన్నెండుగురు కొడుకులనీ చెప్పాను. వారే ద్వాదశాదిత్యులు. వారివల్లనే పగలూ రాత్రీ కలుగుతున్నాయి. వారిలో మిత్రుడు, వరుణుడు అని ఇద్దరు. వారికి సంబంధించినదే ఇప్పుడు చెప్పబోయేకథ. వరుణుడు పడమటిదిక్కుకు నాయకుడైనాడు. పశ్చిమ సముద్రప్రాంతాన ఉన్న పర్వతం వద్దకు సూర్యుడు చేరగానే ఈ ప్రక్కనున్న జగమంతా అంధకారబంధుర మౌతుంది. సూర్యుడు అక్కడ విశ్రాంతి తీసుకుంటాడు.

ఆ పడమటికొండ పలువిధములైన రత్నాలకాంతులతో వెలిగే శిఖరాలు కల గొప్పపర్వతం. అంతా బంగారుమయం. దాని గుహలు సింహశార్దూల నివాసాలు. అచటి వృక్షాలన్నీ అన్నిఋతువుల్లో మధుర ఫలాలతో సంతర్పణ చేస్తూ ఉంటాయి. సిద్ధులు, గంధర్వులూ, ఆ కొండ కోనలలో స్వేచ్ఛగా విహరిస్తుంటారు.

విశ్వకర్మ ఆ కొండశిఖరాన ఒక చక్కని నగరం నిర్మించాడు. రత్నాలు, బంగారం, ఆ నగర నిర్మాణానికి సమృద్ధిగా ఉపయోగించాడు. దానిపేరు విశ్వావతి. దివ్యభోగాలకు అది నెలవు. ఆ నగరం వరుణుని నివాసం. అక్కడ ఉండి పశ్చిమదిశను పాలించవలసిందని బ్రహ్మ వరుణుణ్ణి నియమించాడు. ఆ విధంగా వరుణుడు లోకపాలకు డయ్యాడు.

అలాఉండగా ఒకనాడు అన్నదమ్ములు మిత్రుడు, వరుణుడున్నూ భూలోకంలో వనవిహారానికి ప్రియపడి క్రమంగా కురుక్షేత్రానికి చేరారు. వికసించిన పూ దీగలతో, ఫలవృక్షాలతో, ఋషుల శ్రుతిగోష్ఠులతో, పక్షుల

కూతలతో కలకలలాడుతున్న కురుక్షేత్రంలో, ఆ అన్నదమ్ములు అలా విహరిస్తూ ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులవుతూ ఇంకా లోపలకు వెళ్ళారు. అక్కడ ఒక చిన్న తామరకొలను. దానిపేరు పౌండరీకం. కాస్త దగ్గరగా వెళ్లారు. చక్కగా విచ్చిన కమలాలతో, కమల పరిమళాన్ని మోసుకవచ్చి చల్లగా తాకే పిల్ల గాలులతో, కనువిందుగా ఉన్న ఆ చెరువులో అచ్చరపూబోండ్లలో తలమానికం, అందచందాలకు పెట్టింది పేరు ఊర్వశి చెలికత్తెలతో జలక్రీడలాడుతూంది. పురుషులెవరూ చుట్టుపట్ల లేరు, రారు అని ఆ రమణీమణి కోయిలగొంతుతో శ్రుతికలుపుతూ శృంగారగీతాలు పాడుతూ స్వేచ్ఛగా తానమాడుతూంది. అన్నదమ్ములిద్దరూ ఆ ముద్దుగుమ్మను ఆ అవస్థలో చూచి ఆశ్చర్యానంద విభ్రమాలతో అల్లుకుపోయారు. ఊర్వశి గడసరి పూబోడి ! శృంగారజలధికి ప్రౌఢవిభ్రమ విలాసనౌక ! ఆ అన్నదమ్ముల హావభావాలు అర్థం చేసుకుని అలాగే క్రీగంటి చూపుల తూపులతో వారి హృదయాలను ఛేదించి జిలుగుపావడతో, వెలిపట్టు రైకతో తడిమేను సర్దుకుని దరికివచ్చి, సెలవిప్పించండి పోయివస్తానని ఒక్క చిరునవ్వు విసిరి తూనీగలాగా మింటి కెగిరిపోయింది. ఆ వగలాడి వగలకు మిత్రావరుణులు తాళలేక పోయారు. పట్టుకోవాలని మడుగుగట్టుకి వడివడిగా వెళ్ళి చేతులు చాచారు. అది దొరుకుతుందా? అది అలాగు తుర్రున పై కెగరడమేమిటి, మిత్రావరుణులకు వీర్యస్ఖలనం అయి పోవడమేమిటి, రెప్పపాటు కాలంలో జరిగిపోయిందంతా!

చల్లబడి అన్నదమ్ములిద్దరూ సహజస్థితికి వచ్చి వెనుదిరిగిపోయారు. కురుక్షేత్రంలో అనువైనస్థలం చూచి ఆశ్రమం ఏర్పచుకుని ఘోరతపస్సు చేశారు. వారితపస్సుకు పితామహుడు మెచ్చి వచ్చి మీ తపస్సుకి సంతోషించాను. ఇకలెండి మీకు వైష్ణవతేజస్సిద్ధి కలిగేట్టు వరమిస్తున్నాను. అదికూడా కొంతకాలం పోయాక సిద్ధిస్తుంది" అని వరమిచ్చి అదృశ్యుడైనాడు. తపస్సిద్ధి సాధించిన ఆనందంతో గతం మరచి ఆ అన్నదమ్ములిద్దరూ స్వస్థలాలకు వెళ్ళిపోయారు.

మిత్రావరుణులకు ఊర్వశీసందర్శనంవల్ల మనస్సుకరగి పతనమైన వీర్యం పద్మంలోనూ, కొలనిగట్టున, నీటిలోను పడింది. పద్మమందుపడినదే



శిశువుగా మారింది. అదే వసిష్ఠుని జన్మకు కారణమైంది. బ్రహ్మ వాక్కు అది. ఆనాటికి ఉన్న శరీరం వదిలి ఇంకొక శరీరాన్ని వసిష్ఠుడు ధరించవలసి వచ్చింది. అంటే ఇంకొక జన్మ ఎత్తవలసి వచ్చిందన్న మాట. అది సామాన్య తేజస్సువల్ల జరుగకూడదు. బ్రహ్మసంకల్పం అలాంటిది. కనుక ఆదిత్యులైన మిత్రావరుణుల అమోఘ వీర్యసంభూతుడై వసిష్ఠుడు మైత్రావరుణి అయ్యాడు.

నేలపై పడిన వీర్యాన్ని ఊర్వశి ఒక చక్కని కుంభం (కుండ)లో ఉంచిపోయింది. దాని నుంచి పుట్టినవాడు పొట్టివాడైనా ఆకారానికి, గట్టివాడు ఆత్మశక్తికి. ఎవరాయన...ఆఁ....అతడే అగస్త్య మహాముని. మహాత్ముల జనన కథలు ఇలాగే వింతగా విడ్డూరంగా ఉంటాయి. ఏరుల పుట్టుకా, మహాత్ముల పుట్టుకా ఎరుగశక్యం కాదు.

జలమందుపడిన వీర్యం మత్స్య సంతతికి బీజమయింది. ఇదే వసిష్ఠుడు మైత్రావరుణి అయిన కథ. దీనిని వ్రాసినా చదివినా, వినినా పాపవిముక్తీ భుక్తి ముక్తులూ కలుగుతాయి. సంతతిలేనివారు నిత్యమూ మైత్రావరుణి కథ చదివితే అపత్య ప్రాప్తి కలవారవుతారు. ఇది ముమ్మూర్తులకూ ఇష్టమైనకథ.

అని చెప్పి ఇంకా సూతుడు ఇలా చెప్తున్నాడు.

## 5. మార్కండేయుడు

ఒకప్పుడు కురుక్షేత్రంలో అప్పుడే ధ్యానముద్రనుంచి కనులు తెరచి చిరునవ్వుతో మమ్మల్ని చూస్తున్న మా గురుదేవునివద్ద గురుపుత్రుడు శుకుడు చక్కని ప్రశ్నవేశాడు. ఏమిటో తెలుసునా?

'నాయనా! మార్కండేయుడు మృత్యుంజయుడు ఎలా అయినాడు? ఆ వృత్తాంతం చెప్పవలసింది' అని. ఆ ప్రశ్నకి మా గురుదేవులు నాయనా? శుకా! మంచిప్రశ్న వేశావు. చెప్తాను విను అని మమ్మల్ని కూడ వినండయ్యా అని ఉద్బోధించి చెప్పిన మార్కండేయోపాఖ్యానం చెప్తాను విను భరద్వాజా! మునులారా! వినండి అపమృత్యుహరమైన కథ.

భృగువు కొడుకు మృకండుడు. మృకండుని ధర్మపత్ని సుమిత్ర. గుణవతి, అనుకూలవతి; చదువు సందెలు ఎరిగిన బుద్ధిమంతురాలు. ఆ దంపతులకు కలగక కలగక ఒక కొడుకు కలిగాడు. ఆ శిశువు పుట్టిన వెంటనే ఒక వికారపుమాట వినవచ్చింది ఆ దంపతులకు. ' ఈ బిడ్డడికి పన్నెండో ఏడు నిండగానే ఆయువు నిండిపోతుంది' అని. కొడుకు కలిగాడన్న సంతోషం అంతరించుకు పోయిందని వేరే చెప్పాలా? అందునా ఆ పచ్చి బాలెంతరాలి గుండెదిగులు చెప్పేదేముంది? ఏమైనాకానీ అనుకుని మృకండుడు కాస్త తెప్పరిల్లి ఇల్లాలిని ఓదార్చి సమయానుసారంగా జాతకర్మ, నామకరణం వగైరా జరిపాడు. ఆ శిశువుపేరు 'మార్కండేయుడు'

మార్కండేయుడు విదియచంద్రుడులాగా దినదిన ప్రవర్ధమానుడౌతూ తల్లిదండ్రులకు సంతోషం, సంతాపం కలిగిస్తున్నాడు. గర్భాష్టమం కాగానే మృకండుడు కొడుకుకు వడుగుచేసి విద్యార్థిగా తగిన ఉపాధ్యాయునివద్దకు పంపాడు. మార్కండేయుడు అతిమేధాశాలి. అచిరకాలంలోనే విద్య పూర్తిచేసుకుని ఇంటికి తిరిగివచ్చాడు.

విద్యార్థియై గురుకులానికివెళ్ళిన కొడుకు విద్యావంతుడై అచిర కాలంలో ఇంటికిరాగా ఆ తల్లి పర్ణశాలముంగిట నిలిపి దిష్టితీసి లోనికి తీసుకువెళ్లి ఇష్టదైవానికి మ్రొక్కించింది. తనకు మ్రొక్కించింది. తనకుమ్రొక్క గానే రెండు చేతులతో లేవనెత్తి చెక్కిలి మెత్తగా ముద్దాడి 'మీ నాయనగారికి సాష్టాంగ నమస్కారం చేసిరా నాయనా! అని పంపింది. మార్కండేయుడు వెళ్లి అగ్నిగృహంనందున్న తండ్రికి ప్రవరచెప్పి అభివాదం చేశాడు. మృకండుడు కొమరుని సంప్రదాయజ్ఞతకు సంతోషించి 'చిరంజీవ!' అని దీవించాడు.

మర్నాడు సాయంకాలం విశ్రాంతిగా ఆశ్రమంలో చెట్టుక్రింద కూర్చుని మృకండుడు, శాస్త్రచర్చలో కొడుకుని కదిపాడు. అది కొంతసేపటికి వాదోపవాద పద్ధతికి నడిచింది. చివరకు మార్కండేయుడు విజేతగా తండ్రిమెప్పును పొందాడు. ఆ చర్చ అంతా పర్ణశాలముంగిట వత్తులుచేస్తూ కూర్చున్న సుమిత్ర విని ఆ వాగ్ధాటికి అబ్బురపడి నా చిన్నారితండ్రి చదువుల సరస్వతి అని,



అన్నమాట మృకండుని తాకక పోలేదు. 'పుత్రా దిచ్ఛేత్ పరాజయమ్' అన్న పెద్దలమాట మా ఇంట సార్థకమయింది అని, ఆ సాత్వికముని సంతోషంగా శిరసుమూర్కొని కొడుకును దీవించాడు. సుమిత్ర నయనోత్పలాలు ఆనంద వారితో చెమ్మగిల్లాయి.

కాలం ఆగదు. అది సర్వస్వతంత్రం. తన నిర్ణయం ప్రకారం గడచిపోతూ ఉంటుంది. మార్కండేయుడు పన్నెండేళ్లవా డయ్యాడు.

....ఆనాడు దూరంగా ఒక ఆశ్రమంలో జరిగిన యజ్ఞానికివెళ్ళి మండుటెండలో తిరిగి ఇంటికి వచ్చాడు. నట్టింట కూర్చున్న తల్లి చప్పున లేచి చిన్ని నాతండ్రీ! ఇంతఎండలో వచ్చావేమిరా! అని మొగానకమ్మిన చెమట పయ్యెదతో అల్లనల్లనఒత్తి స్నానం చేసిరా! అన్నం తిందువుగాని, అని సన్నగా జాలిగా అన్నది. 'గొంతుక ఎండిపోయింది. కొంచెం మంచినీ ళ్లియ్యవమ్మా! ఒక్క క్షణం సేదతేరి స్నానంచేస్తా నన్నాడు కొడుకు. సరే అని తల్లి వంటింటికి వెళ్లి చిన్నమంటిపాత్రలో చల్లనినీళ్లు తెచ్చి కొడుకుకి అందించింది. అది మార్కండేయుడు సరిగా అందుకోకముందే క్రిందపడి ముక్కలై నీరు పల్లానికి ప్రాకుతూంది. అది చూచి సుమిత్రకళ్లంట నీరు ధారగా కార నారంభించింది. మార్కండేయుడు తల్లిమొగం చూచి అదేమిటమ్మా! మంటిపాత్ర. ఇవాళ కాకపోతే రేపైనా పగిలిమంటిలో కలసిపోవలసిందే. దాని కోసం చదువుకున్న బుద్ధిమంతురాలవు అలా విచారిస్తావేమిటమ్మా! చా! చా! అని తన బుజాన వ్రేలాడుతూన్న గావంచాతో తల్లికళ్లు మెత్తగా ఒత్తి బుజాలు పట్టుకొని కూర్చోపెట్టాడు. ప్రక్కనే ఉన్న తాటాకు వీవనతో మెల్లగా విసరుతూ అన్నాడు.

కాదుగాని అమ్మా! నిన్ను అడగాలని అనుకుంటున్నాను. ఒక వారం నుంచి చూస్తున్నాను. నువ్వూ నాయనా ఎందుకో నన్నుచూస్తూ విచార పడుతూన్నట్లు కన్పిస్తున్నారు. ఏమిటి కారణం? ఉన్నది ఉన్నట్టు చెప్పకపోతే నా మీద ఒట్టు- అని అనగా ఆ! ఆ! వద్దునాయనా! వద్దు. అంతమాట అనకు. చెప్తాను విను అని తల్లి ఆ కొడుకు పుట్టిననాడు పురుటిగదిలో వినిపించిన దుర్వార్త చెప్పింది. బాబూ! కలగక కలగక కలిగిన వాడవు. నీతో

వంశం వృద్ధి అవుతుందని ఎంతో ఆశతో ఉన్నాను. ఆ ఆశ తెగిపోయే దుర్దశ వచ్చింది. కొడుకు పుట్టి లేనిదానవై పోతూన్న దౌర్భాగ్యురాలను, మరి దిగులుపడక సంతోషంగా ఎలాఉంటాను చెప్పు. పన్నెండోఏడు ఇంక పదునైదు దినాలలో వెళ్లి పోతుంది అని బోరుమన్నది. మార్కండేయుడు అలాగే తల్లిని పట్టుకుని ఓదార్చి ధైర్యం చెప్తూ ఇలా అన్నాడు.

## తపస్సు

అమ్మా! విచారించకు నా మాట విను. మీ విచారానికి కారణం ఇదా? దానికి విరుగుడు నేను తపస్సు చేసి చూపుతాను. మృత్యువును జయించి చిరంజీవిగా ఈశ్వరునివల్ల వరం పొంది త్వరలోవచ్చి మీకు కనిపిస్తాను. నువ్వు ధైర్యంగా ఉండి నాయనకు ధైర్యం చెప్తూ ఉండులే అని అలాగే తల్లిని తండ్రిఉన్న చోటికి తీసుకువచ్చి అప్పగించి తన తపశ్చర్యగురించి చెప్పాడు. మృకండుడి నోట మాటలేదు. కాని చిన్ననవ్వుతో తల ఊపాడు. మనసా దీవించాడు 'చిరంజీవ!' – అని.

మార్కండేయుడు ముందూ వెనుకా చూడలేదు. అడవిమార్గాన పడి వడివడిగా అడుగులువేస్తూ వెళ్లివెళ్లి వాళ్లతాత భృగుమహర్షిఉన్న వనానికి చేరాడు. ఆ వనానికి వల్లీవటం అనిపేరు. చాలమంది మునులు స్వేచ్ఛగా తపస్సు చేస్తూ భృగువువల్ల ధర్మవిషయాలు తెలుసుకుంటూ చిన్నచిన్న పర్ణశాలలు నిర్మించుకొని ఆ వనంలో ఉంటున్నారు. మార్కండేయుడు తిన్నగా తాతవద్దకు వెళ్లి పాదాభివందనం చేశాడు. అలాగే అక్కడ ఉన్న మునులకున్నూ మ్రొక్కి తాతకి ఎదురుగా కూర్చున్నాడు. భృగువు గ్రహించాడు. అలాగా! అనుకున్నాడు మనసులో. ఏమితాతా! మీ అమ్మానాన్న ఇంకా ఆశ్రమవాసులూ అంతా బాగున్నారా? ఏమిటి ఇలా వచ్చావు? అని ముక్తసరిగా అడిగాడు. మార్కండేయుడు తగిన సమాధానం చెప్పాడు. 'అయితే నువ్వు ఏమి చెయ్యదల్చుకున్నావు?' భృగువుప్రశ్న.

'సర్వభూతాలనూ ఎత్తుకుపోయే మిత్తిని జయించాలని నా సంకల్పం. దానికి తగిన ఉపాయం చెప్పుతాతా!' అని గంభీరంగా అన్నాడు మార్కండేయుడు.



'మంచిది. దానికి శ్రీమన్నారాయణుని చరణాలే శరణు. ఆ అచ్యుత దేవుడు భక్తప్రియుడు. ముసలితనమూ, మృత్యువూ లేనివాడు. ఆ మహానుభావుణ్ణి ఆరాధిస్తే అతని అనుగ్రహంవల్ల మృత్యువును జయించవచ్చుకాని, ఏదో తపస్సు చేస్తే నీ కోరిక నెరవేరదు. నారదుడు జరామరణాలులేని దివ్యర్షియై ఉన్నాడంటే కారణం శ్రీహరి అనుగ్రహమే. దానికి ఆ దేవుణ్ణిగూర్చి అంత తపస్సు చేశాడు. తెలిసిందా? అని చిన్న ఉపన్యాసం ఇచ్చాడు భృగువు.

'సరే, నరసింహదేవుణ్ణి ఎక్కడ ఏవిధంగా ఆరాధించాలి? ఆ పద్ధతిచెప్పు' అన్నాడు మార్కండేయుడు.

'సహ్యపర్వతంలో ప్రభవించి నేలపై ప్రవహిస్తూన్న తుంగభద్రా నదీతీరానికి వెళ్లు. అక్కడ అనువైన చోటు నిర్ణయించుకో. శ్రీమహావిష్ణువును ప్రతిష్ఠించు. నీ ఇంద్రియాలు, మనస్సు ఒకటిగా వశపరచుకో? నిర్మలమైన భక్తితో 'ఓం నమో భగవతే వాసుదేవాయ' విన్నావా? ఇది శ్రీహరికి సంబంధించిన ద్వాదశాక్షరమంత్రం. దీనిని జపిస్తూ ఉండు. ఆ జగదీశ్వరుడు సంతోషిస్తాడు. నిన్ను మృత్యువిజేతగా వరమిచ్చి లోకానికి అప్పగిస్తాడు– అని భృగువు మార్కండేయుడికి మృత్యుంజయమంత్రం ఉపదేశించాడు.

మనుమడు మంత్రోపదేశంపొంది మహానందంతో తాత పాదాలకు నమస్కరించి లేచి, తాతా! వెళ్ళివస్తాను, అన్నాడు.

మంచిది. శ్రీనరసింహదేవుని అనుగ్రహంపొంది మృత్యుంజయుడ వై రా! అని తాత మనసా దీవించాడు. అటూ ఇటూ ఉన్న మునులకు కూడా మ్రొక్కి వారి దీవనలు పొంది మార్కండేయుడు భద్రాతీరానికి వెళ్ళాడు.

ఒక మర్రిచెట్టు కనిపించింది. ప్రక్కనే నది. ఇది బాగుంటుందను కున్నాడు. యథావిధిగా నదిలో స్నానం చేసి చెట్టుక్రింద విష్ణువుని విగ్రహరూపాన ప్రతిష్ఠించాడు. మానసికపూజా విధానంగా జితేంద్రియుడై హృదయ పద్మంనందు రవి సోమాగ్ని మండలాలు నిర్మించుకున్నాడు. వాటి మధ్యను జన్మ

జరామృత్యురహితుడైన శ్రీహరిని సంకల్పించి, భావకుసుమాలతో షోడశోపచార పద్ధతిని పూజించాడు. తాత ఉపదేశించిన ద్వాదశాక్షర మంత్రాన్ని తదేక దీక్షతో అసంఖ్యాకంగా జపించ నారంభించాడు.

ఆనాడు తల్లి చెప్పిన దినం. తన జీవితానికి చివరిపూట. మహాదీక్షతో మనోవాక్కాయ శుద్ధిగా బుద్ధిగా శ్రీమహావిష్ణువును చతుర్భుజుణ్ణిగా హృదయపద్మంనందు కల్పించి భావశుద్ధిగా తదేక భావనగా ఆరాధనచేసి ప్రణవ పూర్వకంగా వాసుదేవమంత్రం సంఖ్యానియమంలేని విధంగా జపించ నారంభించాడు.

అనుకున్న గడియ వచ్చింది. కాని అది మార్కండేయుడికి తెలియదు. ప్రభువు శాసనాన్నే అనుసరించి యమకింకరులు వచ్చారు. ఇంకా అల్లంతదూరాన ఉండగానే విష్ణుదూతలు ఎదురై ఏమిటిలా వచ్చారు! ఆగండి. అడుగు ముందుకు వేశారా మీ మృత్యువే మీకు మృత్యు వవుతుంది. మా మాటవిని మారు మాట కర్చు పెట్టక వచ్చిన దారినే తిరిగిపొండి. మా మాటగా మీ ప్రభువుకి చెప్పండి – ఎవరినీ పంపవద్దు ఈ భక్తుని మీదికి అని.

కాని యమకింకరులు వినలేదు. ముందుకి తోసుకు వచ్చారు. విష్ణుదూతలు కోపంతో రెచ్చిపోయారు. యమకింకరుల చేతుల్లో ఉన్న పాశాలు లాక్కుని వాటితోనే వాళ్ళవీపులు జాడించి దక్షిణదిక్కుగా వాళ్ళని విసిరివేశారు.

మా కెందుకీ బాధ. ఆ మృత్యువే వెళ్ళనీ అని యమకింకరులు పడుతూ లేస్తూ యమునిముందుకి వెళ్ళి జరిగినకథ చెప్పారు. విష్ణుదూతలు వెళ్ళిపోతూన్న యమకింకరుల్ని హేళనచేస్తూ–

**స్తుతి**

ఒరే! లోకేశ్వరుడైన మా విష్ణుదేవుని పేరు వినవచ్చే చోట కాలు పెట్టడానికి మృత్యువుకి గానీ, యముడికిగానీ అయే పనేనా? పొండి, పొండి అని చప్పట్లు చరిచారు. యమకింకరులు అలా ఎగురుతూపోయి మృత్యువుతో చెప్పారు. ‘విష్ణుదూతలు దరిజేరనీయలేదు సరేకదా. మా పాశాలతోనే మమ్మల్ని



తొక్కఊడేట్లు చితుకగొట్టి కట్టివిసిరివేశారని. కథంతా విని మృత్యువు కళ్ళెర్రచేసి ఆ ఆర్భాట మేదో నేను చూస్తాను పొండిరా ఏడుపు మొగాలూ మీరున్నూ–అని తర్జించి గాలిలో తేలుతూ మార్కండేయుని వద్దకు వచ్చింది. చప్పున విష్ణుదూతలు ముంజుట్టు అందుకుని మొగం చిదిగేట్టు మూడు గ్రుద్దులు గ్రుద్ది నువ్వేనా మృత్యువంటే; పాపం కష్టపడి వచ్చావు. ఇప్పుడిచ్చిన కట్నాలు చాలునా? ఇంకా కావాలా? బుద్ధిగా వెనుకకు తిరిగిపో? మీ రాజుకు చెప్పు– అని గిరగిరా త్రిప్పి దక్షిణదిక్కుగా విసిరివేశారు. ముక్కంటా నోటంటా నెత్తురు కారుతూ మృత్యువు మూడుమొగ్గలు వేసుకుంటూ, సంయమనీనగరం సింహద్వారంవద్ద దబ్బున పడింది. అక్కడే ఉన్నారింకా కింకరులు.

మృత్యువు “వచ్చే” సమయంలో ఒక వింత జరిగింది. గాఢభక్తియుక్తుడై హృదయస్థిత విష్ణుదేవుణ్ణి ఆరాధిస్తున్న మార్కండేయుడికి విష్ణువే ఒక స్తుతి వినిపించాడు. దానిని అలాగే మార్కండేయుడు స్పష్టంగా చెప్తున్నాడు. ఆ స్తుతి ప్రభావంవల్ల మృత్యువు దరిజేరలేక అంత దూరాన నిలిచి పాశం గిరగిర తిప్పుతూ వికటంగా చిందులు త్రొక్కుతూ హూష్‌హూత్ అని అరుస్తూంది. అది చూచి విష్ణుదూతలు పట్టుకుని సంభావన ఇచ్చి పంపివేశారు. ఆ స్తుతికి మృతుంజయాష్టకం అనిపేరు.

నారాయణం సహస్రాక్షం పద్మనాభం పురాతనమ్,
ప్రణతోస్మి హృషీకేశం కిం మే మృత్యుః కరిష్యతి.
గోవిందం పుండరీకాక్షం అనంతమజ మవ్యయమ్
కేశవం చ ప్రపన్నో ఽస్మి కిం మే మృత్యుః కరిష్యతి.

వాసుదేవం జగద్యోనిం భానువర్ణ మతీంద్రియమ్,
దామోదరం ప్రపన్నోఽస్మి కిం మే మృత్యుః కరిష్యతి.

శంఖచక్రధరం దేవం ఛన్నరూపిణ మవ్యయమ్,
అధోక్షజం ప్రపన్నోఽస్మి కిం మే మృత్యుః కరిష్యతి.

వారాహం వామనం విష్ణుం నరసింహం జనార్దనమ్
మాధవం చ ప్రపన్నోఽస్మి కిం మే మృత్యుః కరిష్యతి.

పురుషం పుష్కరం పుణ్యం క్షేమబీజం జగత్పతిమ్,
లోకనాథం ప్రపన్నోఽస్మి కిం మే మృత్యుః కరిష్యతి.

భూతాత్మానం మహాత్మానం జగద్యోని మయోనిజమ్,
విశ్వరూపం ప్రపన్నోఽస్మి కిం మే మృత్యుః కరిష్యతి.

సహస్రశిరసం దేవం వ్యక్తావ్యక్తం సనాతనమ్,
మహాయోగం ప్రపన్నోఽస్మి కిం మే మృత్యుః కరిష్యతి

య ఇదం పఠతే భక్త్యా త్రికాలం నియత శ్శుచిః,
నాకాలే తస్య మృత్యుస్స్యాన్నరస్యా చ్యుత చేతసః,

**మృత్యుంజయుడు**

తరువాత యమకింకరులు యమునిముందు ఆక్రోశిస్తూ నిల్చొని ప్రభూ! నీ ఆజ్ఞానుసారంగా మేమూ, మృత్యువూ ఆ బ్రాహ్మణబాలుడు తపస్సుచేస్తున్న చోటికి వెళ్లాం. మమ్మల్నీ మృత్యువునీ మా పాశాలతోనే చిదగకొట్టి బలిష్ఠకాయులు నలుగురు మీదికి విసరివేశారు. ఇంతవరకు ఈలాటి అవమానం మాకు ఎక్కడా ఎవరివల్లనూ జరగలేదు. ఆ పిల్లవాడు ఎవరు! ఎవర్ని మనసులో ఉంచుకుని తపస్సు చేస్తున్నాడు! మమ్మల్ని భర్జించి పారదోలిన ఆ పురుషు లెవరు! అని అడిగారు. యముడు ఒక్కక్షణం ఆలోచించి తల పంకించి మెల్లగా అన్నాడు.

ఆ బాలుడు భృగుమహాముని పౌత్రుడు, మృకండుమహాముని కొడుకు, పేరు మార్కండేయుడు. తన అవసానకాలం తెలుసుకుని, దానినుంచి బయటపడవలెనని తన తాతను ఉపాయం అడిగి అతనివల్ల విష్ణుదేవునికి సంబంధించిన ద్వాదశాక్షరదివ్యమంత్రం ఉపదేశం పొందాడు. ఆయన చెప్పినట్టుగా విష్ణుని హృదయపద్మంలో ప్రతిష్ఠించుకొని ఆరాధిస్తూ తదేక దీక్షతో ఆ దివ్యమంత్రం జపిస్తున్నాడు. ఆ విషయం గ్రహించక నేను తొందరపడి మిమ్మల్ని పంపాను. ఆ సమయంలో విష్ణుదేవుడే అతనికి మృత్యుంజయాష్టకం వినిపించాడు. ఇక మీరుగాని, నేనుగాని అతని నేమి చెయ్యగలం! మిమ్మల్ని



భర్జించి నిర్జించిన ఆ నలుగురున్నూ విష్ణుదేవుని దూతలు. కాబట్టి సర్వేశ్వరుని దూతలవల్ల జరిగినదానికి మీరు విచారించకండి. అది మీ మంచికే జరిగింది. విష్ణుభక్తునిమీదికి వెళ్లినందువల్ల వచ్చినపాపం పోయింది. ఇప్పుడు మీకు చెప్తున్న మాటవినండి. 'మీరు గాని, మృత్యువుగాని ఇటుపై విష్ణుభక్తుల మీదికి వెళ్లవద్దు. ఇది నా ఆజ్ఞ' తెలిసిందా!

తరువాత యముడు నరకబాధ అనుభవిస్తూన్న పాపులకు, ఒకప్పుడు నారదునకు విష్ణువు చెప్పిన విష్ణుస్తుతి ఉపదేశించాడు.

'పుండరీకాక్షా! దేవేశా! నరసింహా! త్రివిక్రమా! నిన్నే నేను శరణు పొందుతున్నాను. నన్ను ఉద్ధరించు జనార్దనా! అని ప్రార్థించే వారిని నేను ఉద్ధరిస్తాను' అని ఆ స్తుతికి అర్థం.

ఆ స్తుతి విని నరకాగ్ని జ్వాలలలో మ్రగ్గుతున్న పాపులందరూ నిశ్చల భక్తితో నిబ్బరంగా, ఆ స్తుతిని ఉచ్చరించారు. వెంటనే వారందరూ పాపవిముక్తులై విష్ణురూపధరులై దివ్యవిమానాలలో ఎక్కి వైకుంఠానికి వెళ్లిపోయారు.

## 6. చిరంజీవి

ఆ విధంగా మృత్యువును జయించి కృతార్థుడై మార్కండేయుడు వెనుదిరిగి కతిపయప్రయాణాలలో ఇంటికి వచ్చాడు. శ్రీహరి దయచే మృత్యువును జయించి దివ్యతేజస్సుతో ఒప్పుతూ వచ్చిన కొడుకుని చూచి తల్లిదండ్రులు ఒక్కమారే కౌగిలించుకొని ఆనందబాష్పధారలతో కొడుకు తల తడిపివేశారు. ఆ తల్లి సంతోషానికి అంతులేదు. చిత్రాసనంమీద కొడుకును కూర్చోపెట్టి ఎదురుగా తాను కూర్చుంది. ముఖం తేరిపారచూస్తూ మా వరాలమూట మృత్యువుని జయించివచ్చాడు. దేవ మానవ జాతులలో మునుపు ఈలాటి కథ వినలేదు. మా వరప్రసాదం ఆ పని చేశాడు. లోకచరిత్రలో అపూర్వం అని పొంగిపోతూంది.

కొంతసేపయాక 'లే బాబు స్నానంచేసిరా! ఈ లోపల పాకం సిద్ధం చేస్తాను. నా చేతితో నీకు అన్నంపెట్టి ఎన్నాళ్లో అయిందిరా! లే! లే!' అని తొందరపెట్టి వంటింటికి వెళ్లింది సుమిత్ర.

మార్కండేయుడు స్నానం, ధ్యానం, శ్రీహరిమంత్రజపం యథా క్రమంగా నిర్వర్తించి వచ్చాడు. తండ్రిప్రక్కనే కూర్చున్నాడు. సుమిత్ర వంట అంతా దేవుడికి నివేదించి పతికీ, సుతుడికీ వడ్డించింది. భోజనం అయాక తల్లి భోజనం చేస్తూండగా ఎదురుగా దర్భాసనం మీద ధీమాగా కూర్చుని తండ్రి వింటూ ఉండగా ఇంటిదగ్గరనుంచి తాను బయలుదేరినది మొదలు తిరిగి ఇంటికి వచ్చేవరకు జరిగినదంతా పూసగ్రుచ్చినట్టు మార్కండేయుడు చెప్పాడు. తల్లిదండ్రులు ఆనందం, భయం, ఆశ్చర్యం పొందారు.

అయింది. అనుకున్న ఆపద తప్పింది. స్వామిజనార్దనుడు అనుగ్రహించాడు. ఇక ఆలస్యమెందుకూ? శుభస్యశీఘ్రం అన్నారు. ఒక శుభ ముహూర్తాన సంప్రదాయానుసారంగా లక్షణవతియైన కన్యకను కొడుక్కి ధర్మపత్నిగా వివాహం చేశారు.

సుమిత్ర కొడుకునూ, కోడలునూ ముద్దుగా ముచ్చటగా చూస్తూ మురిసిపోతూంది. మార్కండేయుడు సలక్షణంగా గృహస్థాశ్రమ జీవితం గడుపుతున్నాడు.

కొంతకాలానికి కొడుకు కలిగాడు. ఆ శిశువుపేరు వేదశిరసుడు. వానికి జాతకర్మాదులు సమయానుసారంగా చేశాడు. పెద్దవాడయాకఇంటిబరువు వాని కప్పగించి, తాను ప్రయాగక్షేత్రానికి వెళ్లి వటవృక్షం క్రింద చోటుచేసుకుని మహావిష్ణువును గూర్చి తపస్సు తీవ్రంగా చేశాడు. మృత్యుముఖంనుంచి తనను తప్పించిన విష్ణువును తనివితీరా చూడాలని పట్టుదల. హృదయంలో ఉన్న ఆ దేవుణ్ణి ఈ నేత్రాలతో చూడాలి. ఒక నాడు భక్తిపరవశుడై శ్రీహరిని స్తుతించాడు. అప్పుడు ఒకమాట వినవచ్చింది. మునీ! సర్వతీర్థాలలో స్నానంచేసి పురుషోత్తమక్షేత్రంలో మాధవుణ్ణిగూర్చి ఆరాధించితే కృతార్థుడవవుతావు! అని. సరే మార్కండేయుడు లేచి సర్వతీర్థాలలో మునిగిలేచి పురుషోత్తమ క్షేత్రంలోఉండి శ్రీహరినిగూర్చి తీవ్రమైన తపస్సుచేశాడు. అంతట శ్రీహరిదర్శనం అయింది.

దివ్యాలంకారాలు ధరించి, పీతాంబరుడు, పుండరీకాక్షుడు, శంఖచక్ర గదాపాణి, భువనమోహనాకారుడు పురుషోత్తమదేవుడు కనిపించగానే



మార్కండేయుడు లేచి, సాష్టాంగ నమస్కారంచేసి బహుధా స్తుతించాడు. ఆ స్తుతికి సంతోషించి శ్రీహరి 'మార్కండేయా! నీ తపస్సుకి సంతోషించాను. వరమిస్తాను కోరుకో! అని అనగా 'ప్రభూ! నీ దర్శనం అయింది. అదే నాకోరిక. అయినా ఇస్తానన్నావు కనుక కోరుతున్నా; అనుగ్రహించు.

నిన్ను సర్వదా సేవిస్తూ జీవించాలని నా సంకల్పం. కాబట్టి నీ యందు సుస్థిరమైనభక్తినీ, నిన్ను సేవిస్తూ సంతోషంగా కాలం గడపడానికి 'చిరంజీవిత్వమూ' అనే వరాలు ఇస్తేచాలు అని అన్నాడు.

'మంచిది. మునుపు నన్ను ఆరాధించి మృత్యువును జయించావు. ఇప్పుడు చిరంజీవిగా వరమిస్తున్నాను. ఈ తీర్థం నీ పేరుతో ప్రసిద్ధ మవుతుంది. ఇందులో స్నానంచేసి నిశ్చలమైనభక్తితో నన్ను ఆరాధించేవారు చిరంజీవు లౌతారు. నువ్వు మళ్ళీ యోగముద్రలో ఉన్న నన్ను క్షీరసముద్రంలో చూస్తావు అని శ్రీమహావిష్ణువు అంతర్హితుడైనాడు.

తర్వాత మార్కండేయుడు అక్కణ్ణించి బయల్దేరి జనార్దనస్వామిని జపిస్తూ, కీర్తిస్తూ అక్కడక్కడ మునుల సమావేశాలలో వేదశాస్త్రాలనూ, ప్రాచీన కథలను, పురాణాలనూ చెప్తూ పరమానందంగా, శ్రీహరినామసంకీర్తనం చేస్తూ మరలా పురుషోత్తముణ్ణి దర్శించే కోరికతో క్షీరసాగరానికి వెళ్లాడు. సాగర తరంగాలపై ఉయ్యాల ఊగుతూన్నట్టు శేషశయ్యపై యోగనిద్రలో ఉన్న యోగీశ్వరుణ్ణి దర్శించాడు. ఆనందంతో మైమరచి పోయాడు. అనేకవిధాల మహావిష్ణువును స్తుతించాడు. విష్ణువు అలాగే ఆప్యాయంగా చూచి 'మార్కండేయా! నాపై నీకుగల అచంచల భక్తికి సంతోషించాను. నీకు కోరినంతనే ముక్తి వచ్చేటట్టు వరమిస్తున్నాను. చిరంజీవివై, నాభక్తులలో అగ్రగణ్యుడవై ప్రవర్తించు. నీవు కోరినంతనే దర్శనమిస్తూ ఉంటాను' అని అన్నాడు. మార్కండేయుడు మరీ మరీ శ్రీహరిని కీర్తిస్తూ మరలిపోయాడు.

ఇదీ మార్కండేయుడు మృత్యుంజయుడై చిరంజీవి అయిన కథ అని సూతుడు చెప్పి ఈ కథను భక్తితో చదివేవారూ చిరంజీవులవుతారు...

ఈ వృత్తాంతం విని శుకుడు మహానందం పొంది మా గురువుగారిని చూచి నాయనా! ఎంతవిన్నా విష్ణుకథలు వినాలనే ఉంటాయి. ఇంకేదైనా హరికథ ఒకటి చెప్పు అని అనగా, మా గురుదేవుడు చెప్పినది చెప్తాను విను భరద్వాజా! దానికి ముందు ఒక చిన్నకథ ఎలాటి వారిని దేవతలుగా చెప్పవచ్చును? అనేదానికి ఉదాహరణ వినండి అందరున్నూ.

## అన్న – చెల్లెలు

'కానిపని చేయకూడదు' అనే నీతి వాక్యానికి మొదటి సాక్షి యముడు. దానివల్లనే అతడు దేవతలలో ఒక దిక్పాలకుడై ధర్మరాజు అనే ప్రశస్తమైన పేరు పొందాడు. అతని ధర్మప్రవర్తనకి సంబంధించిన కథ ఇది.

సూర్యునికొడుకు యముడు. అతనిపేరు వినగానే అంతా భయ పడతారు. కాని భయపడ నక్కరలేదు. అతనిబుద్ధి ఏ క్షణంలోను, ఏ దశలోనూ అధర్మమార్గాన నడవలేదు. అంతశ్శుద్ధమైన బుద్ధిగలవాడు. అలాగే అంత అందగాడున్నూ.

యమునికి ఒక చెల్లెలు ఉంది. దాని పేరు యమి. అందానికి ముందు చెప్పదగిన సుందరి. ఆ అన్నకి చెల్లెలే, కాని బుద్ధికి మాత్రం అన్నకీ చెల్లెలికీ అక్షరమైనా పోలికలేదు.

అన్నా చెల్లెలూ ఒకే కడుపున పుట్టి ఒకేయింట అన్యోన్యంగా పెరుగుతున్నారు. క్రమంగా ఇద్దరూ యుక్త వయస్కులైనారు. వయసుతోపాటు వారి అందచందాలుకూడా పెరుగుతూ వచ్చాయి.

ఒకనాడు యమి అన్నకి కాస్త దగ్గరగా ఎదురుగా కూర్చుని చిగురాకు పెదవిపై చిరిమల్లె నవ్వు మెరుస్తుండగా, కాటుక కళ్ళచూపుల్లో కాముని తూపులు విసురుతూ సన్నని కోయిల కంఠంతో అన్నదికదా!

అన్నా! నిన్ను నేను మనసారా వలచిన మగువను. నన్ను కాదనక నా కోర్కితీర్చు. కాదంటావా, కామాగ్ని జ్వాలలకి కట్టెనై పోయి నీ కళ్ళముందే పిడికెడు బుగ్గి అయిపోతాను చూడు అని మెల్లగా చేయిపట్టుకుంది. యముడు



చల్లగా చెయ్యి విడిపించుకుని ఆశ్చర్యంగా చెల్లెల్ని చూచి చెల్లెలా! లోకపద్ధతికి విరుద్ధంగా మాటాడుతున్నావు. ధర్మశాస్త్రానికి రూపం అని చెప్పదగిన సూర్యుని బిడ్డలం మనం. ఒకే తల్లి కడుపున రక్తం పంచుకుని పుట్టిన తోబుట్టువులం. మనం తుచ్ఛకామానికి లొంగిపోయి లోకంలో ఎన్నడూ చెరగని అపకీర్తి నిలిపే నీచుల మౌతామా? నువ్వూ చదివిన దానవే; తగని మాటలాడకు. నీకు అన్ని విధాలా సుఖం కలిగించే పురుషుడు ఎక్కడో పుట్టి పెరుగుతున్నాడు. కాలం కలిసిరాగానే కంటపడతాడు. అంతవరకు తాళవలసిందే. అటు మన అమ్మవంక గాని, ఇటు మన నాయనవంక గాని ఎన్నడూ లేని ఈ దుష్ట మార్గాన నడవడం కలలోనైనా తగదు – అని క్రమక్రమంగా చిరాకు కూడా సూచిస్తూ అన్నాడు.

యమి శాంతించలేదు. మరింత రెచ్చిపోయింది. స్త్రీ కామవశురాలై నపుడు ఆమెకోరికను తీర్చడం పురుషుని ధర్మం. అన్నా చెల్లెలు అని అర్థంలేని వావీ వరసా కల్పించుకుని లోకం పనికిమాలిన పతనావస్థకి దిగజారి పోతూంది. శరీరసుఖానికి వావివరుసలు అడ్డురావు అనే పరిష్కారమార్గం మనం చూపు దాం. కాబట్టి వలచి పలుకుతూన్న నా పలుకులు సరిగా అర్థం చేసుకో. నా ప్రాణాలు నిలబెట్టు అని మొరాయించింది.

యమివాదం విని యముడు శాంతంగా మళ్ళీ అన్నాడు. చెల్లీ! చెయ్యరానిపని యిది. ఈ పని పశువులకూ, పక్షులకూ చెల్లుతుంది గానీ మనవంటి ఏక గర్భజనికులైన ప్రాణులకు తగదు. కాబట్టి తుచ్ఛమైన శారీర వికారానికి లొంగక బుద్ధిమంతురాలవై వర్తించు.

మంచిది. ఒకే కడుపున పుట్టిన మనవంటి ప్రాణులు ఏకం కాకూడ దన్నావు. ఒకే కడుపున ఉండివచ్చిన వాళ్లం ఈ లోకంలో ఒకే శరీరంగా ఒకే పానుపుపై ఏల కలిసి ఉండకూడదు? అని యమి అడ్డుప్రశ్న వేసింది.

చెల్లెలా! అలాటి ప్రశ్నలు చిత్తశుద్ధి కలవారు వెయ్యకూడదు. క్షణికమైన శరీరసుఖానికి లొంగి తల్లి, పిల్ల, చెల్లెలు అనే విచక్షణత లేకుండా జ్ఞానజీవులు ప్రవర్తించకూడదని బ్రహ్మ శాసించాడు. మనం జ్ఞానజీవులం, తెలిసి ఈలాటి అకార్యం మనం చేస్తే ఇక ధర్మమూ, జ్ఞానమూ లోకంలో ఉంటాయా? మంచిని నిర్ణయించుకుని చేయాలి. దానిని లోకం అనుసరిస్తుంది. మంచి చెడ్డా అనేదీ

చూడక మృగాల్లాగా మనవంటివారు నడిస్తే ఇక సృష్టి ఏమయేట్టు? అని కాస్త మందలిస్తూన్నట్టన్నాడీమారు యముడు. చివరిమాటగా అన్నాడుకూడా చెల్లెలా! నేను ధర్మాన్ని గౌరవిస్తూ చలించని చిత్తంతో శివకేశవులను ఆరాధించే దృఢవ్రతుడను, నే నీలాటి పాపపుపని చెయ్యను, చెయ్యలేను. నువ్వు ఒక్కక్షణం ధర్మాన్ని ఆలోచించు.

యమి సిగ్గుతో తలవంచి చేతులు జోడించింది. ధర్మపాలనలో అంత దృఢవ్రతుడు కనుకనే యముడు 'ధర్మరాజు' అని పేరు పొందడమేకాక ప్రధాన దేవతలలో ఒకడైనాడు. ఇది పాపహరమైన కథ. దీనిని చదివి మానవులు ధర్మమార్గమందు స్థిరచిత్తులై ఉండడానికి సాధన చేయాలి.

యమునివలె దృఢవ్రతులూ, అకార్యాలను చెయ్యని వారున్నూ అయిన మానవులు దేవత్వం పొందుతారు అని మా గురువుగారు శుకునకు చెప్పారని సూతుడు తరువాత ఇలా చెప్ప నారంభించాడు.

## 8.పతివ్రత

ఒక పతివ్రతకథను చెప్తాను వినండి. అదికూడా మా గురుదేవుడు శుకునకు చెప్పిందే.

మధ్యదేశంలో నందిగ్రామం అనే గ్రామం. దానిలో నివసిస్తున్న బ్రాహ్మణుడు సద్గృహస్థు. వేదాలూ, శాస్త్రాలూ వల్లించడమేకాదు, అవి చెప్పిన ధర్మాలను యథాశక్తిగా ఆచరణలో చూపుతూన్న కర్మిష్ఠి. నిత్యాగ్నిహోత్రి. అతిథులను అభ్యాగతులను ఆదరిస్తూ వారిని నరసింహస్వామిగానే భక్తితో ఆరాధిస్తాండే జ్ఞాని. పేరు కశ్యపుడు. అతనిఇల్లాలు అతనికితగిన బుద్ధిమంతురాలు. ఇల్లాండ్రకు మేల్బంతిగా ఆ యింతిని చెప్పాలి. ఆచారానికి కుదురు. పతినే దైవంగా భావిస్తూ, పతిశుశ్రూష తప్పక, ఏ పనిలోనూ సోమరితనం లేక పతిఆజ్ఞకు కట్టుపడి ఇంటిని పాలసముద్రంగా చేసుకున్న గృహలక్ష్మి. ఆ ఇల్లాలిపేరు సావిత్రి.

నందిగ్రామానికి ఆమడదూరంలో ఒక చిన్న గ్రామం. ఆ గ్రామంలో యజ్ఞశర్మ అనే బ్రాహ్మణుడు నివసిస్తూ ఉండేవాడు. బాగా చదువుకోకపోయినా



పురోహితవృత్తికి తగిన స్మార్తప్రక్రియ చేయించడానికి తగినంత చదువు గలవాడు. ఆ ఇంటా ఈ ఇంటా పొరుగు ఊళ్ళలో నోములూ, వ్రతాలు చేయిస్తూ వాటితో వచ్చే బియ్యం, పిండీ తెచ్చి భార్యకి ఇస్తూ కాలం వెళ్ళిస్తున్నాడు. చెప్పవలసివస్తే బీదవాడనే చెప్పాలి. అతని భార్యపేరు రోహిణి. ఆమె సర్వ శుభలక్షణాలు గల బుద్ధిమంతురాలు. ఏ దశలోనూ పతికి వ్యతిరేకంగా మాటాడి ఎరగనిసాధ్వి. పతిసేవ గృహజీవనానికి నావ అని త్రికరణశుద్ధిగా నమ్మి అలాగే నడుస్తూన్న ఇల్లాలు. ఆ దంపతులకు కలగక కలగక ఒక కొడుకు కలిగాడు. వానికి యజ్ఞశర్మ జాతకర్మ, నామకరణం సక్రమంగా చేసి దేవశర్మ అని పేరుపెట్టారు. పిల్లవాడు చక్కగా పెరిగి అయిదేళ్ళు కాగానే అక్షరాభ్యాసం, ఏడేళ్ళు రాగానే ఉపనయనం చేశాడు. ఆకస్మికంగా యజ్ఞశర్మ కన్నుమూశాడు.

కొడుకూ తల్లీ, అనాథజీవను లయారు. కొడుకు తల్లిని ఓదార్చి వారినీ వీరినీ దారిబత్తెం యాచించి కాశి, గయ, ప్రయాగ మొదలైన పుణ్యక్షేత్రాలకు వెళ్ళాడు. తండ్రికి యథావిధిగా పారలౌకిక క్రియాకాండ నిర్వర్తించాడు. అలాగే దేశాటనం చేసిచేసి నందిగ్రామానికి వచ్చి అచ్చట ఊరి వెలుపల ఒక దేవాలయంలో ఉంటూ జపం, తపం చేస్తూ ఉన్నాడు. అనుష్ఠానం అయాక గ్రామంలోకి వెళ్ళి ఏ ఇల్లాలో ఆదరించి పెట్టిన భిక్షాన్నంతో ఆకలిచిచ్చును అణచుకుంటూ, ఆలయానికి ప్రక్కగానున్న చెరువునీటితో దప్పి తీర్చుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు. తదేక దీక్షగా జపతపాలు సాగిస్తున్నాడు.

ఒకనాడు చెరువులో స్నానంచేసి ఆలయం ఆవరణలో ఉన్న చెట్టు క్రింద కట్టుబట్ట ఆరవేసి జపానికి కూర్చున్నాడు. అంతలో ఆరీ ఆరని ఆ బట్ట మీద రెట్టలు పడ్డాయి. ఏమిటా అని పైకి చూచాడు. కొమ్మమీద తెల్లని కొంగ, నల్లనికాకీ; కోపంతో బెదర గొట్టుతూ చూచాడు. ఆ కోపదృష్టికి కొంగ, కాకి అక్కడికక్కడే చచ్చి టప్ టప్మని క్రిందపడి పోయాయి. బట్టమీద రెట్టవేసి నందుకు చచ్చాయి. చావనీ! అని మొదట సంతోషించాడు గాని క్షణకాలం అయాక అయ్యో! నోరెరగని పక్షులు నా కోపాగ్నికి ఆహుతి అయిపోయాయే! అని విచారించాడు.

ఒక కఱ్ఱతెచ్చి ఆ రెంటినీ దూరంగా పారజిమ్మి చెరువులో కట్టు బట్టను శుద్ధిచేసి స్నానంచేసి ఆలయానికి వచ్చాడు. మిట్టమధ్యాహ్నం అయింది. భిక్షాటనానికి గ్రామంలోకి వెళ్ళాడు. సరాసరి, కశ్యపుని ఇంటి ముందుకి వెళ్ళి భవతి! భిక్షాం దేహి! అని కేకవేశాడు. అదే సమయంలో కశ్యపుడు ఊరినుంచి ఇంటికి వచ్చి లోనికి వెళ్లాడు. సావిత్రి భిక్షుకుని కేక విన్నదేగాని పతికి సేవచేయక ఏ పనీ చెయ్యని ప్రతివ్రతా రత్నం. కనుక దేవశర్మకు ఆహారం పెట్టలేక పోయింది. పతికి స్నానం, భోజనం వగైరా అంతా సక్రమంగా జరిపి ఆయన నిద్రించాక, ఒక విస్తరిలో ఆహారపదార్థాలు తెచ్చి తీసుకో వడుగా! అని ఆదరంగా అన్నది. 'నేను ఎప్పుడో వచ్చి అన్నం అడిగాను. ఇంతసేపూ నీ వాకిట నిలబెట్టి, ఇప్పుడు తెస్తావా అన్నం?' ...అని దేవశర్మ రోషంతో మండిపడుతూ ఆ ఇల్లాల్ని కాల్చేస్తాను చూడు అన్నట్టు చురచుర చూడసాగాడు. తాను గొప్ప తపశ్శక్తి కలవాడనని గర్వం!

అమాయకురాలు సావిత్రి పరమపతివ్రత. వానిచూపులకు జంకక 'నేను కొంగనూ, కాకినీ కానయ్యా! నీ కరకుచూపులకు కాలి చావడానికి. తీసుకో భిక్ష తీసుకో!' అని చిన్న నవ్వునవ్వి హేళనగా అన్నది. ఆ మాటకి దేవశర్మ గతుక్కుమన్నాడు. ఎక్కడో ఊరివెలుపల చెట్టుక్రింద జరిగిన విషయం ఇంటనున్న ఈమెకి ఎలా తెలిసింది! ఈ పరోక్ష విషయజ్ఞానం ఈ ఆడుదానికి ఎలా వచ్చింది! ఈ ప్రశ్నతో వానిఆకలి అణగిపోయి ఆశ్చర్యం తల మునకలయింది. కిమ్మనకుండా ఆహార పదార్థాలు తీసుకున్నాడు. తలవంచు కుని తిన్నగా తన విడిదికి వచ్చాడు. ఆకులో ఆహారపదార్థాలు గుమ్మరించి అన్నీ కలిపి ఒకమారే ఆహారించాడు. సరియైన చైతన్యం లేదు. అలాగే చెయ్యీ నోరూ కడుగుకున్నాడు. ఎండ చల్లబడినతర్వాత మళ్ళీ కశ్యపునిఇంటికి వచ్చాడు.

అప్పటికి కశ్యపుడు నిద్రలేచి పొలంపనిమీద వెళ్లిపోయాడు. సావిత్రి ప్రాచీన పురాణకథ ఏదో చదువుకుంటూ తీరుబాటుగా కూర్చుంది. అమ్మా!



అనే కేక వినగానే తాటాకుపొత్తం పదిలంగా క్రిందపెట్టి మెల్ల మెల్లగా కలహంసిలాగా అడుగులువేస్తూ వీథివసారాలోకి వచ్చింది. ఎదుటచేతులు జోడించి నిల్చున్న బ్రహ్మచారి దేవశర్మ. 'ఏమి వచ్చావు వడుగా!' అని ఆదరంగా అడిగింది.

'అమ్మా! ఎక్కడో జరిగిన దానిని ఇంటనున్న నీవు ఎలా చెప్పగలిగావు! ఆ శక్తి నీ కెలా వచ్చింది! అది అడగడానికి వచ్చానని బెదురుతూనే అడిగాడు ఆ బ్రహ్మచారి.

అదా! చెప్పనా! పతిని ఆరాధ్యదైవంగా భావించి సేవించడం భార్య ధర్మం. నేను ఆ ధర్మాన్ని ఏమరక నెరవేర్చుతూ ఉంటాను. దానివల్ల నాకు పరోక్షవిషయజ్ఞానం కలిగింది. స్వధర్మం ఎంత కర్కశమైనా దానిని శ్రద్ధతో ఆచరించేవారికి అన్నిశక్తులూ అలవడతాయి. దానిలో ఆశ్చర్యపడవలసింది లేదు. ఇక నీ విషయం. నిన్ను నవమాసాలుమోసి దుర్భరప్రసవవేదన భరించి కని నిన్ను కళ్లలో వత్తిపెట్టుకుని పెంచిన తల్లిని, పైగా అనాథను, నీపై ఆధారపడియున్న వ్యక్తిని గాలికి విడిచిపెట్టి నువ్వు ఇక్కడ చేసే జపమూ, తపమూ అర్థంలేని పనులు. కన్నతల్లిని మించిన దైవం లేదు. 'మాతృదేవో భవ' అనే శ్రుతివాక్యం వినలేదా? విని ఏమిలాభం? ఆ మాతృదేవతను సేవిస్తూ ఉంటే అన్నీ నీకు వశం అవుతాయి. ఆ మాత్రం తెలియక స్వధర్మ త్యాగివై ఏదోతపస్సు చేస్తున్నావు తపస్సు. నీ తపస్సువల్ల వచ్చేదేమిటి? కొంగనీ, కాకినీ చంపడం, అంతేకదా! వెళ్లు, బుద్ధికలవాడవై ఇంటికివెళ్లు, తల్లిని శ్రద్ధాభక్తులతో సేవించు– అదే గొప్పతపస్సనుకో! ముందుగా నీ కోపానికి బలిఅయిపోయిన పక్షులకు దహనశుద్ధిచేసి, స్నానంచేసి, తిన్నగా ఇంటికివెళ్లు. తల్లిని పోషిస్తూ ఉండు. నీకు యజ్ఞశర్మ అనేవాడికూతురు భార్య అవుతుంది. పోయి అడుగు. తరువాత మీకు ఒకకొడుకు కలుగుతాడు. వాడు మీ వంశకర్త అవుతాడు. ఆ పైన నీ తల్లి, భార్య మరణిస్తారు. ఇంకేముంది? నువ్వు యథావిధిగా సన్యాసం స్వీకరించు. ఆ నరసింహస్వామిని మనసా ఆరాధిస్తూ, కాలక్షేపం చెయ్యి. జన్మాంతమందు విష్ణుసాయుజ్యం పొందుతావు అని చెప్పింది సావిత్రి.

అన్నీ విన్నాడు. క్షమించుతల్లీ! బుద్ధివచ్చింది, పోయివస్తాను అని దేవశర్మ వెనుదిరిగివచ్చి పక్షులకు దహనాదికం చేసి తిన్నగా స్వగ్రామం వచ్చాడు. సావిత్రి చెప్పినట్టే మాతృసేవచేస్తూ, గృహస్థుడై, పుత్రుడుకలిగాక, భార్య, తల్లి మరణించగా సన్యాసి అయాడు. ఆ నరసింహస్వామిని నమ్మి ఆరాధిస్తూ జన్మాంతమందు విష్ణుసాయుజ్యం పొందాడు.

విన్నారా! స్వధర్మానుష్ఠానం ఎంతగొప్పదో? అలాగే జ్ఞానం అనేది. అది లేకపోతే మనిషి మనిషి కాడు. ఆహారం, నిద్ర, భయం వగైరా మనుష్యులకూ, పశువులకూ సమానమే. జ్ఞానం అనేది ఒక్కటే మనుష్యులకు అధికం. అదిలేని నాడు మనుష్యుడు కొమ్ములూ, తోకలేని పశువన్నమాట. సర్వశ్రేయస్సులనూ పొందించేది జ్ఞానం. తెలిసిందా? అని వ్యాసుడు చెప్పినట్టుగా సూతుడు భరద్వాజాదులకు చెప్పాడు. చాలా గొప్పకథ చెప్పావు. ఇంకా ఏవేనా విశేషాలు – శుకుడు మీ గురువుగారిని అడగడం. ఆయన చెప్పడం – అని భరద్వాజుడనగా సూతుడు చిరునవ్వునవ్వి అడుగుతావని తెలుసు. సామాన్యుడవా భరద్వాజా! బుద్ధి, ప్రజ్ఞ, ప్రతిభ ఈ మూడు నీమూర్తిగా ఉన్నాయి. విను. మా శుకుడు చక్కని ప్రశ్నవేశాడు. ఏమిటో తెలుసా? నాయనా? సంసారం ఒక బలిష్ఠమైన చెట్టు. దానిని ఆశ్రయించిన మానవుడు సుఖ దుఃఖాది ద్వంద్వాలనే త్రాళ్లకి కట్టుపడి, ధనం, భార్యాపుత్రులు అనేవి చాలక, కామక్రోధాది శత్రువులు పట్టుకుని పీడిస్తూ ఉంటే లేనిపోని ఆశల వలయానికి చుట్టూ తిరుగుతూ, ఊపిరాడక కొట్టుకుంటూ ఉంటాడు. ఆ సంసారికి ఈ బంధాల నుంచి మోక్షం ఏ విధంగా కలుగుతుంది. అదేదో చెప్పు అని అడిగాడు. అప్పుడు మా ఆచార్యుడు మంచిప్రశ్న వేశావు చెప్తాను విను; అని ఆనాడు చెప్పినది వినండయ్యా అని సూతుడు చెప్పనారంభించాడు.

## 9. బంధ విముక్తి

కుమారా! ఒకప్పుడు నారదుడు విన్నాడట ఎవరో చెప్పుకుంటూ ఉంటే. ఏమని? ధర్మం, జ్ఞానం లేక ఇష్టం వచ్చినట్టు చేసిన పనులవల్ల రకరకాల పాపాలు పట్టుకుని జీవుల్ని నరకానికి ఈడ్చుకు పోతాయనీ, అక్కడ ధర్మదేవత విధించిన కఠోరశిక్షలు అనుభవిస్తూ దుర్భరమైన బాధలు అనుభవిస్తూ ఉంటారనిన్నీ.



ఆ మాటలు విని నారదుడు జాలిపడి గబాగబా శివునివద్దకు వెళ్ళి మొరపెట్టాడట. ‘ఈశ్వరా! జీవులు షడూర్ములకు లొంగి, కామభోగాలకు చిక్కి, శుభాశుభాలకు తలవంచి, సుఖదుఃఖాది ద్వంద్వాలకు బంది యయి అలా ఆఘోరిస్తూ మళ్లీ పుట్టుతూ ఇదే విషచక్రమైన సంసారంలో పడి గిర్రున తిరుగుతూ గింజుకుంటూ, రుంజుకుంటూ, ఏడుస్తూ ఉండడమేనా? వీళ్లకి బంధవిముక్తి అనేది ఉందా లేదా? ఉంటే అది ఎలా కలుగుతుంది? సెలవియ్యవయ్యా శంకరా! నేను లోకాలలో ప్రచారం చేస్తాను అని డగ్గుత్తికతో నారదుడన్న మాటలువిని ఆశ్రిత శుభంకరుడు శంకరుడు చెప్పిన దేమంటే–

ఎందుకు లేదు నారదా? బంధవిముక్తి ఎలా అవుతుందో చెప్తా విను. చరాచరాత్మకమైన ఈ జగత్తును తన మాయాపాశాలతో కట్టి విచిత్రనాటకా లాడించే ప్రభువు శ్రీ నరసింహస్వామి. విష్ణువు కరుణించేట్టు చేసుకోవాలి.

అమృతస్వరూపుడూ, పరమానందమూర్తి, సర్వపాపవర్జితుడు, బ్రహ్మణ్యుడుఅయిన విష్ణువును ఆరాధించేవాడు సంసారబంధవిముక్తు డవుతాడు.

యోగీశ్వరుడు, పురాణపురుషుడు, శరీరంలేనివాడు, అన్నిప్రాణుల హృదయాలలో అణుప్రమాణమైన తేజోరూపియై వెలుగుతూ ఆ యా ప్రాణుల కష్టసుఖాలకు కారణములైన కర్మలను చేయిస్తూ వాటివల్లవచ్చే ఎలాటి ఫలాన్నీ తా ననుభవించక తప్పించుకు తిరిగేవాడున్నూ అయిన విష్ణువును ఆరాధించే వాడు బంధవిముక్తుడవుతాడు.

నామగోత్రాలూ, జరామరణాలూ, సుఖదుఃఖాలూ లేని శుద్ధ చైతన్యమూర్తి ‘ఓం’ అనే ఏకాక్షరం. తనమూర్తిగా భాసించే మంత్రస్వరూపుడూ, విశ్వమునకు అది, విశ్వరక్షకుడు, విశ్వమయుడున్నూ అయిన విష్ణువును సదా హృదయంలో ధ్యానించేవాడు బంధవిముక్తుడవుతాడు.

అని శంకరుడు జీవన్ముక్తిబోధ నారదుడికి చేశాడు. ఇప్పుడు నేను నీకు చెప్పవలసేది ఇదే అని మా గురువుగారు కొడుకును ఉద్దేశించి మమ్మల్ని

చూస్తూ హరిభజన చేస్తూ ఉండండి. అక్కరమాలిన చింత మనసులో పెట్టుకుని చివికి జీర్ణంకాకండి, ఏడవకండి, సర్వేశ్వరుడైన శ్రీనరసింహదేవుణ్ణి హృదయాలలో ఉంచుకొని ధ్యానిస్తూ ఉండండి. ఆ దేవుని కృపతో తరించండి అని చెప్పగా విని మా శుకయోగి 'మంచిది. నాయనా! అలాగే చేస్తాము. మరి ఆ దేవుణ్ణి ధ్యానించాలంటే ఏదో అక్షరాల సంపుటి ఉండాలికదా! అది ఉపదేశించు' అని మెల్లగా అన్నాడు. ఆ మాటకి ఆ నాయన చిరునవ్వు నవ్వి, ఉపదేశరూపంగా చెప్పిన దేమంటే, ఉంది. అది మంత్రాల్లో ఉత్తమోత్తమమైన అష్టాక్షరమంత్రం.

## అష్టాక్షర మహిమ

మానవుణ్ణి జన్మసంసారబంధంనుంచి విడిపించి ఈశ్వరసన్నిధికి చేర్చే దివ్యమంత్రం అష్టాక్షరం.

ఏకాంతంగాగాని, విష్ణువిగ్రహం ముందుగాని, విష్ణ్వాలయం నందుగాని, నీళ్లలోగాని నిశ్చలమనస్సుతో విష్ణువును అష్టాక్షర మంత్రజపంతో ఆరాధించాలి.

అష్టాక్షరమంత్రానికి ఋషి నారాయణుడు. ఛందస్సు దేవి గాయత్రి. దేవత పరమాత్మ. ఆ మంత్రాక్షరాలస్వరూపం చెప్తాను వినండి. అష్టాక్షర మంత్రానికి ఆద్యక్షరమైన ఓంకారం తెలుపువన్నె గలది. నకారం ఎర్రనిది. మోకారం నల్లనిది. నాకారం ఎరుపు. రాకారం కుంకుమరంగు. యకారం పసుపు. ణా కారం నలుపు. చివరి అక్షరమైన యకారం పలువన్నెలు గలది. ఈలాటి వర్ణాల సంపుటియైన ఆ మంత్రం 'ఓం' నమోనారాయణాయ' ఇది సర్వార్థసాధకమైన మంత్రం.

ఉదయసంధ్య, సాయంసంధ్య ముగిసినంతనే విష్ణువును స్తుతింప ఈ మంత్రం అష్టోత్తరశతం జపిస్తూ ఉండాలి. అలా జపించేవాడు దైహికంగా సకలసుఖాలూ అనుభవించి జన్మాంతమందు విష్ణుసాయుజ్యం చెందుతాడు.

ప్రతిమాసమందు ద్వాదశినాడు ప్రాతః కాలమందు స్నానంచేసి శుచియై ఈ మంత్రాన్ని జపించేవాడు జన్మాంతమందు పరమపదం పొందుతాడు.

అష్టాక్షరమంత్రం మృత్యుభయాన్ని పోగొడుతుంది. ఇది మంత్రాలలో పరమమంత్రం. దేవతలలో పరదైవతం. ఆయువును పెంచుతుంది. ధనధాన్య



వృద్ధిని చేస్తుంది. పుత్రసంతతి నిస్తుంది. పాడి పంటలను సమృద్ధిగా కలిగిస్తుంది. విద్యను, యశస్సును సమకూరుస్తుంది. ధర్మార్థకామ మోక్షాలను సాధిస్తుంది. ఈ ఫలాలు అక్షరం తప్పకుండా కలుగుతాయి. సందేహం లేదు. ముమ్మాటికీ సత్యం. అష్టాక్షర మంత్రమహిమ ఏమిచెప్పేది! సర్వార్థసిద్ధిప్రదం అని ఒక్క మాటలో చెప్పవచ్చు. ఈలాటి దివ్యమంత్రాన్ని జపించిన మానవుడు సంసారబంధ విముక్తు డౌతాడని వేరే చెప్పాలా?

కుమారా! శుకా! శిష్యులారా! నా కుడిచేయి ఎత్తి గట్టిగా చెప్తున్నాను వినండి.

అష్టాక్షరమంత్రాన్ని మించిన మహామంత్రం లేదు. వేదాన్ని మించిన శాస్త్రం, విష్ణువుకన్నా మిన్నగా చెప్పదగిన దేవుడు లేడు. అని మా గురుదేవుడు నొక్కి వక్కాణించి ఏదశలోనూ చీకూ చింతాలేక సంసార సముద్రం దాటాలనే కోరికతో అందరూ అష్టాక్షరమంత్రం జపించండి అని మాకూ జీవలోకానికీ అభయమిస్తున్నట్లు చెప్పాడు.

భరద్వాజా! మార్కండేయాది పుణ్యకథలు మా గురువుగారు చెప్పిన చొప్పున చెప్పాను. ఇంకేమి చెప్పమంటావు? అని సూతుడడుగగా భరద్వాజుడు తరించామయ్యా! మంచికథలు చెప్పావు. అశ్వినీదేవతలు అంటే ఇద్దరు అన్నదమ్ములు. వాళ్ళ జన్మకథ చెప్పవయ్యా! అని ఆనందంగా అడిగాడు. వెంటనే సూతుడు చిటికె వేసి చెప్తాను విను అని ఇలా చెప్పాడు.

## అశ్వినీ దేవతలు:

అదితి కశ్యపులు పుణ్యదంపతులు. వారిసంతతి ఆదిత్యుడు. అతడే సూర్యుడంటే. అతని కాంతికి కటికచీకట్లు పటాపంచలవుతాయి. అంతటి ప్రచండతేజస్సు కలవాడు. అతనికి, త్వష్ట తనకూతుర్ని, సంజ్ఞ అనే పేరుగల సుందరాంగిని ఇచ్చి సలక్షణంగా పెళ్ళి చేశారు. సంజ్ఞ ఆదిత్యుడితో కాపురం చేస్తుందే కానీ ఉత్సాహంగా ఉండలేకపోతోంది. ఆ తాపం భరించలేక పోతోంది. అలా ఉండిఉండి ఒకనాడు పుట్టింటికి వెళ్లివస్తానని చెప్పి వెళ్లిపోయింది.

అనుకోకుండా వచ్చిన కూతుర్ని చూచి ఏమమ్మా! ఎలాఉంది నీ కాపురం? నీ భర్త సరసంగా పలుకుతున్నడా? లేక పరుషంగా ఉంటున్నాడా! అని లాలిస్తూన్నట్టు అడిగాడు త్వష్ట. సంజ్ఞ దీనంగా చూసింది తండ్రిని. నాయనా! చల్లనివాని కిచ్చావు! మండిపోతున్నాను ఏనాటి కానాడు. ప్రాణాలతో బయటపడి వచ్చాను. అందుకు సంతోషించు అని చిరాకుగా అన్నది. త్వష్ట ఒక్కక్షణం ఆలోచించి, అమ్మా! చిరాకు పడకు. బుద్ధిమతులైన సతులకు పతులే గతి. అత్తవారింట కాపురం అనేకవిధాలుగా ఉంటుంది. కష్టాలు, సుఖాలూ అన్నీ కలగలుపుగా ఉంటాయి. ఏది ఎలాఉన్నా సతికి పతిసేవయే పరమధర్మం, సౌభాగ్య వర్ధనం. వెళ్లు ! ఆయన వద్దకే వెళ్లు. నేను త్వరలో వచ్చి ఆయన ప్రతాపాన్ని కొంతవరకు తగ్గిస్తాను. వెళ్లు! అని నచ్చచెప్పి కూతుర్ని అల్లుని దగ్గరకు పంపాడు.

సంజ్ఞ సూర్యునితాపాన్ని భరిస్తూ సంసారం జరుపుతూంది. కొంత కాలానికి వైవస్వతుడు, యముడు, యమి – అనే ముగ్గురు పిల్లలను క్రమంగా కన్నది. ఇక ఈ సంసారాని కొక నమస్కారం. ఎవరు భరిస్తారీ తాపం? ఇది నా పాపం! వస్తానని నాయన రానే లేదు అని తన ప్రజ్ఞతో ఒక స్త్రీని సృష్టించింది. అచ్చంగా ఆ యువతి తన ఛాయలాగే ఉంది. దానికి 'ఛాయ' అనే పేరు పెట్టింది. నువ్వు ఆయనకు అనుకూలంగా సంసారజీవితం జరుపుతూ ఉండు. ఈ రహస్యం చెప్పకు. పిల్లలు జాగ్రత్త. ఈ క్షణంనుంచి నువ్వే వారికి తల్లివి. వింటున్నావా? అని హెచ్చరిస్తూ పాఠాలు చెప్పింది. ఎవరికి చెప్పకుండా చప్పున ఇంటిలోనుంచి ఉప్పరాన కెగిరి పుట్టింటికి వెళ్లిపోయింది. తండ్రి కూతుర్ని చూచి 'మళ్ళీ వచ్చావా? చెప్పావా నీ భర్తతో?' అని చిన్నకోపంతోనే అడిగాడు.

'వస్తాను. వేడితగ్గిస్తాను అని చెప్పి బలవంతంగా పంపావు. ఏవో ధర్మాలు చెప్పి పంపావా? అలాగే సహించి ముగ్గురుపిల్లలతల్లి నయాను. ఇక ఉండలేనని వచ్చాను. ఇంకా చెప్పిరావడం కూడానా!' అని సంజ్ఞ చికాకుగానే జవాబు చెప్పింది. కూతురిమాటలు ఆ తండ్రికి రుచించలేదు.



'నామాట అర్థం చేసుకోక తొందరపడి భర్తను విడిచివచ్చావు. నేడో రేపో నీ భర్తవచ్చి అడిగితే ఏమి బదులు చెప్పేది? అలాంటి తగవు రానీక వెంటనే నీ పతి దగ్గరకు వెళ్లు. నీ వెనుకనే నేను వస్తాను. లే! వెళ్లు!' అని తండ్రి తొందరపెట్టాడు. సంజ్ఞ వెంటనే లేచింది. బయటకు వచ్చింది. ఏమా లోచించిందో మరి. తిన్నగా ఉత్తర కురుభూములకు వెళ్లి బడబ (ఆడుగుర్రం)గా మారిపోయి పతిధ్యానంతో, నియమబద్ధమైన జీవితం గడుపుతూ ఉండి పోయింది. భర్త దగ్గరకే కూతురు వెళ్లిందని మనశ్శాంతిగా నిట్టూర్పు విడిచాడు విశ్వకర్మ.

ఇక సూర్యునింటి కథ. ఛాయని సంజ్ఞగానే భావించాడు సూర్యుడు. రూపురేఖలు, నడతా మాటా, మంతీ, నవ్వూ, చూపూ అంతా సంజ్ఞకి అచ్చంగా అచ్చు గుద్దినట్టుండగా అనుమానం ఎందుకు కలుగుతుంది. చీకూ చింతా లేకుండా సంసారం చేస్తున్నా రాలుమగలు. కాలక్రమాన ఛాయకి మనువు, శనైశ్చరుడు, తపతి అని ముప్వురు పిల్లలు వరుసగా కలిగారు; పెరుగుతున్నారు.

క్రమక్రమంగా ఛాయ ప్రవర్తన సంజ్ఞ సంతతిని పోషించడంలో మార్పుగా కనిపించసాగింది. పెంపకంలో తన, పెర అనే భావంతో నడుస్తూంది. ఒకనాడు యముడు, యమి, తండ్రితో చెప్పారు. ఇది ఎవరో గానీ మా అమ్మ కాదు. ఆ ముగ్గురినీ చూచినట్టు మమ్మల్ని చూడకుండా ఉంది అని. సూర్యుడు ఛాయను సన్నగా అదలించాడు. నీకు పిల్లలంతా ఒకటేకదా! పెద్దవాళ్ళని సరిగా చూడకుండా ఉన్నావట! ఇది తల్లి చెయ్యవలసే పనికాదు అని అన్నాడే గాని ఆమె పక్షపాతంతోనే ప్రవర్తిస్తూంది. యముడు, యమి రెచ్చిపోయి ఒకనాడు ఆమెను ధిక్కరించి భర్జించారు.ఆమె సామాన్యురాలా! వేలెడంతలేరు, నన్ను మీరు బెదిరిస్తారురా! అనుభవించండి శిక్ష అని యముణ్ణి ఒరే నువ్వు ప్రేతరాజువి అవుదువుగాక ! అనిన్నీ, ఒసే! యమీ! నువ్వు యమునపేరుతో నదివి అగుదువు గాక! అని యమిని శపించింది. ఆ తిట్లు సూర్యుడికి తెలిశాయి. అసలే

ప్రచండుడు. కోపంతో మరింత చండ ప్రచండుడై ఏమే ఎవరు నువ్వు? సంజ్ఞవు కావా? నిజం చెప్పు! లేదా నీ పని పట్టిస్తాను చూడు అని ఛాయను బెదిరించి, ఓరే శనీ! నువ్వు మందుడవై, క్రూరదృష్టిగల పాపగ్రహమై పోరా! అని శనినీ, ఒసే తపతీ! అదే పేరున నువ్వు నదివైపో! అని తపతినీ శపించి, కాస్త శాంతించి ఆలోచించాడు. ఏమిటీ తగవు? సంజ్ఞ ఏమైనట్టు?....ఏ ముంది? ధ్యానమహిమవల్ల తెలిసిపోయింది. ఇదంతా సంజ్ఞ ఆడిన నాటకం అని. అశ్వినీరూపంతో కురుక్షేత్రంలో ఉన్న భార్యదగ్గరకువెళ్ళి తానూ అశ్వమూర్తిగా మారిపోయాడు. అశ్వినిని సమీపించి క్రమక్రమంగా అనుకూలను చేసుకున్నాడు. అశ్విని తనలో కలిగిన వికారానికి ఆశ్చర్య పడలేదు. పతివ్రత నయిన నన్ను ఆదిత్యుడు సూర్యుడు తప్ప ఇంకొకడు ఎవడైనా స్పృశించ గలడా! ఈ అశ్వరూపధరుడు నా పతి చండకరుడే అని మనసా సంతుష్టి పొందుతూ వశురాలైంది. అలా అన్యోన్యంగా ఉన్న ఆ అశ్వదంపతుల అనురాగ ఫలంగా కవలలు పుట్టారు. వారే అశ్వినులు. మోహనమూర్తులుగా ఉన్న ఆ జంట బిడ్డలను చూచి సంజ్ఞాసూర్యులు నిజరూపాలు ధరించి ముద్దులాడుతూ ఉండగా బ్రహ్మవచ్చి ఆ శిశువులకు దివ్యశక్తులనూ, దేవతలలో ముఖ్య స్థానాన్నీ, యజ్ఞభాగాన్నీ, ఆయుర్వేద ప్రావీణ్యాన్నీ ఇచ్చి వెళ్లి పోయాడు. అశ్వినులు స్వర్గానికి వెళ్లారు. సూర్యుడు సంజ్ఞతో తన భవనానికి వచ్చాడు. కొంతకాలం పోయాక విశ్వకర్మ వచ్చి సూర్యుణ్ణి స్తుతించి ప్రసన్నుణ్ణి చేసుకుని ఒకదివ్యచక్రంలో ఉంచి ముమ్మారు తిప్పాడు. ఆ త్రిప్పడంవల్ల సూర్యుని చండత్వం చాలవరకు మాయమయింది.సంజ్ఞాదేవి సంతోషంతో సూర్య మండలంలో నిల్చింది. ఛాయ సంజ్ఞలో లీనమై అన్ని ప్రాణులకూ రేయింబవళ్లు ఛాయ (నీడ)గా నిలిచింది.

ఇదీ అశ్వినీ కుమారుల జననకథ. విన్నారా? ఇంకేమి చెప్పమంటారు? ఏమి మహానుభావా ! భరద్వాజా ! అడుగు అని సూతుడనగా భరద్వాజుడు మరుద్గణం జన్మకథ చెప్పవలసిందిగా కోరాడు. ఊఁ! కానీ వినం దన్నాడు సూతుడు. కథ ఆరంభించాడు.



## 10. మరుద్గణం

మునుపు ఒకప్పుడు దేవతలకూ, దైత్యులకూ యుద్ధం ఉద్ధృతంగా జరిగింది. దానిలో దైవబలం సమృద్ధిగా ఉన్న దేవతలు దైత్యులను చాలమందిని హతమార్చారు. కొందరికి కొండలకూ కోనలకూ దారిచూపారు. వెంట తరిమారు. కొడుకులపాటు తెలిసి దితి చాల దుఃఖించి ఇంద్రుణ్ణి మట్టుపెట్టే కొడుకును కోరుకుని పతియైన కశ్యపుణ్ణి సన్మతితో ఆరాధించనారంభించింది. ఆమె భక్తి తాత్పర్యాలకు సంతుష్టుడై కశ్యపుడు ఇంద్రహంత అయిన కొడుకు పుడతాడు, కాని నువ్వు శుచిగా ఈ గర్భాన్ని నూరేండ్లు భరించాలి. అలా అయితే నీ కోరిక నెరవేరుతుంది. అశుచిత్వం ఏ మాత్రం సంక్రమించినా నీ గర్భం ఛిన్నాభిన్నం అయిపోతుందని హెచ్చరిస్తున్నట్టు అన్నాడు. అలాగే ప్రవర్తిస్తానన్నది దితి. గర్భవతి అయింది. శుచిగా గర్భపోషణ చేస్తూంది. ఈ విషయం ఇంద్రునికి తెలిసింది. ఒక ముసలి బ్రాహ్మణుడుగా మారిపోయి దితి వద్దకు వచ్చి ఆమెకు పురాణకథలు చెప్తూ నవ్వుతూ, నవ్విస్తూ, నమ్మకం కలిగేట్టు ఉంటున్నాడు. అతడు నిజంగా బ్రాహ్మణుడే అనుకుంది పాపం ! ఆ ఇల్లాలు. తన జీవితంలో గతకాలంలో జరిగిన కష్టాలూ సుఖాలూ తీరుబాటుగా కూర్చుని అతనికి చెప్తూవస్తూంది. వాటిని ఓపికగా విని సముదాయిస్తూ పొగడుతూ, వైరాగ్య బోధచేస్తూ, ధైర్యం, ఉత్సాహం కలిగిస్తూ కాలం వెళ్లిస్తున్నాడు ఆ మాయదారి బ్రాహ్మడు.

ఒకనాటి సాయంసధ్యాసమయం. అవతలకు వెళ్ళివచ్చిన దితి కాళ్ళూ చేతులూ కడుగుకోక అలాగే పడకగదిలోకి వెళ్ళి అలసటచే అసురుసురంటూ పక్కమీద వాలింది. క్షణంలో గాఢనిద్రకు వశమైపోయింది. సమయంకోసం కనిపెట్టుకున్న ఇంద్రుడు చప్పున అణురూపియై దితిగర్భంలో శ్వాసవాయువులో ప్రవేశించి వజ్రంతో గర్భస్థ శిశువును తెగనరికాడు. ఆ శిశువు ఏడ్వసాగింది. మారుద ! మారుద ! అంటూ (ఏడవకు ! ఏడవకు !) ఏడుఖండాలుగా తెగనరికి బయటికి వచ్చా డింద్రుడు. ఆ ఖండాలు కూడా వెలుపలకు వచ్చాయి. అంతలో దితి తెలివివచ్చి లేచికూర్చుని జరిగిన దారుణకృత్యానికి బిట్టుగా ఏడిచింది.

ఇక ఏడిచి ఏమి సాధిస్తావు? మేము ఆ ఇంద్రుడి దగ్గరకే పోతున్నాం, అని ఆ శిశుఖండాలు మారుద ! మారుద ! అనే రీతికి అనుగుణంగా మారుత నామంతో ఇంద్రుణ్ణిచేరి సహాయకర్ములై ఉంటున్నారు. అదే మరుద్గణం అని సూతుడు చెప్పగా విని అంతా ఆశ్చర్యం, ఆనందం పొందారు. 'దుస్సంకల్పం ఎన్నడూ ఫలించదు' అని ఒకమాట అన్నాడు భరద్వాజుడు.

సాయం సంధ్యాసమయం ఆనాటినుంచి 'అసుర సంధ్య' అనే పేరుతో వ్యవహారంలోకి వచ్చింది ఆ సమయంలో ఎవరున్నూ పడుకో కూడదు. అందునా గర్భవతులు పక్క వేయకూడదు. దైవప్రార్థనతో ఆ సమయం గడపాలి.

భోజనభాజనాదులకు సంధ్యాసమయం నిషిద్ధం అని మా గురుదేవుడు ఈ కథ ఆధారంగా జీవలోకానికి పాఠం చెప్పారు అని అన్నాడు సూతుడు.

**నిర్మాల్య మహిమ :**

సరే ! అలాగే చేస్తున్నాం కదా మేము సూతా ! అని భరద్వాజుడు; 'దేవపూజచేసిన పువ్వును నిర్మాల్యం అంటారు. దానిని గురించి కథ ఏదేనా చెప్పవయ్యా !' అని అన్నాడు. మంచి విషయం అడిగావు. చెప్తా విను అని సూతుడు ఇలా చెప్పాడు.

చంద్రవంశపురాజులలో శంతనుడు చాలాదొడ్డవాడు. అతడు దానధర్మాలకూ దైవభక్తికీ ఎంతపేరు పొందినవాడో బలపరాక్రమాలకూ, చల్లని పరిపాలనకూ అంత పేరు పొందాడు. అతని మంచితనానికి బహుమతిగా ఇంద్రుడు మంచిరథం ఒకటి ఇచ్చాడు. మంచిరోజు చూచి దానిని అధి రోహించాలని అనుకుని దానిని రథశాలలో ఉంచాడు.

శంతనుడు నారదముని ముఖతః నరసింహస్వామిమహిమ విని భక్తిశ్రద్ధలతో స్వామిని ఆరాధిస్తూ ఉండేవాడు. ఒకనాడు ఉదయకాలం ముహూర్తం బాగుందని దైవజ్ఞుడు చెప్పగా, దేవదత్తమైన దివ్యరథం ఎప్పుడు ఎక్కుతానా అనే తమకంతో ఉన్నవాడు కనుక త్వరత్వరగా స్వామిపూజచేసి బయటికి వచ్చాడు. రథశాలకువెళ్ళి రథాన్ని వెలుపలకు తెప్పించాడు. చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ నమస్కారం చేసి రథం ఎక్కాడు. ఏమి లాభం ! రథం



అంగుళంమేర అయినా నడవలేదు. తెల్లమొగంతో క్రిందికి దిగాడు. రథకారుల్ని రప్పించి ఏమిటిలోపమో చూడండని ఆత్రంగా అన్నాడు. వాళ్లు చాలాదీక్షగా చూచి 'ఏ లోపమూ లేదు ప్రభూ !' అని ఈడుస్తూ అన్నారు. నడపండన్నాడు రాజు వాళ్ళు ప్రయత్నించారు. ప్రయోజనం లేకపోయింది. ఏమిటో అర్థం కాలేదు. శంతనుడి ఉత్సాహం నీరుకారింది. వెలవెలలాడుతూ అంతిపురానికి వెళ్ళిపోయాడు. అక్కడ దిగులుగా కూర్చుని ఇష్టదైవాన్ని స్మరిస్తూ ఉండగా నారదుడు వచ్చాడు. శంతనుడికి సవినయంగా అతిథ్యం ఇచ్చి రథవృత్తాంతం చెప్పాడు. నారదుడు ధ్యానంలో తెలుసుకున్నాడు.

రాజా! దానికి కారణం మరేమీ కాదు. రథనిర్మాణంలో ఏ లోపమూ లేదు. నీవు స్వామివారికి నిన్నచేసిన పూజాపుష్పాలను బయట వేశావుకదా ! బయటికి వెళ్లడంలో వాటిని దాటివెళ్లావు. నిర్మాల్యాన్ని ఎవరికాళ్లకూ తగలని విధంగా ఒకమూలగా వెయ్యాలి. వాటిని దాటడంవల్ల వచ్చిన దోషం నీ రథగమనాన్ని కొట్టింది. నీ మాటకేమి ! నీకు రథం ఇచ్చిన ఆ ఇంద్రుని కొడుకుకే ఇలాంటి ఆటంకం కలిగింది ఒకప్పుడు. ఆ కథ చెప్తాను విను.

'అంతర్వేది' అనే చిన్నపట్టణంలో రవి అనే ఒక మాలాకారుడు రకరకాల పువ్వులదండలు రమ్యంగా అల్లి, మొదట అల్లిన దండలు మూడు ముచ్చటగా నరసింహస్వామికి సమర్పించేవాడు. ఆ దండలల్లడంలో వాని భార్యకూడ నిపుణురాలు. ఇద్దరూ దండలల్లడంలో ఎంతో శ్రద్ధా ఒద్దికా చూపేవారు. స్వామికి సమర్పించగా మిగిలినవి పురోహితుడికీ, దేవపూజలు చేసే వారికీ, కొన్ని అంగడిలో అమ్మకానికీ నిర్ణయించుకునేవారు ముందుగానే. ఆ పుష్పమాలికల అమ్మకంవల్ల వచ్చే సొమ్ముతో కుటుంబపోషణ జరుపుకునే వాడు. మరి రోజూ పూదండ లల్లాలంటే పువ్వులు సమృద్ధిగా ఉండాలికదా! అందుకని పెరటిలో దూరంగా ఉన్న తనసొంత నేలకి చుట్టూ ఎత్తుగా నలువైపులా ప్రహరీకట్టించి లోపల పలుజాతుల పూలమొక్కలూ, తీగలు నాటాడు. ఇంటిలో నుంచే ఒకే ఒక ద్వారం ఉంచాడు. పైనుంచి మనిషిగాని, పశువుగాని లోపలకు రావడానికి ఆస్కారం లేదు.

మల్లె, మొల్ల, మాలతి, జాజి, పొన్న, సురపొన్న, చేమంతి, గొజ్జంగి, సంపెంగ – ఇలా ఎన్నెన్ని జాతులో ఆ తోటలో ఉన్నాయి. దానికి బృందావనం అని పేరు పెట్టాడు. సూర్యోదయం అయేసరికి కొన్ని పూస్తాయి. కొన్ని సాయంసంధ్యా సమయాన పూస్తాయి. ఆ మొక్కలకీ తీగలకీ సమృద్ధిగా నీరు ఉండాలిగా. పెద్దనుయ్యి తీయించాడు. దానికి ఏతం ఎత్తించాడు. నలువైపులా లోతుగా కాలువలు కల్పించాడు. తాను ఏతాములో నీరు తోడుతూంటే, వాని భార్య కాలువలు మార్చుతూ, కొన్నిటికి చేదలతో పోస్తూ ఉంటుంది.

ఆ తోటలో షష్టి గడియలూ పువ్వుల పరిమళం పంచిపెట్టుతూ ఉంటుంది. చల్లగాలి ఆ ప్రక్కనించి పోయేవారు రవిని ఎంతో మెచ్చుకుంటూ ఉంటారు.

అలా ఉండగా ఒక అమావాస్యనాటిరాత్రి. కన్ను పొడుచుకున్నా కనిపించని కటికచీకటి. తొలిజాము ముగిసేదాకా రవి బృందావన సంరక్షణలోనే గడపి ఇంట్లోకి వెళ్లాడు. భార్య అరటాకులు ఎదురెదురుగా వేసి ఆహారపదార్థాలు వడ్డించింది. ఇద్దరూ స్వామివారికథలు చెప్పుకుంటూ భోజనాలు చేసి పడకగదికి పోయారు.

తొలికోడి కూసింది. రవి లేచాడు. దంతధావనం చేసి, స్నానం అయిం దనిపించుకుని, నరసింహస్వామికి మేల్కొల్పు పాడుతూ, పువ్వులబుట్టలు పట్టుకుని తోటలోకి వెళ్ళాడు. పూలమొక్కలన్నీ స్వభావ విరుద్ధంగా కన్పించాయి. దిగాలుపడి చూస్తూ నిల్చున్నాడు. ఏ మొక్కనూ, ఏ తీగనూ ఒక్కపువ్వైనా లేదు. ఏదో గారడీలాగా ఉందే ! నిన్న సాయంకాలం మొగ్గలన్నీ నిండుగా ఉన్నాయి. ప్రతిదినమూ ఈ సమయానికి వస్తున్నాను. బుట్టలనిండా పువ్వులేరుకొని పోతున్నానే ! ఇవ్వాళ ఒక్క పువ్వైనా లేదే ! ఎవరూ రావడానికి శక్యం కానంతగా నలువైపులా గోడ. ఇంటిలోంచి తప్ప తోటలో ప్రవేశించడానికి మరో ద్వారం లేదాయె. మరిపువ్వులు మాయమై పోవడం! ఇదేదో ఇంద్రజాలం లాగున్నదే ! ఈనాడు నా స్వామికి పూదండ సమర్పించలేని దౌర్భాగ్యుడనై పోయానే ! అని కళాకాంతీలేని మొగంతో ఇంటిలోకి పోయి భార్యతో చెప్పాడు ఒక పువ్వైనా



లేదు. వింతగా ఉందని. ఆమె వచ్చి చూచింది. ఆశ్చర్యంగా వెనుదిరిగి వచ్చి, నోట మాటలేకుండా నరసింహస్వామి విగ్రహానికి సాష్టాంగనమస్కారం చేసి లేచింది. ఈ తప్పు ఎవరిదో స్వామివారే సెలవియ్యాలి – అని ఒక్కమాట అన్నది.

బాగాతెల్లవారినతర్వాత రవి తోటలోకివెళ్ళి అక్కడక్కడా కొసా, మసా ఉన్నపువ్వు లేరితెచ్చి ఇంటఉన్న నరసింహస్వామివిగ్రహాన్ని పూజించి ఏదో కొంత తృప్తిపడ్డాడు.

ఆ రాత్రి స్వామిని ప్రార్థించి రవి ప్రక్కమీద వాలాడు. కొంతసేపటికి నిద్రపట్టింది. అర్ధరాత్రం అయిఉంటుంది. కలలో స్వామి కన్పించి విచారించకు లే ! ఈనాడు నన్ను పూజించిన పువ్వులు తీసుకొని వెళ్ళి తోటకి ఆవల వేసిరా! పువ్వులకోసం వచ్చిన ఆ ఇంద్రుడు కొడుకు దొంగాటకం కట్టిపోతుంది– అని చెప్పి అదృశ్యుడైనాడు. రవి చప్పునలేచి భార్యను లేపి కలకథ చెప్పాడు. ఇంద్రుడికొడుకా ఈ పనిచేశాడు అని ఆమె ఆశ్చర్యపడింది. రవి పూజాగృహంలోకి వెళ్ళి నిర్మాల్యం తెచ్చి తోట గోడప్రక్కని చల్లి వచ్చాడు.

అంతలో దివ్యరథం గంటలచప్పుడు. చంద్రబింబాలవంటి నెమ్మోముల అచ్చర పూబోండ్లతో ఇంద్రుని కొడుకు వచ్చి గోడకి ప్రక్కనే రథం దిగి లోపలికి దిగాడు. పువ్వులు కోసుకుని రథం ఎక్కబోయాడు. ఎక్కలేక క్రిందనే ఉండిపోయాడు. ఏమిటీ వింత ! అని సారథిని అడిగాడు. రథానికి ఆ వైపున ఉన్న సారథి పరికించి గోడప్రక్కన చూచి కుమారా ! స్వామిని పూజించిన పువ్వులు క్రింద ఉన్నాయి. వాటిని చూడకుండా నువ్వు తొందరపడి దాటి రథం ఎక్కడానికి వచ్చావు. నిర్మాల్యాన్ని దాటినందువల్ల ఈ పని జరిగింది. ఆ దోషం పోవడానికి నువ్వు తిన్నగా కురుక్షేత్రానికి వెళ్లు. అక్కడ మునులు యజ్ఞం చేస్తున్నారు. ఆ యజ్ఞం చూడడానికి దేశదేశాలనుంచి ఎందరో రాజన్యులు వచ్చి ఉంటారు. వారు భోజనాలుచేసి విడిచిన ఎంగిలాకులు తీసి ఆవల పారవేస్తూ, ఆ ప్రదేశం అంతా నీళ్లతో శుద్ధిచేస్తుండు. అలాగ పన్నెండేళ్లు చేస్తే ఈ నిర్మాల్యాన్ని దాటినందువల్ల వచ్చినపాపం పోతుంది. అంతే దీనికి పరిహారం.

'మేము అమరావతికి పోతాం. వెళ్లు అని సారథి అప్సరసలను రథంపై ఎక్కించుకుని స్వర్గానికి వెళ్లిపోయాడు. ఇంద్రనందనుడు కిమ్మనక కురుక్షేత్రానికి సామాన్య మానవుడిలాగా వెళ్లి అక్కడ పన్నెండేళ్లు ఎంగిలాకులను తీసి పారవేస్తూ, భోజనశాల శుద్ధిచేస్తూ కాలక్షేపం చేశాడు. తరువాత పాపవిముక్తుడై అమరావతికి పోయాడు.

విన్నావా శంతనుమహారాజా! నిర్మాల్యాన్ని, ఏ దేవతకు సంబంధించిన దాన్నైనాసరే! దాటరాదు, వెళ్ళు, నువ్వుకూడ కురుక్షేత్రానికి వెళ్లి అక్కడ యాత్రికులు భుజించి లేవగానే ఆ ఎంగిలివిస్తర్లు తీసి ఆవల పారవేస్తూ ఆ ప్రదేశం అంతా శుద్ధిచేస్తూ ఉండు. అలాగు పన్నెండు సంవత్సరాలు చేస్తే పవిత్రుడవై తిరిగివస్తావు. దేవదత్తమైన రథం ఎక్కడం, అది నిరాటంకంగా వెళ్ళడం అవుతుంది అనిచెప్పి వెళ్ళిపోయాడు. తరువాత శంతనుడు కురుక్షేత్రానికి వెళ్ళి నారదుడు చెప్పినపని పన్నెండేళ్ళుచేసి పాపవిముక్తుడై తిరిగివచ్చాడు. రథారోహణం, రథగమనం నిరాటంకంగా జరిగి హాయిగా రాజ్యం చేశాడు.

నిర్మాల్య లంఘనదోషం ఇలాటిది అని సూతుడు చెప్పి ఇంకేమి చెప్పమన్నారని భరద్వాజుణ్ణి చూచాడు. ఏమి చెప్పడమేమిటి? నీ వేమిచెప్పినా అది ఇహపరసాధకమే. నరసింహస్వామికి సంబంధించి ఏవేనా కథలుచెప్పు. అలాగే విష్ణువు అవతార కథలున్నూ అని భరద్వాజుడనగా సరే వినండి అని సూతుడు కథ ఆరంభించాడు.

**బహురోముడు**

పాండవవంశంలో పుట్టినవాడు సహస్రానీకుడు. తాతముత్తాతలవలెనే దైవభక్తి ధర్మపాలనాసక్తీ, అజేయమైన భుజశక్తి కలవాడుగా పేరుపొందినవాడు. అతడికి నరసింహస్వామివిగ్రహం చేయించి చిన్న ఆలయం కట్టించి అందులో స్వామి విగ్రహం ప్రతిష్ఠించాలనీ, నిత్యమూ ఉభయ సంధ్యలూ ఆ ఆలయాన్ని తుడిచి గోమయంతో అలికి ముగ్గుపెట్టి యథాశక్తిగా స్వామికి పూజ జరుపుతూ ఉండాలని సంకల్పం కలిగింది. అది ఎలా చెయ్యాలి? ఏమిటి దాని తంత్రం? ఎవరు చెప్తారు? అని విచారిస్తూ కూర్చున్నాడు.



అలా ఉండగా అనుకోకుండా ఒకనాడు భృగుమహర్షి సహస్రానీకుని వద్దకు వచ్చాడు. ఆ రాజు ఆనందం ఏమి చెప్పను ! అర్ఘ్యపాద్యాలిచ్చి ఆసనం వేశాడు. ఆయన కూర్చున్నాక యోగక్షేమాలు అడిగి తన సంకల్పం చెప్పాడు. అది విని మహర్షి సంతోషించి రాజా ? కలి కాలుపెట్టిన ఈ యుగంలో దేవుడూ, గురువూ, తల్లీ, తండ్రీ, భయం భక్తీ అనేవి ఎక్కడ ఉంటాయి? నీవు పాండవవంశంలో పుట్టిన భవ్యచరిత్రుడవు కనుక దేవుడూ, భక్తీ అనే మంచిమాటలు నీనోట వచ్చాయి మంచిది. విను చెప్తాను.

నరసింహస్వామి సర్వదేవోత్తముడు. ఆ స్వామి ప్రతిమను చేయిస్తే సర్వపాపాలూ తుడిచిపెట్టుకు పోతాయి. జన్మాంతమందు విష్ణులోకనివాసం సిద్ధిస్తుంది. స్వామి విగ్రహాన్ని యథావిధిగా ప్రతిష్ఠిస్తే ఇహంలో సర్వసుఖాలూ అనుభవించి జన్మాంతమందు తిరిగిరాని పరమపదానికి వెళ్లుతాడు. నరసింహస్వామిఆలయాన్ని శుభ్రంగా చెత్తా చెదారం లేకుండా సమ్మార్జనచేసి గోమయంతో అలికి ముగ్గుపెట్టిన వ్యక్తికి సర్వసౌఖ్యానుభవం ఈ లోకంలోను జన్మాంతమందు విష్ణుసాయుజ్యమున్ను తప్పక కలిగి తీరుతాయి.

బ్రహ్మాదులు దేవతలూ, మాంధాత మొదలైన రాజులూ కేశవుణ్ణి ఆరాధించడం వల్లనే ఉత్తమ పదప్రాప్తితో హాయిగా ఉన్నారు.

నీవుకూడా శ్రీనరసింహస్వామికి సంబంధించిన విషయమంతా మార్కండేయునివల్ల తెలుసుకో ! ఆ విధంగా చేసి తరించు. అలాగే శ్రీహరి అవతారకథలుకూడా ఆ మునిచంద్రునివల్ల విని ధన్యుడవు అవుదువుగాక ! అని భృగుమహర్షి మార్కండేయుణ్ణి ఉపదేశకుడుగా నియోగించి తాను వెళ్ళిపోయాడు. తరువాత మార్కండేయుడు చెప్పిన దేమంటే?...

రాజా ! నరసింహస్వామి ఆలయం నిత్యమూ సమ్మార్జన చేసే భక్తుడు సర్వపాప విముక్తుడై విష్ణులోకవాసి అవుతాడు.

స్వామిఆలయం ముందు గోమయంతో నీళ్ళు చల్లి శుద్ధిచేసిన వాడు అక్షయ పుణ్యఫలంతో విష్ణుసాన్నిధ్యంలో ఉంటాడు. దీనికి పురాతనమైన కథ ఒకటి చెప్తాను విను.

ధర్మరాజు తమ్ములతో ద్రౌపదితో వనవాసం చేస్తూన్న రోజులవి. ఒకనాడు కంటకమయమైన అరణ్యప్రదేశం దాటి ఒక పుణ్యనదీతీరానికి వెళ్ళి కొంతకాలం అక్కడ మునుల ధర్మబోధలు వింటూ మనశ్శాంతిగా కాలం గడపాలని అనుకున్నాడు. అంతా బయల్దేరి వెళ్ళుతున్నారు. కొంతదూరం వెళ్ళాక అంతంతదూరాన ఉన్న చెట్ల చాటున ఒక రాక్షసుడు వారిని చూచాడు. వాడిపేరు బహురోముడు. శరీరం ఆపాదమస్తకం రాగి రోమాలు. ఆ సొంపుచాలక పెద్ద గుండురాయి లాగా శిరస్సు. ఆ రక్కసుడు ద్రౌపదిని అపహరించాలని ఒక ఎత్తువేశాడు.

పల్లజడలు, మూరెడుగడ్డం, నారబట్ట, దర్భాసనం, చేతిలో జపమాల, ప్రక్కనే దండం, జలకుండిక. ధ్యానముద్రలో ఉన్నమునిని చూడగానే ధర్మరాజు అలాగే నిలుచుండి చేతులు జోడించాడు. తలవంచాడు. అప్పుడే ధ్యానం ముగించినట్టు కళ్ళుతెరచి ఆ ముని చూచాడు. దీవించినట్టు చేయెత్తాడు. దరికిరమ్మని సంజ్ఞచేశాడు. ధర్మరాజు కాస్త దగ్గరగా వెళ్ళాడు. ఆ ముని అందర్నీ ముందుకు రమ్మన్నాడు. భీమాదులు వచ్చి ముందు నిల్చున్నారు. కొంచెం ప్రక్కగా నిల్చుంది ద్రౌపది. కూర్చోం దన్నాడు. అంతా కూర్చున్నాక ధర్మబోధ ఆరంభించాడు. అయిదారు నిమిషాలు అయిందో లేదో ! ఒకముని పరుగెత్తు కుంటూ కాపాడండి ! కాపాడండి ! రాక్షసుడు ! రాక్షసుడు అంటు వారివద్దకు వచ్చి చేతిని వెనుకకు చాచి కాపాడండి ! వస్తున్నా దన్నాడు. ధర్మజాదులు అయిదుగురూ లేచి ద్రౌపదిని మొదట మునికి అప్పగించి, ముందుకి పరుగెత్తారు. అలా చాలాదూరం తీసుకుపోయాడా ముని. అంతలో ధర్మరాజు అర్జునుని చూచి తమ్ముడూ ! ఇదంతా రాక్షస ఆవాసంలాగు ఉంది. ఎందుకేనా మంచిది. నువ్వు వెళ్ళి ద్రౌపదినీ, ఆ మునినీ కాపలాకాస్తూ ఉండు ! అని వెనుకకు పంపివేశాడు. అర్జునుడు వెనుదిరిగి వచ్చాడు. ఏ ముందక్కడ? సర్వశూన్యం. దూరంగా ఆర్తధ్వని; ధర్మనందనా ! భీమసేనా ! కాపాడండీ ! కాపాడండీ !... ఆ ధ్వనినిబట్టి అర్జునుడు ఆ దిక్కుకు పరుగెత్తాడు. ద్రౌపదిని ఎత్తుకుని ఒక రాక్షసుడు పోతున్నాడు. ఎలాగైతేనేమి ఆ రాక్షసుడు అర్జునుడి బాణానికి గురి అయి ఆ రక్కసుడు దబ్బున క్రిందపడ్డాడు. ద్రౌపది వింతగా చింతగా చూస్తున్నది. అర్జునుడు దగ్గరకు వెళ్ళాడు. మరీ వింత.



చతుర్భుజుడు, శంఖచక్ర గదాధరుడు, పీతాంబరుడు, మందహాసం చిందే సుందరసుకుమారపల్లవాధరుడు నీలమేఘశరీరుడు. అర్జునుడు ఆ వ్యక్తిని సమీపించి చేతులు జోడించి ప్రభూ ! క్షమించు! అపరాధిని. మా ప్రాణాలు నిలుపుతూన్న నీపై బాణాలు ప్రయోగించాను. తెలుసుకోలేక పోయాను నీమాయ, అయినా ఎందుకీ నాటకం ? ఇలా మమ్మల్ని పరీక్షచేస్తున్నావా? కృష్ణా ! అని దీనంగా అన్నాడు. ఆ వ్యక్తి చిరునవ్వు నవ్వి–

అర్జునా ! నేను కృష్ణుణ్ణి కాను. ఇది కృష్ణుడు ప్రదర్శించిన మాయ నాటకమూ కాదు. నేను బహురోముడు అనే సార్థకనామంకల దానవుడను. పూర్వజన్మకర్మ ప్రభావంవల్ల శ్రీహరి శరీరం ధరించాను– అని అనగా ఆశ్చర్యపడి అర్జునుడు అలాగా? సరే నీవు రాక్షసుడవే అయితే సర్వ రాక్షస సంహారుడైన శ్రీహరి రూపం ధరించే కర్మప్రభావం నీకు ఎలా వచ్చింది. నీ పూర్వజన్మకథ ఏమిటి? – అని అడిగాడు.

విను అర్జునా! చెప్తున్నాను– అని అతడు అనేసరికి ధర్మరాజాదులు నలుగురూ అక్కడికి వచ్చారు. అతడు వారినందర్నీ ఆనందంగా చూచి పెద్దవాడు, అందరికీ మాననీయుడు ధర్మరాజుకూడా వచ్చాడు. నా అదృష్టం. వినండయ్యా ! నా పూర్వజన్మ కథ. కూర్చోండి అందరున్నూ. అమ్మా ! ద్రౌపదీ! కూర్చో! ఇది రాక్షస వేషం కాదు. అది తీరిపోయింది. దానితోనే నా శాపానికీ, విముక్తి అయింది. విచారించకు. నీవు కూడా స్వస్థచిత్తవై నా తొలి పుట్టువుకథ విను తల్లీ ! అని ఇలా చెప్పాడు.

**జయధ్వజుడు:**

గతజన్మలో నేను చంద్రవంశానికి చెందిన క్షత్రియుడను. నా పేరు జయధ్వజుడు. విష్ణుభక్తులలో మున్నెన్నదగిన వాడనని నా దినచర్య చూచి లోకమంతా అనేది. సూర్యోదయం కాకముందే లేచి శ్రీహరి దేవాలయం లోపలా, పైనా ఉన్నచెత్త తుడిచి శుభ్రంచెయ్యడం, తర్వాత ముంగిట గోమయంకలిపిన నీటితో శుద్ధిచేయడం, ముగ్గుపెట్టడం, స్వామికి దీపారాధనచెయ్యడం, ఆ తరువాతనే గృహకృత్యాలూ, రాజ్యకార్యాలున్నూ, నా ఈ దినచర్య తెలిసి ఆ

పురమందున్న పురోహితుడు– అతని పేరు వీతిహోత్రుడు ఆశ్చర్యపడి పట్టాభిషిక్తుడైన రాజు ఆలయంలో చీపురుపట్టుకుని చిమ్మడం, పేడనీళ్లు చల్లడం ఏమిటీ దాసకృత్యం అని ఒకనాడు వచ్చి ఆలయం పని ముగించి విశ్రాంతిగా కూర్చున్న నన్ను అడిగాడు.

రాజా! పరిపాలకులలో ఎంతో పేరుతెచ్చుకున్న బుద్ధిమంతుడవు. సర్వసమర్థుడవు. అలాగే విష్ణుభక్తులలో అగ్రగణ్యుడవు కావచ్చు. ఆలయంలో సమ్మార్జనకృత్యం, ఉపలేపనం అనేవి తప్పకుండా చేస్తున్నావు. అంటే వాటివల్ల వచ్చే పుణ్యఫలం ఏదో నీకు తెలిసి ఉండాలి. అది తెలుసుకోవాలని వచ్చాను. చెప్పదగినదే అయితే, నా పై నీకు ఆదరమో అభిమానమో ఉంటే, నీకు ఇష్టమైతే అదేదో చెప్పవలసిందని కోరుతున్నాను– అని సన్నగా అన్నాడు. చెప్తానయ్యా! అదేమీ రహస్యంకాదు విను.

మునుపటిజన్మలో నే నొక బ్రాహ్మణుడను. నా పేరు రైవతుడు. ఆ యా వయస్సుకి చెయ్యవలసే అక్షరాభ్యాసం, ఉపనయనం సలక్షణంగా పెద్దలు చేశారు. కాని నాకు సత్సహవాసం అబ్బలేదు. దూరంగా ఉండవలసిన దుష్టులతో ప్రాణస్నేహం నా కంఠానికి కళ్ళెం అయింది. జూదం, మద్యపానం, దొంగతనం, జారత్వం నాతోపాటే పెరగడం చూచి తండ్రి నన్ను తన్ని, ఇంటినుంచి పొమ్మన్నాడు. నేను సంతోషంగా బయటపడి ఆబోతులాగా తిరగ నారంభించాను. నా దొంగతనం సామాన్య ధోరణికి మించి బందిపోటుతనానికి పట్టం కట్టింది. పరకాంత నా కంటికి నదరుగా కనిపించిందా, సమయం చూచి కొప్పుపట్టి ఈడ్చుకు పోయానే– ఏ పాడు దేవాలయమో నా నివాసం.

అలవాటు ప్రకారం ఒకనాటి సాయంకాలం పడమటి ఎర్రలు క్రుంకగానే ఊరివెలుపల తోటలో చెట్లచాటుగ నక్కిఉన్నాను. పొరుగూరికి ఎదో శుభకార్యానికి బంధువులఇళ్లకి వెళ్లిన మాజాతి స్త్రీ పురుషులు తిరిగి వస్తూ ఆ తోటలోకి వచ్చారు. ఊరిలోకి రావడానికి అదేదారి. వాళ్లని పసిగట్టి గొంతుక మార్చి భయంకరంగా అరిచాను. ఆ అరుపువిని బెదరి నలుగురూ తలొక దారిని పారిపోయారు. నా ప్రక్కనుంచి ఒక ఇల్లాలు పరుగెత్తుతూన్నట్టు గుర్తించి చప్పున పైనబడి పట్టుకున్నాను. అరవకని నోరునొక్కి ఈడ్చుకుపోయి తోటవెనుక ఉన్న దేవాలయంలోకి చేర్చాను. అప్పటికి లోపల అంతా దుమ్ముపట్టింది. నా పైమీదిబట్టతో ఆ నేలంతా తుడిచాను. ఆ ఇల్లాలిని తలుపువార నిలబెట్టి, 'మాటాడేవా పీక పిసికి ఈ దేవుడికి బలివేస్తాను' అని బెదిరించి బయటికి వచ్చి నూతిలోంచి ఇన్ని నీళ్లు తోడి లోపలచల్లి శుద్ధిచేశాను నా ఉత్తరీయంకొస చించి దీపస్తంభం తడవి ప్రమిదలో వత్తిలాగా నలిపివేసి మొలనున్న అగ్గిరాయితో నిప్పు పుట్టించి దివ్వె వెలిగించాను. ఇంతలో పైన ఏదో అలికిడి అయింది. ఏమిటా అని బయటికి వచ్చాను. అమాంతం ఇద్దరు తలారులు ఊరు కాచేవారు నన్ను దొంగగా అనుమానించి నెత్తిమీద దుడ్డు కర్రలతో మొత్తారు. అంతే! కుప్పకూలి గుక్కెడు ప్రాణం వదిలాను. అంతలో గంటలవిమానంతో పెద్దపెద్ద ఆకారాలవాళ్లు వచ్చి నా సూక్ష్మజీవిని ఆ విమానంలో ఉంచి స్వర్గానికి తీసుకుపోయారు. అక్కడ దివ్యరూపంతో చాలాకాలం దివ్యభోగాలను అనుభవించి ఆ పుణ్యఫలమహిమవల్ల చంద్ర వంశంలో పుట్టి జయధ్వజుడనే పేరుతో పెరిగి, ఇలా విష్ణుదేవాలయ సమ్మార్జనం, గోమయశుద్ధి, దీపారాధన, పూర్వజన్మ వాసనాబలంతో చేస్తున్నాను–అని అనగా ఆ పురోహితుడెంతో, ఆశ్చర్యమూ, ఆనందమూ పొంది ఆనాటి నుంచి తాను కూడా ఆలయ సమ్మార్జనం వగైరా విష్ణుకైంకర్యం చేయనారంభించాడు. తరువాత కథ విను ధర్మనందనా!

చంద్రవంశంలో పుట్టి జయధ్వజుడనే పేరుగల విష్ణుభక్తుడనై ఉంటూ కొంతకాలానికి ఆయువు తీరి ఇంద్రలోకానికి వెళ్ళాను. అక్కడ దివ్యభోగా లనుభవించి రుద్రలోకానికివెళ్లి కొంతకాలమయాక దివ్యవిమానంతో బ్రహ్మలోకానికి వెళ్తున్నాను. దారిలో నారదమహాముని కనిపించాడు. తెలిసికూడా ఆయనను పలకరించలేదు. పోనీ నోరుమూసుకుని పోవచ్చు కదా! అలా కాకుండా ఏమి కలహాశనా ! లోకదిమ్మరీ! ఎక్కడికి ప్రయాణం? అని హేళనగా నవ్వాను. నేను గొప్ప విష్ణుభక్తుడనని అహంకారం. ఆ మాటకు ఆయన ఆగ్రహించి ఎంత విష్ణుభక్తుడవైనా ఇంత హేళన ధోరణి పనికిరాదు.ఫలం అనుభవించు. రాక్షసుడవౌదవు గాక! అని శపించాడు. నా తల గిర్రున తిరిగింది. వెంటనే విమానంమీంచే ఆయనను అనేకవిధాల ప్రార్థించి శాపవిముక్తి

అనుగ్రహించవలసిందని వేడుకున్నాను. క్షమించవలసిందని లెంపలు వాయించుకుని ఏడిచాను. "సరే. అరణ్యవాసం చేస్తున్న పాండవులధర్మపత్నిని ద్రౌపదిని, ఎత్తుకుపోయే సమయంలో అర్జునుని బాణాలకు గురి అయి నీ రాక్షసజన్మ అంతరిస్తుంది. "విష్ణులోకప్రాప్తి కలుగుతుంది పో!" అని తన దారిన తానుపోయాడు. అంతే. రాక్షసరూపంలో ఈ అడవిలో దబ్బున పడ్డాను. ఇన్నాళ్లకి శాపవిముక్తి అయింది. పోయివస్తాను.

అని తనకథ చెప్పాడు. అంతలో పెనుగాలి వీచినట్టయింది. గరుడుడు వచ్చి ఆ వ్యక్తిని తనవీపుపైన ఎక్కించుకుని రివ్వున ఎగిరిపోయాడు. ధర్మరాజాదులు ఆశ్చర్యంగా కొండొకసేపు చూచి తమ దారిన తాము పోయారు.

ఇది మార్కండేయుడు సహస్రానీకునికి దేవాలయ సమ్మార్జనం గురించి చెప్పిన కథ. అతడు మార్కండేయుడు చెప్పినది విని పరమానందభరితుడై ఆ విధంగా విష్ణుసేవ చేస్తూ కాలక్షేపం చేశాడు అని సూతుడు చెప్పి మునులారా! యథాశక్తిగా దేవాలయకైంకర్యం చేస్తూఉండాలి అని చెప్పి తరువాత సహస్రానీకుని కోరికపై మార్కండేయుడు చెప్పిన శ్రీహరి అవతారకథలను సూతుడు భరద్వాజాదులకు ఇలా చెప్పాడు.

## 11. మత్స్యావతారకథ

శ్రీహరి అవతారాలు చాల ఉన్నాయి. అవన్నీ చెప్పడం అలవి కానిపని. కాబట్టి వాటిలో మరీ ప్రధానమైనవి చెప్పదగిన వాటిని చెప్తాను. వాటిలో మొదటిది మత్స్యావతారం

అది ప్రళయకాలం. విష్ణువు పాలకడలిలో శేషశయ్యపై యోగనిద్రలో ఉన్నాడు. ఆ సమయంలో ఆయన చెవులనుంచి చెరొక్క నీటిచుక్క నీళ్లలో పడగా ఆ నీటి చుక్కల రెంటినుంచి ఇద్దరుమహాబలులు మహాశరీరులు పుట్టారు. ఒకడి పేరు మధువు. మరొకడిపేరు కైటభుడు. వాళ్లుపుట్టిన తర్వాత విష్ణునాభిమధ్యలోనుంచి దివ్యతేజస్సుతో ఒక వ్యక్తి పుట్టాడు. అతడిపేరు బ్రహ్మ. అతడికి విష్ణుముఖతః ఒకమాట వినిపించింది.



'ప్రజాసృష్టి చెయ్యవలసింది'–అని.

ఆ మాటవిని బ్రహ్మ వేదశాస్త్రపద్ధతి ఆధారంగా సృష్టిచెయ్యడానికి కూర్చున్నాడు. అంతలో మధుకైటభులు అక్కడక్కడా తిరుగుతూ బ్రహ్మదగ్గరకు వచ్చి ఆ మాట ఈ మాట ఆడుతూ వేదశాస్త్రసంచయాన్ని ఎత్తుకుపోయి సముద్రంలో దూరిపోయారు. బ్రహ్మ దిక్కుతోచక దీనంగా విష్ణువును ప్రార్థించాడు.

**'ఓం నమో వేదనిధయే**
**శాస్త్రాణాం నిధయే నమః,**
**విజ్ఞాననిధయే నిత్య**
**కర్మణాం నిధయే నమః'–అని**

స్తుతించాడు. 'విచారించకు, వేదశాస్త్ర సంచయాన్ని తెచ్చియిస్తాను' అని విష్ణువు అభయమిచ్చి 'ఈ చౌర్యం మధుకైటభుల దుష్కృత్యం' అని గ్రహించి సముద్రజలాలలో పెద్దచేపగా మారి ప్రవేశించాడు. అలా పాతాళానికి వెళ్లాడు. అక్కడ ఒకచోట కూర్చున్నారు ఆ దుష్టరాక్షసులు. వారివద్దకు వెళ్లాడు. ఏదో వేషం వేశాడు. మోసం చేశాడు. మైకం కలిగించాడు. వేదశాస్త్రసముదాయం తీసుకొని చప్పున వెలుపలకు వచ్చి బ్రహ్మకు ఇచ్చాడు. మత్స్యరూపం విడిచి మళ్లీ శేషశయ్యపై యోగనిద్ర.

మైకంలోంచి క్రమంగా తేరి మధుకైటభులు ఇటూ అటూ చూశారు. వేదశాస్త్ర సంచయం కనిపించలేదు. వెదుకుతూ మీదికి వచ్చారు. శేషశాయి అయిన విష్ణువును చూచి ఇడుగో! దొంగ. మనల్ని మోసగించి వేదశాస్త్రాల్ని ఎత్తుకుని వచ్చి ఇక్కడ నిద్ర నటిస్తున్నాడు అని పెడబొబ్బలు పెట్టి మేల్కొనేట్టు చేశారు. విష్ణువు లేచి ఏమి సమాచారం? ఎవరు మీరు? నన్నెందుకు లేపారు? అని బెదరిస్తున్నట్టు అడిగాడు.

ఏమి సమాచారం అని ఏమీ ఎరగనట్టు అడుగుతున్నావా దొంగా? మాయవేషం వేసుకునివచ్చి మమ్మల్ని మోహపెట్టి మా వద్ద ఉన్న వేద శాస్త్రాలు ఎత్తుకువచ్చిన దొంగవు. ఎందుకు వచ్చామా ?విను.

మా సొత్తు మర్యాదగా ఇస్తావా? మాతో యుద్ధానికి వస్తావా! అదేదో తేల్చు అని మధుకైటభులు విష్ణువు చేతులు పట్టుకుని లాగేరు. వెంటనే ఒక ఊపు ఊపి వాళ్ళని గట్టుమీదికి ఎగజిమ్మి మీ అంతు చూస్తాను లెండిరా! అని శంఖం పూరించి యుద్ధ సన్నద్ధుడై వచ్చాడు విష్ణువు. ఇంకేముంది? యుద్ధం ఘోరంగా చాలకాలం సాగింది. ఎలాగై తేనేమి మధుకైటభులు ఇద్దరూ ఆ యుద్ధంలో దారుణంగా మరణించారు. విష్ణువు వారిమేదస్సు (క్రొవ్వు)తో భూమికి మెరుగు కల్పించాడు. ఆ నాటినుంచి భూమికి మేదిని అనే కొత్త పేరువచ్చింది. తరువాత బ్రహ్మ విష్ణువుదయవల్ల ఎలాంటి విఘ్నాలు లేక సృష్టి చేయసాగాడు. అన్నిలోకాలవారూ విష్ణువును మత్స్యావతారుడుగా స్తుతించారు.

ఈ విధంగా హరి మత్స్యావతారుడై వేదశాస్త్రాలను దానవుల చేతులనుంచి తెచ్చి బ్రహ్మకిచ్చి సృష్టి జరిపించాడు. ఈ అవతారకథ విన్నా, చదివినా, వ్రాసినా విష్ణువు సంతోషించి సకల శుభాలూ ఇస్తాడు. తరువాతిది–

**కూర్మావతార కథ:**

ఒకప్పుడు దేవదానవులకు దారుణసంగ్రామం జరిగింది. ఆ యుద్ధంలో దేవతలు దానవుల చేతుల్లో చిత్తుగా ఓడిపోయారు. చేసేదిలేక బ్రహ్మతోసహ అంతా పాలసముద్రం వద్దకు వెళ్లారు. అక్కడ శేషశాయిఅయిఉన్న మహావిష్ణువును ప్రార్థించారు.

**'నమస్తే దేవదేవాయ లోకనాథాయ శార్ఙ్గిణే**
**నమస్తే పద్మనాభాయ లోకనాథాయ శార్ఙ్గిణే**
**మధుకైటభనాశాయ కేశవాయ నమో నమః.'**

ప్రభూ! యుద్ధంలో ఉద్ధతులైన దైత్యులచే ఓడిపోయాం. దిక్కులేని పక్షులమై నీడకోరి నీ పాదసన్నిధికి వచ్చాం. బ్రతికి బాగుండే దారి చూపి కాపాడు శ్రీ పద్మనాభా! అని కీర్తించగా శ్రీహరి వారికి సముద్రతీరమందు ప్రత్యక్షమై ఇలా అన్నాడు.



వేల్పులారా! నామాట వినండి. చెప్పినట్టు చెయ్యండి. సరాసరి ఇక్కణ్ణుంచి దానవులవద్దకు వెళ్లి యుక్తిగా, ఆసక్తిగా మాటాడి వారితో సంధి చేసుకొండి. తరువాత ఎక్కడెక్కడ ఉన్న ఓషధీలతలను తెచ్చి ఈ సముద్రంలో వేయండి. మందరపర్వతం కవ్వంగా, సర్పరాజువాసుకి కవ్వపు త్రాడుగా క్షీరసాగర మథనం చెయ్యండి. సమయానుసారంగా నేనున్నూ మీకు సాయం చేస్తాను. అలా మీరూ దైత్యులు సముద్ర మథనం చేయగా చేయగా దానిలోంచి అమృతం లభిస్తుంది. దానిని ఇంద్రాదులు మీరంతా త్రాగండి. దాని ప్రభావంవల్ల ఇతోధికమైన తేజస్సు, బలపరాక్రమాలు కలవారవుతారు. ఆపైన దైత్యుల నిర్జించడం మీకు నల్లేరుపై బండినడక అని అక్కడి కక్కడ హరి అదృశ్యుడైనాడు. ఇంద్రాదులు దానవుల వద్దకు వచ్చారు. మంచీచెడ్డా మాటాడుకున్నారు. మనం పినతల్లి, పెదతల్లి పిల్లలం. తల్లులు వేరైనా మహనీయుడు తండ్రి కశ్యపుడు ఒక్కడేకదా! అన్నదమ్ములం సాక్షాత్తూ. చీటికీ మాటకీ పోరాటం, ఆరాటం నలుగురిలో నవ్వులాట. ఏమంటారు? కలసి మెలసి ఉండడం బుద్ధిమంతుల లక్షణం. ఆలోచించండి అని దేవతలు అనగానే దైతేయులు తల లూపారు ఔనన్నట్టు. తామసుల స్వభావం అది.

ఒకనాడు ఇంద్రాదులు సముద్రమథనం గురించి ప్రస్తావించారు. అమృతం గొప్పదనం వినగానే ఓ! ఇదెంత పని పదండి– అని దైత్యులు పొలికేకలు వేస్తూ చిందులు త్రొక్కుతూ మందరగిరి వద్దకు వేల్పులవెంట వెళ్లారు. అందరికన్నా ముందు బలి వెళ్లి అవలీలగా ఆ పర్వతాన్ని పెల్లగించాడు. విష్ణువు గరుడునిమూపుపై దానిని ఉంచి పాలసముద్రంలో పడవేయించాడు. అంతలో దేవదానవులు ఓషధుల నన్నిటినీ తెచ్చి పాలకడలిలో వేశారు. విష్ణువు ఆజ్ఞ. కిమ్మనకుండా నాగరాజు వాసుకి వచ్చాడు. పర్వతానికి చుట్టుకున్నాడు. ఏమిలాభం? కొండ నీళ్లలో మునగడం ఆశ్చర్యమా? అందరూ తెల్లమొగాలు వేసి ఏమిటి ఉపాయం? కొండ తేలిఉండాలి! అని దిక్కులు చూస్తూ నిలుచున్నారు. 'విచారించకండి. ఇదిగో కొండ తేలుతుంది' అని విష్ణువు అందరూ ఆశ్చర్యంతో చూస్తుండగా మహాకూర్మరూపుడై సముద్రంలో ప్రవేశించి

వీపుపై అంతకొండనీ కుదురుగా ఉంచి భరించాడు. అలాగే ఎవరికీ కనిపించని దివ్యరూపంతో పైనుండి కొండశిఖరాన్ని పైకెత్తి పట్టుకున్నాడు. ఘటనాఘటన సమర్థుడు అనే అసాధారణమైన బిరుదు విష్ణువునకు ఊరకే వచ్చిందా?...కొండ మీదికి తేలింది. వాసుకి తరిత్రాడు అయ్యాడు. కాని ఎవరు మొగాలవైపు, ఎవరు తోకవైపు పట్టుకోవాలి? మేము తోక పట్టుకోము. మా కది అవమానం అని వాదించారు దైతేయులు. విష్ణువు సరే మీరు పడగలు పట్టుకోండి అని దేవతలకు కనుసన్న చేసి తోకపట్టించాడు. వాసుకి బాధపడుతూ వెలిగ్రక్కే విషపు సెగలకు రాక్షసులు యమబాధ పడుతూన్నా పౌరుషానికి లొంగి పడగలు వదలలేదు.

అలా క్షీరసాగరమథనం జరుగుతూఉండగా కొంతకాలానికి లోక భయంకరంగా కాలకూటం అనే విషం మీదికి వచ్చింది. దానివేడి భరించలేక ఎక్కడి వారక్కడ మూర్ఛపడినంత అయి సముద్రమథనం విడిచి పెట్టారు. అంత విష్ణువుఆజ్ఞతో పాతాళమందున్న నాగజాతివచ్చి ఆ విషాన్ని మ్రింగింది. కాస్త మిగిలిపోగా విష్ణువు శివుణ్ణిచూచి దీనినిమ్రింగి కంఠంలో ఉంచుకో శంకరా! లోకక్షేమంకోసం మనం ఎలాంటి కష్టపాటునైనా భరించాలి కదా ! అని అనగానే శంకరుడు ఆ విషపుముద్దను అరచేత ఆకర్షించి నేరేడు పండులాగా గుటుక్కున మ్రింగాడు. కంఠమందు భరించాడు. దానివేడికి శివునికంఠం కమిలి నీలివన్నెతో నిగనిగలాడసాగింది. అప్పుడు శ్రీహరి శంకరునకు 'నీలకంఠుడు' అనే బిరుదనామం ఇచ్చాడు. అంతా జయధ్వనులు చేశారు.

మళ్ళీ సముద్రమథనం ఆరంభించారు. నాలుగు దంతాలతో నవనవ లాడుతూ తెల్లనిఏనుగూ, దానివెంట అలాంటి తెలుపువన్నెగల అందమైన గుర్రం ఆ సముద్రంలోంచి పైకివచ్చాయి. ఆ ఏనుగు పేరు ఐరావతం, గుర్రం పేరు ఉచ్చైశ్రవం. తరువాత శోభనమూర్తులు, అప్సరసలు పాలకడలినుంచి నారు మొలిచినట్టు నవనవలాడుతూ పైకివచ్చారు. అచ్చరల వెంటనే కోరికలచెట్టు దివ్యవృక్షం పారిజాతం వచ్చింది. ఇలా దివ్యవస్తువులు ఒకదానివెంట ఒకటి వస్తున్నవి. అవన్నీ విష్ణుసంకల్పం ప్రకారం ఇంద్రుని సొమ్ములు అయిపోయాయి.



చెట్టూ చేమా మనకెందుకు? రావలసేది, కావలసేదీ అమృతం అని ఆ యా వస్తువులను దానవులు తృణీకరించారు.

మళ్లీ మథనం ఆరంభమైంది. ఈమారు చల్లని వెలుగులచందమామ వచ్చాడు. ఆ చలివెలుగును శంకరుడు ఆప్యాయంగా గ్రహించి నారీమణి నాగరం ధరించినట్టు శిరోభూషణంగా ధరించి చంద్రశేఖరుడనే క్రొత్తపేరుగల వా డయాడు.

తరువాత దివ్యరత్నాలు తెప్పున తేలాయి. అలాగే సుందరాకారులు గంధర్వులు వచ్చారు. ఇవన్నీ ఇంద్రుని సొత్తు అయిపోయాయి. పోనీ! అన్నారు దైత్యులు.

తదుపరి పద్మహస్త శ్రీదేవి పాలకడలి అలలపై ఊయలలూగు తూన్నట్టు దివ్యసౌభాగ్యరేఖతో వచ్చింది. తీరానికి చేరి అందర్నీ ఒకసారి చూచి అల్లనల్లన నడచివెళ్లి వేలావనంలో ఉన్న విష్ణువును సమీపించి చిరునవ్వుతో చూచి సాభిప్రాయంగా చేతులు చాచింది చేరదీసుకో ప్రభూ! అన్నట్టు. విష్ణువు నీకోసమే ఈ శ్రమ అంతా అన్నట్టు రెండు చేతులూ చాచి ఆప్యాయంగా చేర దీసుకుని శ్రీదేవిని తన విశాలవక్షానికి హత్తుకున్నాడు. ఆ సమయంలో అనుకోకుండా ఆకాశంలో దివ్యదుందుభులు మ్రోగాయి. ప్రక్కనున్న పారిజాతం మధుర పరిమళం వెదజల్లుతూ దట్టంగా పూలవాన కురిసిం దా లోకజననీ జనకుల మీద, దేవతల ఆనందానికి అంతులేదు. వారిమొగాలు ఏదో అనిర్వచనీయమైన శోభతో రాణించసాగాయి. ఔను. కలుములరాణి శ్రీదేవి వారిపక్షాన చేరింది. చూస్తూ అలక్ష్యంగా ఊరకున్న దానవుల దౌర్భాగ్యరేఖ అలా ఉంది.

మళ్లీ సముద్రమథనం. ఈ మారు అమృతకలశం అరచేతులలో ఉంచుకుని ఒక దివ్యపురుషుడు వెలుపలకు వచ్చాడు. ఆ! అదే అమృతం అన్నారు ఎవరో ! అలాగా అన్నారు దైత్యులు. వాసుకిని విడిచి గట్టుకు వచ్చి ఆ దివ్యపురుషుని బెదరించి అమృతకలశం లాగుకుని అల్లంతదూరాన ఉన్న తోటలోకి పారిపోయి చెట్లక్రింద విశ్రాంతిగా కూర్చుని మీసాలు దువ్వుకుంటు న్నారు సాధించాం అన్నట్టు.

తెల్లమొగాలతో దిక్కులుచూస్తూ దిక్కుతోచక నిల్చున్నారు వేల్పులు. స్వామీ ! పురుషోత్తమా ! నీవే గతి. శ్రమ అంతా వృథా అయింది. మమ్మల్ని కృతార్థులను చేయవా ప్రభూ ! అని విష్ణువును ఉద్దేశించి దేవతలు ఉద్ఘోషించారు.

ఎవరా తోటలో! ఏదో చల్లని వెలుగూ. విశ్వమోహనమూర్తి, మోహినీదేవి! చిలుకపలుకులకు కలకండ మేపుతూ, కోయిల గొంతులో తేనెలు నింపుతూ మాటాపాటా ఏదో సృష్టికి అపూర్వశోభ కలిగించే మించు బోణి! వగలొలికే నగవులతో రాక్షసులను కికురించి వారి అధీనంలో ఉన్న అమృత కలశం అందుకుని దేవదానవులను వేరు వేరుగా రెండుబంతులు దీరి ఎదురెదురుగా కూర్చోమంది. కిక్కురుమనకుండా కూర్చున్నారు. ఆ మాటా ఈ మాటా చెప్తూ అమృతం దేవతలకు పంచియిచ్చి, రాక్షసులకు తీయని మాటలూ, కులుకు చూపులు వంతుపెట్టి సర్వం సమాప్తం అనిపించి అక్కడి కక్కడ అదృశ్యురాలై పోయింది. అడుగున ఆ మాత్రం ఈ మాత్రం అమృతం ఉందని గ్రహించి విష్ణువు ఆజ్ఞచే గరుడుడు క్షణంలో ఆ అమృతకలశాన్ని ఎత్తుకుపోయి అమరావతిలో నందనవనం ప్రవేశించి ఈశ్వరాజ్ఞ! భద్రంగా చూస్తూ ఉండండని పాలకుల కప్పగించి తాను వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

రాక్షసులకు ఈ మాయనాటకం ఆవంతైనా అర్థం కాలేదు. నాటకం ఆడించిన సూత్రధారుడు మహావిష్ణువు. సాధుసంరక్షణకోసం ఏ వేషాలైనా వేస్తాడు. ఏ నాటకమైనా ఆడుతాడు. శుద్ధతామసు లా దివ్యశక్తిత్వాన్ని కలలోకూడా తెలుసుకోలేరు.

అమృతపానంతో వేల్పులు అనల్పశక్తి సామర్థ్యాలు కలవారైనారు. చచ్చుమొగాలరక్కసులను చావగొట్టి దిక్కులవెంట పరుగు లెత్తించారు. తమరాజ్యాలు స్వాధీనం చేసుకున్నారు. యథాపూర్వంగా దివ్యభోగాలనుభవిస్తూ హాయిగా ఉన్నారు. ఇది శ్రీహరి కూర్మావతారకథ!

**వరహావతార కథ**

తరువాత శ్రీహరి వరాహావతారంలో జగదుద్ధారకుడైన పుణ్యకథ చెప్తాను విను రాజా! అని మార్కండేయుడు ఇలా చెప్పాడు.



అది లయసమయం. బ్రహ్మకి ఒక దినం పూర్తిఅయిన కాలం. ముల్లోకాలూ జలమయమైపోయాయి. సృష్టినంతనూ తనలోకి తీసుకుని శ్రీమన్నారాయణుడు మహాసముద్రంలో వెయ్యిపడగలఅనంతుని మెత్తని భోగశయ్యపై యోగనిద్రాముద్రితుడై ఉన్నాడు. అది అలా ఉండనీ !

కశ్యపబ్రహ్మకు దితి అనే భార్యయందు కలిగిన సంతతిలో హిరణ్యాక్షుడు పెద్దవాడు, పరమదుర్మార్గుడు. వాడినివాసం పాతాళంలో. అక్కడనుంచే దేవతలకు గుండె గాలమై ఉంటున్నాడు. భూమి మీదికి వచ్చాడా యజ్ఞయాగాలు భూస్వాహా అయిపోయాయే! భూమి మీద ఉన్న మానవులు దేవతల సంతృప్తికోసం యజ్ఞయాగాలు చేస్తూ ఉంటారు. వాటివల్ల దేవతలకు శక్తియుక్తులు అపారంగా వస్తాయి. అవి రాకుండా చెయ్యాలంటే ఈ భూమిని చాపచుట్టగా చుట్టి పాతాళానికి ఎత్తుకు పోవడమే. ఇక మానవులు యజ్ఞాలు ఎలా చేస్తారు? అని అనుకున్నాడు. భూమిని మడిచి చాపచుట్టలాగా చంక నుంచుకుని హిరణ్యాక్షుడు పాతాళానికి వెళ్ళిపోయాడు.

నిద్రముగిసింది. అనంతశయనుడై ఉన్న సర్వభూతాత్ముడు శ్రీహరి కళ్లు తెరిచి చూచి భూమి ఏమైనట్టు? అని అనుకుని ఓరి దుర్మార్గుడా ఎంతపని చేశావురా? నీ అంతుచూస్తా నుండు అని అనుకున్నాడు. ఆవులించాడు. మెల్లగా శేషశయ్యమీంచి లేచాడు. ఇటూ అటూ చూచాడు. చప్పున దివ్యవరాహరూపుడైనాడు.

నాలుగు వేదాలే పాదాలు. యజ్ఞాలలో పశుబంధనానికి ఉపయోగించే మంత్ర పూతాలైన యూపస్తంభాలే దంతాలు. కరకు దర్భలే రోమాలు. అగ్ని నాలుక. సూర్యచంద్రులే నేత్రాలు. నక్షత్రాలు ముక్తాహారాలు. అదొక వింత వరాహరూపం. సరాసరి రసాతలంలోకి వెళ్లాడు. అక్కడ నక్కిఉన్న హిరణ్యాక్షుణ్ణి దిక్కుతోచని విధంగా యుద్ధంలో మర్దించి చీల్చి చెండాడాడు. దంతాగ్రంచే భూమిని ఉద్ధరించాడు. ఇంకేముంది? 'ధాతా యథాపూర్వం అకల్పయత్' యథాపూర్వంగా సృష్టి జరిగిపోయింది.

ఆ దేవుడికి ఇదొక ఆట. ఇలా సృష్టిస్తాడు. దుష్టులవల్ల వచ్చే ఉప ద్రవాలను ఏదో రూపంతో పోగొట్టి సృష్టిని పోషిస్తూ ఉంటాడు. లయ సమయంలో రుద్రరూపుడై అన్నింటినీ అంతమొందిస్తాడు.

వేదాంతవేద్యుడైన ఆ పరమపురుషుని ఈ అవతార కథలను వ్రాసిన చదివిన విన్న మానవులు సర్వపాపవిముక్తులై జన్మాంతమందు విష్ణుపదం పొందుతారు.

శ్రీహరి నరసింహావతారుడైన అద్భుతకథ విను చెప్తున్నాను రాజా! అని మార్కండేయుడు ఇలాచెప్పాడు.

**నరసింహావతార కథ**

కశ్యపునకు దితియందు కలిగిన సంతానంలో హిరణ్యాక్షుని తర్వాత చెప్పదగినవాడు హిరణ్యకశిపుడు. సోదరుని మరణానంతరం దేవతలపై పగబట్టి వాళ్ళని తన చేతిక్రిందికి తేవాలని అనుకున్నాడు. అడవికి వెళ్లి ఆశ్రమవాసియై బ్రహ్మనుగూర్చి కఠోర నియమాలతో చాలాకాలం తపస్సు చేశాడు. ఆ తపోదీక్షకి మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై దానవేశ్వరా! ఏమిటో నీ వరం! కోరుకో. నిస్సందేహంగా ఇస్తున్నానని మాట ఇచ్చాడు. ఆ మాటకి సంతోషిస్తూ హిరణ్యకశిపుడు చతుర్ముఖునకు సవినయంగా మ్రొక్కి–

భగవన్! నాకు వరాలివ్వాలని నీకు మనసైతే కోరుతున్నాను విను. ఎండినది గాని, పచ్చిది గాని నన్ను చంపకూడదు. నీరు, నిప్పు, కర్ర, పురుగు, భూతం, పాము, మృగం, మనిషి, దేవత, కిన్నర కింపురుషులు, యక్ష రాక్షసులు నన్ను చంపలేనట్టు నాకు వరం ఇయ్యవయ్యా. పగలు, రాత్రి, నేలపై, నింగిలో, ఇంటా, బయటా, నాకు చావు రాకూడదు. ఇప్పుడున్న ఆయుధాలుగానీ, అస్త్రాలుగానీ నాకు మరణహేతువులు కాకూడదు. ఏమంటావు? నిజంగా నా మీద దయఉంటే ఈ విధంగా నాకు వరమివ్వవలసిందని వేడుతున్నాను అని అన్నాడు. వాని మాటలు విన్నాడు బ్రహ్మ. రాక్షసరాజా! ఎవ్వరూ చెయ్యలేని తపస్సు చేశావు. దానివల్ల నువ్వేమి కోరినా ఇవ్వాలనే అనుకున్నాను.



ఇంతవరకూ గతకాలంలో ఎవ్వరూ ఇలాటివి కోరలేదు. నేనివ్వలేదు. దుర్లభా లైనా ఇస్తున్నాను, వెళ్ళు. ఈ తపస్సుఫలంగా దివ్యభోగాలు అనుభవించు, అంటూ వానికి కోరిన వరాలిచ్చి బ్రహ్మ తనలోకానికి వెళ్ళిపోయాడు. హిరణ్య కశిపుడు వరగర్వంతో పొంగుతూ స్వనగరానికి వచ్చాడు. మరునాడే స్వర్గంమీదికి దండెత్తి వెళ్ళి గడియలో వశపరచుకుని ఇంద్రాదులను దిక్కులవెంట పరువెత్తిం చాడు. అదేవరస. ముల్లోకాల్లోను తన విజయపతాక లెగురవేసి తిరుగులేని శాసనంతో రాజ్యం చేస్తున్నాడు. అలా చేస్తూ ప్రజలను సమావేశపరచి వినండి నా శాసనం– “ఈ క్షణం నుంచి మీరు యజ్ఞాలు, యాగాలూ, దాన ధర్మాలు, జప తపాలూ ఆ దేవతల పేరుతో చెయ్యకూడదు. అన్నిజాతులకు, లోకాలకూ నేనే యజమానిని. నేనే ప్రభువును! నా సంతుష్టి కోసం నా పేరుతో చేస్తూ ఉండాలి. దీనికి వ్యతిరేకంగా నడిచేవారు తగిన శిక్ష అనుభవిస్తారు. అను కూలంగా నడిచేవారు తగిన రక్ష పొందుతారు. తెలిసిందా? వెళ్ళండి.”

అని శాసించి పంపాడు. చావక తీరదు గూనివంపు. ఏమిచేస్తారు, అమాయిక ప్రజలు! వాని శాసనం ప్రకారం చేస్తున్నారు. మొత్తంమీద దేవుడు అనేమాట వాని పరిపాలనలో ఎక్కడా వినరాలేదు.

ఇలా ఎంతకాలం? దేవతలు ఇంద్రుణ్ణి ముందుంచుకుని గురువుగారి వద్దకు వెళ్ళి మొరపెట్టారు. గురుదేవా! ఆ హిరణ్యకశిపుడి దుష్టనాటకానికి భరతవాక్యం ఉందా? లేదా? శిష్యులు దుర్బలులై అనాథులై చెట్టుకొక పిట్టగా ఇలా దేవిరి బ్రతుకు బ్రతకవలసిందేనా?

బృహస్పతి వారి గోడు విన్నాడు. ఒకక్షణం ధ్యాన శక్తితో ఏదో ఊహించి తల పంకించాడు. విచారించకండి అని ఇలా అన్నాడు. నా మాటలు వినండి. మీకు మీ మీ పదవులు రావడం నిస్సందేహం. హిరణ్యకశిపుడు అచిరకాలంలో నశిస్తాడు. వానికి అదృష్టరేఖ మాసిపోవడం ఆరంభ మయింది.

శోకం బుద్ధిని చెడగొడుతుంది. జ్ఞానం నశిస్తుంది. మంచి ఆలోచనను శోకం ఇట్టే త్రుంచి వేస్తుంది. చదువు శోకంవల్ల పనికిరాకుండా పోతుంది. శోకంతో సమమైనశత్రువు లేదు. అగ్నిని తాకవచ్చు, ఆయుధాలదెబ్బను

భరించవచ్చు. శోకంవల్ల వచ్చే బాధను మాత్రం భరించడం ఎంతటివానికి సాధ్యంకాదు. ప్రస్తుతంకాలం వాడికి బలంగాఉంది. కాని అపశకునాలు వాడి దిక్కున ఆరంభమయాయి. వాటిఫలితం రాక్షసనాశం. అంతవరకూ మనం వేచి ఉండాలి. తొందరపడి ప్రయోజనం లేదు. చెయ్యవలసేది చెప్తున్నాను వినండి. అందరూ కలిసి పాలసముద్రానికి ఉత్తరతీరానికి వెళ్లండి. ధర్మపాలకుడైన ప్రభువు సర్వతంత్రస్వతంత్రుడు శ్రీహరి పాలకడలిలో యోగ నిద్రలో ఉన్నాడు. ఆ దేవుని స్తుతించి మేల్కొలుపు పాడండి. మీ కోరిక తీరుతుంది. ఆ దుష్ట దైత్యుని మరణోపాయం ఆయన చెప్తాడు. వెళ్ళండి–అని బృహస్పతి ప్రోత్సహిస్తూ అన్నాడు. సరే అన్నారు ఇంద్రాదులు. ఇంద్రాదులు క్షీరాబ్ధి ఉత్తర తటానికి వెళ్ళారు. పురుషోత్తముణ్ణి వివిధ స్తోత్రాలతో స్తుతించారు. ఆ సమయంలో శంకరుడు ప్రత్యేకించి దివ్యార్థభరితమైన నామావళితో శ్రీహరిని స్తుతించాడు.

"విష్ణు ర్జిష్ణు ర్విభు ర్దేవో యజ్ఞేశో యజ్ఞపాలకః,
ప్రభవిష్ణు ర్గ్రసిష్ణుశ్చ లోకాత్మా లోకపాలకః"
"జ్యోతిష్మాన్ ద్యుతిమాన్ శ్రీమాన్ ఆయుష్మాన్ పురుషోత్తమః,
వైకుంఠః పుండరీకాక్షః కృష్ణ స్సూర్యస్సురార్చితః,
నరసింహో మహాభీమో వజ్రదంష్ట్రో నఖాయుధః,
ఆదిదేవో జగత్కర్తా యోగేశో గరుడధ్వజః,
త్రివిక్రమ స్త్రిలోకేశః బ్రహ్మేశ ప్రీతివర్ధనః,
వామనో దుష్టదమనో గోవిందో గోపవల్లభః,
శంఖీ చక్రీ గదీ శార్ఙ్గీలాంగలీ ముసలీ హలీ,
కిరీటీ కుండలీ హారీ మేఖలీ కవచీ ధ్వజీ.
అనంతాయాప్రమేయాయ నమస్తే గరుడధ్వజ"।।

ఇలాగ శంకరాదులు నామపుష్పాదులతో క్షీరసాగరశయనుణ్ణి ఆరాధించగా సంతుష్టుడై దర్శన మిచ్చి శ్రీహరి ప్రసన్నవదనుడై ఇలా అన్నాడు:



"సురలారా! మీ దివ్యనామసంకీర్తనం నా కెంతో సంతోషం కలిగించింది. మీకు నేనేమి చెయ్యాలో చెప్పండి చేస్తాను– అని అనగా శంకరాదులు 'ప్రభూ! సర్వజ్ఞుడవు. నీకు తెలియని దేముంది?' అని అనగా 'అవును ఆ హిరణ్యకశిపువధ కర్తవ్యం. కొంచెం కాలం ప్రతీక్షించాలి. వానికి ఒక కొడుకు కలుగుతాడు. పేరు ప్రహ్లాదుడు. వాడు నా భక్తుడు.

హిరణ్యకశిపుడు వరగర్వంతో మిడిసిపడుతూ ఆ భక్తుణ్ణి హింసిస్తాడు. అప్పుడు నేను వాణ్ణి అంత మొందిస్తాను. వెళ్లండి' అని శ్రీహరి అదృశ్యుడైనాడు. దేవతలు ఓదార్పుగా తమ విడిది పట్టులకు వెళ్లిపోయారు. ఇక తరువాతి కథ.

హిరణ్య కశిపుడు లోకాలన్నిటినీ అరచేత త్రిప్పుతున్నా, మళ్ళీ తపస్సు చెయ్యాలి అనుకున్నాడు. ఏమిటో వాని కోరిక. ఒకనాడు ముహూర్తం చూచి బయలుదేరాడు. ఆ సమయానికి భూమి గిర్రున తిరిగింది. దిక్కులు మంటలతో బగబగలాడాయి. ఇలాగే ఏవో విపరీత శకునాలు తోచాయి. చూచారు బంధుమిత్రులు. హిరణ్యకశిపుణ్ణి నిలవరిస్తూ అన్నారు. రాజా! మళ్ళీ ఎందుకొచ్చిన తపస్సు? నీకు వశంకాని శక్తులే లేవు. తీరని కోరికలు లేవు. ఏదేనా లోపంఉంటే అనుకోవచ్చు. అది అలా ఉండనీ. నీవు బయల్దేరే సమయంలో అన్నీ అపశకునాలే తోచాయి. మాకు నీ ప్రయాణం ఆమోదయోగ్యంగా లేదు. ప్రభుక్షేమం కోరేవారం గనుక ఈ మాత్రం చెప్పవలసి వచ్చింది. చెప్పాం. ఆపైన నీ ఇష్టం.

వరగర్వం; పరమమూర్ఖత్వం. హిరణ్యకశిపుడు వారి మాటలు పెడచెవిని పెట్టి వెళ్ళిపోయాడు. ఇద్దరు ముగ్గురు ఆంతరంగికులైన అనుచరులు అతణ్ణి అనుసరించారు. సరాసరి కైలాసపర్వత ప్రాంతానికి వెళ్ళి కఠోర నియమాలతో తపశ్చర్య ఆరంభించాడు. రాక్షసరాజు తపస్సు బ్రహ్మకు తెలిసింది. కలతపడ్డాడు. మళ్లీ ఈ గండమూర్ఖుడు తపస్సు ఆరంభించాడే. ఇంతకుముందు తపస్సుతో నన్ను సాధించి అడ్డమైనవరాలూ పొందాడు. ఇప్పుడు ఏమి కోరుతాడో? వీడి తపస్సు ఆపడం ఎలాగ? – అంతలో నారదుడు వచ్చి నాయనా! ఎందుకలా విచారిస్తావు? నారాయణుడు హృదయంలో ఉన్నవారు

దేనికీ విచారించరు. ఆ దైత్యుని తపస్సు మాన్పించే ఉపాయం నేను చూస్తాను. అలాంటి ప్రజ్ఞను సర్వేశ్వరుడు శ్రీమన్నారాయణుడు నాకు అనుగ్రహించుగాక! అని ధైర్యం చెప్పి మేనల్లుడైన పర్వతుడు వెంటరాగా నారాయణస్మరణ చేస్తూ కైలాసప్రాంతానికి చేరాడు.

కాసింత దూరంలో చిన్న పర్ణశాల; ముంగిట చెట్టు క్రింద చుట్టూ అగ్ని హోత్రం. ఆ మధ్య హిరణ్యకశిపుడు. నారదుడు చూచాడు. పర్వతుడికి చెప్పాడు చెవిలో.

హిరణ్యకశిపుడు తపస్సుచేస్తున్న చెట్టుక్రింద దూరంగా అతడి అనుచరులు కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. హిరణ్యకశిపుడికి ఎదురుగా కొమ్మమీద రెండు పిచ్చుకలు కూర్చుని ఒకదాని తరువాత ఒకటి...

ఓం నమో నారాయణాయ! అని గట్టిగా కూయనారంభించాయి. హిరణ్యకశిపుడికి మతి మతిలో లేదు. కళ్లుతెరిచి చూచాడు. ఎదురుగా పిచ్చుకలు. అదేపాట. మరి ప్రశాంతంగా కూర్చోలేక లేచి విల్లు తీసుకొని కోల సంధించాడు. ఆ పిట్టలు చూచాయి. రివ్వున ఎగిరిపోయాయి.

హిరణ్యకశిపుడు విసవిసలాడాడు. విసురుగా బయల్దేరాడు. అనుయాయులు అనుసరించారు. తిన్నగా స్వనగరం వచ్చాడు.

ఆ రాత్రి భార్య అడిగింది. ఏమి స్వామీ! తపస్సు ముగించి నేను ఇంటికి రావడం కొన్ని వందలసంవత్సరాలు అయాక, అని చెప్పి వెళ్లావు. ఇంత తొందరగ వచ్చావేమి? తపస్సు అయిపోయిందా? చనువుతో అడుగుతున్నాను. మరొకలా అనుకోకు అని లాలిస్తున్నట్టుగా భార్య అడగగా హిరణ్యకశిపుడు 'ఏమి చెప్పమన్నావు? కైలాసప్రాంతానికి వెళ్లాను. ఉనికి ఏర్పరచుకున్నాను. తపస్సు చేస్తున్నాను. అలా ఉండగా నా కెదురుగా చెట్టుమీద రెండుపిచ్చుకలు కూర్చుని నాకు వినడానికి అసహ్యంగా ఓం నమో నారాయణాయ అని అరవడం, ఒకటేగోల. అది నేను విని సహించగలనా? దానితో కోపంవచ్చి వింటబాణం సంధించి వాటి మీద ప్రయోగించపోయాను. అవి ఎగిరి పోయాయి. మరి నాకు అక్కడ తపస్సు చెయ్యాలని అనిపించలేదు. ప్రస్తుతానికి స్వస్తి చెప్పి ఇంటికిచేరాను. ఇదీ కథ- అని అన్నాడు.



హిరణ్యకశిపుడి సంసారజీవితం కొత్త మలుపు తిరిగింది. ఒక కొడుకు పుట్టాడు. ఆ శిశువు పెరిగి నోటవచ్చిన మొదటిమాట ఓం నమోనారాయణాయ. తల్లి తల్లడిల్ల నారంభించింది. ఈ మాటవిని ఆ తండ్రి ఈ ముద్దుల బిడ్డణ్ణి ఏమి చిత్రహింస పెడతాడో అని-వేడినిట్టూర్పు విడిచేది. కానున్నది కాకపోదు-అనే మొండి నిర్ణయానికి వచ్చింది.

ఆ శిశువు ప్రహ్లాదుడు. అయిదేళ్లవాడయాడు. గోవిందనామ సంకీర్తనమే రక్షగా పెరుగుతున్నాడు. తండ్రి గురువుకి అప్పగించాడు తమ జాతికి తగిన చదువు చెప్పవలసిందని.

కొంతకాలం కాగా ఒకనాడు కొడుకుని రప్పించి హిరణ్యకశిపుడు అడిగాడు. చిన్నికుర్రా! నీకు గురువుచెప్పిన రాజకీయ విద్య ఏమాత్రం అయింది? జాగ్రత్తగా శ్రద్ధగా చదువుతున్నావా? ఏదీ ఒక పద్యం చక్కగా చదివి అర్థం, తాత్పర్యం చెప్పుబాబూ! అని లాలనగా అనగా ప్రహ్లాదుడు "నాయనా! ఈ పొట్టకూటి విద్యలెందుకు? ఆవలిగట్టుకి చేర్చుచదువే ముఖ్యం. దానికి మూలమంత్రం-

'గోవింద! దామోదర! మాధవ! అనేది- అదే నేను నేర్చుకున్నది అని నిర్భయంగా నింపుగా అన్నాడు. తల్లికడుపులో ఉన్నపుడే వానికి విష్ణుతత్త్వోపదేశం నారదుడివల్ల జరిగింది. అది పొమ్మంటే పోతుందా? జన్మవైష్ణవుడు ప్రహ్లాదుడు. ఆ రహస్యం తెలుసుకుని ఆనందించే అదృష్టం ఆ తండ్రికి లేకపోయింది.

కొడుకు గోవిందా! దామోదరా! మాధవా! అనేసరికి హిరణ్యకశిపుడికి ఆపాదమస్తకం విసపు జెర్రులు ప్రాకినట్టయింది. అంకసీమపై కూర్చున్న కొడుకును అలాగే క్రిందకు త్రోసి తేరిపారజూచి కొంచెం శాంతంవహించి-

'కుర్రా'! గోవింద నామస్మరణ మనజాతికి తగదు. అలా చేసే వారు నాకు శత్రువులు. నువ్వు ఎవరివల్ల ఈ దుర్బోధ విన్నావో! ఇటుపై ఇలాటి

మాటలు అనకు. అని సేవకుణ్ణి చూచి ఒరే! త్వరగా వెళ్లి గురువుని తీసుకు రారా! అని ఆజ్ఞాపించాడు. సేవకుడు వెళ్లి గురువుని తోడ్కొని వచ్చాడు. గురువు రాక్షసరాజు ముఖవైఖరి చూచి ఏదో కొంపమునిగింది! అని భయపడుతూ అలాగే నిల్చున్నాడు.

హిరణ్యకశిపుడు గురువును చూచి 'ఏమయ్యా! నా కొడుకు నాకు విరుద్ధమైన పద్ధతిలో శ్రీహరిస్మరణ చేస్తున్నాడే! ఇది మా కులానికి తగనిపాఠం. నీ బోధ ఇదా? నెమలి పామునీ, పిల్లి ఎలుకనూ పొగడుతూన్నట్టు ఉందే!' అని బెదరించి, కొడుకును చూచి 'ఇదిగో చూడు! మంచిగా చెప్తున్నాను. మనజాతికి బద్ధవిరోధి అయిన ఆ మాధవుణ్ణి నువ్వు చెప్పడం తగదు. నిజానికి లోకనాథు డెవడో నేను చెప్తున్నాను విను. ఎవడు శూరుడో, ఎవడు వీరుడో వాడే లోకేశ్వరుడు. వాడే అందరికీ ప్రభువు. నువ్వు పేర్కొన్న ఆ మాధవుడు మాయాధవుడు. ఎదుటపడి మాటాడి మన్నన పొందదగిన మగటిమి లేని తంత్రగొట్టు. అలాంటివాడు విశ్వేశ్వరుడని నీవు కీర్తించడం నీతిమాలినపని. ఇటుపై అలాటి వికారపుపాటలు పాడక లోకైకశూరుడను, వీరుడను, ధీరుడను అయిన నన్నే విశ్వనాథుడుగా ఎన్నుకుని, మనజాతికి తగిన చదువు చదువుకుని నలుగురిచే సెబాస్ అనిపించుకో! వెళ్లు. గురువులు చెప్పినరీతిని నడుచుకో అని ముదలకించి, గురువునుచూచి 'వెళ్లవయ్యా!' పిల్లవాణ్ణి తీసుకువెళ్లు. మా స్వభావానికి అనుగుణమైన చదువు చెప్పి విద్వాంసుణ్ణి చేసి తీసుకురా! చెడు దారిని నడువనీకు అని తర్జించాడు. చిత్తం అలాగే చేస్తాను మహారాజా! అని ఆ గురువు ప్రహ్లాదుణ్ణి తీసుకుని వెళ్లిపోయాడు. కడుపు కక్కుర్తి అలాంటిది. విష్ణువే సర్వేశ్వరుడని సర్వాత్మనా తెలిసిన వివేకి అయినా ఆ గురువు రాచకొలువు బ్రతుకు తెరువున నడవక తప్పిందికాదు పాపం!'

కొన్నాళ్లయింది. కొడుకుచదువు తెలుసుకోవాలనే కుతూహలంతో హిరణ్యకశిపుడు గురువునూ కొడుకునూ తోడ్చుకు రమ్మని సేవకుణ్ణి పంపాడు. గురువూ కొడుకూ, సభకు వచ్చారు. దైత్యరాజు కొడుకును లాలిస్తూ నాయనా! మనదారికి వచ్చావా? అసలు విషయం తెలుసుకున్నావా? గురువులు చెప్పినట్టు



నడుస్తున్నావా? శాస్త్రజ్ఞానం కోసం బాగా బుద్ధికి పని కల్పించాలి? నువ్వు చదువులో చాల నేర్పరివని మీ గురువులు మొన్న ప్రస్తావనయా పొగడగా నాకెంతో సంతోషం కలిగింది. అదేకదా ఏ తండ్రికైనా కావలసేది–అని అనగా విని ప్రహ్లాదుడు నిర్భయంగా ఏమన్నాడంటే–

రాజా! ఎందుకీ అర్థశాస్త్రాలూ, ధర్మశాస్త్రాలున్నూ. అసలు విషయం తెలుసుకున్నాను. అదేమిటో తెలుసునా? అశాశ్వతమూ, దుఃఖమయమూ అయిన ఈ భవబంధాన్ని తెగగొట్టుకుని, శాశ్వతమూ, ఆనందమయమున్నూ అయిన విష్ణుపదం పొందడానికి ఆవశ్యకమైన విద్య తెలుసుకున్నాను. అది చాలును. మోక్షేచ్ఛగలవారందరూ అది తెలుసుకోవాలి అని ప్రహ్లాదుడు అనగా విని హిరణ్యకశిపుడు దెబ్బతిన్న త్రాచులాగా రుంజుకున్నాడు. కోపంతో వణకుతూ పళ్లు పటపటకొరికి, కళ్లంట నిప్పులు గక్కుతూ సేవకుల్ని చూచాడు. గట్టిగా అరిచాడు. బలివెయ్యండి ఒరే! వీణ్ణి ఈడ్చుకువెళ్లి కరకుకత్తులతో వీడి అవయవాలు తెగనరికి కాకులకూ గ్రద్దలకూ వెయ్యండి! పొండి–అని అరవగా ఆ రాక్షసభటులు ఆ బాలభక్తుణ్ణి తీసుకుపోయి కరవాలాలతో ఖండించ బోయారు. ఆశ్చర్యం! ఆ బాలునిశరీరంమీద పడినఆయుధం నూగింజ ప్రమాణంగా ముక్కముక్కలై గాలిలో ఎగిరిపోయింది. దారుణ సంసారబాధను పోగొట్టే దివ్యాయుధం విష్ణుభక్తి నిండుగా హృదయంలో ఉన్న వ్యక్తిని కత్తులు, కటార్లు ఏమిచెయ్యగలవు? సేవకులు ఏడుపు మొగాలతో వచ్చి చెప్పారు? ప్రభూ! మా ఆయుధాలు పిల్లవాని శరీరం మీదపడి తుక్కుతుక్కుగా ఎగిరిపోయాయి. ఇక ఏమిచేయవలసింది?' అని సేవకులు చెప్పగా ఆ దుర్మార్గుడు ఒకక్షణం తల్లక్రిందులయాడు. ఇక వీణ్ణి చంపడానికి ఏమి ఉపాయం? అని ఆలోచించాడు.

ఆఁ–అదీ–ఒరే! విషసర్పాలతో బంధించి కరిపించండిరా! ఆ కాటుకు విషం తలకెక్కి చస్తాడు. మనకు ఈ పీడ విరగడ అవుతుంది. అని భటులను ఆజ్ఞాపించాడు. ఈ వాళ్లు బాలప్రహ్లాదుణ్ణి తీసుకుపోయి విషసర్పాలను తెచ్చి అతని మీదకు వదిలారు. కానీ ఆవంతైనా ప్రయోజనం లేకపోయింది. ఆ

పాములు ప్రహ్లాదుణ్ణి కరవడంవల్ల వాటికోరలు సమూలంగా విరిగి పడి పోయాయి. దానితో అవి చావూ కాక, బ్రతుకూకాక తలలు వంగి చచ్చినట్టు పడి ఉండగా భటులువచ్చి తమరాజుకు పాముల బ్రతుకు చెప్పారు. అది విని హిరణ్యకశిపుడు ఆశ్చర్యపడి మంత్రులతో ఆలోచించాడు.

'వీడు మనం వేసే శిక్షకు లక్ష్యం అయ్యేట్టు కన్పట్టలేదు. ఇక ఏమిటి కర్తవ్యం?' అని ఏమీ తోచక దిక్కులుచూస్తూ కూర్చున్నాడు. అంతలో గురువులు వచ్చి–ప్రభూ! బాలుడు ప్రహ్లాదుడు. తెలిసో తెలియకో అలా ప్రవర్తిస్తున్నాడు. వానిని గురించి కోపించడం, ఏవేవో శిక్షలు వేయడం అంత మంచిది కాదు. మేము మంచిగా వానికి బోధించి దారికి తీసుకువస్తాము. మా మాట మన్నించు! అని అన్నారు. అంతట హిరణ్యకశిపుడు కొడుకును చేరదీసుకుని బుజ్జగిస్తూ 'కుమారా! నువ్వు మన కులానికి వ్యతిరేకంగా నడవడం మంచిదికాదు. నిన్ను నా కొడుకుగా ఏమని శిక్షించగలను? చూడు. నా మాట విను. గురువులతో వెళ్లు. వారు చెప్పిన రీతిగా రాజనీతి, కులనీతి చక్కగా నేర్చుకుని రా బాబు! నా తరువాత సింహాసనం ఎక్కి పరిపాలన సాగించవలసేవాడవు. బాగా ఆలోచించుకో. వెళ్లు– అని గురువులకు అప్పగించాడు. ఆ నాటికి సభ చాలించాడు.

అక్కడ గురునింట ప్రహ్లాదుడు తోడిబాలురను చుట్టూ కూర్చుండ బెట్టుకుని తనపాట తాను యథాపూర్వంగా ఆరంభించాడు.

తనలో తాను ఏ మూలనో కూర్చుని కొంతసేపు మౌనధ్యానం, ఆ ధ్యానంలో చిరునవ్వు, అస్పష్టంగా పెదవులపై ఏవో అక్షరాలు.

తోడి దైత్యబాలురు ప్రహ్లాదుణ్ణి దరిజేరి అడిగారు. ప్రహ్లాదా! నువ్వు నీలో ఏదో అంటూ నవ్వుతూ, ఇటూ, అటూ వింతగా చూస్తూ ఉంటావు. అదేమిటో చెప్పవయ్యా!

ఏమిచెప్పేది? ఈ పుట్టువు తల్లిగర్భంలో ఏడుస్తూ పదిమాసాలు గడపడం, తరువాత ఈ నేలమీద పడడం, పెరగడం, ఆకలిదప్పులు, నిద్రాహారాలు, హితులు, అహితులూ, ధనం, తరుణి, తనయులు, ఏమిటీబంధం?



ఇదెలా తెగుతుంది ప్రభూ!– అని ఆ దేవదేవుణ్ణి మాధవుణ్ణి మనసులో వేడుకుంటూ ఉంటాను. సంసారం అంటే ఇదే. ఇది పేరుకే సంసారం. మతిని విరిచి, మాయకి లోబరచి, జీవిని ముప్పుతిప్పలూ పెట్టి, ఏడిపించి, ఎప్పుడో గొంతు నులుముతుంది. మళ్లీ యథాప్రకారం ఏతల్లి కడుపునందో నివాసం, భూపతనం–ఇది ఒక విషచక్రబంధం. మళ్లీ దీనిలో పడకుండా నీ పాదసన్నిధికి చేర్చుకో విశ్వవిభూ! అని ఆ దేవుణ్ణి గురించి మొరపెట్టుతున్నాను. మీరూ ఆపని చెయ్యండి. బుద్ధిమంతుడైన వాడు అరచేతిలో ఉన్న రాజ్యాన్ని ఉపేక్షించి బిచ్చం ఎత్తుకోడు. ఆకలిని తీర్చేదివ్యాన్నం ఎదుట ఉండగా దానిని వదలి తెలకపిండి తినే తెలివితక్కువ వ్యక్తివలె సంచరించకండి.

'కేశవా! మాధవా! పరాత్పరా! క్షమించు!
నీ పాదాలవద్దకు చేర్చుకో! నీవే గతి'

అనేది ఆ ఈశ్వరునికి వినిపించ వలసే దివ్యమంత్రం దీనిని మీరు నిశ్చలమైన మనస్సుతో జపిస్తూ ఉంటే ఆ స్వామికి, నేడు కాకపోతే రేపైనా మనస్సు కరుగుతుంది ఉద్ధరిస్తాడు. ఆపైన మీయిష్టం. నాకు తోచినది చెప్పాను. అని ప్రహ్లాదు డనగా ఆ దైత్యబాలురు విని, ఆశ్చర్యపడి సరేగాని ప్రహ్లాదా! మనకి మంచిచెడ్డలు బోధించే గురువు చండామర్కులుకదా! వారు ఒక్కనాడైనా ఇలాంటి పాఠం చెప్పలేదు. మరి నీకు ఈ పాఠం ఎవరు చెప్పారు? ఉన్నది ఉన్నట్టు చెప్పు–అని అన్నాడు. ఆ మాటకు జవాబుగా ప్రహ్లాదుడు ఇలా అన్నాడు.

"వినండయ్యా చెప్తాను. నేను మాతృగర్భంలో ఉన్నకాలం అది. మానాయన తపస్సుకి వెళ్లాడు. అప్పుడు ఇంద్రుడు వచ్చి కామ ప్రభావానికి లొంగి, వివేకశూన్యుడై మా తల్లిని తీసుకుని అమరావతికి వెళ్లిపోతున్నాడు. ఆ సమయంలో దేవముని నారదుడు దారిలో ఎదురుపడి ఓరీమూర్ఖా! పతివ్రతారత్నం ఈమె. గర్భవతి–నీ కామం తగలబడా! నాశనం కోరి బలాత్కరించి తీసుకు పోతున్నావా? వదులు అని ఇంద్రరథంనుంచి మా అమ్మను విడిపించి తన ఆశ్రమానికి తీసుకుపోయాడు. అక్కడ ఆమెకు మానసోల్లాసంగా ఈశ్వరపరమైనకథలు చెప్తూ శ్రీహరినామసంకీర్తనం చేస్తూ ఆత్మబోధ

చేస్తూండేవాడు. అలా కొంతకాలం అయాక మా నాయన తపస్సు ముగించుకుని స్వనగరానికి వచ్చాడని తెలిసి మా అమ్మను తోడుకొని వచ్చి అప్పగించాడు. నాకు ఆ విధంగా తల్లికడుపులో ఉన్నపుడే మాధవానుగ్రహంవల్ల, నారద మహాముని దివ్యోపదేశం మూలంగా ఈ హరిభక్తి కలిగింది. మంచిగానీ, చెడ్డగానీ బాల్యంలో పట్టుపడినది ఒకంతట వదలదు. అలాగే నాకు అలవడిన శ్రీహరినామస్మరణ ఇప్పుడు పొమ్మంటే పోతుందా?' ఇదీ నాకు మాధవ నామకీర్తనం వచ్చిన మార్గం. మీరు ఈ మార్గాన నడిచి తరించవలసిందని నా అభిప్రాయం అని అనగా ఆ బాలురు కూడా శ్రీహరినామసంకీర్తనం ఆరంభించారు. ఆ విధంగా గురువుగారి ఇల్లు శ్రీవిష్ణుదేవాలయం అయింది.

ఆ రాత్రి నగరంలో గస్తీ తిరిగే రక్షకభటులు గురువునింట తోడిబాలకులతో హరినామసంకీర్తనం చేస్తున్న ప్రహ్లాదుని చూచి గబగబా వచ్చి హిరణ్యకశిపుడికి చెప్పారు. అసలే నిద్రలేక కలతనిద్రలో శ్రీహరితో పోరాడుతున్న దైత్యరాజుకి ఈవార్త అగ్గిమీది గుగ్గిలం చల్లినట్లు అయింది. కోపంతో రెచ్చిపోయాడు. కొలువుకూటానికి వచ్చి, మంత్రులను రప్పించి ఇక ప్రహ్లాదుని రక్షించి లాభం లేదని పురరక్షకులు చెప్పినది చెప్పి ఆ కులద్రోహిని మట్టుపెట్టడానికి ఏమి ఉపాయం? అని గద్దిస్తూ అడిగాడు. వాళ్ళేమి చెప్తారు? ఒకరిమొగం ఒకరు చూచుకుని గ్రుక్కిళ్లు మింగుతూ కూర్చున్నారు.

సరే! నా నిర్ణయం కానీయండి. ఎవడురా అక్కడ! వెంటనే ఆ చండామర్కులఇంటికి వెళ్ళి కులద్రోహిని ప్రహ్లాదుణ్ణి ఈడ్చుకురండి! అని గావుకేకతో ఆజ్ఞాపించాడు. అక్కడవున్న భటులిద్దరు పరుగుపరుగున గురునింటికి వెళ్లి శ్రీహరిభజనలోఉన్న ప్రహ్లాదుణ్ణి అలాగే సందిటపట్టి ఎత్తుకువచ్చి హిరణ్యకశిపుని ముందుంచారు.

వీణ్ణి నాగపాశాలతో బంధించి సముద్రంమధ్య వదలిరండిరా అన్నాడు రాజు. ఆ భటులు మారు మాటాడక నాగపాశాలతో ఆ బాలుణ్ణి బంధించి ఎత్తుకుపోయి సముద్రంలోకి విసిరివేశారు. ఏమిలాభం? భక్తునిబాధ భగవంతుడు



అనుభవిస్తాడట! వెంటనే శ్రీహరి గరుడుణ్ణి పంపి నాగపాశ విముక్తి చేయించి గట్టుకి చేర్పించాడు. తరువాత సముద్రుడు అమూల్యమైన రత్నాలు రాశిగా ప్రహ్లాదుని ముందుంచి భక్తశిరోమణీ! ఈ చిన్ని కానుక తీసుకుని నన్ను ధన్యుణ్ణి చేయవయ్యా! అని కనిపించకుండానే అన్నాడు. ఆ మాట విని ప్రహ్లాదుడు మహానుభావా! సర్వదా విష్ణుదేవుని నీలో దాచుకుని తనివితీరా చూస్తూ సంతోషిస్తూ ఉంటావు. మరి ఆ పాటి అదృష్టవంతుడవు నాకు దర్శన మివ్వకూడదా? అని దీనంగా అన్నాడు. వెంటనే సముద్రుడు దివ్యపురుష రూపంతో దర్శనమిచ్చి 'కుమారా! నిన్ను ఆ మహావిష్ణువు కఠినంగా పరీక్షిస్తున్నాడు. నువ్వు నీ భక్తితో చలించకుండా ఆ పరీక్షలో నెగ్గుతున్నావు. ఆ మహాప్రభువు త్వరలో నీకు తృప్తిగా దర్శనమిచ్చి నిన్ను ధన్యుణ్ణి చేస్తాడు. విచారించకు వెళ్ళు!' అని అదృశ్యుడైనాడు.

ప్రహ్లాదుడు రెండే రెండు రత్నాలు తీసుకుని మిగిలినవి సముద్రునికే సమర్పించి శ్రీహరినామ సంకీర్తనం చేస్తూ తండ్రి దగ్గరకు వచ్చాడు. సిగపువ్వు వాడకుండా, చిరునవ్వు మోముతో శ్రీహరిని కీర్తిస్తూ వచ్చిన చిన్నిప్రహ్లాదుణ్ణి చూచి కొలువులో ఉన్న హిరణ్యకశిపుడితో సహ అందరూ ఆశ్చర్యభరితులైనారు. ఏవేవో గుసగుసలు పుట్టాయి. నిశ్శబ్దం!– అని గట్టిగా అరిచాడు హిరణ్యకశిపుడు. చీమ చిటుకుమంటే వినిపించేటంత నిశ్శబ్ద వాతావరణం ఏర్పడింది కొలువులో.

హిరణ్యకశిపుడు పట్టాకత్తి తీశాడు. ఎదురుగా నిల్చుని ఉన్న కొడుకును నిప్పులు గ్రుమ్మరించే చూపులు చూస్తూ ఓరీ! కులద్రోహీ! ఇదిగో ఇది చివరిమాట. నీహరి ఎక్కడున్నాడురా? నా ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పు.

ప్రహ్లాదుడు కాసింతైనా కంగారు పడలేదు. శ్రీహరి ఎక్కడ ఉన్నాడని వింతగా అడుగుతున్నావేమిటి నాయనా? ఎక్కడంటే అక్కడే ఉన్నాడు. అయితే అంత తేలికగా కన్పిస్తాడా? ఆత్మదృష్టితో వెదకి చూస్తే కన్పిస్తాడు.

ఈ స్తంభంలో ఉన్నాడా? అని ఎదురుగా ఉన్న స్తంభాన్ని కత్తికొనతో తాకి అడిగాడు హిరణ్యకశిపుడు.

చెప్తాను ఇప్పుడే, స్తంభంలో ఉన్నాడు. నీలో ఉన్నాడు. నాలో ఉన్నాడు. శ్రీహరి లేనిచోటే లేదు.

'దీనిని ఇప్పుడే తెగనేస్తున్నాను. దీనిలో నువ్వు చెప్పిన హరి లేడా? ఈ కత్తికి నీకంఠం బలి. ఏమంటావు?

'ఎందుకా నిరర్థకప్రసంగం నాయనా? శ్రీహరిని సర్వాంతర్యామిగా తెలుసుకోలేక పరీక్షచెయ్యడానికి సిద్ధపడడం అనుచితం.

కొడుకుజవాబు ఆ తండ్రికి వెగటుగా తోచింది. తటాల్న గద్దెమీంచి లేచి చరాల్న కరాళకరవాలంతో స్తంభాన్ని తెగనరికాడు. అంతే. శతకోటి మెరుపులు ఒక్కమాటు మెరిసినట్టయింది. వేలకొద్ది అగ్గిపిడుగులు పెఠిల్లు పెఠిల్లున ప్రేలుతూ త్రుళ్లి పడుతూన్న కర్ణకఠోరధ్వని. ఎక్కడి వారక్కడే కొయ్యబారి కూలబడ్డారు.

సగానికి విరిగిన స్తంభంలోనుంచి ఒక వింత ఆకారం మూరెడు నాలుక క్రిందుమీదుగా ఆడిస్తూ మోమున గ్రమ్మిన సువర్ణప్రభాభాసమానములైన సటలతో, నిప్పుకణాలు ఎగజిమ్మే చూపులతో, అరుణపద్మాల మెరుగులకు మెరుగులుదిద్దే కన్నులతో, విశాలవక్షంతో, గంభీర ప్రళయగర్జానుకారి అయిన కంఠధ్వనితో, సుదీర్ఘాలయిన కండలుతిరిగిన బాహువులతో, వజ్రసన్నిభములైన నిడుదగోళ్లతో, బంగరురంగులు తురంగలించు నడుంకట్టు పట్టుబట్టతో, నవ రత్నాలకాంతులను దొంతర దొంతరగా వంతులువేసి వెదజల్లే కర కంకణాలతో– ఆ మూర్తి నరసింహమూర్తి. ఒక్క ప్రహ్లాదుడు మాత్రమే గ్రహించగలిగాడు ఆ మూర్తి తన ఇష్టదైవమైన శ్రీహరి ధరించిన విశిష్టావతారమని.

సాయంసంధ్యాసమయం. చప్పున ఆ దివ్యమూర్తి హిరణ్యకశిపుణ్ణి నిడుపాటి బాహువులతో ఒడిసిపట్టి సభాద్వారంవద్దకు లాక్కునివచ్చి ఆ గుమ్మం మీద కూర్చున్నాడు. ఒక్క హుంకారంతో హిరణ్యకశిపుడికళ్లు మూసుకు పోయాయి. బల్లిలాగా వ్రేలాడుతూన్న ఆ దైత్యుణ్ణి నరసింహదేవుడు తనతొడలపై అడ్డంగా పడుకోబెట్టి గోళ్లతో గుండెలుచీల్చి ఆ నెత్తురు సభలో కలయచిమ్మాడు.



పేగులుతీసి జందెంగా వేసుకున్నాడు. చచ్చినకుక్కను ఈడ్చి పారవేసినట్టు విసురుగా ఒకమూలకి ఆ కళేబరాన్ని విసిరివేశాడు. అయి పోయింది. నేనే సర్వాధికారిని. సర్వేశ్వరుణ్ణి అని దురుక్తులతో ధూర్తుడై కన్నుమిన్ను గానక కన్నకొడుకుని గాయపరచడానికి పూనుకున్న కఠినచిత్తుని బ్రతుకు కనుఱెప్పపాటు కాలంలో భరతవాక్యం పాడింది. నరసింహస్వామి కఠోర కంఠధ్వనికి గుండెలవిసి రాక్షసులు ఎక్కడివారక్కడే ప్రాణాలు వదిలారు.

తరువాత బ్రహ్మేంద్రాదులు వచ్చి స్వామిని బహుధా స్తుతించి ప్రసన్నుణ్ణి చేశారు. అప్పుడు నరసింహస్వామి బ్రహ్మచే ప్రహ్లాదుణ్ణి రాక్షసరాజ్యానికి అధిపతిగా అభిషేకం చేయించి ఇంద్రాదులకు వారివారి పదవులు ఇచ్చి ప్రహ్లాదుణ్ణి సుఖజీవిగా చిరంజీవిగ ఆదరించి వరమిచ్చి భక్తానుగ్రహం పరమ లక్ష్యంగా శ్రీశైలశిఖరం చేరి అక్కడ విశ్రాంతిగా ఉన్నాడు.

ఈ నరసింహావతార కథను వ్రాసినా చదివినా విన్నా సర్వపాపాలు, కష్టాలు పోతాయి. దుశ్శీలుడుకూడా మంచినడత కలవాడై సుఖంగా జీవిస్తాడు. శ్రీ నరసింహస్వామిభక్తులకు శత్రుభయం ఉండదు

అని చెప్పి మార్కండేయుడు వామనావతార కథను ఇలాగా చెప్పాడు.

**వామనావతార కథ**

రాజా! లోకక్షేమం, ధర్మస్థాపన పరమలక్ష్యంగా పరమేశ్వరుడు వింతవింతలైన లీలలు చూపుతూ ఉంటాడు. ఆయన అవతారాలన్నీ అలాటివే. ఇప్పుడు చెప్పబోయే వామనావతారంకూడా అలాటిదే విను.

విరోచనుడు అనే రక్కసుని కొడుకు బలి. పేరుకి తగిన భుజబలం, అర్థబలం, అంగబలం ఉన్నవాడు. అయితే మిగతా రాక్షసుల్లాగా అయిన దానికి కానిదానికీ తగవులూ, తంటాలూ పెట్టి అందర్నీ బాధించే స్వభావం కలవాడు కాడు. అంతే కాదు. ఎదుట నిల్చి దేహి! అన్న యాచకునికి లేదనక తుష్టిగా ఇచ్చే నెరదాత అని పేరు తెచ్చుకున్నాడు. అయితే దేవతలతో పడకపోవడం, వాళ్లతో పోరాడడం వాళ్ల దేశాలు వశపరచుకోవడం దైత్యులకు ఒక ఆనవాయితీ.

అలాగే బలికూడా స్వర్గ మర్త్య పాతాళాలు తన బలానికి, చలానికీ పారితోషికాలుగా వశపరచుకొని ముల్లోకాలలో ఎదురులేని శాసనకర్త అయ్యాడు. ఇక ఇంద్రాదుల అవస్థ మామూలే.

దితి చెల్లెలు. అదితి అక్క. ఇరువురకూ భర్త ఒక్కడే కశ్యపుడు. ఆయన కొడుకుల తగవులలో ఎన్నడూ తలదూర్చలేదు. అలాగే బలిచక్రవర్తివల్ల ఇంద్రాదులు దిక్కుమాలిన పక్షులై కొండల్లో కోనల్లో ఆకులలములు తింటూ బ్రతుకుతున్నారన్న విషపువార్త చెవిని పడినా కాలం కర్మ కలసివస్తే వాళ్ళే బాగుంటారని కిమ్మనకుండా ఊరకున్నాడు. కన్నతల్లి ఆడమనస్సు అదితి నిబ్బరించలేక పోయింది. ఒకనాడు భర్తవద్ద కొడుకుల కోడళ్ళ దురవస్థ చెప్పి కంటతడి పెట్టింది. కశ్యపుడు విన్నాడు. గుండె కరిగింది. మాటాడక మనస్సులో శ్రీహరిని ధ్యానించి అదితికి శ్రీనారాయణాష్టాక్షర మంత్రం ఉపదేశించాడు. రేపటినుంచి ఒక ఏడాదిపాటు నిర్విఘ్నంగా నిశ్చలమనస్సుతో నిత్యమూ, సహస్రానికి తక్కువకాకుండా ఈ మంత్రం ఉభయసంధ్యల్లో జపించు. ఈ సంవత్సరం అంతా ఏకభుక్తం అంటే పగలు ఉపవాసం రాత్రిమాత్రం సాత్త్వికాహారం. ఈ నియమం పాటిస్తూ ఆ మంత్రాన్ని జపిస్తూఉండు. సంవత్సరాంతమందు శ్రీహరిప్రీతిగా మంత్రజపం ధారాదత్తం చెయ్యి. సర్వేశ్వరుడు నిన్ను అనుగ్రహిస్తాడు అని తన అనుష్ఠానానికి తాను వెళ్ళి పోయాడు. అదితి ఆవిధంగానే నియమపాలనతో మంత్ర జపం పూర్తి చేసింది. శ్రీహరి దివ్యమంగళమూర్తి అయి దర్శన మిచ్చాడు. అదితి ఆగమార్థ గర్భితంగా అరవిందాక్షుణ్ణి స్తుతించింది. ఆ స్తుతికి శ్రీహరి సంతోషించి అమ్మా! నేను నీ కుమారుడనై జన్మిస్తాను. తరువాత ఏమి చేస్తానో నీకే తెలుస్తుంది అని మాట ఇచ్చి అదృశ్యుడైనాడు.

అదితి కాలక్రమాన గర్భవతియై కశ్యప తపశ్శక్తిఫలంగా కొడుకును కన్నది. అయితే ఆ బుడుతడు అతిలఘుమూర్తి, మరుగుజ్జు, మృదువుగా చెప్పాలంటే వామనుడు. వామనుడు పుట్టగానే బ్రహ్మవచ్చి స్వయంగా జాతకర్మాదికం నిర్వర్తించాడు. వామనుడు అనే నామ కారణంచేసి తన లోకానికి వెళ్ళిపోయాడు.



గర్భాష్టమం కాగానే కశ్యపుడు వామనుడికి ఉపనయనం చేశాడు వామనుడు సంప్రదాయానుసారంగా వారిని వీరిని యాచించి ఆ భిక్షాపాత్రను అలాగే చేత ఉంచుకుని తల్లితో చెప్పి బయల్దేరాడు. ఎవరో దారంట పోతున్నవారు చెప్పారు. 'బలిచక్రవర్తి యజ్ఞం చేస్తున్నాడు. ఆ యజ్ఞంలో కోరినవారికి సమృద్ధిగా ఇస్తున్నాడు ఇస్తాడు' అని. సరే అక్కడికే వెళ్ళాలయితే అని చిరునవ్వుతో దారినపడ్డాడు. అడుగుతీసి అడుగువేస్తూ ఉంటే భూమి అదర నారంభించింది. అలా వెళ్లి వెళ్లి బలి చేస్తున్న యజ్ఞశాల చేరాడు.

ఏదో ధూళి ఎగజిమ్ముతూ వేడిగాలులు వీచనారంభించాయి. యజ్ఞశాలలో అగ్నులు మండలేదు. హోతలు పలికే మంత్రాలు అపస్వరాలతో వస్తున్నాయి. పేరుపొందిన అసురులు హవిస్సు తీసుకోకుండా ఒకరినొకరు బెదురుతూ చూస్తూ కూర్చున్నారు.

ఏమిటీ విపరీతం అని బలి, కులగురువు శుక్రుణ్ణి అడిగాడు. శుక్రుడు ఆత్మదృష్టితో గ్రహించి ఉన్నది ఉన్నట్టు చెప్పాడు.

రాజా! దేవతలు నీ వల్ల పదవీచ్యుతులైనారు. వారికి తిరిగీ ఆయా స్థానాలివ్వాలనే సంకల్పంతో శ్రీహరి అదితి కొడుకై వామనాకృతితో పుట్టాడు. ఆ మహానుభావుడు ఇప్పుడు నువ్వు చేస్తూన్న యజ్ఞానికి వచ్చాడు. అతని మహిమవల్ల ఈ విపరీత పరిస్థితి ఏర్పడింది. సురులకు మంచికాలం వచ్చినట్టుంది అని గురువు చెప్పగా విని బలి, అయితే ఇప్పుడు కర్తవ్యం ఏమిటని అడిగాడు? ఏముంది! దేవతల మేలు దైత్యులకీడు కర్తవ్యాలుగా హరి ఈ వేషంతో వస్తున్నాడు. దానిని అనుసరించి నువ్వు నడిస్తే మంచిది. ఏమిటంటావా? నిన్ను ఈ యజ్ఞం పేరుతో యాచించడానికి వస్తూన్న వామనునికి ఇది ఇస్తాను అది ఇస్తాను అని మాట ఇవ్వకు. అంతే. దానితో ఆటకట్టు. దీనికి వ్యతిరేకంగా నడిచావా నీ ఆట కట్టు అని శుక్రుడు హెచ్చరికగా చెప్పాడు. ఆ మాటకి బలి ఊకొట్టలేదు. గురుదేవా! సామాన్యుడైన వ్యక్తికే ఏదికోరినా లేదనక ఇచ్చే దాతగా పేరుపొందిన నేను, యజ్ఞంలో సంభావనగా మహావిష్ణు వంతవాడు వచ్చి దేహి అంటే నహి అని అనగలనా? అలా ఎన్నడూ జరుగదు. ఏమడిగితే అది ఇస్తాను. ఏమయినా సరే అవుగాక అని నిక్కచ్చిగా అన్నాడు బలి.

అంతలో వామనుడు యజ్ఞశాలలో ప్రవేశించాడు. బలినీ యజ్ఞాన్నీ బహుధా ప్రశంసించాడు. ఆ ప్రశంసకి బలిమెచ్చి ఏమి నీ కోరిక వడుగా? అని లాలనగా అన్నాడు. 'ఏమున్నది? అగ్నిహోత్రసంరక్షణకోసం మూడడుగుల నేల ఇస్తే చాలు. బ్రహ్మాండం ఇచ్చినంతగా సంతోషిస్తానని వామనుడు చమత్కారంగా అన్నాడు. నీకు దానితోనే సంతృప్తి కలుగుతుందంటే' ఇచ్చానన్నాడు బలి. ఓ! నిరాక్షేపంగా సంతృప్తి పొందుతాను. ధారాదత్తం చెయ్యవయ్యా అని ఉత్సాహంగా అన్నాడు వామనుడు. సరే–అని బలి జారీ అందుకుని ధార వామనుడి చేతిలో విడువబోయాడు. శిష్యునిపై ఉన్న వాత్సల్యంతో శుక్రుడు సూక్ష్మరూపంతో, జారీ కొమ్ములో ప్రవేశించి, నీటిధార పడకుండా చేశాడు. వామనుడు గ్రహించాడు. ప్రక్కనున్న దర్భతీసుకుని దాని కొసతో జారీ కొమ్ములో పొడిచాడు. ఆ పోటుకి శుక్రుడు దృష్టిదోషం వచ్చి ఆ బాధభరించలేక ఏకాక్షుడై బయటికి వచ్చాడు. ఇదే చావు తప్పి కన్ను లొట్టబోయిందన్న సామెత అయింది. ఇంకేముంది? జలధార వామనుని అరచేతిలో పడ్డది. బ్రహ్మప్రీతిగా త్రిపాద ధరణిని ఇస్తున్నాను గ్రహించు అని అన్నాడు బలి. గ్రహించానన్నాడు వామనుడు.

బలివిడిచిన నీరు చేతిలో పడినంతనే వామనుడు అంతఎత్తుగా పెరిగిపోయాడు. ఒకపాదంతో భూమిని, ఒకపాదంతో అంతరిక్షాన్ని, వేరొక పాదంతో స్వర్లోకాన్నీ ఆక్రమించుకున్నాడు. బలినిచూచి ఆదరంగా అన్నాడు అభయమూ, వరమూ ఇస్తూ.

బలిచక్రవర్తీ! నువ్వు ఎంతో సంతోషంగా నాకు మూడడుగుల నేల ఇచ్చినందుకు నీ దాతృత్వానికి సంతోషిస్తూ నేను నీకు నిర్భయమూ, భోగభాగ్యసమన్వితమూ అయిన పాతాళలోకం ఇస్తున్నాను. నీవారితో అక్కడకు పోయి భోగభాగ్యాలు అనుభవిస్తూ నిశ్చింతగా ఉండు. ఈ వైవస్వతమన్వంతరం కాగానే నీవు ఇంద్రుడ వౌతావు–అని వామనుడనగా మహాప్రసాదం! అని బలి తనవారితో త్రివిక్రమునకు నమస్కరించి పాతాళానికి వెళ్లిపోయాడు.

వామనుడు ఇంద్రుణ్ణి ముజ్జగాల దొరగా అమరావతిలో పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. ఎవరూ ఏలాటి అపాయమూ పొందకుండా తమతమ స్థానాల్లో హాయిగా ఉన్నారు.



ఈ వామనావతారకథ సూర్యోదయకాలమందు చదువుతూ వామనుణ్ణి స్తుతించేవారు సర్వపాపవిముక్తులౌతారు. జన్మాంతమందు విష్ణులోకానికి వెళ్ళుతారు.

విష్ణువు వామనుడై అవతరించి బలినుంచి ముల్లోకాలూ తీసుకుని ఇంద్రునకిచ్చి సురలకూ అసురులకూ కూడా మేలుచేసిన కథ ఇది–

ఇక శ్రీహరి భృగునందనుడై భార్గవరాముడుగా ప్రసిద్ధుడై క్షత్రజాతిని ఉత్సాదించిన కథ చెప్తాను విను– అని మార్కండేయుడు పరశురామావతార కథను ఇలా చెప్పాడు.

**పరశురామావతార కథ**

తమభోగమే ప్రధానంగా, ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించే రాచవారి ఔద్ధత్యాన్ని భరించలేక మునులూ, జనులూ పాలసముద్రంలో శేషశయ్యపై నున్న శ్రీమన్నారాయణుణ్ణి ప్రార్థించారు. వారి ప్రార్థన విని కనికరించి విష్ణువు 'త్వరలో ఆ దుష్టజాతి ఆట కట్టిస్తాను. నిశ్చింతగా వెళ్ళండి' అని అభయ మిచ్చాడు. అలాగే జమదగ్నిమునికి కొడుకై పుట్టాడు.

కృతవీర్యుడు అనేరాజు కొడుకు కార్తవీర్యుడు. సహజంగా అస్త్రశస్త్రవిద్యాసంపన్నుడు. బలసంపన్నుడు. దత్తాత్రేయుణ్ణి ఆరాధించి ఆయన అనుగ్రహం పొంది చక్రవర్తి అయాడు. తిరుగులేని తీర్పుతో ఏలుబడి చెల్లించుకుంటున్నాడు. అలా ఉండగా....

ఒకనాడు వేటకని సమృద్ధిగా సైన్యాన్ని వెంట ఉంచుకుని అడవికి వెళ్లి జమదగ్ని మహాముని నివసిస్తూన్న ఆశ్రమప్రాంతానికి వెళ్లాడు. చతురంగబలాలతో రాజు వచ్చాడని తెలియగానే జమదగ్ని ఎదురువెళ్లి స్వాగతం పలికి రాజా! మాకు అతిథివి. నిస్సందేహంగా సైన్యంతో ఇక్కడ ఉండవచ్చు. ఆశ్రమపద్ధతి ననుసరించి మేము కల్పించే ఆహారపదార్థాలు ఆరగించి వెళ్లవచ్చు–అని అనగానే సరే నన్నాడు రాజు.

జమదగ్ని తన హోమధేనువును చూచి రాజుకి చతురంగబలాలకు వారివారి యోగ్యతనుబట్టి నివాసాలు ఏర్పరచు. అలాగే స్నానపానాలకూ భోజన

భాజనాలకు తగిన సదుపాయాలు చూడు–అని అన్నాడు. ఆ గోవు సంకల్ప మాత్రాన వారివారికి తగినట్టు అన్ని సౌకర్యాలూ కలిగించింది. ఆ ఏర్పాట్లుచూచి అంత చక్రవర్తి కార్తవీర్యుడు దిగ్భ్రాంతుడయాడు.

స్నానాలగదులు, ఏనుగుల శాలలు, గుర్రాలగదులూ, సైనికులస్థావరాలు తానుకూడా అంతసొంపుగా నగరంలో ఏర్పరచ లేదని అనుకున్నాడు.

స్నానానికి మధురపరిమళవాసితాలైన జలాలూ, స్నానం చేయించే అందగత్తెలు, ఆటపాటలు, వివిధమంగళవాద్యాలూ, స్నానం కాగానే చక్రవర్తికి తగిన అమూల్యవస్త్రాలు ఇచ్చాడు జమదగ్ని. ఆ వస్త్రాలుధరించి సంధ్యోపాసన, విష్ణుపూజ–షడ్రసోపేతమైన విందుభోజనం–అలాగే పరిజనం, స్నానం వగైరా ముగించేప్పటికే ప్రొద్దుపోయింది.

ఆ రాత్రి వివిధసంగీతక విధానంతో కొంతకాలం గడపి మహారాజో చితమైన మంచంపై మైమరచి నిద్రించాడు మహారాజు.

తెల్లవారింది. కార్తవీర్యునకు ఆ వైభవంచూచి మతిపోయినట్లని పించింది. తన పురోహితుణ్ణి చూచి ఇదంతా మునితపశ్శక్తి అని అంటావా? అని అడిగాడు. అయి ఉండవచ్చు. ఆ ఆవు కూడా అంతశక్తికలదే అని నా అభిప్రాయం. అలా అని దాన్ని ఎత్తుకుపోవడానికి మాత్రం ప్రయత్నించరాదు. అలా ప్రయత్నించేవాడు ఆపదలపాలవుతాడు 'అని పురోహితుడన్న మాటవిని ప్రక్కనున్న మంత్రి నవ్వి 'మహారాజా! స్వపక్షపాతం అంటే ఇదే! బ్రాహ్మణుడు కనుక బ్రాహ్మణపక్షపాతంతో మాటాడుతూ భయపెడుతున్నాడు. నాకు ముదల ఇస్తే నేను వెళ్లి ఆ ఆవు సమాచారం తేల్చివస్తానని బిరుసుగా అన్నాడు. కానీ! అన్నాడు కార్తవీర్యుడు.

మంత్రి మునివద్దకు వెళ్లి మునీశ్వరా! ఈ ఆవు మంచివస్తువు. ఇలాటివి మహారాజులవద్ద ఉండవలసినవి. కాబట్టి మర్యాదగా దీనిని నా ద్వారా మారాజు గారికి అప్పగించు; కాదంటావా? మాపని మేము చేసుకుపోవలసి వస్తుంది



అని నయానా భయానా చెప్పాడు. నా జీవితమే అది. దానిని ఇవ్వలేనని జమదగ్ని నిర్ణయానికి వచ్చి జవాబు చెప్పాడు.

అలాగా! చూడు మా వాడి– అని మంత్రి గోవును బలవంతంగా తీసుకు పోవడానికి ముందుకు వచ్చాడు. జమదగ్ని, అతని భార్యా అడ్డుపడ్డారు ఆవుకి. ఇక ఉపేక్షించ కూడదని తెగించి మంత్రి జమదగ్నిని కత్తితో తెగవేసి ఆవును లాక్కునిపోయాడు. అది అంత తేలికగా చిక్కుతుందా? రివ్వున గాలిలోకి ఎగిరిపోయింది.

దారుణంగా మంత్రి చేతిలో భర్త చనిపోగానే ఆ కళేబరంపై పడి భార్య ఇరవై ఒక్కమారు కడుపు బాదుకుంటూ ఏడ్చింది.

అంతలో పళ్లూ, సమిధలూ, పుష్పాలూ తేవడానికి అడవికి వెళ్ళిన రాముడు పరశుధారియై వచ్చి జరిగినది విని తల్లిని ఓదార్చుతూ–

అమ్మా! శాంతించు ఆ రాజునీ ఆ దుష్టమంత్రినీ ఇప్పుడే వెళ్ళి అంతమొందిస్తాను. అంతేకాదు. నువ్వు ఇరవై ఒక్కమారు కడుపు చరిచి ఏడ్చావు. దానికి తగినట్టు ఇరవై ఒక్కమారు క్షత్రియులను వెదకి వెదకి వధించి వస్తాను. ఊరడిల్లు–అని ఓదార్చి ప్రతిజ్ఞచేసి పరశుధారి అయి ముందు మాహిష్మతీ నగరానికి వెళ్ళి కార్తవీర్యుణ్ణి యుద్ధానికి పిలిచాడు. కార్తవీర్యుడు ఇరవై ఒక్క అక్షోహిణి సైన్యంతో రాముని మీదికి యుద్ధానికి వచ్చాడు.

పోరు ఘోరంగా ఇరవై ఒక్కదినం సాగింది. ఆ యుద్ధంలో క్రమ క్రమంగా అవతారపురుషుడైన పరశురాముని పరాక్రమం పైచేయి అయింది.

కార్తవీర్యుని సైన్యమూ, తోడువచ్చిన రాజులూ, మంత్రులూ, దిక్కుమాలిన చావు చచ్చారు. తరువాత కార్తవీర్యుణ్ణి పరశురాముడు ముందు వెయ్యి చేతులూ కారాకుల్ని ఎగర గొట్టినట్టు తెగనరికి తరువాత తలపడగొట్టాడు.

కారణజన్ముడైన భార్గవరాముని చేతిలో హతుడైన కార్తవీర్యుడు దివ్యప్రభా భాసమానుడై దివ్యమాల్యాంబరధరుడై, దివ్యవిమానారూఢుడై, దివ్య సంస్తుతులతో వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

తరువాత పరశురాముడు తల్లికి ఇచ్చినమాట ప్రకారం ఇరవై ఒక్కమారు భూమిని పరిభ్రమించి క్షత్రియవధ చేశాడు. భూమినంతనూ కశ్యపుడనే బ్రాహ్మణునకు దానం ఇచ్చివేశాడు. దుష్టక్షత్రియవధ చేసి భూభారం తీర్చి రాజవంశానికి సింహస్వప్నమై పరశురాముడు మహేంద్రగిరిని స్వాశ్రయంగ చేసుకున్నాడు. ఇప్పుడూ ఉన్నాడు.

ఈ విధంగా దుష్టశిక్షణకై భృగువంశాన అవతరించి పరశురాముడుగా ప్రసిద్ధుడైన భగవానునికథ చదివినవారికి పాపవిముక్తి అవుతుంది. శ్రీహరి అనుగ్రహం కలుగుతుంది.

తరువాతిది సురనర సంస్తవ్యమానమైన శ్రీరామావతారకథ సర్వ పాపహరం, శుభప్రదమున్నూ. విను చెప్తున్నాను-అని మార్కండేయుడు చెప్పిన-

## శ్రీ రామావతార కథ

దేవకంటకుడు, లోకవిద్రావణుడు అయిన రావణుణ్ణి రామావతారుడై సూర్యవంశాన పుట్టి బంధుమిత్ర మంత్రిపుత్ర సైన్యసమేతంగా సంహరించి భూభారం తీర్చిన సర్వలోకశరణ్యుని కథ. బహురమ్యమైనది. శ్రీమహావిష్ణువు అవనిలో అవతరించిన అవతారాలలో ఆదర్శమైన అవతారం రామావతారం.

బ్రహ్మమానసపుత్రుడు పులస్త్యుడు. అతనికొడుకు విశ్రవసుడు. అతని సుతుడు దుర్మతులలో అగ్రేసరుడు రావణుడు. అసలే రాక్షసస్వభావం. దానికి తోడు అసాధారణమైన తపస్సు చేసి బ్రహ్మవల్ల నానావరాలూ పొంది ఆ వరబలంతో మరింత బిర్రబిగిసిపోయి ఇంద్రాది దేవతలను గడ్డిపోచల్లాగా ఎగరగొట్టి యక్షదానవాదులను నిర్జించి ఏ జాతి నారి అయినా సుందరంగా కన్పిస్తే సిగ్గూఎగ్గూ లేకుండా ఎత్తుకుపోతూ మొత్తంమీద లోకరావణు డయాడు.

తనకు అన్న కుబేరుడు. లంకాధిపతి. అతనివిమానం పుష్పకం. చాలా మహిమ కలది. రావణుడు ఒకనాడు ఆకస్మికంగా లంకమీదికి వెళ్లి అన్నని అల్లలాడించి అక్కణ్ణించి వెడలగొట్టాడు. లంకనూ, పుష్పకాన్నీ స్వాధీనం చేసుకుని



లంకాధిపతి అయాడు. వాడికి ఓడినవారు, అనుసరించిన వారున్నూ, సంతతిగా చెప్పదగిన వారున్నూ రక్కసులు లెక్కకి మిక్కిలిగ ఉన్నారు. వారంతా లంకకి చేరి రావణుని అనుచరులై లంకావాసులయారు, ఎక్కడవిన్నా రావణుడి పేరే. అలా వెళుతుంది కాలం.

శంకరుడు ఇంద్రాదులు బ్రహ్మవద్దకు వెళ్లి మా గతియింతేనా? అని ఏడిచారు. పదండి. శంకరుడు ముందుంటాడు. పాలకడలిలో యోగనిద్రలో విశ్రాంతి తీసుకుంటున్న జగన్నాథుణ్ణీ, శ్రీనాథుణ్ణీ ప్రార్థించి ఆ దేవునిదయకు పాత్రులమయామా కష్టాలు గట్టెక్కుతాయి అని బ్రహ్మ శంకరాదులతో క్షీరావా రాశి తీరానికి చేరి విష్ణువును ప్రార్థించాడు.

క్షీరాబ్ధివాసా! నాగతల్పా! పాదాశ్రితశుభప్రదా! యోగనిద్రాముద్రితా! యోగాంతర్భూతా! తార్కాసనా! గోవిందా! శ్రీహరీ! పద్మనాభా! శుభాంగా! సునేత్రా! మాధవా నమోనమః అని బ్రహ్మ స్తుతించగా శ్రీహరి ప్రత్యక్షమై ఏమిటి విశేషాలు? శంకరుడితోసహ వచ్చారంతా! అని తెలియనట్టు అడిగాడు.

బ్రహ్మ తలవంచి రావణుడి దుష్టత్వం, వరబలం వివరించి చెప్పివాణ్ణి హతమార్చి లోకాలకు క్షేమం చేకూర్చవలసిందిగా వేడుకునేందుకు వచ్చాం ప్రభూ! అని విన్నవించాడు.

మంచిది. సూర్యవంశంలో శ్రీమంతుడుగా, గుణవంతుడుగా, బలవంతుడుగా సుప్రసిద్ధుడైన మహారాజు దశరథుడు. అతని సుతుడనై నేను జన్మిస్తాను. మీరు మీ మీ అంశలతో వానరులను సృష్టించండి. ఆ విధంగా నరవానర బలపరాక్రమాలతో రావణాదుల్ని సంహరించడం, భూభారం తీర్చడం అవుతుంది. వెళ్ళండి- అని విష్ణువు అంతర్హితుడైనాడు. కృతార్థుల మయ్యాం అని నిండు గుండెలతో దేవతలు వెనుదిరిగి మేరుపర్వత ప్రాంతానికి వెళ్లారు. తమ తమ అంశలతో వానరవీరులను పుట్టించారు.

దశరథుడు పుత్రసంతతికై వేదపారగులైన బ్రాహ్మణుల సూచనపై పుత్రకామేష్టి అనే వైదికక్రతువు చేశాడు. ఆ హోమం పూర్తికాగానే దివ్య

పురుషుడు, దివ్యమైన పాయసంకల పాత్రతో వచ్చి కులగురువున కందించి దశరథుని భార్యల కివ్వవలసిందిగా చెప్పి అంతర్ధానం పొందాడు.

వసిష్ఠుడు ఆ పాయసం యథోచితంగా దశరథుని భార్యలయిన కౌసల్య కైకేయి సుమిత్రలకు ఇచ్చాడు. వారా దివ్యపదార్థాన్ని ఆరగించి తన్మహిమతో గర్భవతులైనారు. కాలానుసారంగా కొడుకుల్ని, దివ్యతేజోవిరాజమానుల్ని కన్నారు. కులగురువు వసిష్ఠుడు వారికి జాత కర్మాదికం నిర్వర్తించి కౌసల్య కొడుకునకు రాముడు, కైకేయి సుతునకు భరతుడు, సుమిత్రానందనులకు లక్ష్మణ శత్రుఘ్నులు అని పేళ్లు పెట్టాడు. కొడుకుల్ని చూచి దశరథుడు పొందిన ఆనందానికి అంతు లేదు.

కాలక్రమాన నలుగురూ ఉపవీతులై వసిష్ఠుని వద్ద వేదశాస్త్రాలు నేర్చుకున్నారు. అలాగే ధనుర్వేదంలో కూడా విద్వాంసులైనారు.

నలుగురిలో రామలక్ష్మణులు ఒకజంట. భరతశత్రుఘ్నులు ఒక జత. మేని రంగుమాత్రం వేరు.

రాముడు నీలమేఘశ్యాముడు, లక్ష్మణుడు జాళువాపసిడివన్నెవాడు. భరతుడు రాముని పోలిక. శత్రుఘ్నుడు పచ్చని పసుపు రంగు.

అలా ఉండగా విశ్వామిత్రమహాముని విష్ణుప్రీతిగా ఒక యజ్ఞం చేస్తూండగా రాక్షసులు చెలరేగి ఆ యజ్ఞం సక్రమంగా సాగనీక అలజడి కలిగించగా ముని ఆలోచించి అయోధ్యకు వచ్చాడు. దశరథునితో చెప్పి రామ లక్ష్మణులను యాగసంరక్షణకై పంపవలసిందిగా కోరడానికి.

విశ్వామిత్రునిరాక తెలిసి దశరథుడు కులపురోహితునితోసహా ఎదురేగి, అర్ఘపాద్యాదులతో సత్కరించి కొలువుకు తోడ్తెచ్చి సముచితాసనంపై కూర్చుండ బెట్టి 'ఏమి సెలవు మునీంద్రా!' అని చేతులు మొగిచి సవినయంగా అడిగాడు.

'ఏమీ లేదు నేనొక యజ్ఞం ఆరంభించగా రక్కసులు ఆటంకం కల్గిస్తున్నారు. తద్రక్షణకై నీ కొడుకులను రామలక్ష్మణులను కోరడానికి వచ్చాను.'

అని విశ్వామిత్రు డనగా దశరథుడు దిగులుతో అన్నాడు: మునీంద్రా! కళ్ళు సరిగా తెరవని పిన్నవాండ్రు. మాయావులైన రాక్షసులతో తలపడగలరా?



నేను తగిన సైన్యంతో వచ్చి నీయజ్ఞం నిరాటంకంగా పూర్తి చేయిస్తాను అని అన్నాడు. ఆ మాట విశ్వామిత్రునకు రుచించలేదు.

రాజా! ఆ రాక్షసులను రాముడే జయించ గలడు. నీవు జయించలేవు. సందేహించక ఆ అన్నదమ్ములను నాతో పంపు-అని అన్నాడు.

దశరథునికి మరింత బెంగ-అలాగే అన్నాడు. మళ్లీ! కుసుమ సుకుమారుడు, నిండా పదారేళ్లైనా లేని నా చిన్నారి కమలనయనుడు రాముడు ఆ రక్కసుల నేమి ఎదిరిస్తాడు? అది అలా ఉండనీ! దీనిలో రహస్యం ఏమంటే కానక కానక కన్న సంతానం కాన, క్షణం కనిపించకపోతే రాముని కన్నతల్లి కౌసల్య భరింపరాని బెంగతో ప్రాణం విడిచి పెడుతుంది. అలాంటి మమకారంతో ఉన్న తల్లిని ఏడిపించడమెందుకు? అందుకే నేను చతురంగ బలాలతోవచ్చి నీ యజ్ఞం పూర్తి చేయిస్తాను పద! అని అన్నాడే గాని విశ్వామిత్రు డేమంటాడో అన్న భయం లేకపోలేదు.

దశరథుని మాటలు విని విశ్వామిత్రుడు చిరునవ్వు నవ్వి రాజా! రామలక్ష్మణులు ఎవరని మీ ఉద్దేశం? దుష్టశిక్షణకు శిష్టరక్షణకు నీ ఇంట అవతరించిన నారాయణుడు, శేషుడున్ను; ఆ విషయం నాకు తెలుసును. నా యజ్ఞసంరక్షణ నెపంతో రాక్షస వినాశ నాటకానికి నాంది పలకనీ. నిక్షేపంలాగా తిరిగి నీకు అప్పగిస్తాను. నిర్భయంగా నిర్విచారంగా రామలక్ష్మణులను రప్పించు. నాతో పంపించు అని నిక్కచ్చిగా అన్నాడు. ఇంకేమి చెయ్యడం. కానీ! అనుకున్నాడు. సేవకుని పంపి రామలక్ష్మణుల్ని రప్పించాడు. వెళ్లివస్తాం. శుభం భూయాత్ అని విశ్వామిత్రుడు బయల్దేరాడు. వెంట నాలుగడుగులు వచ్చి దీనంగా అన్నాడు దశరథుడు:

'మునీంద్రా! చిరకాలం సంతతిలేక చింతతో చితికిపోయిన ఈ చివరి దశలో నీ వంటిమునుల అనుగ్రహంవల్ల ఈ కొడుకులను కన్నాను. వీళ్లని విడిచి గడియయైన ఉండడం నా వల్ల కాదు. కాబట్టి శీఘ్రంగా తిరిగి తీసుకువచ్చి నాకంట పెట్టవలసిందని ప్రార్థన.'

అని అనగా విశ్వామిత్రుడదు నాకు తెలుసును రాజా! విచారించకు. నా యజ్ఞం పూర్తి అయిన వెంటనే నీ కొడుకులను కల్యాణ మూర్తులుగా నీకు అప్పగిస్తాను- అని ధైర్యం చెప్పి ముందడుగు వేశాడు.

ముందు విశ్వామిత్రుడు, వెనుక మహారాజకుమారులు రామ లక్ష్మణులు. కాలినడకన ప్రయాణం. సరయూతీరాన వెళ్లి వెళ్లి ఒకచోట విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు దివ్యశక్తులుగల విద్యలు రెండు ఉపదేశించాడు. ఒటి బల; రెండవది అతిబల. వాటివల్ల ఆకలిదప్పులు దరికి రావు. తరువాత తన స్వాధీనంలో ఉన్న అస్త్ర సముదాయాన్నంతనూ ప్రయోగ ఉపసంహార సకీలకంగా ఉపదేశించాడు.

తరువాత గంగను దాటి శోణ తీరాన ప్రయాణిస్తూ మునుల ఆశ్రమాలనూ, మునులనూ చూపుతూ విశ్వామిత్రుడు ముందువెళ్తున్నాడు. రామలక్ష్మణులు ఆ యా ఆశ్రమాలనూ, మునులనూ ఆ యా ప్రదేశాల విశేషాలనూ గురువువల్ల తెలుసుకుంటూ నడక సాగిస్తున్నారు.

అలా వెళ్లి వెళ్లి తాటక స్వేచ్ఛగా తిరిగే వనానికి చేరారు. అపుడు విశ్వామిత్రుడు రామునితో అన్నాడు. రామా! రావణుని ఆజ్ఞ మేరకే తాటక అనే క్రూరరాక్షసి ఇక్కడే నివసిస్తుంది. దాని నోట ఎందరో మానవులు, మునుల పుత్రులూ, జింకలవంటి సాధుమృగాలూ నామరూపాలు లేకుండా అదృశ్యమై పోయాయి. చక్కిలం ముక్కలుగా విరుచుకు తినేస్తుంది. ఆ రాకాసిని నీ బాణానికి లక్ష్యంచేసి ఈ ప్రదేశాన్ని కాపాడు. అని అనగా విని రాముడు 'గురుదేవా! ఓం ప్రథమంగా నా బాణం ఆడుదానిపైనా వేయడం. స్త్రీవధవల్ల మహాపాపమని మీ వంటి పెద్దలు చెప్తున్నారుకదా! అని అన్నాడు. ఆ మాటకి విశ్వామిత్రుడు రామా! స్త్రీవధ వల్ల మహాపాపం వస్తుందన్న పెద్దలమాట కాదనను. కాని ఈ తాటక సామాన్యస్త్రీ కాదు. సాధుజీవులపాలి ప్రత్యక్షయమి. దీనిని ఒక్కతెను చంపితే కొన్ని వందల ప్రాణులను మృత్యుముఖంనుంచి బ్రతికించిన పున్నెం వస్తుందని నేను చెప్తున్నాను. కనుక పాపపుణ్య వివక్ష చేయక ఆ ఘోర రాక్షసిని హతమార్చు! అని అధికార స్ఫూర్తితోనే అన్నాడు.'

అలా విశ్వామిత్రుడు అనడమేతడవు పెడబొబ్బ పెట్టుతూ తాటక కొండగుహలాగా నోరుతెరుచుకుని ఆకాశంమీంచి వారికెదురుగా వచ్చింది. మానవుల పేగులు ఒడ్డాణంలాగా నుడుముకు చుట్టుకొని చెయ్యెత్తి మీదికి వస్తూన్న తాటకను గురిచూచి రాముడు ఒకేఒక కోలవిడిచాడు. ఆ దెబ్బతో రెండుగా గుండెచీలి నెత్తురు క్రక్కుతూ అది క్రిందపడి ప్రాణం వదిలింది. విశ్వామిత్రుడు ఆనందంగా రాముణ్ణి కౌగిలించుకొని ముందంజ వేసి నడచి నడచి తన ఆశ్రమానికి ఆ అన్నదమ్ముల్ని తీసుకువెళ్లాడు.



నేను యజ్ఞదీక్షలో ప్రవేశిస్తున్నాను. రావణచోదితులు, మారీచాదులు, రాక్షసులు వచ్చి యజ్ఞభంగం చేస్తారు. వారిని హతమార్చి యజ్ఞసంరక్షణ చెయ్యాలి అని ఆ అన్నదమ్ములకు చెప్పవలసేది చెప్పి తాను యజ్ఞదీక్షితు డయాడు. ఋత్విజులు దీక్షగా మంత్రాలు చెప్తూ యాగక్రియ నడుపుతున్నారు.

ఆకస్మికంగా రక్తవర్షం. ఆశ్చర్యంగా రామలక్ష్మణులు ఆకసంవంక చూచారు. ముందు సుబాహుడు వెనుక మారీచుడు, మరికొందరు రక్కసులు ఉక్కుముక్కల్లాగున్నారు.

ముందు రామునిబాణం సుబాహునిమీదికి వెళ్లింది. అంతే. ఆ కళేబరం అక్కడి కక్కడే బాణాగ్ని జ్వాలకి దగ్ధమైపోయింది. వెనుక నున్న మారీచుడు కుండతో రక్తం పోస్తున్నాడు. రామునికోల అనుకోకుండా వింటినుంచి దూసుకువెళ్లి ఎండిపోయిన ఆకును గాలిలాగా మారీచుణ్ణి ఎగురగొట్టి సముద్రంలో పడవేసింది. మిగిలిన రాక్షసుల్ని లక్ష్మణుడు పంచుకున్నాడు. ఒక్కడూ నామరూపాలతో మిగలలేదు. యజ్ఞం నిరాటంకంగా, నిర్దుష్టంగా పూర్తి అయింది. విశ్వామిత్రుడు పరమానందభరితుడై ఋత్విజులను యథోచితంగా పూజించి, రామలక్ష్మణులను మన్నించాడు.

తరువాత మళ్లీ ప్రయాణం.త్రోవలో ఏవేవో కథలుచెప్తూ, విశ్వామిత్రుడు ముందూ, వెనుక రామలక్ష్మణులు. అలా వెళ్లగా వెళ్లగా ఒకచోట రాయి ఒకటి రాముని కాలు తగిలి శుభలక్షణలక్షిత అయిన సుందరాంగిగా మారి లేచి రాముణ్ణి స్తుతించి వెళ్లిపోయింది.

ఈ వింతేమిటని రాము డడిగాడు. ఆమె గౌతముడనే మునిభార్య. ఇంద్రుని దుష్టత్వంవల్ల పతిశాపానికి గురియై ఇలా పడిఉండి భువన పావనుడవైన నీ పాదస్పర్శచే పాషాణరూపంపోయి యోషామణి రూపం పొంది

పతివద్దకు వెళ్లిపోయింది. ఆమెపేరు అహల్య అని విశ్వామిత్రుడు చెప్పి ముందుకు నడిచాడు. తనలో అనుకున్నాడు. ఈ ఇద్దరికీ వివాహాలు చేసి దశరథుడికి అప్పగించాలి. కల్యాణమూర్తులుగా అప్పగిస్తానని ఆనా దతనితో అన్నాను. ఆ మాట నిలుపుకోవాలి కదా! అని అల్లనల్లన మిథిలానగరానికి తీసుకు వెళ్లాడు.

విశ్వవిఖ్యాతుడైన విశ్వామిత్రుడు వచ్చాడని తెలియగానే జనకుడు వచ్చి బహుధా సంభావించి రామలక్ష్మణుల సమాచారంకూడా తెలుసుకుని తగినరీతిని సత్కరించి ఉచితమైన విడిది ఏర్పరిచాడు.

అది జనకుడు తనకొమర్తె సీతకు కల్యాణం చెయ్యడానికి సన్నాహం చేసిన సమయం. నానాదేశీయులైన రాజులు వచ్చి ఉన్నారు. మిథిల సందడిగా ఉంది.

మర్నాడు జనకుడు చిరకాలంనుంచి తనయింట శంకరమూర్తిగా పూజలందుకుంటూన్న శివధనుస్సును వేదికమీదికి తెప్పించి అందరికీ చూపి ఎలుగెత్తి అన్నాడు.

ఈ శైవధనువును నారిసారించి ఎక్కుపెట్టిన వారికి నా కూతురు సీతను ఇచ్చి కళ్యాణం చేస్తాను అని. కళ్యాణం అంటే కళకళలాడే రాచమొగాలు శివధనువు నెత్తలేక వెలవెలలాడాయి. అంతట విశ్వామిత్రుని సెలవుకాగా రాముడు గున్నటేనుగులాగా గంభీరంగా నడుస్తూ రంగస్థలం మీదికివెళ్లి పెట్టెలో ఉన్న శివధనువును ఏనుగు తామరతూడు నెత్తినట్లు అవలీలగా పైకెత్తి అనాయాసంగా నారిని కూర్చి మ్రోగించగానే ఆ విల్లు ఫెళ్లున నడిమికి విరిగి పడిపోయింది. తండ్రిచాటున నిల్చున్నసీత పరమానందభరితురాలై వచ్చి పద్మమాలికను రాముని కంఠానవేసి ఆప్యాయంగా ఒకసారి చూచి అల్లనల్లన తండ్రివద్దకి వెళ్లిపోయింది.

ఆ దృశ్యం చూచి రాజులు ఓర్వలేక యుద్ధసన్నద్ధులై శరవర్షం కురిశారు. వెంటనే రాముడు వింటినెక్కుపెట్టి ఊహకందని విధంగా అంపవాన కురిశాడు. కానీ వారు వదలలేదు. ఆశ్చర్యం! కళ్యాణరంగమైన మిథిలానగరం కదనరంగ మయింది. రామబాణాలకు రాజులరథాలూ, గుర్రాలూ, జెండాలూ, బాణాలూ చిందరవందరౌతున్నాయి. జనకుడుకూడా అల్లుడికితోడై తనసైన్యాన్ని సన్నద్ధం చేశాడు. ఇక లక్ష్మణునిమాట చెప్పనక్కరలేదు. ఒక్క అడుగులో ముందుకి ఉరికి రాజులను తన నిశితశరవర్షంతో చెదరగొట్టి వారి రథాలనూ, గుర్రాలనూ అటుంచిటు మళ్లించి, ముందుకు సాగి, పారిపోతూన్న రాజులను తెగవేయడానికి ధనుస్సు సారించాడు. వెంటనే జనకుడున్నూ, విశ్వామిత్రుడున్నూ వలదు లక్ష్మణా! వలదు. కదనరంగాన కాలికి బుద్ధిచెప్పిన పగవానిని కనికరించి విడిచిపెట్టాలిగాని కంఠచ్ఛేదం కావింపరాదు. పోనీ! వారినలా పోనీ!–అని దారికి తెచ్చారు.



తరువాత జనకుడు రామలక్ష్మణులను స్వభవనానికి సబహుమానంగా తోడ్కుకొని వెళ్ళాడు. యథోచితంగా సత్కరించాడు. విశ్వామిత్రుని మాటనుపట్టి దశరథునివద్దకు శుభలేఖలతో దూతలను పంపించాడు. కొడుకులు పెండ్లి కొడుకులైనారని కల్యాణపత్రికలు చదివి దశరథుడు పరమానందభరితుడై సముచిత పరివారంతో, గురువైన వసిష్ఠునితో బయల్దేరి మిథిలకు వచ్చాడు. జనకుడు పెండ్లివారికి తగినబసలూ, సదుపాయాలూ ఏర్పరచి కులగురువుల ఆదేశానుసారంగా రామలక్ష్మణ భరత శత్రుఘ్నులకు వరుసగా సీతా ఊర్మిళా మాండవీ శ్రుతకీర్తులను తన తమ్ముని తనయల నిచ్చి దివ్యవైభవంగా కళ్యాణం జరిపాడు.

వివాహానంతరం మూన్నాళ్లు మిథిలలో ఉండి దశరథుడు కొడుకులతో కోడండ్రతో బయల్దేరాడు. ఆ సమయంలో జనకుడు కూతుళ్లకు విరివిగా అరణం ఇచ్చి విశ్వామిత్రునికి మ్రొక్కి ఆనందంగా వెనుకకు మరలినాడు. విశ్వామిత్రుడు చిరునవ్వుతో రామలక్ష్మణులను దశరథునకు అప్పగించి పోయివత్తునా రాజా! అని అనగా దశరథుడు పరమానంద భరితుడై అపరబ్రహ్మ–ఆనాడు అనినమాట అక్షరాలా జరిపి నా కొడుకుల్ని అప్పగించాడు. ఇది మా అదృష్టం. అని సవినయంగా నమస్కరించాడు. విశ్వామిత్రుడు రామ లక్ష్మణులకు చెప్పి ఉత్తరదిక్కుగా తపశ్చర్యకు వెళ్లిపోయాడు.

దశరథుని వాహనాలు కదిలి సందడిగా వెళ్లుతూన్నాయి. కొంత దూరం వెళ్ళగానే గండ్రగొడ్డలి హేలగా ఆడిస్తూ భార్గవరాముడు ఎదురు వచ్చి

ఆగండి! అని వార్ధుకాభ్రంలాగ గర్జిస్తూ అన్నాడు. అంతే! ఎక్కడి భటులక్కడ ఎక్కడివాహనం అక్కడ గప్‌చప్–ఆగిపోయాయి. సమాచారం తెలిసి దశరథుడు వసిష్ఠుణ్ణి సమీపించి బిక్కచచ్చి ఏమిసాధనం అని బొంగురుపోయిన గొంతుతో అడిగాడు. ఆ మాటకి వసిష్ఠుడు రాజా! భయపడకు. రాముడంటే ఎవరను కున్నావు? శిష్టరక్షణకు, దుష్టశిక్షణకు నీయింట అవతరించిన మహావిష్ణువు. సర్వమూ తానే అయిన పరబ్రహ్మ. అలాటి సర్వస్వతంత్రునిగూర్చి భయమెందుకు రాజా! రాముని పేరు ఒక్కమారు ఉచ్చరిస్తే మానవులకు ఆపదలన్నీ పటాపంచలై సంపదలు సమకూరుతాయి. కనుక రామునకు, రామునికి సంబంధించిన నీకు, నీ వారికి ఈ భార్గవరామునివల్ల ఏలాటి ఆపద రాదు. భయపడకు. ధైర్యంగా ఉండు అని అంటుండగానే పరశురాముడువచ్చి రామునిముందు నిల్చి రాకుమారా! రామనామం విడిచిపెడతావా! నాతో యుద్ధం చేస్తావా? ఇద్దరు రాములు ఉండరాదు అని గద్దిస్తూ అన్నాడు. అప్పుడు రాముడు ఎందుకు విడిచి పెట్టాలి రామనామం? ఆ యుద్ధంసరదా తీర్చుకుందాం– అని నిర్భయంగా నిలిచి విల్లు ఎక్కుపెట్టి నారి సారించాడు.

ఆశ్చర్యం! పరశురాముని శరీరమందున్న వైష్ణవ తేజస్సు వెలువడి రాముని ముఖమందు ప్రవేశించింది. చూచిన వారందరూ నిర్ఘాంతపడి చూస్తూ నిల్చున్నారు.

ఇంకేముంది? పరశురాముడు ప్రసన్నవదనుడై రాముణ్ణి ఆప్యాయంగా చూచి రామా! గ్రహించాను. నీవు శ్రీహరివి. ఎదురులేని పరాక్రమంతో ప్రవర్తించు. దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించు. ధర్మ సంస్థాపనచేసి వర్ణాశ్రమ ధర్మాలను ప్రతిష్ఠించు. నేను తపశ్చర్యకు పోతున్నాను– వారిచే పూజలంది మహేంద్రగిరికి వెళ్లిపోయాడు.

తర్వాత దశరథుడు బ్రతుకు జీవుడా! అని నిబ్బరంగా గుండె రాసుకుని అయోధ్యకు చేరాడు. రామాదులరాక దూతలవల్ల ముందు తెలిసి పౌరులు మంగళ వాద్యాలతో ఎదురువచ్చి సేసలు చల్లి, స్వాగతగీతాలు పాడి ఆనందంగా పురప్రవేశోత్సవం జరిపారు. దశరథుడు మహానందంగా రాజప్రాసాదానికి



చేరాడు. అత్తలు ముగ్గురూ కోడళ్లను చూచి మురిసి ముచ్చటగా చేరదీసుకుని కుశల ప్రశ్న చేసి కొడుకులతో గృహప్రవేశోత్సవం వైభవంగా చేశారు.

సర్వమంగళమూర్తులైన భార్యలతో రామాదులు హాయిగా కాలం గడుపుతూన్నారు. కొంతకాలం అయాక భరతుడు శత్రుఘ్నునితో కలిసి మేనమామగారింటికి వెళ్ళాడు.

ఒకనాడు దశరథుడు ఆలోచించాడు. రాజుగా రాముడు దొరతనం చెల్లించడానికి తగిన లక్షణాలన్నీ ఉన్నవాడు. కాబట్టి పట్టంకట్టి నేను బంధవిముక్తుడ నవడం మంచిది. అని అనుకుని మంత్రులతో ఆలోచించి మంచిదని వారిచే అనిపించుకుని తన పలుకుబడి చెల్లుతున్నంతమేర పల్లెలలో, పట్టణాలలో చాటింపించాడు రామపట్టాభిషేకానికి యథాశక్తిగా సంభారాలు తీసుకుని రావలసిందని. మంత్రులు మహానందంగా సర్వం సమాయత్తం చేశారు. రాముని పట్టాభిషేకోత్సవానికి తగినట్టు నేర్పరులైన అలంకారికులు పురం అలంకరించారు. కొడుకు పట్టాభిషేకం. ఆ తల్లి కౌసల్య పొందిన ఆనందం హద్దుమీరిన సముద్రం అయింది. అలాగే సుమిత్ర, సీత, లక్ష్మణులూ పరమానంద భరితులైనారు.

కైకేయి దాసిపేరు మంథర. పేరుకి తగిన ఆకారం మరుగుజ్జు. దాని చెవిని పడింది రామపట్టాభిషేక వార్త! మెల్ల మెల్లగా కైకేయి వద్దకు వెళ్ళి ఇలాగన్నది.

ఓ రాణీ! నీ బ్రతుకు అయిపోయింది. నీ కొడుకు ఎంతోదూరంగా తాతగారింట ఉండడం, ఇదే మంచి సమయమని మహారాజు రాముడికి అంటే ఆ కౌసల్య కొడుకుకి పట్టాభిషేకం చెయ్యడానికి పూనుకోవడం, ఇక చెప్పేదే ముంది? డబ్బు దస్కం, కోటా పేటా, వాహనాలూ వైభవాలూ అన్నీ రేపటినుంచి రాముడి అదుపాజ్ఞల్లో ఉంటాయి. నీ బ్రతుకు ఆ సవతిచేతుల్లో ఉంటుంది. ఆ కౌసల్యకి నువ్వు దాసి వవుతావు.

దాసిమాటలు విని కైకేయి ఒక్క క్షణం ఆలోచించి చికాకుగా అన్నది. ఏమిటి మంథరా! అంత తొందరగా ముందూ వెనుకా ఆలోచించక అంటున్నావు.

చూడే ఏమి చేస్తానో? నా సవతి కొడుకు అడవిలోనూ, నా కొడుకు నగరంలోనూ ఉంటారు.

అని ఆసనంమీంచి చివాల్న లేచింది. కొప్పున అలంకరించుకున్న కొత్తపూదండ తీసి త్రెంచి వేసి ఒక మూలకి విసరి వేసింది సరిగంచు క్రొంబట్టు చీరవిడిచి మాసిన నూలుచీర కట్టింది. నగలు తీసి వేసింది. కటికనేలమీద వాలింది. నుదుట తెల్లని గుడ్డ బిగించి కట్టుకుంది. ఆ దీపం ఆర్పివేసి నువ్వు అవతలి గదిలో ఉండవే అంది. మంథర దీపాలన్నీ ఆర్పివేసి అవతలకు వెళ్ళి పోయింది. భవనం అంతా అంధకార బంధురం. పెద్ద పెద్ద నిట్టూర్పులు విడుస్తూ నేలమీద అటూ ఇటూ దొర్లుతూంది.

అర్ధరాత్రమయింది. పట్టాభిషేకానికి సంబంధించిన ఏర్పాట్లు గురువుతో, మంత్రులతో ఆలోచించి ఆ యా పనులకు తగిన వ్యక్తులను నియోగించి కైకేయికి రామ పట్టాభిషేకవార్త చెప్పాలని దశరథుడు ఆ మేడకి వచ్చాడు. అంతా కటిక చీకటి! దశరథుని హృదయంలో ఉన్న ఆనందకౌముది అంతరించుకుపోయి విచారాంధకారం క్రమ్మింది. అల్ల నల్లన అడుగులు వేస్తూ పడకగది చేరి ఆరీఆరని దీపం ఒకటి చూపగా నేల మీద వాలి ఉన్న కైకేయిని చూశాడు. వణకుతూన్న చేతులతో అలా లేవనెత్తి పానుపుమీదికి చేర్చాడు. హృదయేశ్వరీ! తెల్లవారితే మన రాముని పట్టాభిషేకం గురువులు నిర్ణయించారు. నగరం అంతా అలంకరించి రంగు రంగుల దీపాల తోరణాలు కట్టారు చూడు. నీ మేడ ఒక్క దీపమైనా లేక ఈ కటిక చీకటి-ఏమిటో కారణం? అయినా నీ వేషమేమిటి ఇంత దయనీయంగా ఉంది? అని కంపిస్తూన్న కంఠంతోనే అన్నాడు. ముందుకి వెళ్లి దీపాలు వేశాడు.

కైకేయి నాగుపాములాగా బుసకొట్టుతూ లేచి నిష్ఠురంగా అన్నది భర్తతో-అక్కర మాలిన ప్రసంగం ఎందుకు? మునుపు ఒకప్పుడు దేవాసుర యుద్ధంలో నీకు ప్రాణరక్ష కలిగించాను. అప్పుడు నాకు రెండు వరా లిచ్చావు. అవి ఇప్పుడు నా కివ్వాలి.



అంతేనా? దానికింత వికృతి ఎందుకు ప్రియురాలా? ఆనాడిచ్చానో లేదో గాని ఈ సంతోష సమయంలో తప్పక ఇస్తున్నాను, కోరుకో అని గంభీరంగా అన్నాడు దశరథుడు.

'అవేమిటో విను. తెల్లవారగానే రాముడు అయోధ్య విడిచి పద్నాలుగేళ్లు వనంలో నివసించాలి. నాకొడుకు భరతుడు పట్టాభిషిక్తుడు కావాలి' అని కైక అనేసరికి హా! అని అరచి దశరథుడు క్రింద పడిపోయాడు.

తెల్లవారింది. కైకేయి సుమంత్రుణ్ణి రామునివద్దకి పంపింది రాముణ్ణి తీసుకురమ్మని. సుమంత్రుడు వెళ్ళి రాముణ్ణి తీసుకువచ్చాడు. కైకేయి రాముణ్ణి చూచి నిర్దాక్షిణ్యంగ అన్నది. రామా! మీ తండ్రి అభిప్రాయం చెప్తున్నాను. నా మాట కాదిది. నువ్వు ఇప్పుడే అయోధ్యను వదలి వనవాసివి కావాలి పద్నాలుగేళ్లు. (పన్నెండేంళ్లు అని ఉన్నది మూలం. ఆలోచించాలి. నేను వాల్మీకం అనుసరించి పద్నాలుగేళ్లు అని వ్రాశాను.) మంచిదమ్మా! అన్నాడు రాముడు. ఇద్దరికీ నమస్కరించాడు. తల్లి వద్దకు తండ్రి అభిప్రాయంగా పినతల్లి చెప్పింది; చెప్పి అలాగే సుమిత్రకి తెలిపి అడవికి బయల్దేరాడు. ఆ వార్త తెలిసి పౌరులు ఎంత చింతించారో చెప్పనలవి కాదు.

లక్ష్మణుడు కైకమీద మండిపడ్డాడు. రాముడు తమ్ముణ్ణి తగిన మాటలతో శాంతింప జేశాడు. రథం వచ్చిందన్నాడు సారథి. అందరికీ నమస్కరించి రాముడు రథం ఎక్కాడు. ఎక్కేముందు తనకు సంబంధించిన ధనధాన్య వస్తు వాహనాలను స్వేచ్ఛగా యాచకులకు రెండు చేతులా పంచిపెట్టాడు. సీత ముగ్గురత్తలకూ, కన్నీరు కార్చుతూ తెలివి తప్పి పడిఉన్న మామగారికీ నమస్కరించి రామునివెంట రథం అధిరోహించింది. గతీమతీ తప్పినవాడిలాగా పిచ్చిగా దిక్కులుచూస్తూ అన్న వెంట పోవడానికి ముందడుగువేసిన లక్ష్మణుణ్ణి చేరదీసుకుని సుమిత్ర నాయనా! లక్ష్మణా! ఈ క్షణంనుంచి రాముణ్ణి దశరథుడుగా; సీతను నన్నుగా, అరణ్యాన్ని అయోధ్యగా భావించు. సీతారాములతో వనవాసానికి వెళ్లు అని గంభీరంగా అన్నది. వెంటనే లక్ష్మణుడు తల్లికి మ్రొక్కి సెలవు తీసుకుని రథం ఎక్కాడు. రథం కదిలింది.

మంత్రులు, పురోహితులు, ప్రధానులు వెంటపడి రామా! నిన్ను రాజుగా మన్నిస్తూ నీ పరిపాలనలో కులాసగా కాలక్షేపం చేస్తామని ఎంతో ఆశపడిన మమ్మల్ని విడిచి ఎక్కడకు వెళ్లిపోతావు? వద్దు వద్దు! ఇటు తిరుగు రఘునందనా! అని గట్టిగా బతిమాలుతూన్నట్టు ఏడుస్తూ అన్నారు. రాముడు ఒక్కక్షణం రథం ఆపి నా మాట మన్నించండి. పితృవాక్యపరిపాలన చెయ్యడం కొడుకు ధర్మం. అందుచే నేను అడవికి వెళ్లి పద్నాలుగు సంవత్సరాలు కాగానే తిరిగి వస్తాను. అంతవరకు మా తమ్ముడు భరతుడు రాజుగా పాలించాలి. మీరంతా అతణ్ణి అనుసరించి ఉండాలి అని శాసించినట్టు చెప్పి రథం పోనిచ్చాడు.

రథం మహావేగంగా పోయి గంగాతీరానఉన్న శృంగివేరపురం చేరింది. ఆ ప్రాంతాని కంతకూ అధికారి గుహుడు. జాతికి బెస్తవాడు. నీతికి గురువు. అతడు రామునకు స్వాగతంచెప్పి ఆ రాత్రి అతిథ్యం ఇచ్చి తనవారిని కాపుంచి బస ఏర్పరిచాడు.

తెల్లవారకముందు సారథికి చెప్పి గుహుడు తెచ్చిన పడవనెక్కి రాముడు భార్యతో, లక్ష్మణునితో గంగనుదాటి భరద్వాజాశ్రమానికి వెళ్లాడు. ఆ రాత్రి భరద్వాజునికి అతిథులై మర్నాడు ఆ మహాముని చెప్పిన చొప్పున పయనించి చిత్రకూటం చేరారు.

రామవనవాసగమనంవల్ల అయోధ్య అమావాస్య నాటిరేయిలాగా కళాకాంతీలేక వికారాకార మయింది. దశరథుడు తెలివి వచ్చి లేచాడు. రాముడు సీతాలక్ష్మణసమేతుడై వనవాసానికి వెళ్ళాడు. ఇక భరతుణ్ణి రప్పించి రాజ్యానికి అభిషిక్తుణ్ణి చెయ్యవలసిందని కైకేయి చెప్పింది. అంతే! దశరథుడు హారామా! అని బిగ్గరగా అరచి నేలకూలాడు. అతని పాంచభౌతికమైన శరీరం, ప్రాణవాయువు నిష్క్రమించి కొయ్యబొమ్మ అయిపోయింది.

దశరథుడు దేవలోకగతుడైనాడని అయోధ్య దుఃఖంతో అట్టుడికినట్టు ఉడికిపోయింది. కౌసల్యాది అంతఃపురకాంతల చింతావృత్తాంతం చెప్పనక్కర లేదు. సర్వధర్మవేత్త కులగురువు వసిష్ఠుడు మంత్రులతో ఆలోచించి రాజ



కళేబరాన్ని తైల దోణియందు పెట్టించి వేగరులైన దూతలను భరతుని తాతగారింటికి పంపించాడు.

దూతలు వెళ్లి భరతునకు గురువుల ఆజ్ఞగా వెంటనే అయోధ్యకు రావలసిందని మనవి చేశారు. రథారూఢుడై తమ్ముడితో ప్రయాణించి నాలుగుదినాలకు అయోధ్యకి చేరాడు. ఏవేవో అపశకునాలు. అయోధ్యలో ఏదో వైపరీత్యం జరిగిందని అనుమానించాడు. పురమంతా కళాహీనమై ఉంది.

రథం దిగి సరాసరి తండ్రిఉండే మేడకి వెళ్లాడు. గతం అంతా తెలిసింది. ఎక్కడవిన్నా హా రామా! హా సీతా! హా లక్ష్మణా!....ఇదేమాట.

తల్లిని చూశాడు. కోపం ఆపలేక నోటికివచ్చినట్టు చెడామడా తిట్టాడు. దుష్టురాలా! నీవల్లనే నాతండ్రి దివంగతుడైనాడే. పూజ్యుడైన మా అన్న, తల్లిసీతాదేవి, భ్రాతృరత్నం లక్ష్మణుడూ వనవాసానికివెళ్లడమా? నేను రాజ్యం ఏలడమా? ఎవరుచెప్పారు నీకి ఘోరపాతం? ఎంతపాపపు పని చేశావే దురాత్మురాలా! నా నిర్ణయం విను.

లోకాభిరాముడు నాఅన్న రాముడు. దివ్యశోభనమూర్తి మా వదిన జానకి. గుణవంతుడు, ధీమంతుడు, భాతృవత్సలుడు లక్ష్మణుడు ఉన్నచోటికే నేనూపోతాను. పట్టం కట్టుకుని గద్దె నెక్కి నేనేలుతానని కలలోనైనా అనుకోకు. నీ కడుపున పుట్టి నేను లోకంలోశాశ్వతమైన అపకీర్తిని పొందవలసి వచ్చింది. ఛీ! అని తిట్టి, తండ్రికోసం పలవించి పలవించి ఏడుస్తూ ఉండగా మంత్రులతో సహ కులగురువు వసిష్ఠుడు అక్కడకు వచ్చి ఓదార్చుతూ అన్నాడు.

కుమారా! భరతా! గతం గతం. విచారించకు. లే! లే! కర్మఫలం బలం అలాటిది. దివంగతుడైన మీ తండ్రికి పారలౌకికక్రియలు చెయ్యవలసి ఉంది. ఇది కంటనీరు పెట్టవలసే సమయం కాదు. నా మాట విను.

రాముడెవరో తెలుసునా? దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు ఇక్ష్వాకుకులమం దవతరించిన మాధవుడు. లక్ష్మణునితో తాను అరణ్యంలో చెయ్యవలసేపని ముమ్మరంగా ఉంది. అరణ్యానికి వెళ్లవలసివచ్చింది. అది ముగించుకుని

రాముడు తిరిగి అయోధ్యకు వస్తాడు అని తత్త్వబోధ చేశాడు. భరతుడు ఊరడిల్లి మెల్లగా లేచాడు. శత్రుఘ్నుడితో సరయూతీరానికి వెళ్లి గురువులమాటల ననుసరించి తండ్రికి దహనాదికం, పారలౌకికతంతు యావత్తూ సక్రమంగా చేశాడు. తరువాత శుచిస్నానం చేసి తగిన పరివారంతో బయల్దేరాడు అన్నను అయోధ్యకు తీసుకువస్తానని.

అంతసైన్యంతో ఆర్భాటంగా వస్తూన్న భరతుణ్ణి చూచి గుహుడు అచ్చంగా రామదాసుడు కనుక అడ్డుకోవాలనుకుని యుద్ధపద్ధతిలో ఎదిరించాడు. మీ అమ్మ అడవికి పంపింది. అదిచాలక మీ అన్నను చంపాలని వస్తున్నావా దుష్టుడా? నాదేవుడి మీదికి వెళ్తూన్న నిన్ను అడుగు ముందుకి వెయ్యనిస్తానా? అని భీషణంగా విల్లు మ్రోగించాడు. భరతుడు సవినయంగా దగ్గరకువచ్చి అయ్యా! కోపించకు. నేను చెప్పేది అంతరాత్మ సాక్షిగా చెప్తున్నాను. తాతగారింట నేనుండగా మా అమ్మ యీ పనిచేసింది. నా కేమీ తెలియదు. రామునియందు నీ కెంతభక్తి ఉందో నాకూ అంతభక్తి ఉంది. మా అన్నను అడవినుంచి అయోధ్యకు తీసుకుపోవడానికి రాజలాంఛనంగా సైన్యంతో వెళ్తున్నాను అని చెప్పగా నమ్మి గుహుడు భరతాదులను నావలతో గంగను దాటించాడు.

భరతుడు భరద్వాజాశ్రమానికి వెళ్లి భక్తిగా నమస్కరించి తనరాక చెప్పాడు. అదివిని భరద్వాజుడు నీ సంకల్పం మంచిదే. రాముడు ప్రస్తుతం చిత్రకూట పర్వత ప్రాంతమందున్నాడు. అతడికి లక్ష్మణుడు అజేయపరాక్రముడు అంగరక్షకుడుగా ఉన్నాడు. రాముడు పితృవాక్యపరిపాలన లక్ష్యంగా అడవికి వచ్చాడు. అది తీరితేగాని అయోధ్యలో అడుగుపెట్టడు. ఇది నా అభిప్రాయం. అయినా వచ్చావు కనుక వెళ్లు! అని చిత్రకూటానికి వెళ్లేదారి చెప్పాడు. భరతుడు నడక సాగించాడు. అల్లంతదూరంలో ధూళి ఎగజిమ్ముతూ వస్తూన్న సేనను చూచి లక్ష్మణుడు చెట్టెక్కి ఏమనుకున్నాడో మరి వడిగా క్రిందికి దిగి 'అన్నా! నువ్వు మా వదినను తీసుకుని పర్ణశాలలో ఉండు. ఎవడో సైన్యంతో ఒక వీరపురుషుడు వస్తూన్నాడు. వాడిసంగతి ఏమిటో నేను చూచుకుంటాను అని ఆవేశంగా అన్నాడు. రాము డది విని సౌమిత్రీ! మనలను చూడడానికి బహుశః



భరతుడుగాని వస్తూన్నాడేమో! తొందరపడకు తమ్ముడూ! అని ధీమాగా అన్నాడు. లక్ష్మణుడు మరేమీ అనలేక కొంచెం దూరంగా వెళ్లి నిల్చున్నాడు. అంతలో వసిష్ఠాదులతో, మంత్రులతో భరతుడు వచ్చి రామునకు, సీతకు, లక్ష్మణునకు నమస్కరించి ఏడిచాడు. అంతింతదూరాన ఉండి మంత్రులు రాముని అవస్థను చూచి విచారించారు. అప్పటికి తల్లులు ముగ్గురూ సౌభాగ్యహీనములైన ముఖాలతో వచ్చి సీతారామలక్ష్మణుల ఆశ్రమజీవితాన్ని చూచి శోకమూర్తులై పోయారు. తల్లుల దశను మంత్రులవల్ల తెలుసుకొని రాముడు తండ్రినిగూర్చి విచారించి భార్యతో, తమ్మునితో నదికివెళ్లి స్నానాదికం జరిపి తండ్రికి జలాంజలిఇచ్చి పర్ణశాలకి వచ్చాడు. కొంతసేపయాక భరతుణ్ణిచూచి అన్నాడు.

తమ్ముడా! నువ్వు విచారించి ఇక్కడ ఉండడం తగదు. రాజ్యం అరాజకంగా ఉండకూడదు. అయోధ్యకు వెళ్లి రాజ్యాధికారం చేపట్టి ప్రజాక్షేమం లక్ష్యంగా దొరతనం నెరపు. వెళ్లు! అని అనగా భరతుడు అన్నా! సీత, లక్ష్మణుడు ఉన్నట్టే నువ్వు ఉన్న చోటనే ఉంటానుగానీ నువ్వులేనిచోట ఉండను. ఇది ముమ్మాటికీ నిజం. అని భరతుడన్నది విని రాముడు తిరిగి శాసిస్తున్నన్నాడు.

భరతా! పితృశాసనం బుద్ధిమంతుడైన కొడుకు అనుసరించాలి. నేను నాయనమాటకి కట్టుబడి అడవికి వచ్చాను. జ్యేష్ఠుడు తండ్రితో సముడనే సనాతనోక్తి నీకు తెలుసును. నేను జ్యేష్ఠుడను. కాబట్టి నామాట పితృవాక్యంగా మన్నించి నువ్వు అనుసరించాలి. నేను నాయన మాటనుబట్టి పద్నాలుగేళ్లు వనవాసవ్రతం జరిపి వెంటనే నీవద్దకు వస్తాను. నా మాటవిను. అయోధ్యకు వెళ్లు. శోకానికి నీ మనసులో చోటీయక ధైర్యం అవలంబించి రాజ్యం పాలించు అని అనగా భరతుడు కన్నీరు అరచేతులతో ఒత్తుకుని అన్నా! నీవు పితృసముడవు కాదనను. నా మనవి విను. రాజ్యం నీది గాని నాది కాదు. నీ ఆజ్ఞ ప్రకారం నడుస్తాను. కాని నీపాదుకలు ఇప్పించు. అయోధ్యలో నేనూ ఈ పద్నాలుగేళ్లూ కాలుపెట్టను. అక్కడికి దగ్గరగా ఉన్న నందిగ్రామంలో నీలాగే వనవాసవ్రతం దానికి తగిన వేషం అవలంబించి ఉంటాను. ఏరోజు జరిగిన విషయం ఆరోజు నీ పాదుకలకు నివేదిస్తూ కాలక్షేపం చేస్తాను. నీ వనవాసం పూర్తి అయిన మర్నాడు వచ్చావా ప్రాణాలతో ఉన్న ఈ భరతుణ్ణి చూస్తావు. రాలేదా? ఈ

భరతుని శరీరం అగ్నికి ఆహుతి అయిపోయిందనుకో! అని శపథం చేశాడు. రామునిపాదాలకు సాష్టాంగనమస్కారం చేశాడు. రాముడు భరతుణ్ణి ఆప్యాయంగా లేవనెత్తి శిరసు మూర్కొని పాదుకలిచ్చి ధైర్యంగా ఉండు. వనవాసం పూర్తికాగానే వస్తాను అని నొక్కి చెప్పాడు. భరతుడు రాముని పాదుకలను శిరసుపై ఉంచుకుని అన్నకి ప్రదక్షిణం చేసి ముగ్గురివద్దను సెలవుతీసుకుని తల్లులతో, వసిష్ఠాది గురువులతో సుమంతాదిమంత్రులతో బయల్దేరి నడకకాని నడకతో అడవులూ వాగులూ, నదులూ దాటి నందిగ్రామం చేరాడు. అక్కడ సింహాసనం వేయించి రామపాదుకలు దానిపై ఉంచాడు. అచ్చంగా అన్నలాగే మునివేషం వేశాడు. నారబట్టలు, జటాకలాపం, కృష్ణాజినం కాయకసరులు ఆహారం. రామనామస్మరణ. అన్నమాట మనసులో ఉంచుకుని రాజ్యపాలన భారం వహించి బరువుగా బ్రతుకు వెళ్ళిస్తూన్నాడు. ఆ అన్నకి నీడలాగున్న శత్రుఘ్నుని ప్రవర్తన వేరే చెప్పనక్కర లేదు.

పాదుకలు శిరసుపై ఉంచుకుని భరతుడు వెనుదిరిగి వెళ్లిన తర్వాత రాముడు వనవాసం చేస్తూ ఒకనాడు లక్ష్మణుడు అడవిలో దూరంగా ఫలాదికం కోసం తిరుగుతూన్న సమయంలో సీతతో చిత్రకూటం దరినున్న వనంలో తిరిగి తిరిగి ఒకచెట్టుక్రింద విశ్రమించాడు. కొంతసేపు సీతతో కులాసాకబుర్లు అయాక ఆమె అంకంపై శిరస్సు ఆనుకుని నిద్రించాడు. గాఢనిద్ర.. సీతకదలక మెదలక కూర్చుంది. అంతలో ఒక కాకి వచ్చి ఆమెవక్షంపై పొడిచి ఎదురుగా ఉన్న చెట్టు కొమ్మపైనుండి కర్ణకఠోరంగా కూయనారంభించింది. సీతవక్షంపై నుంచి నెత్తురుచుక్కలు రాముని మోముపై పడగా చప్పునమేల్కొని ఏమిటిది? అని రాముడు సంభ్రమంగా అడిగాడు. అదిగో ఆ కొమ్మమీద ఉన్నకాకి.....అని ఆమె చూపింది. వెంటనే రాముడు ఒక గడ్డిపోచను త్రుంచి దానికి బ్రహ్మాస్త్రమంత్రం పఠించి విడిచాడు. అది కాకిమీదికి వెళ్లింది. దానిప్రతాపానికి భయపడి కాకి ఇంద్రలోకానికి ఎగిరిపోయింది. ఆ కాకి ఇంద్రునికొడుకు. ఇంద్రుడు గ్రహించి ఛీ! నీచుడా! పోయి ఆ మహానుభావునికి క్షమాపణ చెప్పుకో. ఇక్కడ నిన్నెవ్వరూ రామబాణాగ్ని జ్వాలనుంచి కాపాడలేరు అనిదూషించి పొమ్మన్నాడు. చేసేదిలేక ఆ కాకి తిన్నగా రామునివద్దకువచ్చి శరణు! శరణు!



పాహిమాం ప్రభో! అని పాదాలమీదపడగా రాముడు కాకికి అభయమిచ్చి నాఅస్త్రానికి ఏమైనా బలిఇవ్వకపోతే నీప్రాణం నిలవదు. ఏమంటావు? అని అన్నాడు. ఏమిచ్చేది? నా కళ్లలో ఒకటి ఇస్తున్నాను. దానిని తీసుకొని విడిచిపెట్టితే ఏకాక్షినై ఎలాగో బ్రతుకుతాను అని కాకి అన్నది. వెంటనే రామాస్త్రం ఆ కాకి కంటిని ఛేదించి శాంతించింది. బ్రతుకుజీవుడా! అని కాకి ఎగిరిపోయింది. ఆ నాటి నుంచి కాకజాతికి రెండుకళ్లున్నా కనిపించేది సరాసరి ఒక కంటికే.

తరువాత సీతారాములు అక్కణ్ణించి పర్ణశాలకి పోయారు. కొన్నాళ్లక్కడుండి దండకారణ్యానికి మజిలీ మార్చారు. కొంతకాలం అక్కడఉండి అచ్చటనున్న మునులచే మన్ననల పొందుచు వారికి రాక్షసులవల్ల ఎలాటి బాధలు రానట్లు రక్షకుడై ఉంటూ వారిసలహా ననుసరించి ముందుకు పోయాడు. అగస్త్యమహామునిని దర్శించి ఒక ఖడ్గమున్ను, తరగని అమ్ములపొది, వైష్ణవధనువున్ను ఆ మహాముని ఆశీస్సులతో పొంది, సెలవొంది గోదావరితీరాన పంచవటిని చేరి అక్కడ వసతి ఏర్పరచుకున్నాడు.

అలాగు అక్కడ ఉంటూ ఉండగా ఒకనాడు జటాయువు అనే గ్రద్ద వచ్చి తాను దశరథుని మిత్రుడనని పరిచయం చేసుకుని సీతాసంరక్షణ విషయంలో కనిపెట్టి ఉంటానని మాట ఇచ్చి తనచోటికి వెళ్లిపోయింది. తరువాత ఒకనాడు రావణుని చెల్లెలు శూర్పణఖ యథేచ్ఛగా తిరుగుతూ వచ్చి భువవనమోహనుడైన రామునిచూచి మోహించి తానూ మాయాశక్తిచే సుందరిగా మారి తనను భార్యగా చేపట్టవలసిందని రాముణ్ణి కోరింది. ఆ మాటకి రాముడు 'నా ఇల్లా లీ సీత.' పరకాంతను తాకనని నా వ్రతం. అటు చూడు. ఆ పర్ణశాలలో ఉన్నవాడు నా తమ్ముడు లక్ష్మణుడు. అతడు భార్యలేకుండా ఒక్కడే ఇక్కడ ఉంటున్నాడు. వెళ్ళి అతనిని చేపట్టు అని అన్నాడు. సరే అలాగు ఈ ఆకుమీద వ్రాసి ఇమ్మని ఒక ఆకు ఇచ్చింది శూర్పణఖ. రాముడా ఆకుమీద కత్తికొనతో దీని ముక్కు తెగగోసి విడిచిపెట్టు అని వ్రాసి ఇచ్చాడు. శూర్పణఖ ఆపత్రం తీసుకునివెళ్ళి లక్ష్మణునకు ఇచ్చింది. సౌమిత్రి అది అందుకుని

చదువుకుని చిరునవ్వు నవ్వి కత్తితో చెరాల్న దాని ముక్కూ, చెవులూ కూడా తెగగోసి పొమ్మన్నాడు. ఇక దాని ఘోష ఏమి చెప్పేది? 'అన్నా! రావణా! కుంభకర్ణా! విభీషణా! ఈ మానవమాత్రులు నన్నెంత అవమానించారో చూడండి' అని పెడబొబ్బలు పెడుతూ జనస్థానంలోఉన్న రావణప్రతినిధులను ఖరదూషణ త్రిశిరులనుజేరి జరిగినది చెప్పి, గోలున ఏడిచింది. తామసులైన ఆ రాక్షసులు పద్నాలుగువేలమంది ఉక్కుతునకల్లాటి రాక్షసవీరభటులతో రామునిమీదికి కయ్యానికి కాలుదువ్వారు. రాముడు వాళ్ళ ఆర్భాటం చూచి లక్ష్మణుణ్ణి సీతా సంరక్షణకు నియోగించి ఎదుర్కొని ఖరాదులతో ఆ రక్కసులనందరనూ సునాయాసంగా తుక్కుతుక్కుగా తెగనేసి ఆ ప్రాంతమంతా రాక్షసశ్మశానంచేసి నెత్తురుటేర్లు పారించాడు.

శూర్పణఖ అక్కణ్ణించి తూనీగలాగా ఎగిరి లంకకుపోయి జరిగిన కథ చెప్పి అన్నా! నీకేదో ఆపదవచ్చింది. దానికేమి గాని ఆ రాముని భార్య సీత త్రిలోకసుందరి. అది నీ ప్రక్కనుండవలసేది. ఎలాగైనా దానిని ఎత్తుకుని వచ్చి సుఖపడు. నా ఈ కోరిక చెల్లించు అని రావణుడికి దుర్మోహం కలిగించింది. అంతా విని ఆ తెలిసిన మూర్ఖుడు రావణుడు చెల్లెల్ని ఓదార్చి ఒక్కక్షణం ఆలోచించి చప్పున లేచి విమాన మెక్కి సరాసరి జనస్థానంలో ఒక మారు మూలను మునియై పర్ణశాలలో ఉన్న మారీచునివద్దకు వచ్చి రాక్షసజాతికి ఒకమానవుడివల్ల మహాదారుణమైన ఆపదవచ్చింది. దానికి ప్రతిక్రియ, వాడి ఇల్లాలిని ఎత్తుకు పోవడం అనీ దానికి నీ సహాయం కోరివచ్చాను. అద్భుతమైన బంగారులేడిగా మారి ఆ రామలక్ష్మణులు సీతకి దూరంగా పోవునట్టు నువ్వు చెయ్యాలి. అంతలో నాపని నేను చేసుకు పోతాను అని అన్నాడు. మారీచు డందుకు ఇష్టపడక మునుపు నేను రాముని బాణం దెబ్బతిని ఉన్నాను. సామాన్యుడు కాడు. మన మాయ లతనిముందు పని చెయ్యవు. అయినా పరకాంతావ్యామోహం నీవంటి విద్వాంసుడికి మంచిది కాదు అని ధర్మబోధ చేశాడు. మతిభ్రష్టుడికి మంచి మాట చెవి కెక్కుతుందా? రావణుడు కత్తితీసి ఇదిగో నీ నీతిపాఠం వినడానికి నేను రాలేదు. చెప్పినట్టు చెయ్యవా ఇదిగో ఈ ఖడ్గానికి నీ తల బలి అని గ్రుడ్లురుముతూ జళిపించాడు. మంచిది.



కులభ్రష్టుడవైన నీ చేత చచ్చేకన్నా పురుషోత్తముడైన రాముని చేతిలో చస్తే పుణ్యలోకానికి పోవచ్చు. పద. లంక నీచేతిలో నాశం అయిపోతుంది అని లేచాడు. ఇద్దరూ విమానమెక్కి రాముడు నివసించే పర్ణశాలకి అంత దూరంలో దిగారు. అక్కడ మారీచుడు బంగరులేడిగామారి రామాశ్రమం ముందు ఇటూ అటూ గంతులు వేస్తూ సీతకంట పడ్డాడు. అంతవరకు కని విని ఎరుగని ఆ వింత జంతువును చూసి సీత దానిని పట్టి ఇవ్వవలసిందని రాముణ్ణి కోరింది. భార్యకోరిక కాదనలేక రఘువీరుడు లక్ష్మణుని ఆశ్రమరక్షకుడుగా నియమించి లేడివెంట నడిచాడు. దొరికీ దొరకనట్టు ఆ మాయలేడి చేరువగా దూరంగా చెంగు చెంగున ఎగురుతూ కూతవేటు దూరం రాముణ్ణి తీసుకుపోయింది. ఇక ఉపేక్షించి లాభం లేదని రాముడు విసిగి ఒక కోల ప్రయోగించాడు. పిడుగుపడ్డట్టుగా ఆ దెబ్బకు లేడి హా లక్ష్మణా! అని రెండుమార్లరచి క్రిందపడింది. మరణ సమయాన ఆ మాయరూపు పోయి మారీచుడు కొండలాగా పెద్ద రూపుతో బయటపడి చచ్చి ఊరుకున్నాడు. రాక్షసమాయ! ఔరా! అని రాముడు వెనుదిరిగి వడి వడిగా నడవసాగాడు.

అక్కడ పర్ణశాల ముంగిట నిలిచి సీత హా లక్ష్మణా! అనే ఆర్తనాదం విని లక్ష్మణా! విన్నావా మీ అన్న కంఠస్వరం. ఏదో ఆపద...త్వరగావెళ్లు! అని విలపిస్తూ బిగ్గరగా అన్నది. విచారించకమ్మా! మా అన్నకి ఆపదేమిటి? అది రాక్షసమాయ–అని లక్ష్మణుడు గంభీరంగా అన్నాడు. ఆ మాట సీత వినిపించుకోలేదు. నీచబుద్ధితో మాటాడుతున్నావు. మీ అన్న పోగానే నన్ను వశపరచుకోవాలని చూస్తున్నావా? ఈ జన్మలో అది జరిగేపని కాదు. వెళ్తావా? వెళ్లవా? అని కోపంతో హెచ్చరించింది సీత. అనర్థానికి మూలం ఆడబుద్ధి–అని పెద్దలు ఊరకే అన్నారా?..అని లక్ష్మణుడు చివాల్న లేచి వెళ్ళిపోయాడు.

అక్కడి కక్కడ అవతరించినట్టు సన్న్యాసివేషంతో రావణుడు సీతకి బారెడుదూరంలో నిల్చుని వైదేహీ! రాముడు పంపగా వచ్చిన మునిని నేను. భరతుడు వచ్చి ప్రార్థింపగా మరి కాదనలేక రాముడు లక్ష్మణునితో, కొందరు మునులతో అయోధ్యకు బయల్దేరాడు. అంతా సిద్ధంగా ఉన్నారు. నిన్ను త్వరగా తీసుకు రమ్మన్నాడు రాముడు. లే! అని తొందర పెట్టాడు. నిజమే అనుకుని వాని వెంట వెళ్ళి సీత విమానమెక్కింది....

ఆకాశంమీంచి విమానం దక్షిణదిశగా మహా వేగంగా పోతూంది. సీత ఇదేదో మోసంలాగుందే ఎవరు నువ్వు? నా రాముడెక్కడ? అని అరిచింది. మాటాడకు అని రావణుడు నిజరూపం చూపాడు. భయంకరమైన ఆ రూపు చూసి సీత భయకంపిత అయి, నాథా! రఘువీరా! రక్షించు, రక్షించు. మరిదీ! లక్ష్మణా! ఎవడో మాయావి రాక్షసుడు ఎత్తుకు పోతున్నాడు అని పెడబొబ్బలు పెట్టుతూంది. ఆ ఆర్తనాదం విని జటాయువు వచ్చి రావణ విమానాన్ని అడ్డుకుని రెక్కలతో ముక్కుతో కాళ్లతో విమానాన్ని రావణుణ్ణీ పీడించ నారంభించాడు. ఆ దెబ్బలకు రౌద్రాకారుడై రావణుడు తీవ్రఖడ్గధారతో జటాయువును తెగనరికాడు. ఆ దెబ్బకు పడిపోతూ జటాయువు దుష్టరావణా! నిరాయుధుణ్ణి ఆయుధంతో చంపడం యుద్ధపద్ధతికి విరుద్ధం. నీ బ్రతుకు రాముని చేతిలో ఆరిపోతుంది. పో! అని పడిపోయాడు. ఆ మాట విని సీత విలపిస్తూ పక్షిరాజా! నన్ను కాపాడాలనే సత్సంకల్పంతో వచ్చి నా కోసం ప్రాణాలర్పించిన ధర్మ మూర్తివి. నా రాముని దయవల్ల నీకు విష్ణులోకప్రాప్తి అవుగాక! రాముణ్ణి చూసి నా వార్త చెప్పేవరకు నీవు సజీవుడవై ఉండు అని అన్నది. రివ్వున వెళ్లిపోతూంది విమానం. సీత తన నగలు తీసి పైటచరగున మూటకట్టి అది అలాగే చింపి ఈ నగలు నా భర్తకి చేరుగాక అని క్రింద పడవేసింది.

రావణుడు జటాయువును దారుణంగా తెగనేసి మహావేగంతో విమానా రూఢుడై సీతను లంకకుచేర్చి తిన్నగా అశోకవనానికి తీసుకుపోయాడు. అక్కడ శింశుపావృక్షం క్రింద ఉంచి, రాక్షసస్త్రీలను రప్పించి ఈమెను జాగరూకతగా కాపాడుతూ ఉండండని గట్టిగా కాపుపెట్టి స్వభవనానికి వెళ్లిపోయాడు. సీతను రావణుడు తోడితెచ్చిన వృత్తాంతం విని లంకావాసులు కొందరు 'లంకావినాశం కోసమే దుర్మార్గుడు ఈ పని చేశాడు' అని తిట్టారు.

సీత పడవైచిన నగలమూట ఒక కొండచరియపై పడింది. ఆ సమయానికి అక్కడ నలుగురు వానరు లున్నారు. వా రామూటతీసి పైన ఉన్న తమప్రభువైన సుగ్రీవున కందించగా అతడు భద్రంగా గుహలో దాచి ఉంచండి, అని అన్నాడు. వా రది తీసుకువెళ్ళి గుహలో ఒకచోట భద్రంగా ఉంచారు.



రాముడు వడివడిగా ఆశ్రమానికి వస్తూ సగం దారికి వచ్చి ఎదురుగా వస్తూన్న తమ్ముణ్ణి చూచి ఒంటరిగా మీ వదినను పర్ణశాలలో విడిచి ఎందుకు వచ్చావు? పద పద! అని గబ గబ పర్ణశాలకి వచ్చాడు. ఏముంది? సర్వశూన్యం! ఆశ్చర్యం. ఆశ్చర్యాన్నిమించి విచారం. గొల్లున ఏడిచాడు. వెనుకనున్న లక్ష్మణుడుకూడా దుఃఖించాడు. రాముడు భరింపరాని విచారంతో పలువిధాల పలవించి పలవించి నేలపై పడిపోయాడు. లక్ష్మణుడు అన్నను లేవనెత్తి ఓదార్చుతూ అన్నా! నీ వంటి గంభీరుడు ఇలా మితిమీరి విచారింప వచ్చునా? లే! పద! శాయశక్తులా మా వదినను వెదుకుదాం. అని చెప్పగా మెల్లగా లేచి ముందుకి అడుగువేశాడు.

కొండ, కోన, పొదరిళ్లు, నదీతీరం– అంతా నల్లపూసను వెదకినట్టు సీతాన్వేషణ చేస్తూ వెళ్ళి వెళ్ళి నెత్తురు క్రక్కుతూ, రెక్క తెగి పడివున్న జటాయువును చూచారు. 'పక్షిరాజా! ఏమిటి ఇలాగా జీవన్మరణావస్థలో ఉన్నావు. మేము రామలక్ష్మణులం అని అనగా జటాయువు హీన స్వరంతో రావణుని దౌష్ట్యం చెప్పి ప్రాణం విడిచాడు. రాముడు విచారించి పక్షీంద్రా! నా కోసం దారుణ మరణం పాలయావు. మహాయోగులూ, ఆత్మద్రష్టలూ, భూదానపరులున్నూ, జన్మాంతమందు పొందే పరమపదం నీకు ప్రాప్తించుగాక! అని రాముడు జటాయువుకి పారలౌకిక క్రియల నిర్వర్తించాడు. తరువాత అన్నదమ్ములిద్దరూ సీతాన్వేషణ చేస్తూ అడవిలో వెళ్తూ ఒక విచిత్ర వ్యక్తిని చూశారు. ఆ వ్యక్తి తల పొట్టలో కలసిపోయి ఉంది. అక్కడ పెద్దకళ్లు. పొడవైన చేతులుచాచి ఆ విరూప వ్యక్తి రామలక్ష్మణులను దగ్గరగా లాక్కున్నాడు. వెంటనే అన్నదమ్ములు సంజ్ఞలు చేసుకొని రెండు చేతులూ సమూలంగా నరికి హతమార్చారు. వాడిపేరు కబంధుడు. వాడిని ఒక పెద్దగోతిలో పడవేసి చేయవలసే తంతు చేయగా వాడు దివ్యపురుషుడై పైన నిల్చుని మహానుభావా! నీవు రాముడవని గ్రహించాను. నేను దేవజాతివాడను. మునిశాపంవల్ల ఈ వికారాకారంతో పడిఉన్నాను. నీ వల్ల నా శాపవిముక్తి అయింది. నీ భార్యను రావణుడెత్తుక పోయాడు. వాణ్ణి హతమార్చడానికి నీకు తగిన సహాయం సుగ్రీవుడు అనే వానరరాజు ఈ మార్గాన కొంతదూరం వెళ్ళితే ఋష్యమూకం అనే కొండమీద ఉన్నవాడు

మిత్రుడై మేలు చేస్తాడు. సెలవు–అని ఒక మంచిమాట చెప్పి ఆ దివ్యుడు ఆకాశాన వెళ్ళిపోయాడు.'

వానిమాటలు వినగానే రాముడు కొంత ఉత్సాహంతో ముందడుగు వేశాడు. అలా అన్నదమ్ములు వెళ్లివెళ్ళి ఒక సిద్ధాశ్రమానికి చేరారు. అక్కడ ఒక వృద్ధశబరి రాముని సమాచారం తెలుసుకుని 'నీరాక కెదురుచూస్తూ గురువుగారి మాటప్రకారం ఇక్కడ ఉన్నాను. వచ్చావా రామన్నా! రా! లచ్చన్నా!' అని ఇద్దరికీ ఎంచి ఉంచిన ఫలాలతో ఆతిథ్యం ఇచ్చింది. అన్నదమ్ములు ఆప్యాయంగా శబరి ఆతిథ్యం స్వీకరించారు. నీకు యోగీశ్వరులు పొందే పరమపదప్రాప్తి అవుగాక! అని రాముడు అనగా ఆ ముసలిది తనుత్యాగంచేసి దివ్యమూర్తియై దేవవిమానారూఢయై దివికి పోయింది. తర్వాత రామలక్ష్మణులు మెల్లమెల్లగా చల్లనిచెట్లనీడల్లో నడచినడచి పంపాసరస్సు వద్దకు వెళ్లారు.

ఆ ప్రక్కనున్న కొండచరియమీద ఉన్నాడు సుగ్రీవుడు. అన్నయైన వాలితో పగకలిగి ఆ కొండమీద నివసిస్తున్నాడు. వాయుపుత్రుడైన హనుమంతుడు, ఇంకా ముగ్గురు ఆత్మీయులైన వానరులు అతనికి తోడు. రామలక్ష్మణుల తాపసవేషాలూ, విల్లమ్ములూ చూసి అన్నపంపిన దూతలని అనుమానించి భయపడి తుప్పున చరియమీంచి ఎగిరి ప్రక్కనున్న తోటలోకి పారిపోయాడు. హనుమదాదులుకూడా అతనితోనే వెళ్లారు.

అక్కడ సుగ్రీవుడు హనుమంతునిచూచి హనుమా! ఆ ఇద్దరు ముని వేషధరులూ ధనుర్బాణాలు ధరించినవారు. వింతగా ఉంది. వాలి నా మీదికి పంపిఉంటాడు. నీవు బుద్ధిమంతుడవు. వారిసమాచారం తెలుసుకుని, అనుమానించడానికి అవకాశం లేకపోతే, మనకి హితకారులయేట్టు వ్యవహారం నడిపి తీసుకురా! అని చెప్పాడు. వెంటనే హనుమంతుడు తోటలోంచి చాటుగా పంపగట్టుకి భిక్షుకరూపం ధరించి వచ్చి రామలక్ష్మణులను సమీపించి సవినయంగా పలకరించాడు. చక్కగా ప్రశ్నించాడు.

ఎవరు మీరు? తాపసవేషాలు, ధనుర్బాణాలు విచిత్రంగా ఉంది, ఎందుకిలా వనసంచారం? ఉన్నది ఉన్నట్టు చెప్పవలసిందిగా కోరుతున్నాను.



ఆ మాటకు సమాధానం చెప్పమన్నట్టు రాముడు చూడగా లక్ష్మణుడు ఇలా అన్నాడు: ఈయన మా అన్న. దశరథమహారాజ నందనుడు. అయోధ్యాధిపతి. పినతల్లి కోరిన వరాల ననుసరించి పట్టాభిషేకం తప్పించుకుని భార్యయైన సీతతోసహా తాపసవేషం ధరించి అడవికి బయల్దేరాడు. ఆయన ననుసరించి ఉండేవాణ్ణి నేను. నా పేరు లక్ష్మణుడంటారు. నేనున్నూ ఆయనతో అడవికి వచ్చాను. జనస్థానంలో మమ్మల్ని మోసగించి రాక్షసు డొకడు మా వదినెను అపహరించాడు. ఆమెను వెదుకుతూ మే మిలాగు అడవులలో తిరుగుతున్నాం– అని లక్ష్మణుడు చెప్పగా విని హనుమంతుడు 'మీకు తోడు కాగలవానిని చూపుతాను రండి నాతో" అని వారిని సుగ్రీవుని వద్దకు తీసుకువెళ్ళి సఖ్యం కలిగించాడు. తర్వాత సుగ్రీవుడు రామునితో చెప్పాడు తనకీ వాలికీ గల భ్రాతృత్వం, పగ. 'ఇక నీవే నా ప్రభువు. నీ ఆజ్ఞను సారంగా నడుస్తాను. నా యథాశక్తిగా నీకు తోడౌతాను. నన్ను కిష్కింధ నుంచి వెడలగొట్టిన ఆ వాలిని చంపి నన్ను కిష్కింధకు చేర్చితే చాలు. ప్రస్తుతం ఇద్దరూ సమానమైన అవస్థలో ఉన్నాం' అని సుగ్రీవుడనగా 'విచారించకు మిత్రుడా! నీ కోరిక నెరవేరుస్తాను. నిన్ను వానరరాజును చేస్తాను'– అని రాముడు వాగ్దానం చేశాడు. సుగ్రీవుడు రాముని మాటకి సంతోషించి 'రామచంద్రా! క్షమించు. పెద్దలవల్ల విన్నమాట చెప్తున్నాను. ఏడు తాటిచెట్లను ఒక్కమారు తెగనేసిన వానివల్ల వాలి మరణిస్తాడట!' అని అన్నాడు. వెంటనే రాముడు వింటబాణం సంధించి ఎట్ట యెదుట కన్పించే తోటలో వరుసగా ఉన్న తాళవృక్షాలపై ప్రయోగించాడు. ఆ బాణం వాయువేగంతో దూసుకు వెళ్ళి ఏడు చెట్లనూ సిగలు తెగకోసి తిరిగి రాముని అమ్ముల పొదికి వచ్చింది. అదిచూసి సుగ్రీవుడు చాలా సంతోషించాడు. తరువాత రాముడు సుగ్రీవుణ్ణి గుర్తించడానికి ఒక పూదండ లక్ష్మణునిచే అతని కంఠాన వేయించి 'పద! వాలిని యుద్ధానికి రమ్మను. నడు కిష్కింధకు' అని ప్రోత్సహించాడు. ముందు సుగ్రీవుడు వెనుక రామలక్ష్మణులు హనుమదాది మంత్రులు నల్గురు.

సుగ్రీవుడు వెళ్ళి కిష్కింధ పొలిమేర నిలిచి పెనుబొబ్బపెట్టి వాలిని యుద్ధానికి రమ్మన్నాడు. వాలి మహారోషంతో వచ్చాడు. వాలి సుగ్రీవుల యుద్ధం

మహోద్ధృతంగా సాగుతూంది. కొంతసేపటికి సుగ్రీవుని బలం తగ్గినట్టు కనిపించింది. చెట్టుచాటుగా నిల్చున్న రాముడు ఒక సామాన్య బాణం ప్రయోగించాడు. అది సరిగా వక్షానికి తగిలిందో లేదో పిడుగుపడ్డ కొండ శిఖరంలాగా వాలి డబ్బున నేల కొరిగాడు. అతడికి జరుపవలసే పారలౌకికపు తంతు రాముడు సుగ్రీవునిచే జరిపించి హనుమదాదుల సాహయ్యంతో వానర రాజ్యాధిపతిగా పట్టాభిషిక్తుణ్ణి చేయించాడు. వాలి పుత్రుణ్ణి అంగదుణ్ణి యువరాజుగా నియోగించవలసిందని సుగ్రీవునకు అప్పగించాడు. ఆ విధంగా అంగదుడు యువరాజయాడు. అప్పుడు సుగ్రీవుడు 'రఘువీరా! వర్షాకాలం సమీపించింది. ఈ సమయంలో వానరులు తిరగలేరు. శరత్కాలం రాగానే సీతాన్వేషణకు చారులను నలుదిక్కులా పంపుతాను. అంతవరకు ఋశ్యమూకం గుహలో నివసించవలసి ఉంటుంది. ఏమంటావు?' అని అన్నాడు.

'అలాగే కానీ!' అని రాముడు ఒక్కమాట మాత్రం అని తమ్మునితో ఋశ్యమూక కందరంలో బస ఏర్పాటు చేసుకున్నాడు.....సుగ్రీవుడు నిశ్చింతగా రాజ్యభోగాలనుభవిస్తూ కిష్కింధలో కాలక్షేపం చేస్తున్నాడు.

* * *

కారుమబ్బులు నీరుకారి తెల్లమొగాలతో దిక్కుల కానలకు చేరాయి. శరద్రాత్రులు కప్పురపుపొడి చల్లినట్లు చల్లని తెల్లని వెన్నెల వెల్లివిరిస్తున్నాయి. రాముడు లక్ష్మణుణ్ణి సుగ్రీవునివద్దకు పంపాడు సీతాన్వేషణకు ప్రయత్నించ వలసిందనే కబురుతో....

లక్ష్మణుని హెచ్చరిక, హనుమంతుని బోధ, తార సంప్రదింపూ ఏకమై సుగ్రీవుని మత్తు తీర్చి యథోచితమైన కర్తవ్యానికి దారికి తెచ్చాయి. హనుమదాదులతో రాముని వద్దకు వచ్చాడు. సమర్థులైన వానరులను, నలుదిక్కులనున్న వానరులను, వేగరులను పంపి రప్పించాడు. అందరూ వచ్చారు. వారిలో ఎంచి తూర్పు, పడమర, ఉత్తర దిక్కులను తగిన వానరులను 'సీతాన్వేషణ చేసి వార్త ఏదయినా సరే ముప్పదవరోజు మించకుండా వచ్చి చెప్పాలి. ఆ గడువు దాటివచ్చిన వారికి ముక్కూ చెవులూ తెగిపోతాయి–' అని శాసించి హనుమదాదులనుచూస్తూ అన్నాడు...



'దక్షిణదిశకు జాంబవంతుడు, అంగదుడు, మైంద ద్వివిదులు, ఇంకా పేరుగల వీరులూ, ఆంజనేయుడు అన్వేషకులు...'

సుగ్రీవుడు, అందరిలో అన్నివిషయాల పెద్దవాడైన జాంబవంతుని 'తాతా! అన్నివిధాలా నీ బుద్ధిని ఉపయోగించి రామకార్యం సాధించి రావాలి' అని ఒకమాట ఆదరంగా అన్నాడు. ఆ మాటకే జాంబవంతుడు చేతులు మొగిచి 'వానరేంద్రా! యువరాజు అంగదుడు, అతిలోకధీమంతుడు హనుమంతుడు, అసహాయశూరులు ఈ మైందాదులు ముందుండగా రఘురామునికార్యం సాధ్యం కాకపోవడమేమిటి? సెలవు, వెళ్ళివస్తాం'–అని సుగ్రీవునకు రామలక్ష్మణులకు నమస్కరించి అంగదాదులను చూసి 'లెండి' అని సన్నగా అన్నాడు.

అప్పుడు రాముడు హనుమంతుణ్ణి దగ్గరకు రమ్మని 'ధీమంతా! హనుమంతా! ఇంతవరకూ మాకు అంతా అనుకూలంగా నడిపావు. ఇటుపై కూడా అలాగే నడుపు. వెళ్ళి త్వరగావచ్చి సంతోషకరమైన వార్త చెప్పండి' అని అందరినీచూసి అనగా 'స్వామీ! అలాగేచేస్తాం కానీ ఆ తల్లి మమ్మల్ని నమ్మడానికి అనువుగా ఏదేనా ఆనవాలు దయచెయ్యవలసిందిగా కోరుతూన్నానని చల్లగా అన్నాడు. రాముడు తన పేరున్న ఉంగరం తీసి ఇచ్చి 'హనుమా! జానకి మా శరీరలక్షణాలు అడగవచ్చు. నిదానించి చూచివెళ్లు' అని అనగా హనుమంతుడు రామలక్ష్మణులను ఒక్కసారి తేరిచూసి తెలుసుకున్నాను! వెళ్ళివస్తానని రామ లక్ష్మణులకు సుగ్రీవునకు నమస్కరించాడు. అంతా బయల్దేరారు. సుగ్రీవుడు జాంబవంతుణ్ణి చూసి 'విన్నారు కదా గడువు?' అని అన్నాడు. విన్నామన్నట్టు జాంబవంతుడు మెల్లగా తల ఊపి ముందడుగువేశాడు. వెనుక అంగదాదులు మహానందంగా, సందడిగా, ఎగురుతూ, కుప్పిగంతులు వేస్తూ బయలుదేరారు.

కనుపించిన అడవి, కొండలూ, కోనలూ, తోటలూ, పొదరిళ్లూ ఏమరుపాటు లేకుండా వెదకి వెదకి జాంబవదాదులు ఒక కొండగుహలో

ప్రవేశించారు. అది అక్కడి కక్కడ వెయ్యి సూర్యులు ఉదయించినట్టు వెలుగుతూంది. అల్లనల్లన ముందుకి వెళ్లారు. ఒకచోట నల్లలేడి చర్మంపై ఒక తాపసి ధ్యానముద్రలోఉంది. చూసి కిమ్మనకుండా కాస్తదూరంగా నిల్చున్నారు. కొంతసేపటికి ఆమె తెల్లతామరరేకుల్లాగా మిలమిలలాడే కళ్లు అల్లనల్లన తెరిచి, వానరులనుచూసి, ఆశ్చర్యంగా అడిగింది– 'ఎవరు మీరు? ఈ చోటికి ఎందుకు వచ్చారు?' అని. జాంబవంతుడు తమ పని చెప్పాడు. ఆమె వారికి తియ్యని ఫలాలతో, చల్లని పానీయంతో ఆతిథ్యమిచ్చి 'మంచిది. రామకార్యం. ఇక్కణ్ణించి వెలుపలకువెళ్ళి కొంతదూరం వెళ్లండి. మహేంద్రగిరి అనే కొండఉంది అక్కడ. దానిపై శతవృద్ధ' సంపాతి అనే పక్షిరాజు ఉంటాడు. మీ పనికి తగిన మార్గం చెప్తాడు, అని అన్నది. జాంబవదాదులు, ఆమెను స్వయంప్రభగా తెలుసుకుని విశ్రాంతి తీసుకుని బయటికి వచ్చారు. త్వరగా మహేంద్రగిరిని చేరుకున్నారు. ఒక చెట్టు క్రింద కూర్చున్నారు. అప్పుడు జాంబవంతుడు విచారంగా అన్నాడు. 'నెలపై పదిరోజు లయింది. వానర రా జిచ్చిన గడువుదాటింది. ఇంత వరకు మనం అటూ ఇటూ తిరగడం తప్ప పని కాలేదు. స్వయంప్రభ అసత్యం చెప్పదు. ఆ సంపాతి దర్శనం కాలేదు. మనగతి ఏమి?....'అని అలా విచారంగా అంటూండగా సంపాతి ఆ చెట్టుకొమ్మమీంచి క్రిందికివచ్చి 'నేనే సంపాతిని. ఎవరు మీరు? ఏమిటి మీ పని?' అని అడిగాడు. జాంబవంతుడు చెప్పాడు. ఆ చెప్పడంలో జటాయువు మరణవార్తకూడా చెప్పక తప్పలేదు. అది విని సంపాతి 'అలాగా? ఆ దుష్టరావణుడి చేతిలో నా సోదరుడు మరణించాడా? దైవనిర్ణయం'– అని విచారించి 'వానరవీరులారా! ఈ సముద్రాన్ని దాటి ఆవలి దిక్కున ఉన్న లంకకు వెళ్ళాలి. అది రావణుని ఏలుబడిలో ఉంది. వాడు సీతను అశోకవనంలో ఉంచాడు. నాకు గల దూరదృష్టితో ఈ మాట అంటున్నాను. వెళ్ళండి. పని సాధించుకోండి'– అని అక్కడికక్కడ శరీర త్యాగం చేసి స్వర్గానికి వెళ్లిపోయాడు...



తరువాత జాంబవంతుని ప్రోత్సాహంతో హనుమంతుడు అందరి వద్ద సెలవుతీసుకొని రామలక్ష్మణులకు, సుగ్రీవునకు మనసా నమస్కరించి గురువైన సూర్యునకూ, దేవతలకూ అభివందనాలు చేసి కొండ ఎక్కి తండ్రిని స్మరించి కుప్పించి పైకెగిరాడు...

మహావేగంతో పైనుంచి వెళ్తూన్న హనుమంతునకు విశ్రాంతి కలిగించాలని సముద్రుడు తనలో ఉన్న మైనాకుడనే హిమగిరి కొడుకును పైకి పంపాడు. ఎదురుగా నిల్చున్న ఆ గిరికుమారుణ్ణి చేతితో ఆదరంగా స్పృశించి 'రామకార్యం సాధించాకగానీ విశ్రాంతి తీసుకోను, వస్తాను అని హనుమంతుడు ముందుకి దూసుకుపోయాడు. అలాగే దేవపరీక్షకు ఆగి సింహికను జయించి వెళ్లాడు. ప్రొద్దుపోయేసమయానికి సముద్రానికి ఆవలి వైపున్న త్రికూటపర్వతం మీదికి దిగాడు. చీకటిపడినతర్వాత లంక వెదకడానికి తలపోసి సాయంసంధ్యను ఉపాసించి ఒకచెట్టుమీద నక్కి ఉండిపోయాడు.

ప్రొద్దుపోయింది. చీకటిక్రమ్మింది. అంగుష్ఠమాత్రమైన రూపం ధరించి లంకలో ప్రవేశించాడు. రావణుని అంతఃపురం, శయన మందిరం, పాకశాల పరిశోధనగా చూశాడు. సీతాదర్శనం కాలేదు. ఒకచోటనిల్చుని విచారించాడు. 'ఆఁ...సంపాతిచెప్పాడు. సీత అశోకవనంలో ఉందని.' తుప్పున ఎగిరాడు. అశోకవనంలో ప్రవేశించాడు. మెల్లమెల్లగా శింశుపావృక్షంమీద వ్రాలి క్రిందికి చూశాడు. చుట్టూ రాకాసిమూక. చెట్టు మొదట ముడుచుకుకూర్చున్న జానకి, ఆకులచాటునుంచి చూశాడు. 'ఆఁ....ఈ సాధ్వి జనకతనయా. సందేహం లే' దనుకున్నాడు. అంతలో వాద్యధ్వనులు. రావణుడు సముచిత కాంతాపరిజనంతో వస్తున్నాడు.

'సీతా! ఈ దాసుణ్ణి అనుగ్రహించు. ఆ దీనమానవుడి మీద ఆశ వదులుకో! దిక్కూ దిశా లేని ఆ నరమాత్రుడు సముద్రం దాటి రావడం, నన్ను

గెలవడం, నిన్ను తీసుకువెళ్లడం ఈ జన్మలో అయేది కాదు. చూడు. ఈ లంకారాజ్యానికి చక్రవర్తినివై మండోదరి మొదలు నా భార్యలందరూ నీకు సేవలుచేస్తూ పరిచారికలుకాగా, సకలలోక విజేతనైన నేను నీ కను సన్నలలో మెలిగే సేవకుడనుగా ఇష్టోపభోగాలనుభవిస్తూ నా దివ్యసౌధంలో హాయిగా ఉందువుగాని లే. ఎందుకు వచ్చిన వనవాసం ఇది' అని రావణుడు ఏదో ఆస చూపుతూన్నట్టన్నాడు, సీతకి అంతదూరంలో నిల్చుని. ఆ మాటలు విని సీత ఒక గడ్డిపోచ పట్టుకుని–

'నీచుడా! ఆ నరమాత్రుని బాణాలు నీ ప్రాణాలుతీసే సమయం సమీపించింది. నువ్వూ, నీ దుష్ప్రవర్తనకి వంతపాటపాడే నీ అనుచరులూ, సహచరులూ, దారుణంగా నా పతి బాణాలకూ, నా మరది లక్ష్మణుని అస్త్రాగ్నికి భస్మం అయిపోయేకాలం ఆసన్నమయింది. పరకాంతా వ్యామోహం ఊరక పోదు...పో...' అని పెడమొగంగా శాపం పెట్టినట్టు నాలుగు మాటలన్నది.

రావణుడు సీత మాటలు విని కోపంతో రౌద్రాకారుడై చుట్టూఉన్న రాకాసులనుచూసి 'ఓసీ! ఈ మానవికి రెండునెల్లు గడువు. ఈలోపున నాకు లొంగునట్టు చేయండి. లొంగకపోతే ఆపైన నన్నడగ నక్కరలేదు. దానిని చిత్రవధచేసి మీ చల్దికూడుగా ఆరగించండి' అని గిర్రున తిరిగి వెళ్ళిపోయాడు. రావణుని దుర్భాషణం విని చెట్టుపైనున్న హనుమంతుడు క్రిందికి దుమికి 'ఒక్క గ్రుద్దుతో వీని పని పట్టుదునా?' అని అనుకొని అంతలోనే శాంతించి 'ఇది సమయం కాదు. తొందరపడి రామకార్యం పాడు చెయ్యకూడదు'–అని సర్దుకున్నాడు.

అంతలో కాస్తదూరంలో నిద్రిస్తూఉన్న త్రిజట అనే రాక్షసిదిగ్గున లేచింది. సీతను బెదిరిస్తూన్న రాక్షసాంగనలను వారించి 'ఇదిగో వినండి నా మాట. నాకు విచిత్రమైన కలవచ్చింది. అది రావణుడికి మరణప్రదం, రామ



లక్ష్మణులకు విజయప్రదం; సీతకు పతిప్రదం. రావణుణ్ణి అనుసరించే రాక్షసుడెవడూ బ్రతికి ఉండడు. ఇది తెల్లవారుజాము కదర్రా! తప్పదు అతి సమీపకాలంలోనే జరుగుతుంది. సీతను ఈ నిమిషం నుంచి పల్లెత్తు మాటాడక మంచిగా ఉండండి. నామాట వినండి' అని చెప్పగా వాళ్లు బెదురుతూ అక్కణ్ణించి వెళ్ళిపోయారు.

హనుమంతుడు చెట్టుమీంచి క్రిందికి దిగి, రామలక్ష్మణుల వృత్తాంతం, సుగ్రీవమైత్రిచెప్పి ఆమెకు నమ్మకం కలిగేట్టు రాముడిచ్చిన ఉంగరం ఇచ్చి రామలక్ష్మణుల శరీరలక్షణాలు, స్వభావాలూ చెప్పాడు. 'విచారించకమ్మా! త్వరలో రాముడు, సుగ్రీవ సహాయంతో, వానర సేనతో వస్తాడు. నీ మరిది లక్ష్మణుడు మహారథుడు. సామాన్యుడు కాడు. శరసంధానంలో లక్ష్మణునకు లక్ష్మణుడే సాటి. ఆ అన్నదమ్ములు ఈ దుష్టరావణుణ్ణి బంధుమిత్రపుత్రాదులతో హతమార్చి నిన్ను తీసుకువెళ్లుతారు. వానరరాజు సుగ్రీవుడు, యువరాజు అంగదుడు, బుద్ధికీ బలానికీ పేరుగలవాడు జాంబవంతుడూ పగవారి ప్రక్కలో బల్లాలు వానరులా ఆ రూపాలలో ఉన్న యములే. నామాట నమ్ముతల్లీ!' అని ఓదార్పుగా చెప్పగా విని సీత నమ్మింది. నిజంగా రామదూతే అని. కాని అడిగింది 'సామాన్య వానరుడుగా కన్పిస్తున్నావు. దాట శక్యంకాని సముద్రాన్ని ఎలా దాటగలిగావు?' అని.

'అమ్మా! నేను రామునిబంటును రామనామం జపిస్తూ పైకెగిరాను. నాకు ఆ దివ్యనామజపం వల్ల అంత సముద్రమూ గోష్పాదమంత అయి పోయింది. తెలిసిందా? ఆ సుగుణాభిరాముడు, రాముని నామమహిమ అలాంటిది... ఇంకేముంది? పోయివస్తాను. ధైర్యంగా ఉండు. మరి ఆయన నమ్మకం కోసం ఏమేనా చెప్పవలసేది, ఇవ్వవలసేది అనుగ్రహించు అని సవినయంగా అన్నాడు హనుమంతుడు.

వెంటనే సీత శిరోరత్నం ఇచ్చి కాకాసుర పరాభవకథ చెప్పింది. అలాగే ఒకనాడు చిత్రకూటపర్వతం దగ్గర వనంలో విహరిస్తూండగా, ఎండకి నానుదుట తిలకం కరిగిపోగా మనశ్శిలాద్రవంతో నొసట రఘురాముడు తిలకం దిద్దడం జరిగింది. ఇది ఎవరికీ తెలియని విషయం. ఆయనకి చెప్పు. కాకిపై గడ్డిపోచను బ్రహ్మాస్త్రంగా మంత్రించి ప్రయోగించిన అస్త్రవిద్యావిశారదుడు. కట్టుకున్న ఇల్లాలు కరకు రక్కసుని చెరలో ఉండడం ఎలా సహించి ఊరకున్నాడో? అని అడిగానని మీ రామునితో అనుమా హనుమా!.

ఆ మాట కంఠంలోంచి కొంచెం పరుషధ్వనితోనే వచ్చింది. దానిలో ఆక్షేపణకూడా తొంగిచూస్తున్నట్టుంది. హనుమంతుడు నిదానంగాచెప్పాడు.

'అమ్మా! నీ ఉనికి తెలియనిదే రాముడు ఏమి చెయ్యగలడు? ఇదిగో! ఇప్పుడు నేను వెళ్ళి నీ సమాచారం చెప్పాక ఏమవుతుందో నీకే తెలుస్తుంది. పోయి వస్తాను' అని సెలవుతీసుకుని నాలుగడుగులు ముందుకి వేసి ఒక చోటనిల్చుని ఆలోచించాడు.

రావణుణ్ణి ఎలా చూడాలి ? ఏమిటి ఉపాయం? చెట్లను మునుంపెట్టి కూకటివ్రేళ్ళతో పెల్లగించి విరిచి పోగులుపెట్ట నారంభించాడు. హనుమంతుడు శింశుపావృక్షం ఒక్కటితప్ప ఆ ప్రదేశంలో ఒక్క మొక్కైనా నిలచి ఉన్నది లేదు. వనపాలకులు అడ్డుకుని చావుదెబ్బలు తిన్నారు. ఎవడో పోయి రావణుడికి చెప్పాడు. 'తోటా దొడ్డీ నామరూపాలులేకుండా పోయాయి, ఒకకోతి ప్రతాపంవల్ల!' అని.

రావణుడు ఆశ్చర్యంగా చూసి పెద్దకొడుకుని అక్షుడు అనే వాణ్ణి హనుమంతునిమీదికి పంపాడు. ఆ అక్షుడు కొంతసైన్యాన్ని వెంట పెట్టుకుని వచ్చాడు. ఆ సమయానికి హనుమంతుడు తోరణం మీద కూర్చుని 'అతిరథుడు రాముడు జయించుగాక! మహారథుడు లక్ష్మణుడు జయించుగాక! రాముని రక్షణలో ఉన్న వానరరాజు సుగ్రీవుడు జయించుగాక!' అని పెడబొబ్బలు పెట్టుతున్నాడు.



అక్షుడు 'వానివెంట వచ్చిన సైనికులు' తరువాత చాలామంది రాక్షసులు వీరాంజనేయుని విక్రమాగ్ని జ్వాలలకు సమిధలై పోయారు. తదుపరి ఇంద్రజిత్తు వచ్చి కొంతసేపు కలహించి బ్రహ్మాస్త్రం ప్రయోగించి బంధించి హనుమంతుణ్ణి తండ్రికొలువుకి తీసుకు వెళ్ళాడు. అక్కడు రామలక్ష్మణులను, సుగ్రీవుణ్ణి విశేషించి వర్ణించి రావణునికి నీతిపాఠం చెప్పాడు. ఆపైన లంకను కాల్చి మరల సీతను దర్శించి సెలవు తీసుకుని అనాయాసంగా సముద్రం దాటి మహేంద్రగిరి దరినున్న అంగదాదులను కలుసుకున్నాడు. సీతాదర్శనం వగైరా లంకలో తాను చేసిన ఘనకార్యాలు వారికి చెప్పి ఆనందపరిచాడు. ఆ ఆనందాతిశయంతో అంగదుని అజ్ఞ నొంది, అందరూ మధువనంలో ప్రవేశించి, వన పాలకుణ్ణి దధిముఖుణ్ణి తర్జించి, స్వేచ్ఛగా ఫలరసాలు, తేనెలు త్రాగి సుగ్రీవాజ్ఞను మన్నించి, రామునివద్దకు వచ్చారు.

హనుమంతుడు రామలక్ష్మణులకు, సుగ్రీవునకు నమస్కరించి తాను సముద్రం దాటినది మొదలు తిరిగివచ్చినందాక జరిగిన కథ అంతా విశదంగా చెప్పి 'రఘునాయకా! శీలవతీశిరోమణి జనకజాత సీత, అశోకవనంలో నీ నామజపంతో తపస్సుచేస్తూంది. నీ కీ శిరోరత్నం అనవాలుగా ఇచ్చింది ప్రభూ! స్వీకరించు' అని చూడామణిని ఇచ్చాడు. చిత్రకూటపర్వత ప్రాంతాన ఒకనాడు జరిగిన కాకాసుర వృత్తాంతం ఆ తల్లి చెప్పి, ఆవంక అపరాధం చేసిన కాకిపై బ్రహ్మాస్త్రం ప్రయోగించిన ఆత్మాభిమాని 'కట్టుకున్న ఇల్లాలి నెత్తుకుపోయి తనతోటలో చెట్టుక్రింద చెరపెట్టిన క్రూరరాక్షసుణ్ణి ఎందుచే ఉపేక్షించాడో తెలియదు–అని ముదలకించినట్టు విచారిస్తూ చెప్పింది. రఘుకులస్వామీ! ఇక జాప్యమెందుకు? ఆ తల్లి చెర విడిపించడానికి ప్రయత్నించాలని చెప్పాడు. రాముడు చూడామణిని చూసి హనుమముఖతః ఇల్లాలి మాటలు విని గుండెకరిగి కన్నీరు మున్నీరుగా ఏడిచాడు. అప్పుడు ప్రజ్ఞావంతుడు జాంబవంతుడు ఓదార్చి, వానరేంద్రుణ్ణి సాభిప్రాయంగా చూశాడు. ఆ చూపు

అర్థం చేసుకుని సుగ్రీవుడు శపథం చేసినట్టు రామునికి ధైర్యం చెప్పి పదండి సముద్రం వద్దకు' అని సేనాపతులకు ఆజ్ఞ ఇచ్చాడు. అచిరకాలంలో అందరూ సముద్రం వద్దకు చేరారు. ఉల్లోల కల్లోలంగా ఉన్న సముద్రాన్ని చూసి రాముడు ఈ సముద్రాన్ని దాటడం ఎలాగ? అని ఇసుక నేలపై కూలబడ్డాడు.

పాహిమాం పాహి రఘువీరా! ధర్మావతారా!' అని ఎదురుగా మింటి నుంచి ఆర్తనాదం వినవచ్చింది. రాముడా వంక చూశాడాశ్చర్యంగా. నా పేరు విభీషణుడు; రావణుని చిన్నతమ్ముడను. మంచిని బోధించగా వినక అవమానించి నన్ను బహిష్కరించాడు. నీవే శరణు అని వచ్చాను' అని ఆ వ్యక్తి ఉచ్ఛైస్స్వరంతో అన్నాడు. వెంటనే హనుమంతుడు మంచిదన్నట్టు తల ఊపాడు. రమ్మన్నట్టు రాముడు చెయ్యి ఊపాడు. బుద్ధిమంతులైన నలుగురు మంత్రులతో విభీషణుడు రాముని ముందువాలి పాదాలకు తలచేర్చి సాష్టాంగ నమస్కారం చేశాడు. రాముడతనిని ఆప్యాయంగా రెండు చేతులతో లేవనెత్తి అభయమిచ్చి వెంటనే సముద్ర జలాలు హనుమంతునిచే తెప్పించి 'విభీషణా! నువ్వు లంకకి రాజువు' అని ఆ జలాలతో అభిషేకించాడు. విభీషణుడు, సముద్రుణ్ణి ప్రార్థిస్తే, సేతుబంధనం సుసాధ్యమౌతుందని చెప్పాడు.

రాముడు దర్భాసనంపై తూరుపు మొగముగ మూడు అహోరాత్రులు ప్రాయోపవేశం చేశాడు. ఫలితం కనిపించ లేదు లేచాడు. తమ్ముణ్ణి చూచాడు. 'సౌమిత్రీ! విల్లు తే! విషసర్పాలవంటి బాణాలిలా అందించు!' అని బలాత్కరించి లాక్కుని 'చూడు ఈ సముద్రాన్ని ఇంకిస్తాను. మన వానర సైనికులు నిరపాయంగా నడిచి ఆవలకు వెళ్ళుతారు....అని' ఆగ్నేయాస్త్రం వింట సంధించాడు. దానిలోంచి పెనుమంటలు వస్తున్నాయి.

'త్రాహి! త్రాహి!' అని దివ్యపురుషవేషంతో సముద్రుడు వచ్చి 'ప్రభూ! కోపించకు. స్వభావానికి విరుద్ధంగా నడవకూడదు. నీకు తెలియనిదేముంది?



వానరసైన్యంలో అడుగో నలుడనే శిల్పి ఉన్నాడు. అతనిచే రాళ్లతో, వృక్షాలతో నాపై సేతువు కట్టించు. నిరపాయంగా అందరితో అవతలికి వెళ్ళు! అని అంతర్ధానమైనాడు...'

వానరులు తెచ్చి యిచ్చే కొండలతో, బండలతో, చెట్లతో, చేమలతో నలుడు సముద్రంమీద సేతువు కట్టాడు. రామాదులు వానర సైన్యంతో సేతువు మీంచి ఆవలిగట్టుకి చేరి అక్కడ ఉన్న సువేలాద్రివద్ద విడిశారు.

ఆ రాత్రి ఎలాగో గడపి తెల్లవారినతర్వాత రాముడు అంగదుణ్ణి రావణుని కడకు దూతగా పంపాడు! 'ధర్మపద్ధతి ననుసరించి తప్పొప్పుకుని సీత నప్పగించడం మంచిది! అని చెప్పి రా. ముందుగా కయ్యానికి కాలుదువ్వడం తగవు కాదు, అని-అంగదుడు వెళ్లాడు. రావణుని కొలువులో చూసి 'రామదూతను, వాలి పుత్రుడను, నా పేరు అంగదుడు' అని చెప్పి ధర్మబోధ చేశాడు. వాడు వింటాడా? 'పట్టుకోండి ఈ కోతిని' అని భటుల కాజ్ఞాపించాడు.

అంగదుడు రివ్వున ఎగిరాడు. రావణుని కిరీటం ఎంతోదూరం ఎగిరిపడేట్టు ఎడమకాలితో నెత్తిమీద ఒక తాపు తన్నాడు. పట్టుకోడానికి వచ్చిన నలుగురు రాక్షసులను ఒక్కొక్క చరుపుతో మెడలు విరిగేట్టు పడగొట్టాడు. 'ఇక కోతులదెబ్బ కాచుకో! రావణా!' అని ఒక అరపు అరచి క్షణంలో రాముని ముందు వాలాడు. జరిగినది చెప్పాడు. 'శ్రీరామా! ఆ వ్యక్తి అలా వినేవాడు కాడు' అని హేలగా అన్నాడు విభీషణుడు.

రావణుడు చారులవల్ల వానరసైన్యం సమాచారం తెలుసుకుని బెదిరి బెదరనట్టు నటిస్తూ లంక నాలుగు ద్వారాలకూ తగిన సైన్యాన్నీ, రాక్షసవీరులనూ కాపరులుగా నియమించాడు.

యుద్ధం ఆరంభం అయింది. ఉత్తరద్వారాన తగిన బలగంవెంట ఉంచుకుని రావణుడే నిల్చున్నాడు. భయంకరమైన ఆ యుద్ధంలో వానరులూ, రాక్షసులూ చాలమంది మరణిస్తున్నారు.

దేవదానవులకు అజేయుడైన ఇంద్రజిత్తు లక్ష్మణునిచేతిలో తను త్యాగం చేశాడు. కుంభకర్ణుడు మొదలైన పేరూ ప్రఖ్యాతీగల రాక్షసవీరులూ, రావణుని మంత్రులూ ఒకరి తర్వాత ఒకరు రాముని బాణాలకూ, సుగ్రీవ హనుమ దంగదాది వీరాగ్రణుల భుజబలానికీ బలి అయిపోయారు. చివరకు రావణుడు ఒక్కడే మిగిలాడు.

అనుకోకుండా ఆ నాడు ఇంద్రుడు మాతలి సారథిగా రథం పంపాడు రామునకు. ఆ సమయంలో అగస్త్యమహాముని వచ్చి ఆదిత్య హృదయం ఉప దేశించాడు. రాముడు దానితో దుర్నిరీక్ష్యమైన తేజస్సుతో వెలుగుతూ కొంతసేపు సామాన్యపద్ధతిలో యుద్ధం నడిపి, క్రమక్రమంగా మధ్యాహ్నమార్తాండుడు లాగా విరాజిల్లి, బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. అంతే రావణుని శిరోదశకం మశక మాలికలాగా రూపుమాసింది. అంతలో బ్రహ్మేంద్రాదులువచ్చి రాముణ్ణి బహుధా స్తుతించారు. తరువాత ఇంద్రుడు తనతో నున్న దశరథణ్ణి రామలక్ష్మణులకు చూపి సంతుష్టులను చేశాడు. తదుపరి విభీషణుడు ఒక చక్కని శిబికలో సీతాదేవిని కూర్చుండబెట్టి తగిన రాక్షస కాంతలతో శ్రీరాముని వద్దకు తీసుకు వచ్చాడు. రాము డామెను అగ్నిసాక్షిగా పావనమూర్తిగా స్వీకరించి, విభీషణుడు కొనివచ్చిన పుష్పకవిమానం నధిష్ఠించి, సీతాసమేతుడై విభీషణాది విశిష్ట రాక్షసులతో, సుగ్రీవాది వానరశ్రేష్ఠులతో, ముందు నందిగ్రామానికి వచ్చాడు.

ఆ నాటితో పద్నాలుగు సంవత్సరాలై పోయింది. రామాగమనం కోసం భరతుడు నిరీక్షిస్తున్నాడు. అతనికోరిక తీరింది. అన్నదమ్ములు కలుసుకున్నారు. అభివందనాలకన్నా ఆలింగనాలే కన్పించాయి. అందరూ కోలాహలంగా అయోధ్యకు వెళ్లారు. కులగురువు వసిష్ఠుడు నిర్ణయించిన శుభముహూర్తాన శ్రీరామపట్టాభిషేకం జగజ్జేగీయమానంగా జరిగింది. తల్లులు ముగ్గురూ మహదానందభరితలైనారు. రాముడు ధర్మమార్గాన సర్వమనోరంజనంగా పరిపాలించి సమయానుసారంగా యజ్ఞయాగాలుచేసి సంతోషంగా స్వస్థానానికి



వెళ్లిపోయాడు, అని చెప్పి మార్కండేయుడు 'రాజా! శ్రీహరి తరువాతి అవతారాలు–

**రామకృష్ణావతారాలు:**

విను వాటిని గురించి చెప్తాను.

ఒకప్పుడు భూదేవి సత్యలోకానికి వెళ్లి నిండుకొలువులో నిగమగోష్ఠిలో ఉన్న బ్రహ్మనుచూచి దీనంగా విన్నవించింది. ఏమని?

'కమలాసనా! దేవదానవయుద్ధంలో విష్ణుచక్రానికి బలియైన దానవులు నేలపై క్షత్రియవంశాలలో జన్మించారు. కంసుడు మొదలైన వారు వారే. నీతీ నియమం, జాతీ గౌరవం లేకుండా ప్రవర్తిస్తున్నారు. వారిని భరించడం నావల్ల కాకుండా ఉంది. ఆ బరువు తీరేవిధం ఏదో చూడవలసిందని విన్నవించడానికి వచ్చాను' అని అన్నది. కమలాసనుడు ఓర్పుగా విన్నాడు, ఓదార్పుగా అన్నాడు– 'అమ్మా! విచారించకు. నీకీ భారం తీరాలంటే ఆ పుండరీకాక్షుని అనుగ్రహం ఆవశ్యకం. నేను ఇప్పుడే పాలకడలికి వెళ్లి, శ్రీమన్నారాయణుని ప్రార్థించి, యీ విషయం విన్నవించి, కార్యోన్ముఖుణ్ణి చేస్తాను. నీవు కాస్త ఓర్చుకుని నాలుగుదినాలు గడుపు, అని అనునయిస్తూ పంపాడు. ఇంద్రాదులను వెంట నుంచుకుని పాలసముద్రం ఉత్తరతీరానికి వెళ్లాడు. అక్కడ శేషశాయియై ఉన్న శ్రీమన్నారాయణుణ్ణి స్తుతిసుమాలతో పూజించాడు. నారాయణదేవుడు అల్లనల్లన మేల్కొని దర్శనం అనుగ్రహించి పద్మసంభవా! ఏమిటి ఇలాగు వచ్చారంతా?' అని ఆదరంగానే అడిగాడు. బ్రహ్మ భూభార వృత్తాంతం విన్నవించాడు. 'సరే! నా శక్తులు సిత (తెల్లనిది), అసిత (నల్లనిది) వసుదేవునియందు ప్రవేశించి అతనిభార్యలైన రోహిణీ దేవకుల పుత్రులైపుట్టి కంసాది దుష్టులను సంహరిస్తాయి. ఆ విధంగా భూభారం తీరుతుంది, అని అంతర్ధానమయాడు శ్రీమన్నారాయణుడు. అప్పుడే ఆ పని జరిగినంత ఆనందంగా బ్రహ్మాదులు తమ తమ ప్రదేశాలకు వెళ్లిపోయారు.

తరువాత శ్రీహరి సితశక్తి వసుదేవునిభార్య రోహిణి గర్భవాసాన మగబిడ్డడై జన్మించింది. ఆ శిశువే బలరాముడు. అసితశక్తి దేవకి గర్భాన కొడుకుగాపుట్టింది. అతడే కృష్ణుడు. ఆ అవతార పురుషులు చిన్నతనంనుంచి దుష్టసంహారకేళి అత్యద్భుతంగా చేశారు వినురాజా! చెప్తాను.

భుజబలానికి సాటిలేనివాడై రాముడు బలరాముడుగా పెరుగుతూ బాలకేళిగా ఒకనాటిరాత్రి బాలఘాతుకురాలైన శకుని అనే నిశాచరిని కిక్కురు మనుకుండా పీకనొక్కి పీనుగును చేశాడు. ఇక అదేవరుస. క్రమంగా పెరుగుతూ ధేనుకాసురుణ్ణి, ప్రలంబుణ్ణి సంహరించాడు. మథురానగరంనందు కంసుని మల్లులలో ఒకడైన ముష్టికుణ్ణి, వాడి మిత్రుడైన పుష్కరకుణ్ణి యమపురికి పంపాడు. కంసుని సోదరుడైన సునాభుణ్ణి మల్లులకు తోడుగా పంపాడు.

తమ్మునితో కలిసి తాతకి పట్టాభిషేకం చేశాడు. సాందీపనివద్ద విద్యలు నేర్చాడు. మథురపై దండెత్తివచ్చిన మగధరాజబలాన్ని మర్దించి ముద్దచేశాడు. సముద్రజలాలలో ద్వారక నిర్మాణానికి ముందు నిల్చినవాడు బలరాముడు. స్నానానికి పిలిస్తే దగ్గరకు రాలేదని కోపించి తన ఆయుధమైన నాగలితో యమునను తోటలో తనవద్దకు ఆకర్షించాడు. రేవతిని పరిగ్రహించి గృహస్థు అయాడు. జూదంలో కళింగరాజు దంతా లూడగొట్టిన జెట్టిరాముడు. కుండినపుర రాజపుత్రుణ్ణి రుక్మిని, ఒకరోకలిపెట్టుతో మట్టుపెట్టిన వీర శిరోమణి. ఇలా దుష్టుల్ని శిక్షించి, నేలపైనున్న సర్వతీర్థాలలో మునిగిన పావనచరిత్రుడు బలరాముడు.

ఇక ఆ మహనీయుని తమ్ముడు కృష్ణుడు చేసిన ఘనకార్యాలు చెప్తాను విను.

పాలుత్రాగే పసిపాపడుగా ఉన్నపుడే బాలకృష్ణుడు, శిశుహంత్రియైన పూతనను మృత్యువాత పెట్టినవాడు. శకటాసురుణ్ణి విరగతన్ని, మద్దిచెట్లకు మోక్షమిచ్చి, కాళియుడనే దుష్టసర్పరాజును మర్దించి యముననుంచి వెళ్లగొట్టాడు. గోవర్ధనగిరి నెత్తి రాళ్లవాననుంచి గోవులను, గోపాలకులను కాపాడాడు. కంసుణ్ణీ, వాని మల్లుడు చాణూరుణ్ణీ, వాని మిత్రులనూ క్షణంలో యమునికి అతిథుల్ని చేశాడు. అన్నతో సాందీపనివద్ద అరవైనాలుగు దినాలలో చతుష్షష్టికళలు నేర్చి, గురుదక్షిణగా ఎన్నడో మరణించిన గురుపుత్రుణ్ణి యముని ఇంటినుంచి రప్పించి గురునకు సమర్పించాడు. నరకుని సంహరించి లోకానికి రక్ష కలిగించాడు. ఇంద్రుని తృణీకరించి నందనవనంలోనున్న పారిజాత వృక్షాన్ని భూమికి తెచ్చాడు. పాండవమధ్యముడైన అర్జునునకు సారథియై కౌరవవంశాన్ని నామరూపాలు లేకుండా చేశాడు. కురుక్షేత్రమందు అర్జునునకు బోధించినట్టుగా జీవలోకానికి ఆధ్యాత్మికయోగశాస్త్రాన్ని ప్రసాదించాడు. ఆ విధంగా గీతాచార్యుడైనాడు.



ఈ విధంగా రామకృష్ణులు దుష్టశిక్షణచేసి ధర్మరక్షకులై, భూభారం తీర్చి తదనంతరమందు సితాసితశక్తిరూపాలతో శ్రీమన్నారాయణుని చేరారు.

తరువాతిది శ్రీహరి దశమావతారం.

**కల్కి: కలిమహిమ**

కలికాలంలో ధర్మం నశించి, పాపం పెచ్చు పెరిగి, జనం వ్యాధులతో బాధపడుతూ ఉండగా దేవతలు విష్ణువును ప్రార్థిస్తారు. వారి ప్రార్థన మన్నించి విష్ణువు శంబలం అనే గ్రామంలో విష్ణుయశుడు అనే బ్రాహ్మణుని పుత్రుడై జన్మిస్తాడు. వాహనం శుభలక్షణలక్షితమైన గుర్రం. ఆయుధం పట్టాకత్తి. అశ్వారూఢుడై ఖడ్గపాణియై నేలంతా పర్యటించి, భూభారహరణం లక్ష్యంగా, పాపాచారులను మునుం పెట్టి తెగనరికి, బహుకాంచనం అనే యజ్ఞంచేసి స్వస్థానానికి వెళ్లిపోతాడు.

రాజా! శ్రీహరి అవతార కథావిశేషాలివి. వీటిని నరసింహదేవుని యందు భక్తికలవాడై శ్రద్ధగా వినేవాడు పాపవిముక్తుడై విష్ణుసన్నిధికి వెళ్లుతాడు.

అని చెప్పగా సహస్రానీకుడు నమస్కరించి 'మునీంద్రా! నీ దయవల్ల నృసింహమూర్తి అవతారకథలు విన్నాను. ధన్యుణ్ణి అయాను. ఒక్క సందేహం మనవి చేస్తున్నాను, అవధరించు. కలియుగంలో జనులు ఏ విధంగా ప్రవర్తిస్తారు?'

ఆ ప్రశ్నకి సమాధానంగా మార్కండేయుడు ఇలాచెప్పాడు రాజా! కలి పాపాలకి పుట్టిల్లు. ధర్మాలన్నీ నశిస్తాయి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అనే ఈ నాలుగు జాతుల వారున్నూ స్వజాతి ధర్మాలను విడిచిపెట్టి విరుద్ధ ప్రవర్తను లౌతారు. అహంకారం, దాంభికత్వం, అసత్యం, అన్యాయం, ధిక్కారం రాజ్యం చేస్తాయి. దేవుడంటే హేళన. నేనే గొప్పవాడను అనే భావంతో ఎదుటి వాళ్లని తూలనాడడం పరిపాటి అవుతుంది.

కలియుగంలో పూర్ణాయువు అనుభవించేవారు నూటికొకరుంటా రేమో!

బ్రాహ్మణులు విద్యాధికులుగా ఉండరు. ఆ పరిస్థితిలో ధర్మానికి తావెక్కడిది? అలాగే అన్ని వర్ణాలవారున్నూ.

కలియుగంలో వర్ణసాంకర్యం కలుగుతుంది. కామం, క్రోధం కలియుగ జనులకు మిత్రులు. ఈ రెండింటివల్ల వారుపొందేది సంతాపమేగాని సంతోషం కాదు. బద్ధవైరంతో బ్రతుకులు పాడవుతూ ఉంటాయి. ఉత్తములు నీచులూ, నీచులు ఉత్తములూ అవుతారు. ధనం ఉన్నవాడే రాజు. ధనహీనుడు బంటు.

కొడుకులు తండ్రులకు, కోడళ్లు అత్తలకు పనులు చెప్తారు. పతులనూ, సుతులనూ మోసగించి స్త్రీలు ప్రవర్తిస్తూ ఉంటారు.

మేఘాలు ఖండవృష్టితప్ప సమయానికి సస్యానుకూలంగా వర్షించవు. ఒక్కొక్క ప్రదేశంలో మహోపద్రవంగా కురిసి ప్రాణులను బాధిస్తాయి. పట్టపగలు బాటలు దొంగాటకంతో బాటసారులను హడలెత్తిస్తాయి. మద్యపానంచేసి మత్తెక్కిన మనిషి వేదాంతం చెప్తాడు. కుక్కలు ఎక్కువవుతాయి. ఆవులు తగ్గిపోతాయి. పురుషజనాభా అల్పంగా, స్త్రీసముదాయం అధికంగా ఉంటుంది. విద్యాధికులకు మర్యాద ఉండదు. బ్రాహ్మణులు తదితరులకు కింకరు లౌతారు.



కొడుకులు తండ్రులను, భార్యలు భర్తలను, శిష్యులు గురువులను ధిక్కరించి తూలనాడుతూ ఉంటారు. అత్యాశకు చుట్టుకుని ఆరాటపడతారు జనులు. పరాన్నం కోసం ప్రాకులాడుతారు. పరధనం, పరకాంతను కోరుతూ పాపవర్తను లౌతారు.

యజ్ఞ యాగాలకు స్వస్తి చెప్తారు. నిత్యనైమిత్తిక క్రియలను చేయరు. వ్రతాలన్నా ఉపవాసాలన్నా చులకనగా మాటాడుతారు. దాన ధర్మాలు అంతరించుకు పోతాయి ఒకవేళ చేసినా సత్పాత్రదానం జరగదు. పాలు అమ్మి సొమ్ము సంపాదించడం కోసమే ఆవులను పెంచుతారు. ధనార్జన ప్రధానంగా గ్రహశాంతులు వగైరా చేస్తారు. ఎక్కడ చూచినా ఆత్మస్తుతి పరనిందా పెచ్చు మీరుతాయి. 'నీకేమి తెలుసును? నేను చెప్పేది విను' అనే వారే గాని నీతి నియమాలను వినరు. పైగా చెప్పేవాణ్ణి ఆక్షేపిస్తారు.

తిన్నయింటికి వాసాలు లెక్కపెడతారు. ఉపకారం పొంది అపకారం చేస్తారు. ఎవడు గురువో, ఎవడు శిష్యుడో తెలియరాని స్థితి ఏర్పడుతుంది. వేదశాస్త్రాలకు మన్నన ఉండదు.

ఆకలి, వల్లమాలిన కోరికలు కలియుగ జనానికి అలంకారాలు. శుచి, శుభ్రత పాటించరు... పెద్దలు చెప్పినా వినక స్త్రీలు రెండు చేతులతో తల గోకుకుంటూ ఉంటారు. మడీ తడీ మటుమాయమైపోతాయి. ఇలా ధర్మ విరుద్ధంగా ఉన్ననేలపై సిరిసంపద లెలాఉంటాయి? కలిలో పలువిధాలైన రోగాలు ప్రజలను బాధిస్తూ ఉంటాయి. ఇలాటి జనానికి మోక్షం కలగాలంటే ఒక్కటే సాధనం. అది హరి భక్తి. హరిస్మరణ ఒక్కటే సర్వశుభాల నిస్తుంది. సోమరులైన

కలియుగ మానవులు యజ్ఞయాగాలను చేయలేరని ఋషులు తరణోపాయంగా చెప్పినది హరిభక్తి.

హరీ! కేశవా! గోవిందా! వాసుదేవా! జగన్మయా!
జనార్దనా! జగద్ధామా! పీతాంబరధరా! అచ్యుతా!

అని నిత్యమూ హరినామసంకీర్తనం చేసేవారు కలిబంధం నుంచి విముక్తి పొందుతారు. ఇందుకు సందేహంలేదు.

విన్నావా రాజా! కలి లక్షణం?....అని మార్కండేయుడు చెప్పగా రాజు విచారించి కనులు మూసుకుని ఒకింతసేపు హరిధ్యానం చేసి కనుదోయి తెరిచి ఇలాగన్నాడు.

మహానుభావా! మనవి. వామనదేవునిచే శుక్రుడు కన్నుపోగొట్టు కున్నాడని ఆ అవతారకథలో చెప్పావు. మళ్లీ అతనికి కన్ను వచ్చిందా? వస్తే ఏవిధంగా వచ్చింది? ఆ విషయం సెలవీయ వలసింది అని సహస్రానీకు డనగా మార్కండేయుడు ఇలా చెప్పాడు.

## నేత్రదానం

శుక్రుడు వామనునిచే కన్ను పోగొట్టుకుని బాధపడుతూ ఒకచోట ఉండలేక సంచారం ఆరంభించాడు. రాక్షసుల ఆశ్రయంకూడా పోయింది. ముందు పుణ్యనదులలో స్నానం, పుణ్యక్షేత్రాలలో నివాసం, జపం, తపం చేసి చేసి కాశీక్షేత్రానికి వెళ్ళాడు. అక్కడ పావనగంగాజలాలలో సూర్యోదయాత్పూర్వం మునిగితేలి గట్టుననిల్చి సంధ్యావందనం, గాయత్రీ జపం యథావిధిగా చేసి, రెండు చేతులూ పైకెత్తి జోడించి, ఒంటికాలి మీద నిలిచి, నిశ్చల మనస్కుడై శ్రీమన్నారాయణుణ్ణి ధ్యానిస్తూ స్తుతిచెయ్యడం ఆరంభించాడు.

'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ,
తస్మాత్కారుణ్య భావేన రక్ష రక్ష జనార్దన!'



అని మండల దీక్షతో శ్రీహరిని స్తుతించాడు. ఆ మర్నాడు శంఖ చక్ర గదాధరుడు, పీతాంబరుడు, మా మనోహరుడు, ఆర్తరక్షాకరుడు, గరుడారూఢుడై శుక్రునకు దర్శనమిచ్చాడు. శుక్రుడు అల్లనల్లన కళ్లు తెరిచి ఎట్టఎదుటఉన్న స్వామిని పరమభక్తి భావంతో స్తుతించాడు. ఆ స్తుతికి శ్రీహరి సంతోషించి శుక్రాచార్యా! నీ భక్తికి సంతోషించాను. నీ కోరిక ఏమి? అని ఆదరంగా అడిగాడు. ఏముంది ప్రభూ! నీ యెడ అపరాధం చేశాను. కన్ను పోగొట్టు కున్నాను. అన్ని ఇంద్రియాలలో నేత్రం ప్రధానం అని గడుసుతనంగా తన కోరిక చెప్పాడు. శ్రీహరి చిరునవ్వు నవ్వి శంఖంతో మెల్లగా పోయిన కంటిని స్పృశించాడు. వెంటనే ఆనేత్రం చక్రంలాగా రూపొందింది. శుక్రుడు మళ్ళీ శ్రీహరిని స్తుతించాడు.

'దుర్లభం చాపి భక్తానాం యః ప్రయచ్ఛతి తోషితః,
తం సర్వసాక్షిణం విష్ణుం ప్రణమామి సనాతనమ్'

భక్తులకు పొందశక్యం కానిదైనా సంతోషించి ఇచ్చే మహాదాత, సర్వసాక్షి, సనాతనుడు అయిన విష్ణువునకు నమస్కరిస్తున్నాను. అనిస్తుతించగా నరహరి సంతోషించి శుక్రాచార్యా! నీ కోరిక తీరిందికదా! మునుపటివలె దివ్యశక్తి సంపన్నుడవై రాణిస్తూ ఉండు! అని అంతర్హితుడైనాడు! రాజా! ఈ విధంగా శుక్రుడు పునః నరహరిని స్తుతించి పోయిన కన్ను సంపాదించి కృతార్థుడైనాడు. ఇంకేమి చెప్పమన్నావు? అని అడుగగా రాజు సోదాహరణంగా చెప్తున్నాను విను శ్రద్ధగా, అని మార్కండేయుడు అష్టాక్షరమంత్రమహిమ ఇలా చెప్తున్నాడు.

## అష్టాక్షరమహిమ

చక్కనికథ దానిలో జీవలోకానికి మంచి నీతిపాఠం చెప్పడం గ్రహించాలి. దానివల్ల వినేవారికి సుస్థిరమైన విష్ణుభక్తి కల్గుతుంది. చదివేవారి గురించి చెప్పనే అక్కరలేదు.

ఇంద్రుడు బృహస్పతి బోధనూ, ఆలోచననూ అనుసరిస్తూ సురరాజ్యం పాలిస్తున్నాడు. అలాఉండగా కర్మఫలమే అనాలి మరి అతనికి వైరాగ్యం కలిగింది. ఇల్లూ ఇల్లాలూ, పిల్లలూ, రాజ్యం ఇలా వేటిమీదా మమత లేనివాడైపోయాడు. ఇంద్రుని ఈ ఆకస్మిక వైరాగ్యానికి మునులు, సురలూకూడా ఆశ్చర్యం, ఆవేదనా పొందారు. ఎవరూ ఏమీ చెప్పలేకపోయారు.

ఇంద్రుడు చప్పున విమానం ఎక్కి ముక్తికాంక్షతో కైలాసనాథుని సేవకు రజతగిరికి దారితీశాడు.

అక్కడ నివసిస్తూ ఒకనాడు స్నానంకోసం మానససరస్సుకి వెళ్లాడు. ఆ సమయానికి కుబేరునిభార్య అక్కడికి ఒంటరిగా వచ్చి సరసిలో దిగి జలకమాడుతూంది. ఆమెను చూశాడు. చెంపకి చేరడేసి కళ్లు, చంద్రబింబంవంటి నెమ్మోము, నువ్వుపువ్వులాంటి నాసిక, శ్రీకారాల్లాంటి చెవులు, మదనుని విలుకొమ్మలను పోలిన కనుబొమ్మలు, వినీల సుదీర్ఘ కేశపాశం, మన్మధరథం విజయపతాకలాగ ఉందా దివ్యసుందిరి. ఒక చెట్టుచాటున నిల్చుని చూసి గట్టుకి వచ్చాక అడుగుదామనుకున్నాడు. ఆమె కొంతసేపటికి గట్టుకి వచ్చి పట్టుచీర, పట్టురైక ధరించి నొసట తీరుగా కుంకుమబొట్టు పెట్టుకుని చెట్టుక్రింద పార్వతీ విగ్రహాన్ని పూజించడానికి ఉపక్రమించింది.

ఆ దివ్యసుందరరూపం చూసి, ఎందుకీ వ్యర్థమైన వైరాగ్యం, ఇలాటి సుందరిపొందు......విస విసలాడాడు. మన్మథుణ్ణి తల్చుకున్నాడు. వెంటనే కుసుమ సమ్మోహన బాణంతో ప్రత్యక్షమై ఏమి సెలవు దివిజేంద్రా! నిన్నెదిరించి బాధకలిగిస్తూన్న శత్రువెవరు?....వారిపని పట్టిస్తాను......అని ధీర గంభీరస్వరంతో అనగా మారా! నీ క్రూర కుసుమ నారాచానికి లొంగని వారెవరు? రుద్రుని వంటివాడు నీ సమ్మోహనాస్త్రానికి ముగ్ధుడై గిరిజకు అర్ధశరీరమే అర్పించుకున్నాడు. ఇంకొకరిని గురించి చెప్పడమేల? నిన్నిపుడు స్మరించిన పని విను.



అదిగో! ఆ చోట ఉమాదేవిని అర్చిస్తున్న వన్నెలాడి ఎవరో నా మనసును ఆకర్షించింది. ఆ సుందరిని నాకు వశమయ్యేటట్లు చెయ్యవలసి ఉంది– అని దీనంగా బ్రతిమాలుతూన్నట్టన్నా డింద్రుడు. ఆ మాటకి ఉబ్బి తబ్బిబై పోయాడు మదనుడు. వజ్రపాణి ఇంద్రుడంతటివాడు తన సహాయం కోరాడు...వెంటనే సమ్మోహనాస్త్రం వింట సంధించి కుబేర పత్నిపై ప్రయోగించాడు. ఆబాణం తగలగానే ధనదపత్ని అక్కడికక్కడ పూజవిడిచిపెట్టి ఏవేవో వికారాలతో చప్పున లేచి వింతగా వగలొలుకుతూ దిక్కులు చూడసాగింది. ఇక నేను వస్తానని మన్మథుడంతర్ధానమైనాడు. ఇంద్రుడు మెల్ల మెల్లగా నడుస్తూ వెళ్ళి ఆమెకి బారెడు దూరంలో నిల్చున్నాడు. ఆ సుందరి ఇంద్రుణ్ణి చూసింది. చెప్పేదే ముంది. చిఱునవ్వు....ఓరచూపు....నునుసిగ్గు....కాముని వింటి చప్పుడు చెవులను పడినతర్వాత మనసును నిలుపుకునే మగువకానీ, మగవాడు కానీ ఉంటారా?

ఆమె లక్షణాలు కనిపెట్టి ఇంద్రుడు మరికొంచెం దరిజేరి భువనమోహినీ! ఎవరునువ్వు? విలోలాక్షి నీపేరేమి? అని అడిగాడు.

ఆ మాటవిని ఆ వగలాడి మరీ మదన వికారంతో క్రిందుమీదై మదవతీ మదనా! నేను కుబేరుని భార్యను. నా పేరు చిత్రసేన. నన్ను గిరిజాపూజనుంచి మరులెత్తించిన భువనసుందరుడవు నీ వెవరు? అని సన్నగా చిలుక పలుకుగా అడిగింది.

ఇంద్రుడు తన సమాచారం చెప్పి సుందరీ! నీ కోసమే ఇక్కడ మతిచెడి తిరుగుతున్నాను. నన్ను అనుగ్రహించు అని చేతులు చాచాడు.

మరుని బాణానికి మతిమాలిన ఆ చిత్రసేన మారుమాటాడక బిర బిర వచ్చి ఇంద్రుని కౌగిటిలో పంజరంలో చిలుకలాగా అణగిపోయింది. మదన వికారానికి చుట్టుకుపోయిన ఇంద్రుడు ఆ మదవతి కౌగిలింత మోక్షంకన్నా

మిన్నగా భావించాడు. అలాగే ఆమెను విమానం ఎక్కించి తీసుకుపోయాడు. ఎవరికీ తెలియని విధంగా మందరగిరి గుహలో ఒక రమ్యమైన భాగంలో ఉంచాడు......

* * *

చిత్రసేన నెచ్చెలులు ఎప్పటికీ తమ సఖిరాదేమని తోటా, దొడ్డీ, ఇలూ, వాకిలీ వెదకి వేసారి గుండెనిబ్బరం చెడి కుబేరునితో చెప్పారు చిత్రసేన కనిపించదని.... ధనదుడు చుట్టు ప్రక్కలంతా భటులచే వెదకించాడు. ప్రయోజనం లేకపోయింది. దురంతమైన చింత, చిత్త స్థైర్యం చెడి నాప్రాణంలో ప్రాణం చిత్రసేన లేనపుడు నాకెందుకీ బ్రతుకు–అని చరమావస్థకి లోనయాడు. ఆ దుర్దశలో ఆంతరంగికమంత్రి కంఠకుబ్జుడు వచ్చి రాజా! విచారించకు నా మాట విను. ఆమెను ప్రస్తుతావస్థలో కనుగొనడానికి తగిన మనశ్శక్తి కలవాడు నీ తమ్ముడు విభీషణుడొక్కడే, అతనివద్దకు వెళ్ళి బ్రతిమాలితే పని అవుతుంది–అని హితబోధ చేశాడు. ఎట్టకేలకు కుబేరుడు తేరుకుని విభీషణుని సహాయంకోసం లంకకి వెళ్ళాడు. గుణవంతుడైన విభీషణుడు కుబేరునకు ఆప్యాయంగా స్వాగతంచెప్పి సముచితాసనంపై కూర్చుండజేసి తేరిపారజూచి అన్నా! ఏమి సమాచారం! దిగులుగా ఉన్నట్టు నీ మోము చెప్తూంది. నా చేతనయేది చేస్తాను. అసలు విషయం చెప్పవలసిందని సవినయంగా అన్నాడు. కుబేరుడు తన ఇల్లా లదృశ్యమైన వార్త చెప్పి ఎక్కడుందో తెలుసుకుని వచ్చేటట్టుచేసి తనకు అప్పజెప్పి తనజీవితం నిలపవలసిందని దీనోక్తిగా చెప్పాడు. విభీషణుడు విని ఒక్కక్షణం ఆలోచించి అన్నా! విచారించకు. మా వదిన ఉనికి కనిపెట్టి భద్రంగా రప్పించే ప్రయత్నం చేస్తాను. ధైర్యంగా వెళ్లు–అని సముదాయించి పంపించాడు.

తరువాత నాడీజంఘ అనే రాక్షసిని రప్పించాడు. కథ అంతాచెప్పి చిత్రసేన దేవలోకంలో ఉందేమో ముందు చూడు. అక్కడ లేకపోతే తరువాత



ఎక్కడ వెదకాలో చెప్తాను. పని సాధించుకురావాలి. నీ మాయలమారితనం సఫలం అవుగాక! అని నవ్వించి పంపాడు. ఆ రాక్షసి నిజంగా మహామాయా శాలిని. చిత్తం ప్రభూ! చేతనైనంతాచేసి ఆమె స్థితిగతులు తెలుసుకుని వస్తాను–అని పక్షిలాగా రివ్వున ఆకాశానికెగిరి క్షణంలో అమరావతిలో ప్రవేశించింది. అక్కడ త్రిలోక సుందరిగామారి నందనవనంలో సవిలాసంగా తిరగసాగింది. ఆ సమయంలో ఇంద్రుడక్కడకు వచ్చి ఆమెను చూచాడు. సన్నని ఎలుగెత్తి కలస్వనంతో గానంచేస్తూ అల్లనల్లన హంస నడకలు నడుస్తున్న ఆ సుందరి నందనవనంలో వసంతభామినిలాగా తోచింది ఇంద్రునికి. ఆమెను చూడగానే చిత్రసేనను మరచిపోయాడు. కామ వికారానికి లోనై అశ్వినీ కుమారులను రప్పించి ఆమెనుచూపి అంతఃపురానికి వచ్చేట్టు చెయ్యండి–అని చెప్పి ఆ వనంలోనే ఉన్న భవనానికి వెళ్లిపోయాడు. ఆశ్వినేయులా లతాంగిని సమీపించి ఇంద్రుని కోరికను చెప్పారు. ఆమె చిరునవ్వు నవ్వి ఆయన స్వయంగావచ్చి కోరితే నా అభిప్రాయం చెప్తానన్నది. ఆ దేవవైద్యులు ఇంద్రునివద్దకు వెళ్లి సురరాజా! నీవే వచ్చి కోరాలట అని నిరాశగా చెప్పారు. సురరాజు ససంభ్రమంగా వచ్చి తన్వంగీ! ఆజ్ఞాపించు. ఏమి చేయాలి? నీ దాసుణ్ణి. కటాక్షించు–అని ఆకాంక్షగా అన్నాడు.

ఆ సుకుమారి ఓరచూపుతూపుతో ఇంద్రుని హృదయం భేదించి నీ మనసు తెలిసింది. కాని నా మనసు చెప్పాలిగా విను. ఇంతవరకూ నీవు వశపరచుకున్న కాంతల్ని నాకు దాపరికం లేకుండా చూపాలి. వారి అందచందా లేపాటివో నేను గ్రహించాలి. ఆ తరువాత నేను నీ దాసనౌతాను అని ధీమాగా బదులు పలికింది.

'తప్పక చూపుతాను రా!' అని రహస్య మందిరాలలో ఉన్న సుందరీ మణులను పేరు పేరునా చెప్పి చూపాడు. అందరినీ చూసింది. దేవరాజా!

మాయామర్మం లేకుండా నాపట్ల ప్రవర్తించాలి. ఇంకెక్కడైనా ఎవతెనైనా ఉంచావా? ఉంచితే నాకు చూపాలి అని గంభీరంగా అన్నది దివ్యసుందరా కారంతోనున్న నాడీజంఘ. ఇంద్రుడు చిరునవ్వు నవ్వి మాయామర్మం ఎందుకూ? ఇంకొక్క వగలాడి ఉంది. రా చూపుతాను-అని ఆమెతోసహా విమానం ఎక్కి మందరగిరికి వస్తూ ఉండగా ఆకాశగమనంతో పోతున్న నారదుడు కనిపించాడు. ఇంద్రుడు విమానవేగాన్ని తగ్గించి సురమునికి నమస్కరించి ఎక్కడికి ప్రయాణం మునీంద్రా! అని అడిగాడు.

ఎవరు? ఇంద్రుడా! ఆ-మానససరస్సులో స్నానానికి పోతున్నాను. క్షేమమా? అని ప్రక్కకుచూసి ఓ! నాడీజంఘ! మీ సోదరుడు విభీషణుడు కులాసగా ఉన్నాడా? ఏమిటికథ? సురరాజు ప్రక్కకు చేరావు-వస్తాను అని కైలాసంవైపు నారదుడు వెళ్లిపోయాడు.

ఇంద్రుడు నాడీజంఘను తీవ్రంగాచూసి ఏమీ నువ్వు రాకాసివా? నీ నాటకం కట్టిస్తాను రావే నిశాటీ! అని మందరగిరి చేరువన విమానాన్ని దింపి 'దిగు క్రిందికి' అని గద్దించాడు. కిక్కురుమనకుండా అది దిగింది. ప్రక్కనే ఒక ఆశ్రమం. దానిలోకి జుట్టుపట్టుకుని నాడీజంఘను ఈడ్చుకొనిపోయి వజ్రాన్ని తలచుకున్నా డింద్రుడు. వజ్రం చేతిలోకి వచ్చింది. నాడీజంఘ పెనుబొబ్బ పెట్టింది-రక్షించు-రక్షించు అని. అంతలో ఆశ్రమవాసి అయిన తృణబిందు మహర్షి వడివడిగా వచ్చాడు. అప్పుడే ఇంద్రుడు వజ్రంతో ఆ రాక్షసిని తెగనేశాడు. ఆ ఘాతుక కృత్యంచూసి ముని శాంద్రాకారుడై ఓరీ! క్రూరుడా! ఎంతదారుణప్పని చేశావురా! నా ఆశ్రమంలో స్త్రీహత్యా! దుర్మార్గుడా! నీ కిదే శాస్తి. 'స్త్రీ అయిపోదువుగాక!' అని శపించాడు.

దెబ్బకి దెయ్యం లొంగుతుందన్నట్టు శాపం చెవినిపడగానే ఇంద్రుడు భీతితో గజగజ వణుకుతూ మునీంద్రుని పాదాలకు మ్రొక్కి క్షమాపణచెప్పుకొని



మునీశ్వరా! ఇది మహాదుష్ట. పైగా రాక్షసి. ఆ కారణంచేత దీనిని చంపాను. క్షమించు! అని ప్రార్థించాడు.

'నా ఆశ్రమం పుణ్యధామం. ఇక్కడ దుష్టులూ, శిష్టులూకూడా ఉంటారు. కానీ ఎవరికీ అపకారం జరగదు. అలాటిచోట నా కళ్లముందు స్త్రీవధ సహించేది లేదు. పో! నీ శాపశిక్ష అనుభవించు- అని తృణబిందుడు లోనికి వెళ్లిపోయాడు.'

ఇంద్రుడు అక్కడికక్కడ స్త్రీఅయి విమానారూఢుడై అమరావతికి వచ్చి అంతఃపురానికి వెళ్లి సిగ్గుతో ముడుచుకుపోయి మూలకూర్చున్నాడు. శచికి మతిపోయినట్లయింది. దేవతల కీ విషమవిషయం తెలిసి దిగ్భ్రాంతులై ఇంద్రునితోసహా సత్యలోకానికివెళ్లి బ్రహ్మతో మొర పెట్టారు.

'దేవా! ఏమిటీకర్మ-' అని జరిగినకథ చెప్పి పతిహీనయైన సతిలాగా కృష్ణుడులేని గోకులంలాగా ఇంద్రుడులేని అమరావతి గతి యేమయ్యేట్లు? కరుణించి ఇంద్రుని స్త్రీత్వం పోవడానికి ఉపాయం సెలవీయవలసింది-అని వేల్పులు వినుతిచెయ్యగా విని బ్రహ్మ.

మునిశాపం పోగొట్టడానికి నేనే కాదు శంకరుడుకూడా సమర్థుడు కాదు-అది అనుభవించవలసిందే. ఇంద్రుడు చెయ్యరాని తప్పులు రెండు చేశాడు. ఒకటి-కుబేరుని భార్యను ఎత్తుకురావడం. రెండు-స్త్రీని ముని ఆశ్రమంలో చంపడం. ఇవి అనరాని వినరాని మహాపాతక క్రియలు. ఈ పాతక నివృత్తికి ఒకటే గతి.

"ఓం నమో నారాయణాయ"- అనే అష్టాక్షర మహామంత్రాన్ని శ్రద్ధాభక్తులతో రెండు లక్షల సంఖ్యతో నిష్ఠాపరుడై జపించాలి. అలాచేస్తే ఈ శాప నివృత్తి అయి స్త్రీత్వం పోతుంది. ఆ తర్వాతనైనా బుద్ధిగా, శుద్ధిగా ఉంటే

మంచిది! వెళ్ళండి-అని ఇంద్రుణ్ణిచూసి విన్నావా వెళ్లు... నేను చెప్పినట్లు చెయ్యి...కృతార్థుడవౌతావు-అని కసిరి పొమ్మన్నాడు.

ఆ తరువాత ఇంద్రుడు బ్రహ్మచెప్పినట్లుచేసి విష్ణుదేవుని అనుగ్రహానికి పాత్రుడై స్వరూపం పొందాడు.

విన్నావా రాజా! అష్టాక్షరమంత్రమహిమ. ఈ కథ చదివినవారూ, విన్నవారూ పాపవిముక్తులై విష్ణుదేవుని అనుగ్రహానికిపాత్రులై జన్మాంతమందు శ్రీహరి పదసన్నిధిని చేరుతారు.

అని మార్కండేయుడు సహస్రానీకునికి చెప్పినట్టు సూతుడు భరద్వాజాది మునులకు చెప్పాడు.

కథ అంతావిని సహస్రానీకుడు అడిగాడు. చిత్రసేన సమాచారం ఏమయినట్టు? అని అప్పుడు మార్కండేయుడన్నాడు. ఏముంది? బ్రహ్మలోకం నుండి అమరావతికివచ్చి వేల్పులు ఇంద్రుణ్ణి అడిగారు-'చిత్రసేనను ఎక్కడ ఉంచావని. సిగ్గుతో చెప్పాడింద్రుడు తలవంచుకుని మందరగిరి కందరంలో ఉంచానని. వెంటనే శచీదేవి వెళ్లి చిత్రసేనను తోడుకొనివచ్చి తగిన మన్నన చూపి చెలికత్తెలను తోడిచ్చి విమానప్రయాణంతో కుబేరునివద్దకు పంపించింది. ఇదీ చిత్రసేన విషయం...

* * *

తరువాత భరద్వాజుడు సూతుణ్ణి అడిగాడు. సూతుడా! పరమార్థం తెలుసుకోవాలంటే ఒకొక్కరు ఒక్కొక్క సాధనం చెప్తారు. సత్యం, శౌచం, తపస్సు, సాఖ్యం, జ్ఞానం, ధ్యానం, క్షమ, యోగం, దయ, ఆర్జవం, దానం, వైరాగ్యం.. అలాగే ధర్మార్థకామమోక్షాలను సక్రమంగా సాధించడం-ఇది ఏదో నాకు సమన్వయం కాలేదు. ఏది చెయ్యదగినది? ఏది చెయ్యరానిది? వీటిలో ఉత్కృష్టం ఏది? సర్వార్థ సాధకమైనది ఏది? నీవు సర్వజ్ఞుడవు. అపర నారాయణు డైన వ్యాసభగవానుని ప్రియశిష్యుడవు. కనుక నీ చెప్పినది అనుసరింప దగినదిగా, ఆచరింపదగినదిగా లోకానికి ఒక చక్కని పాఠం అవుతుందని



అడుగుతున్నాను. విశదీకరించవయ్యా! అని అడుగగా సూతుడు చిరునవ్వు నవ్వి భరద్వాజ మునీంద్రా! ఏదో నన్ను పెద్దచేసి అడుగుతున్నావుగాని అప్రమేయ ప్రతిభాశాలివి నువ్వు. నీకు తెలియని దేముంది? అయినా అడిగావు గనుక నేను నా గురుదేవునివల్ల తెలుసుకున్నది చెప్తాను విను. నేను చెప్పబోయేది నిజంగా సామాన్య విషయం కాదు. సంసారం నుంచి విముక్తిని కలిగించే దివ్యసాధనమే. అది మనోరంజనమూ, పాపభంజనమున్ను. ప్రాచీనమైన ఇతిహాసం అది. విను.

**పుండరీకచరిత్ర**

పుండరీకుడు అనే పేరుగల ఒక బ్రాహ్మణుడు, బుద్ధిమంతుడు, విద్యావంతుడు, అతనికీ సురముని, శిరోమణియైన నారదునికీ జరిగిన సంవాదరూపమైనది!

పుండరీకుడు సంపన్నకుటుంబంలో పుట్టినవాడు. ఉపనయనం సలక్షణంగా అయిన తరువాత యథావిధిగా బ్రహ్మచర్యంపాటిస్తూ సమర్థులైన ఉపాధ్యాయులవద్ద వేదశాస్త్రాధ్యయనం చేశాడు. చక్కని తెలివి తేటలున్నవాడు. అచిరకాలంలో వేదాధ్యయనం, శాస్త్రపాఠం ముగించుకుని వేదశాస్త్రాలలో అర్థనిర్ణయం చెయ్యగల విద్వాంసుడై ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు-విద్యావంతుడు, యుక్తవయస్కుడు అయిన కొడుకును గృహస్థును చేద్దామని సంకల్పించి తమ అభిప్రాయం అతడికి చెప్పారు. తొందరపడకండి చెప్తానని పుండరీకుడు, ఏకాంత ప్రదేశంలో కూర్చుండి మానవజీవితాన్ని విమర్శించు కున్నాడు. ఆ యువకుని దృష్టిలో సంసారం గచ్చపొదలా తోచింది. తల్లి దండ్రులను, అన్నదమ్ములను, మిత్రులను అందర్నీ గడ్డిపోచల్లాగా విడిచిపెట్టి ఇల్లువదలి దేశసంచారానికి ఉపక్రమించాడు. అక్కడా ఇక్కడా దొరికిన కాయాకసరూ తింటూ, కడుపుచిచ్చు చల్లార్చుకుంటూ నీటి బుడగవంటి ఈ జీవితాన్ని ఎవడు నమ్మమన్నాడు. క్షణక్షణానికి మారిపోయే శరీరస్థితిని నమ్మి బ్రతకడం మతిమాలిన పని అని పురాణం చెప్పిన ప్రకారం నేలపైగల తీర్థాలు సేవించాలని నిశ్చయించుకున్నాడు.

గంగ, యమున, గోదావరి మొదలైన నదులలో మునిగి క్షేత్రాలలో నివసించి ఆ యా దేవతలను దర్శించి సాత్వికాహారం ఆరగిస్తూ అలా తిరిగి తిరిగా 'సాలిగ్రామం' అనే పుణ్యక్షేత్రానికి చేరాడు. అక్కడి భక్తులను పుణ్యజలాన్ని చూసి ముచ్చటపడ్డాడు. ఇది నా నిర్ణయానికి అనుగుణంగా ఉందని బస ఏర్పాటు చేసుకున్నాడు. తాను గురువుల వల్ల తెలుసుకున్న ప్రకారం ప్రాణాయామం మొదలుగా యోగశాస్త్రం ఆచరణలో పెట్టి తీర్థస్నానం, భగవద్ధ్యానం సకాలానికి చేస్తూ చాలాకాలం వెళ్లించాడు.

అలా ఉండగా ఒకనాడు నారదమహాముని అక్కడకు విచ్చేశాడు. పుండరీకుడు నారదుని దివ్యతేజస్సునూ, మూర్తిసౌభాగ్యాన్నీ చూసి ఆశ్చర్యానందాలతో స్వాగతం చెప్పి తన పర్ణశాలకి సబహుమానంగా తోడ్చుకు వెళ్లాడు. అర్ఘ్య పాద్యాదులిచ్చి ఆసనం చూపాడు. నారదుడు చిరునవ్వుతో ఆసనాసీనుడై మౌనంగా పుండరీకుణ్ణి పరిశీలనగా చూస్తున్నాడు. ఇందరు సన్యాసులను, జితేంద్రియులను, మునులనూ చూస్తున్నాను. ఎందరినో ఇంతకుముందు ఆ యా క్షేత్రాలలో చూసి ఉన్నాను కాని ఇలాటి దివ్యతేజోవిరాజమానుణ్ణి చూడలేదు. ఎవరై ఉంటాడు– అని పుండరీకాక్షుడు అనుకుని–మహాత్మా ఎవరు నీవు? నన్ను తరింపజేయడానికి ఈ రూపంతో విచ్చేసిన శ్రీమన్నారాయణుడవనే అనుకుంటున్నాను–అని అన్నాడు.

'అడుగుతావని అనుకున్నాను. నన్ను నారదుడని అంటారందరున్ను. నిన్ను చూద్దామనే వచ్చాను. శుద్ధ బుద్ధిగల భక్తుణ్ణి చూస్తే పుణ్యం వస్తుందని భగవంతుడే అన్నాడు–అని చిరునవ్వుతో అన్నాడు నారదుడు. నారదుని మాట వినగానే లేచి పుండరీకుడు రెండుచేతులు జోడించి నమస్కరించి కృతార్థుడనైనాను. మహానుభావా! నీదర్శనం దైవదర్శనమే. నా మనవి విను.

'పరమార్థ సాధనకు ప్రధానమైన సాధనం ఏదో సెలవిచ్చి నన్ను ధన్యుణ్ణి చెయ్యవలసిందని ప్రార్థిస్తున్నాను–అని అనగా–



'పుండరీకా! కూర్చో చెప్తాను' అని అన్నాడు నారదుడు. పుండరీకుడు పరమానందంగా కూర్చున్నాడు. పరమార్థ జ్ఞానవిషయం నారదుడు ఇలా చెప్పాడు.

పుండరీకా! శాస్త్రాలూ, అని చెప్పిన కర్మలు చాలా ఉన్నాయి. అలాగే ధర్మ మార్గాలున్ను.

ఈజగమంతా అవ్యక్తమైన ఆదిపదార్థంనుంచి పుడుతుంది. అందే లీనమౌతుందని వేత్తలు చెప్తున్నారు.

ఒక్కొక్కరు ఒక్కొక్కవిధంగా చెప్పిన మతమూ ఉంది. అదంతా అలా ఉండనీ! అదంతా సమన్వయం చేసి ఒకప్పుడు మా నాయన నాకు చెప్పినది పరమ గోప్యమైన ఆధ్యాత్మికతత్త్వ విషయం సంసారబంధంనుంచి విడుదల కలిగించేది చెప్తాను విను శ్రద్ధగా! పుండరీకా!

'నారాయణః పరం బ్రహ్మతత్వం నారాయణః పరః
నారాయణః పరంజ్యోతిః ఆత్మానారాయణః పరః
అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్థితః'

నారాయణుడే పరబ్రహ్మ; పరతత్వం; పరంజ్యోతి; సర్వజీవుల ఆత్మా; పరమాత్మా నారాయణుడే. ఈ జగత్తును లోపలా పైనా వ్యాపించి ఉన్నదీ నారాయణుడే!

'నమోనారాయణాయేతి ధ్యాత్వా చానన్యమానసః
యో నిత్యం ధ్యాయతే దేవం నారాయణ మనన్యధీః
ఏతత్ జ్ఞానం పరం నాతో యోగశ్చైవ పరస్తథా'

'నమో నారాయణాయ' అనేది ప్రణవ పూర్వకంగా నిశ్చలమైన మనస్సుతో నిత్యమూ ధ్యానం చేస్తూ జపిస్తే చాలు, అదే పరమజ్ఞానం, ఇంతకంటే పరమార్థాన్ని తెలిపేది లేదు. పరమార్థమూ లేదు.

అన్ని శాస్త్రాలనూ, అన్ని మతాలనూ, అందరు శాస్త్రకారుల వాక్కులనూ పరిశీలించి నేను చెప్పేది ఇది ఒక్కటే.

'ధ్యేయో నారాయణస్సదా....' నారాయణుడే ధ్యానింపదగినవాడు.

పుండరీకా! అదా ఇదా అని భ్రాంతిని కలిగించే శాస్త్ర వాక్కులను మరచిపో. నారాయణుని నమ్మి మనసా ధ్యానించు. అలా ప్రవర్తిస్తే త్వరగా విష్ణుసాయుజ్యం పొందగలవు. మళ్లీ చెప్తున్నాను విను.

'కిం తత్ర బహుభి ర్మంత్రైః
కిం తత్ర బహుభి ర్వ్రతైః
నమో నారాయణాయేతి
మంత్ర స్సర్వార్థ సాధకః'
ఎన్ని మంత్రాలున్నా ఏమి ప్రయోజనం?
ఎన్ని వ్రతాలు చేస్తే ఏమి లాభం?

ఓం నమో నారాయణాయ! అనే మంత్రమే సర్వార్థ సాధకం. వస్తాను–అని బోధించి నారదుడు వెళ్ళిపోయాడు. ఇంక చెప్పేదేముంది? పుండరీకుడు నారాయణమంత్ర జపంలో, నారాయణ నామస్మరణలో రెండవ నారదుడై పోయాడు.

'సర్వ జగత్తును విష్ణుమయంగా, భావించి ధ్యానించి అచిర కాలంలో చరితార్థుడైనాడు. సాలిగ్రామ క్షేత్రంలో చిరకాలం తపస్సు చేశాడు. శ్రీహరిని గూర్చి. అతని తపస్సుకు సంతృప్తుడై పుండరీకాక్షుడు పుండరీకుని అక్షులు సఫలం అయ్యేట్టు దర్శనం ఇచ్చాడు. శ్రీహరి దర్శనం కాగానే పుండరీకుడు సాష్టాంగ నమస్కారంచేసి లేచి చేతులు జోడించి ప్రార్థించాడు.

అప్పుడు శ్రీహరి పుండరీకా! కోరుకో వరం– అని అనగా పుండరీకుడు 'ప్రభూ! ఏమి కోరాలో నాకు తెలియదు. ఏమిచ్చినా సంతోషమే అని అన్నాడు.

శ్రీహరి చిరునవ్వు నవ్వి సరే! రా! ఈ గరుడుని మూపుపై నా వెనుక కూర్చో! నాతో వైకుంఠానికి రా! నా రూపం ధరించి నిత్యం నా వెనుక ఉంటూ



ఉండు–అని చెయ్యి పట్టుకుని వాహనం మీదికి తీసుకున్నాడు. ఆ సమయంలో దేవదుందుభులు మ్రోగాయి. దేవతలు జయశబ్దాలతో మందార కుసుమవర్షం అమందంగా కురిశారు. అలాంటి జగదానంద స్థితిలో జగదీశ్వరుడు పుండరీకాక్షుడు పుండరీకుణ్ణి తనతో సహా గరుడారూఢుణ్ణి చేసి వైకుంఠానికి తీసుకు వెళ్ళిపోయాడు–అని చెప్పి సూతుడు భరద్వాజునితో అన్నాడు.

'మునీశ్వరా! పరమార్థసాధకం తెలిసిందా? దీనిని మననం చేస్తూ జగదీశ్వరుడైన విష్ణువును నమ్మి కీర్తించడమే కలిమానవులకు మంచిది. ఇదే మోక్షప్రదం. బ్రతికి ఉన్నంతకాలం ఇలలో సుఖాన్ని కలిగిస్తుంది.

తర్వాత భరద్వాజుడు సూతుణ్ణి ఇలా అడిగాడు, సూతుడా! గొప్పవిషయం చెప్పావు. చాల ఆనందంగా ఉంది. సరే–ఇంకొక్క సమీక్ష–శ్రీహరి క్షేత్రాలలో ముఖ్యమైనవన్నీ, ఆ దేవుని పేర్లున్నూ–అంటే ఆ క్షేత్రాలలో వినవచ్చే ఆ దేవుని పేర్లు చెప్పవలసిందని మా కోరిక, అని అనగా సూతుడు ఇలా చెప్పాడు.

**క్షేత్రం–దేవుడు**

కోకాముఖంనందలి దేవునిపేరు వరాహమూర్తి. మందరమందు మధుసూదనుడు. కపిల ద్వీపంనందు అనంతుడు. ప్రభాసంలో రవి నందనుడు, వైకుంఠంనందు ఉదపానుడు, మహేంద్రంలో నృపాత్మజుడు, ఋషభ క్షేత్రంనందు మహావిష్ణువు, ద్వారకయందు భూపతి, పాండుసహ్య క్షేత్రమందు దేవేశుడు, వసురూఢమందు జగత్పతి, వల్లీవటంనందు మహాయోగుడు, చిత్రకూటమందు నరాధిపుడు, నిమిషం అనే క్షేత్రమందు పీతవాసుడు, గోకులమందు హరి, సాలిగ్రామమందు తపోవాసుడు, గంధమాదనమందు అచింత్యుడు, కుబ్జాగారమందు హృషీకేశుడు, గంధద్వారమందు పయోధరుడు, సకలమందు గరుడధ్వజుడు, సాయకమందు గోవిందుడు; బృదావనమందు గోపాలుడు, మధురయందు స్వయంభువుడు, కేదారమందు మాధవుడు, వారణాసియందు కేశవుడు, పుష్కరక్షేత్రమందు పుష్కరాక్షుడు, ధృష్టద్యుమ్నమందు

జయధ్వజుడు, తృణబిందువనమందు వీరుడు, సింధుసాగరమందు అశోకుడు, కసేరాటమందు మహాబాహువు, తేజోవనమందు అమృతుడు, విశ్వాసయూప మందు విశ్వేశుడు, మహావనమందు నరసింహుడు, హోలాంగరమందు రిపుహరుడు, దేవశాలయందు త్రివిక్రముడు, దశపురమందు పురుషోత్తముడు, కుబ్జకమందు వామనుడు, వితస్తయందు విద్యాధరుడు, వారాహక్షేత్రమందు ధరణీధరుడు, దేవదారువనమందు గుహ్యుడు. కావేరియందు నాగశాయి, ప్రయాగయందు యోగమూర్తి, పయోష్ణియందు సుదర్శనుడు, కుమారతీర్థమందు కౌమారుడు, లోహితక్షేత్రమందు హయగ్రీవుడు, ఉజ్జయినియందు త్రివిక్రముడు, లింగకూటమందు చతుర్భుజుడు, భద్రాక్షేత్రమందు హరిహరుడు, కురుక్షేత్రమందు విశ్వరూపుడు, మణికుండమందు హలాయుధుడు, అయోధ్యయందు లోకనాథుడు, కుండినమందు కుండినేశ్వరుడు, భాండార మందు వాసుదేవుడు. చక్రతీర్థమందు సుదర్శనుడు, ఆధ్యక్షేత్రమందు విష్ణుపదుడు, శూకరక్షేత్రమందు శూకరుడు, మానసమందు బ్రహ్మేశుడు, దండక క్షేత్రమందు శ్యామలుడు, త్రికూటమందు నాగమోక్షుడు, మేరుశిఖరాన భాస్కరుడు, పుష్పభద్రయందు విరజుడు, కేరళకమందు బాలుడు, విపాశయందు యశస్కరుడు, మాహిష్మతియందు హుతాశనుడు, పాలకడలి యందు పద్మనాభుడు, విమలక్షేత్రమందు సనాతనుడు, శివనదీక్షేత్రమందు శివకరుడు, గయలో గదాధరుడు అని ఆ యా ముఖ్య క్షేత్రాలూ, వాటియందున్న విష్ణువు నామాలున్నూ చెప్పి సూతు డిలాగన్నాడు:

ఇవి నేను ఊహించి చెప్పినవి కావు. విష్ణువే ఒకప్పుడు బ్రహ్మ అడగగా చెప్పాడు. ఆ దేవుని నోటవచ్చినవి పరమప్రమాణములూ, పరమపావనములూ అని వేరే నేను చెప్పనక్కర లేదనుకుంటాను. సారం ఒక మాటలో చెప్పాడు దేవదేవుడు. అది ఏమిటో తెలుసునా?

'సర్వత్ర పరమాత్మానం'
యః పశ్యతి సముచ్యతే'
అంతటా పరమాత్మున్ని చూచేవాడు ముక్తుడౌతాడు.



ఈ క్షేత్రాలలో ఉండే శ్రీహరినామాలు అరవైఎనిమిది. ప్రొద్దుట లేవగానే ఈ అరవైనామాలనూ చెప్పుకుంటూ ఉండేవాడు వేయి గోదానాలుచేసిన ఫలం పొందుతాడు. ఒకరు చెప్తూ ఉండగా శ్రద్ధగా బుద్ధిగా ఈ నామాలు వినేవారికికూడా ఆ పుణ్యఫలం వస్తుంది.

ప్రతిదినం శుచిగా ఈ నామాలను కీర్తించేవానికి దుస్స్వప్నాలు, దశ్శకునాలురావు. మూడుప్రొద్దులా ఈ నామసంకీర్తనం చేసేవాడు సర్వపాపవిముక్తుడై జన్మాంతమందు విష్ణుపదం చెందుతాడు. ఇది సందేహించ నక్కరలేని మాట!

యథాశక్తిగా మానవుడు ఈ క్షేత్రాలను దర్శించాలి...అని చెప్పి సూతుడు బ్రహ్మకి విష్ణువు చెప్పినట్టుగా కొన్ని పుణ్యతీర్థాలు చెప్పాడు.

**పుణ్యతీర్థాలు:**

ముందు చెప్పవలసేది గంగ. తరువాత చెప్పవలసేవి యమున, గోమతి, సరయువు, సరస్వతి, చంద్రభాగ, చర్మణ్వతి, కురుక్షేత్రం, గయ, నర్మద, వాపి, పయోష్ణి పుణ్యతీర్థాలు.

అన్ని పాపాలనూ రూపుమాపే పుణ్యతీర్థం విరజ. గోదావరి పుణ్యనదులలో అగ్రగణ్య. అలాగే తుంగభద్ర. హరిహరులిద్దరూ తుంగభద్రా జలాల నాశ్రయించి ఉంటారు.

దక్షిణదేశంలో రెండవ గంగానదిగా చెప్పదగినది కావేరీనది. సహ్యపర్వతం సమీపాన ఆమలకం అనే గ్రామం ఉంది. అక్కడ విష్ణువు బ్రహ్మచే పూజలందుకుంటూ దేవదేవుడుగా ప్రసిద్ధుడైనాడు.

ఇలాగు భూమిపై ఎన్నో తీర్థాలున్నాయి. అక్కడక్కడా స్నానం చేసి శ్రీహరిపూజ చేసేవారు పాపవిముక్తులై పరమపదం పొందుతారు–అని చెప్పగా భరద్వాజుడు విని పుణ్యాత్ముడా! సూతుడా! ఆ ఆమలకగ్రామం దానికథ అక్కడ ఉంటే తీర్థాలు ఏలాటివో చెప్పి మమ్మల్ని ధన్యులను చేయవయ్యా! అని కోరగా సూతుడు చెప్పనారంభించాడు.

**ఆమలక వృత్తాంతం:**

సరే! చెప్తాను వినండి. అది పాపవినాశనం. ఆమలకతీర్థం ఉత్పత్తీ దానికి వచ్చిన గొప్పదనం ఏలాటిదంటారా?–

సహ్యాపర్వత ప్రాంతాన ఒక పెద్దతోట. దానిలో ఒక ఉసిరికచెట్టు. అది పెద్దపెద్ద కొమ్మలతో, కొమ్మలనిండా ఆరపండిన పండ్లతో చూసేవారికి ఆశ్చర్యకరమై ఉంది. ఒకనాడు అనుకోకుండా అటు విహారానికై వెళ్ళిన బ్రహ్మ పెద్దపెద్దపళ్లతో నిండుగా ఉన్న ఆ చెట్టును చూసి ఆశ్చర్యపడి, దగ్గరగా వెళ్లి తన సృష్టిలో ఇలాటి ఆశ్చర్యకరమైన అత్యున్నతమైన ఉసిరికచెట్టు ఉందా? అని తదేకదృష్టితోచూస్తూ ఉండగా పైన శంఖచక్రగదాధరుడైన శ్రీహరి కనుపించి నట్లు అనిపించింది. ఇదేమిటి నన్ను గన్న తండ్రి దీనిపై ఉన్నాడా? అని అనుకొని మళ్లీ దీక్షగా చూశాడు. ఈమారు కనిపించింది శ్రీహరిప్రతిమ. ఆ ప్రతిమ పాదం చెట్టుమొదటికి ఆనుకుని ఉంది. అదిచూసి సర్వేశ్వరుడిలా అనుగ్రహించాడని బ్రహ్మ యథావిధిగా ఆ పాదాన్ని అర్చించసాగాడు. అలా గంధపుష్పాదు లతో కొంతకాలం పూజించగా ఒకనాడు ఆపాదంనుంచి జలం సన్ననిధారగ బయటకు ప్రవహించింది. అదే చక్రతీర్థం అనే పేరుతో కాలక్రమాన ప్రసిద్ధం అయింది. లోకపితామహుడు బ్రహ్మ ఆ తీర్థంలో స్నానంచేసి శ్రీహరిని స్తుతించి సత్యలోకానికి వెళ్లిపోయాడు.

భరద్వాజమునీంద్రా! ఇదీ ఆమలక వృత్తాంతం. అలాగే సహ్యాపర్వత ప్రాంతాన చక్రతీర్థానికి చుట్టుప్రక్కలా కొన్ని తీర్థాలున్నాయి.

చక్రతీర్థంలో స్నానంచేసిన ప్రాణికి ఆ జన్మలోనే విష్ణుసాయుజ్యం ప్రాప్తిస్తుంది. దానిప్రక్కనున్న శంఖతీర్థజలాలలో మునిగితేలినవారికి వాజపేయఫలం వస్తుంది. పుష్యమాసంలో ఆదివారాలలో అక్కడ యాత్ర జరుగుతుంది.

తొల్లి బ్రహ్మజలకుండిక నుంచి కొంత గంగాజలం సహ్యాపర్వతం మీద పడి చిన్నతీర్థం ఏర్పడింది. అదే కుండికాతీర్థం. మూడు అహోరాత్రాలు



ఉపవాసం చేసి ఆ తీర్థంలో స్నానంచేసినవారు సర్వపాపవిముక్తులై బ్రహ్మలోక వాసులౌతారు.

కుండికాతీర్థానికి ఉత్తరంగా పిండతీర్థం ఉంది. మూణ్ణాళ్లు ఉపవసించి ఆ తీర్థంలో స్నానంచేసినవారు ఋణత్రయ విముక్తులౌతారు (పితౄణం, ఋషిఋణం, దేవఋణం). తీర్థాలన్నింటిలో అది ఉత్తమం అని ఋణమోచన తీర్థం అనేపేరు పొందింది.

శ్రద్ధాభక్తులతో అక్కడ పితృదేవతలకు తిథికార్యం నిర్వర్తించి ఆ పిండాలను, పిండతీర్థజలాలలో కలిపితే పితృదేవతలు పరమానందభరితులై పితృలోకంలో ఉంటారు. అయిదు దినాలు ఉపవసించి ఆ పాపమోచనతీర్థంలో స్నానం చేసినవాడు విష్ణులోకవాసి అవుతాడు.

ధనుఃపాతతీర్థంలో స్నానంచేసినవాడు పూర్ణాయువుగా జీవించి తదనంతరం స్వర్గతుడౌతాడు. శరబిందుతీర్థంలో స్నానం చేసినవాడు ఇంద్రపురానికి వెళ్లుతాడు. ఒకనాడు శుష్కోపవాసం చేసి వారాహతీర్థంలో స్నానం చేసినవాడు విష్ణులోకానికి వెళ్లుతాడు.

సహ్యాపర్వతశిఖరాన ఆకాశగంగాతీర్థం అని ఒకటి ఉంది. అది తెల్లని మంటితోకలసి ఆ శిఖరంమీంచి క్రిందికివస్తూ ఉంటుంది. దాని యందు స్నానం చేసినవాడు సర్వయజ్ఞఫలం పొంది విష్ణులోకవాసి అవుతాడు.

ఇన్ని మాటలెందుకు! సహ్యాపర్వతప్రాంతాన ఎక్కడెక్కడున్న చిన్న నీటిగుంట అయినా పుణ్యతీర్థంగానే భావించాలి. సహ్యాపర్వతానికి వెళ్లినవారు అక్కడ ఉన్న తీర్థాలలో స్నానం చేస్తే విష్ణుదేవుని అనుగ్రహానికి పాత్రులౌతారు.

అన్ని తీర్థాలూ కలిసి ఉన్నది గంగ! అందరు దేవతలు తనలో ఉన్నవాడు శ్రీహరి! అన్ని శాస్త్రాల సారభూతం భగవద్గీత! అన్ని ధర్మగుణాలలో మిన్న దయాగుణం!

మునీంద్రా! క్షేత్రవిషయం ఇది. అందునా ఆమలక వృత్తాంతం పర్వపాపవిమోచనం చెప్పడమయింది. ఆ చెట్టుక్రింద రూపొందిన చక్రతీర్థం

చక్రపాణి పాదపద్మంనుంచి ప్రవహించిన దివ్యమకరందధార. అది సర్వపాప ప్రణాశం అని విశేషించి చెప్పాలా? దానిలో స్నానం చేసినవారు ఏన్నో అశ్వమేథయాగాలు చేసినఫలం పొందుతారు. వారికి పునర్జన్మ ఉండదు. గంగ, ప్రయాగ, నైమిశం, పుష్కరం, కురుక్షేత్రం, యమున-ఇవి కాలానుసారంగా నరునకు పాపం పోగొట్టుతాయి. భగవానుని పాదపద్మంనుంచి ఉద్భవించిన చక్రతీర్థం స్నానమాత్రాన సద్యఃపవిత్రత కలిగిస్తుంది.

భరద్వాజమునీ! ఇప్పుడు చెప్పినతీర్థాలన్నీ భూమిపై నయన గోచరాలై ఉన్నవి. మానసతీర్థాలు కొన్ని ఉన్నాయి. విశేషఫలాన్నిస్తాయి. వాటిని వివరిస్తాను విను.

**మానసతీర్థాలు:**

రాగద్వేషాలకు మార్పుచెందక మనస్సు నిర్మలంగా ఉండడం మానసతీర్థాలలో ప్రధానతీర్థం. అదే వరుసలో చెప్పదగినవి సత్యతీర్థం, దయ, ఇంద్రియనిగ్రహం, గురుశుశ్రూష, మాతాపితృసేవ, స్వధర్మం ఆచరించడం, అగ్నిని ఉపాసించడం- ఇవి మానసతీర్థాలు. వీటిని పుణ్యతీర్థాలుగా విజ్ఞులు నిర్ణయించారు.

కొన్ని ముఖ్యములైన వ్రతాలు చెప్తాను విను. ఏకభుక్తం, నక్తం, ఉపవాసం- అని వ్రతాలు మూడు విధాలు. ప్రొద్దునీమం అనుసరించి పగటిపూట మాత్రమే అన్నం (ఒక్కమారు) తినడం ఏకభుక్తం-నిత్యనైమిత్తికాలైన సంధ్యోపాసనా మంత్రజపాలు, గృహదేవతాపూజలతోపాటు, సమయాను సారంగా పగలు ఒక్కమారు ఆహారస్వీకారం అని వివరం-

పగలంతా పూజాపురస్కారాలు చేసి ఉపవసించి రాత్రిమాత్రమే భుజించడం నక్తం.

పగలూ రాత్రీకూడా భుజించక పోవడం ఉపవాసం. ఇలాటి నియమం పాటించే కాలమందు కేవలం సర్వేశ్వరనామ సంకీర్తనం, దైవిక కథాప్రసంగాలు మాత్రమే జరపాలి.



పూర్ణిమ, అమావాస్య, తిథులయందు ఏకభుక్తం పాటించాలి. అలాచేసిన వారికి పుణ్యగతి కలుగుతుంది.

చవితి, సప్తమి, అష్టమి, త్రయోదశి, చతుర్దశి తిథులయందు నక్తం ఆచరించాలి. అలాచేస్తే అభీష్టసిద్ధి అవుతుంది.

ఏకాదశినాడు ఉపవాసం-నరసింహస్వామిని అర్చించడం ముఖ్యం. అలాగుచేస్తే సర్వపాపవిముక్తి స్వామి అనుగ్రహప్రాప్తి అవుతాయి.

హస్తానక్షత్రం కలిసిన ఆదివారంనాడు సౌరనక్తం చెయ్యాలి. ఆ నాడు స్నానంచేసి శుచిగా కూర్చుని సూర్యమండలమందుండే విష్ణువును ధ్యానిస్తూ గడపినట్టయితే రోగవిముక్తి అవుతుంది.

త్రయోదశీ గురువారంనాడు అపరాహ్ణమందు ఋషులకు జలతర్పణం, పితృదేవతలకు తిల తండుల తర్పణం, ఇచ్చినట్లైతే పాపవిముక్తి, విష్ణులోక నివాసం కలుగుతాయి.

ఖగోళంలో అగస్త్యోదయంనాడు శంఖజలంతో, తెల్లనిపువ్వులతో, అక్షతలతో అగస్త్యునకు అర్ఘ్యమిచ్చి యథావిధిగా అర్చించాలి. అప్పుడు

'కాశపుష్ప ప్రతీకాశ! అగ్నిమారుత సంభవ!
మిత్రావరుణయోః పుత్ర! కుంభయోనే! నమోస్తు తే!'

అనే శ్లోకం చదవాలి. ఇలాగు ఏడురాత్రులు అగస్త్యుడున్న దిక్కుగా, ఉండి ఆచరిస్తే పాపాలన్నీ పటాపంచలవుతాయి. జన్మాంతరమందు విష్ణుపదప్రాప్తి అవుతుంది.

భరద్వాజ మునీంద్రా! శ్రీనరసింహపురాణం మీ మునుల సమక్షంలో ఇలాగు చెప్పి ధన్యుడనయాను.

ఇది మునుపు మరీచి మొదలైన మునులకు బ్రహ్మ చెప్పినది. ఆ మహానుభావులు భృగువునకు, భృగువు మార్కండేయమహామునికి చెప్పగా మార్కండేయుడు సహస్రానీకునికి చెప్పాడు. నరసింహస్వామిదయవల్ల మా

గురుదేవుడైన వ్యాసులవారికి సంప్రాప్తించింది. ఆయనప్రసాదంగా నాకు లభించింది. నేను మీకు వివరించి చెప్పడమయింది. మీకు స్వస్తి అగుగాక! ఉత్తమమైన ఈ పురాణాన్ని శ్రద్ధాభక్తులతో వినేవారికి మాఘమాసంలో ప్రయాగ క్షేత్రమునందు త్రివేణీ జలస్నానం చేసిన పుణ్యఫలం వస్తుంది. భక్తులకు దీనిని శ్రద్ధగా వినిపించేవానికి సర్వతీర్థఫలం, విష్ణులోక నివాసమూ కలుగుతాయి.

సర్వపాపవినాశకమైన ఈ నరసింహపురాణం, చెప్పేవారికీ వినే వారికీ నరసింహస్వామి అనుగ్రహంవల్ల దైహిక జీవితం హాయిగా గడుస్తుంది. అంతమందు శ్రీహరి సాయుజ్యం ప్రాప్తిస్తుంది.

శ్రద్ధతోగానీ, అశ్రద్ధతోగానీ ఈ నరసింహపురాణం వినదగిన పుణ్యకృతి. ఇక నాకు సెలవిప్పించండి. పోయి వస్తాను" అని సూతుడనగా, భరద్వాజాది మునులు సూతుణ్ణి సమ్మానించి సబహుమానంగా సాగనంపారు. తరువాత వారు భరద్వాజుని ముఖతః శ్రీహరి కథలు వింటూ ఆనందిస్తున్నారు.

సర్వం సంపూర్ణం.

శుభమస్తు.

* * *

## శనైశ్చరకృత శ్రీ నరసింహస్తుతి

ఒకానొక సందర్భంలో శ్రీ నరసింహస్వామివారితో సంభాషించే మహద్భాగ్యం శ్రీ శనైశ్చరస్వామికి కలిగింది. ఆ సందర్భంలో శ్రీ శనైశ్చరుడు శ్రీ నృసింహభగవానుని పరమభక్తిగా స్తుతించినాడు. ఈ స్తోత్రాన్ని విన్న నరసింహుడు సంతృప్తి చెందుతూ శనైశ్చరా! నీ స్తుతి చాలా బాగుంది. సంతోషం అయింది. ఏదైనా వరం కోరుకో ! అని అన్నాడు.

"స్వామీ ! నృసింహభగవన్ ! నేను చేసిన ఈ స్తోత్రాన్ని నాకు ప్రీతి కరమైన శనివారంనాడు భక్తులు పఠించినా, విన్నా సమస్త కోరికలు నెరవేరునట్లుగా వరం ఇమ్ము" – అంటూ శనిభగవానుడు ప్రార్థించినాడు.

అలాగే ! అంటూ శ్రీ నృసింహుడు ఈ స్తోత్రాన్ని పఠించినవారికి సమస్త కోరికలు తీరడమేగాక ఏలినాటిశని, అష్టమశని, అర్ధాష్టమశని దశలలో ఎలాంటి భయాలు ఉండవు. సమస్త దోషాలు తొలుగుతాయి. అంటూ వరం ఇచ్చినాడు.

ఈ శనైశ్చరకృత శ్రీ నృసింహస్తోత్రం సర్వార్థాలను ఖచ్చితంగా నెరవేర్చగల అత్యంత మహిమగల స్తుతిగా శ్రీ కృష్ణభగవానుడు కూడ ప్రమాణీకరించినాడు.

**ఈ స్తోత్రం భవిష్యోత్తర పురాణం నుండి పొందుపరచబడినది.**

* * *

సులభో భక్తియుక్తానాం దుర్దర్శో దుష్టచేతసాం ।
అనన్యగతికానాం చ ప్రభుర్భక్తైకవత్సలః ॥ 1 ॥

శనైశ్చరస్తత్ర నృసింహదేవ స్తుతిం చకారామలచిత్తవృత్తిః ।
ప్రణమ్య సాష్టాంగమశేషలోక కిరీటనీరాజితపాదపద్మం ॥2 ॥

### శ్రీ శని రువాచ

యత్పాదపంకజరజః పరమాదరేణ
సంసేవితం సకలకల్మషరాశినాశం ।
కల్యాణకారకం అశేషనిజానుగానాం
స త్వం నృసింహ మయి దేహి కృపావలోకం ॥ 3 ॥

సర్వత్ర చంచలతయా స్థితయా హి లక్ష్మ్యా
బ్రహ్మాది వంద్యపదయా స్థిరయాన్య సేవి ।

పాదారవిందయుగలం పరమాదరేణ
స త్వం నృసింహ మయి దేహి కృపావలోకం ॥ 4 ॥

యద్రూపం ఆగమశిరః ప్రతిపాద్యమాద్యం
ఆధ్యాత్మికాది పరితాపహరం విచింత్యం ।
యోగీశ్వరైరపగతాఖిల దోషసంఘైః
స త్వం నృసింహ మయి దేహి కృపావలోకం ॥ 5 ॥

ప్రహ్లాదభక్తవచసా హరిరావిరాస
స్తంభే హిరణ్యకశిపుం య ఉదారభావః !
ఊర్వో నిధాయ ఉదరం నఖరైర్దదార
స త్వం నృసింహ మయి దేహి కృపావలోకం ॥ 6 ॥

యో నైజభక్తం అనలాంబుధి భూధరోగ్ర-
శృంగప్రపాత విషదంతిసరీసృపేభ్యః ।
సర్వాత్మకః పరమకారుణికో రరక్ష
స త్వం నృసింహ మయి దేహి కృపావలోకం ॥ 7 ॥

యన్నిర్వికార పరరూపవిచింతనేన
యోగీశ్వరా విషయవీతసమస్తరాగాః ।
విశ్రాంతిమాపుర వినాశవతీం పరాఖ్యాం
స త్వం నృసింహ మయి దేహి కృపావలోకం ॥ 8 ॥

యద్రూపముగ్ర పరిమర్దనభావశాలి
సంచింతనేన సకలాఘవినాశకారి ।
భూతజ్వరగ్రహ సముద్భవభీతినాశం
స త్వం నృసింహ మయి దేహి కృపావలోకం ॥ 9 ॥

యస్యోత్తమం యశ ఉమాపతిపద్మజన్మ
శక్రాదిదైవతసభాసు సమస్తగీతం ।
శక్త్యైవ సర్వశమలప్రశమైక దక్షం
స త్వం నృసింహ మయి దేహి కృపావలోకం ॥ 10 ॥



ఇత్థం శ్రుత్వా స్తుతిం దేవః శనినా కల్పితాం హరిః ।
ఉవాచ బ్రహ్మ వృందస్థం శనిం తం భక్తవత్సలః ॥ 11 ॥

**శ్రీ నృసింహ ఉవాచ**

ప్రసన్నోహం శనే తుభ్యం వరం వరయ శోభనం ।
యం వాంఛసి తమేవ త్వం సర్వలోకహితావహం ॥ 12 ॥

**శ్రీ శనిరువాచ**

నృసింహ త్వం మయి కృపాం కురు దేవ దయానిధే ।
మద్వాసర స్తవప్రీతికరః స్యాద్దేవతాపతే ॥ 13 ॥

మత్కృతం త్వత్పరం స్తోత్రం శృణ్వంతి చ పఠంతి చ ।
సర్వాన్ కామాన్ పూరయేథాః తేషాం త్వం లోకభావనః ॥ 14 ॥

**శ్రీ నృసింహ ఉవాచ**

తథైవాస్తు శనేఽహం వై రక్షోభువన సంస్థితః ।
భక్తకామాన్ పూరయిష్యే త్వం మమైకం వచః శృణు ॥ 15 ॥

త్వత్కృతం మత్పరం స్తోత్రం యః పఠేచ్ఛృణుయాచ్చ యః ।
ద్వాదశాష్టమజన్మస్థాత్ త్వద్భయం మాస్తు తస్య వై ॥ 16 ॥

శనిర్నరహరిం దేవం తథేతి ప్రత్యువాచ హ।
తతః పరమసంతుష్టాః జయేతి మునయోఽవదన్ ॥ 17 ॥

**శ్రీ కృష్ణ ఉవాచః**

ఇదం శనైశ్చరస్యాథ నృసింహదేవ
సంవాదమేతత్ స్తవనం చ మానవః ।
శృణోతి యః శ్రావయతే చ భక్త్యా
సర్వాణ్యభీష్టాని చ విందతే ధ్రువం ॥ 18 ॥

* * *

## ఋణవిమోచన నృసింహస్తోత్రం

దేవతాకార్యసిద్ధ్యర్థం సభా స్తంభ సముద్భవమ్।
శ్రీ నృసింహం మహావీరం నమామి ఋణముక్తయే ॥ 1 ॥

లక్ష్మ్యాలింగితవామాంగం భక్తానాం వరదాయకమ్ ।
శ్రీ నృసింహం మహావీరం నమామి ఋణముక్తయే ॥ 2 ॥

ఆంత్రమాలాధరం శంఖ చక్రాబ్జాయుధ ధారిణం ।
శ్రీ నృసింహం మహావీరం నమామి ఋణముక్తయే ॥ 3 ॥

స్మరణాత్ సర్వపాపఘ్నం కద్రూజవిషనాశనమ్ ।
శ్రీనృసింహం మహావీరం నమామి ఋణముక్తయే ॥ 4 ॥

సింహనాదేన మహతా దిగ్దంతిభయనాశనమ్।
శ్రీనృసింహం మహావీరం నమామి ఋణముక్తయే ॥ 5 ॥

ప్రహ్లాదవరదం శ్రీశం దైత్యేశ్వర విదారిణమ్ ।
శ్రీనృసింహం మహావీరం నమామి ఋణముక్తయే ॥ 6 ॥

క్రూరగ్రహైః పీడితానాం భక్తానామభయప్రదమ్
శ్రీనృసింహం మహావీరం నమామి ఋణముక్తయే ॥ 7 ॥

వేద వేదాంతయజ్ఞేశం బ్రహ్మ రుద్రాది వందితమ్ ।
శ్రీనృసింహం మహావీరం నమామి ఋణముక్తయే ॥ 8 ॥

య ఇదం పఠతే నిత్యం ఋణమోచన సంజ్ఞితమ్ ।
అనృణీ జాయతే సత్యో ధనం శీఘ్రమవాప్నుయాత్ ॥ 9 ॥

* * *

**......శ్రీ వాదిరాజతీర్థస్వామి**